

ఖర
శ్రావణము

భారతి

సంపుటము 28
సంచిక 8

తేజోలహరి

★

శ్రీ పింగళి లక్ష్మీకాంతం

ఉదయాద్రి శిఖర సానూద్భూత ధాతుధారా మజ్జనక్రీడరక్తి నొంది
జంభారి భద్రేభకుంభస్థలీ సాంద్ర సిందూరరజముతోఁ జెలిమి చేసి
త్రిదశకన్యాకరార్పిత హేమజలజాత బలిపుష్ప పరిచితిక్ ప్రౌఢి మెఱసి
దరహసితాంభోజ దళదళాంతరరాగ సంగ్రహోత్కంఠచే జాజువాఱి

అబ్జాండఘటీ బహిరంతరములఁ
దళుకు జలపోతగ వించి వెలుగు నవిగో!
నవనవారుణభాను భానువులు, ప్రార్థ
నాంజలి ఘటింపు డభ్యుదయమ్ము లొసగు

మందారకింజల్క మాత్రాక్ష్వర్తి దోల్తఁ బొడుపు గుబ్బలిమీఁదఁ బొటమరించి
ఇంతలోఁ బెనుదీగెలంతలై మాహేంద్రదిక్ప్రాంగణమ్ము నతిక్రమించి
అంతంత దుర్నిరీక్ష్య ప్రోన్నతంబులై గగనాంతరాళలంఘన మొనర్చి
వాగతీత ప్రభావమ్ములై యాశావకాశమ్ములన్నింటఁ గలయఁ బ్రాకి

త్రిభువనాక్రాంతి విక్రమరేఖ మెఱసి
యమ్మహావిష్ణు వామనత్వమ్ము ననుక
రించు నంభోజమిత్రు మరీచిజాల
మడచుగావుతఁ బుడమిలో నిడుమలెల్ల.

దారిద్ర్య:దుఃఖసంతప్త నిర్భాగ్య జీవనులపాలిటి తప్తకనకధార
ఆజవంజవ దుర్గమారణ్య పథగతిగ్లాని పీడితుల ఆలంబయష్టి.
అమరావతీ నివాసాశాసమాదృత క్రతుపరాయణులకు రాజవీధి
పరతత్త్వదర్శనత్వరమాణ మానస తిమిరాపనోదన దీపమాల

నిర్వికల్పసమాధిసంస్థిత మునీంద్ర
తను గృహద్వారపాలక దండమైన
బాలభాను మరీచి సంప్రార్థితార్థ
సిద్ధులొడగూర్చి మిమ్ము రక్షించుగాక.

సప్తర్షి దత్తార్ఘ్య జలధారలకుఁ బద్మరాగ మాలికల విభ్రమమొసంగి
నొగమీఁది వినతాతనూజారుణచ్ఛాయ కమితారుణత్వమ్ము నావహించి
రథవాజివక్త్ర పార్శ్వములఁ ఖలీనక్షతాస్ర రేఖాకారమధిగమించి
మార్గగోచరశైల మహిత మూర్ధములందుఁ దపనీయ శేఖరత్వము భజించి

అష్టదిగ్భామినీ ప్రాతరంగరాగ
రచన కనుకూల కుంకుమద్రవముగూర్చి
విశద వాసరముఖములై వెలుగుభాను
దీధితులొసంగు నాత్మసందీప్తి మీకు.

పఱతెంచుచున్నదా; పద్మరాగపరాగ రంజితమేరుపర్వతతటమ్ము
ఆడుచు నున్నదా, యరదమ్ముపై? మహారజన చిత్రితమైన ధ్వజపటమ్ము
వ్రాలుచు నున్నదా? రథవాహధుత శిరఃస్థల చిత్రమాంజిష్ఠ చామరములు
జాల్వాఱుచున్నదా? క్షతదేహమందేహ వదననిర్గత రక్తవారి ధార

అనుచు బహువిధ శంకాసమాకులముగ
జగము వీక్షింపఁ దోతెంచు పవిత్రుఁడుదయ
కాంతిపటలము దుష్కృతధ్వాంతలయము
లయ మొనర్చుత ధర్మవిప్లవము లెల్ల.

భారతజాతీయ ప్రణాళిక

శ్రీ వి. వేంకటరావు

ఎన్నికల సమయాలు సమీపించినప్పుడు, ప్రజాస్వామ్య దేశాల్లో ప్రతిపక్షమూ, తాము ప్రభుత్వంలో ఉంటే చెయ్యదలచుకొన్న విషయాలు గుదిగుచ్చి తమ కార్యకలాపంగా ప్రచురించటం ప్రతిదేశంలోనూ పరిపాటే. అయితే ప్రభుత్వంలో ఉన్న పక్షం (ప్రజాస్వామ్య దేశాలలో) ప్రభుత్వంలో లేనిపక్షాలలాగా ఆకర్షణీయంగా ఆశలు చూపించటం, కొంతకష్టం. కారణాలు వెదుక్కోనక్కరలేదు. మాటల్లో చెప్పినంత క్రియలో చెయ్యగల్గిందీ లేనిదీ, ప్రభుత్వపక్షం విషయంలో, ప్రజలకు కొంతవరకూ, పూర్వపరిపాలనే ఋజువిచ్చేదిగా ఉంటుంది. ప్రభుత్వంలో లేని పక్షాలకు ఆ భయంలేదు. "లేస్తే మనుష్యులంకాము" అని ప్రగల్భాలుకొట్టి, కాస్త ప్రతిభ ఉంటే వాట్లను ప్రజనమ్మేదాకా చెవి నిల్లు కట్టుకొని పోరగల అవకాశం ఉంటుంది.

ఎన్నికలకోసం ఏపక్షమైనా ప్రజలకు అదన్న పరిస్థితులలో 'రామరాజ్యం' కరతలామలకం చేసి పెట్తామనే అనక తప్పదు. సర్వసమానత్వము, సర్వ సౌభ్రాతృత్వము, దేశసౌభాగ్యం, విశ్వకల్యాణం, సమకూర్చి పెడతామనని రాజకీయ పక్షం, ఈనాడు నియంతృ దేశాలలో సహితం ఎక్కడా లేదు. అందరు చూపించే ఆదర్శము, సుఖ, శాంతి, సమానత్వాల విషయంగా స్థూలంగా ఒకటే— రాజకీయపక్షాల అవకతవక ప్రభుత్వాలవల్ల ఎన్ని సార్ల ఎన్ని అగచాట్లు పడినా, వీళ్ల ఆశపెట్టే, "రామరాజ్యాలు" వాళ్ళ పద్ధతిలోనైనా సంభవమా అసంభవమా అన్న ప్రశ్న, ఎంతటి సంస్కృతిగల దేశంలోనైనా ప్రజాకోటిలో విస్తృతంగా కలగటం కల్ల. కారణం, అల్లాంటి ఆశ ఆవేదే గడ్డిపరకగా అందకపోతే, నిత్యదుర్భర పరిస్థితుల నైరాశ్యంలో, సామాన్య మానవుడు ఏనాడో నశించిపోవలసి ఉండేది. జీవాన్ని నిలబెట్టేది మానవ ప్రాథమికమైన ఈ మూల విశ్వాసమే. అందుచేత, ఎవరో ఆశ చూపించినప్పుడు ఎంత బూటకమని తెలిసినా, సామాన్య మానవుడు, ఇంతకన్నా చెడేం దేముందిలే అన్న భావంతోనే, తన విశ్వాసానికి కలిగిన, అంతటి స్వల్ప బాహ్యస్పందనంతోనూ తృప్తిపడి, ఆ వ్యక్తినిగాని పక్షాన్నిగాని అధికారస్థానంలోకి తెప్పించటానికి సహకరిస్తాడు. కాని ఫలితాలను ఆశించని నిర్లిప్తుడుగానే మిగులుతాడు. అతని కళ్ళముందర ఆశపెట్టిన ఆదర్శాలు ఆచరణలోకి వస్తున్నట్లు కనిపించగానే, కొంత నిస్తబ్దతను వదల్చుకొని, తను కూడా దేశ కల్యాణానికి ఆ విధానంలో కృషి చేయటానికి కూడా తోడ్పడతాడు. కాని ఆచరణలో ప్రభుత్వపరంగా, ఏ అంతరంలో బూటకం కనబడినా, కుంచుకుపోయి నిర్వీర్యుడైపోతాడు. అప్పుడు, ప్రజనిర్లిప్తులుగా ఉన్నారనీ, తమ కృషికి ప్రోత్సాహ మియ్యటంలేదనీ అగ్రనాయకులు కారాలూ మిరియాలు నూరి, ఉగ్రనరసింహులవటం, యథార్థాలు గుర్తించలేని ఆత్మవంచన మాత్రమే అవుతుంది.

ఈనాడు కాంగ్రెస్, తన ఎన్నికల ప్రచారానికి, తదితర ఆదర్శప్రచారా లన్నిటికన్న కూడా, జాతీయ పంచవర్ష ప్రణాళికను, మూల స్తంభంగా ఏర్పరుచుకొని, ప్రజాదరణ చూరగొనటానికి ఆశిస్తోంది. పంచవర్ష ప్రణాళికలు, షడ్వర్ష ప్రణాళికలూ, ఏకవర్ష ప్రణాళికలూ, దీర్ఘకాల ప్రణాళికలూ, ఇత్యాదులన్నీ కూడా, ప్రజల చెవుల్లో నిత్యం, ఏ పక్షంవారి వద్దనుంచో ఒకరి వద్దనుంచి మోగిస్తూ వినవస్తూనే ఉన్నాయి. ఈ ప్రణాళికల ప్రకారం ఫలితాలు, ఎక్కడో విదేశాలలో పండించుకొన్నారని వినటం తప్ప, ఏ చిన్న ప్రణాళికకూడా, ఆచరణలో విజయవంతంగా, ఋజువుగా కొనసాగి, భారతదేశంలోని, ఏ స్వల్ప జనపథానికైనా, ప్రయోజనకరముకావటం ఈ నాటికీ భారతప్రజలు చూచి ఎరగరు. అందులోనూ నాలుగేళ్ళ కాంగ్రెసు పరిపాలన అనంతరం ఎన్నికల ముందు బయల్వడిరావటంలో కూడా, ఈ ప్రణాళిక ఋజువైనదే నని, కాంగ్రెసు, ప్రజలను నమ్మించటంలో కూడా కొంత కష్టం లేకపోలేదు.

కాని ప్రభుత్వ అనుభవంతో, పరిపాలనలోని కష్టసుఖాలను, ప్రజలకు సమకూర్చగల శ్రేయస్సుల పరిమితిని, కొంచెం జాగ్రత్తగా, వాస్తవిక దృష్టితో అంచనాలు వేసికొని, ఎక్కువ ఆడియాస లేవీ కల్పించక, ఉన్న పరిస్థితులనే గుడ్డిలో మేలుగా చేసుకోటమే, నేటి ప్రపంచపరిస్థితులలో, మహాఘనకార్యమని, ప్రజలకు యథార్థ పరిస్థితులను బోధించటం ఈ ప్రణాళికలోని గొప్ప సుగుణము,

నీటివనరులకు ఆహారదినుసులకు, విద్యుచ్ఛక్తి నిర్మాణాలకు, వ్యవసాయకాభివృద్ధికి, రాబోవు ఐదేండ్లలో ౧౪౮౯-౩ కోట్ల రూపాయలు అవసరంగా ఖర్చుపెట్టకొంటే తప్ప, మనకు పెరిగే జనాభాకు, మనకున్న, ఆహారవస్త్రాది ప్రాథమిక వస్తుసంపద లేమికి, ఈ ఐదేళ్లలో ఇంతకన్న భీభత్సంగా చితికి పోగలమని, తమ పరిపాలనానుభవంవల్ల, ప్రభుత్వం ఈ ప్రణాళికద్వారా ప్రజలకు హెచ్చరిక నిచ్చింది. ఇందులో ఆశగొల్పగలిగే వస్తు విశేషంకన్న, నైరాశ్యాన్ని ఎదుర్కోవలసిన, మనోనిబ్బరాన్ని, జాతి ఈమాత్రంగానైనా జీవించాలంటే యావచ్ఛక్తితో ప్రతి ఒక్కరూ సహకరించి చేయవలసిన మహత్తర కృషిని, ప్రోత్సహించే హెచ్చరికే, ఆశలను ఆదర్శాలనూ తలదన్ని అంతర్గర్భితంగా ప్రణాళికను ఆవరించుకొని ఉంది. ఐదేళ్ల తర్వాత ప్రతివారికీ ౧౩ ఔన్సుల ఆహారపదార్థం మాత్రమైనా అందాలంటే, ఈ నాటినుంచే ఈ ఖర్చులు ప్రజభరించటం అత్యవసరం. అప్పటికీ వస్త్రం కొరత, గృహాలకొరత, పారిశ్రామిక సంపదకొరత, ప్రజలకుఉద్యోగాల కొరత, తీరకపోవచ్చును.

కాని ఈ కొరతలు ఇంతకన్నా అధ్వాన్నం కాకుండా ఉండాలంటే ఈనాటినుంచే ఈపన్ను లభరించి, ఈ కంట్రోళ్ల అమలు సరిగ్గా జరిగేందుకు ప్రజలే ప్రభుత్వానికి జాగ్రత్తనుకొలిపి, ప్రభుత్వం నిర్ణయించే సహకార విధానాలకు, పారిశ్రామిక విధానాలకు ప్రతి ఒక్కరూ ఎదురు తిరగకుండా ప్రజాస్వామ్య విధానంలో సహకరించి, అరమరికలు లేకుండా ప్రభుత్వం పెట్టిన ప్రతి నియమాన్ని విశ్వాసంతో పాలించటం, అత్యవసరం. ప్రభుత్వంలో ఎవరున్నా ప్రజలు ఈ బాధ్యత స్వీకరించవలసిన ఆవశ్యకతను ఈ ప్రణాళిక యథాతథంగా తెలుపుతోంది.

నియంతృ దేశాలలోకన్నా ప్రజాస్వామ్య దేశాల్లో ప్రజలకున్న అధిక బాధ్యతలు, ఆత్మనియమానికి, స్వార్థరహిత కృషికి, తమ హక్కులకన్న తమ బాధ్యతలను ముందు ఎరిగుండవలసిన విద్యావివేకాలు ప్రజల్లో అపారంగా ఉండవలసిన అత్యవసరం, ఉన్న ప్రభుత్వపాలనా యంత్రాన్ని విమర్శించటంలో కాక, సాధ్యమైనంతవరకు తోడ్పడి నిలబెట్టటంలోనే ప్రజల కృషి నిమగ్నం కావలసిన, విధ్యుక్తధర్మమును, నియంతృత్వపాలనలోలాగా ప్రభుత్వ దండనభీతివల్ల కాక, స్వబుద్ధివల్లనే ప్రతీ ప్రజాస్వామ్యవ్యక్తీ, త్యాగ దీక్షలను అలవర్చుకోవలసిన, అత్యుత్తమ ఆదర్శ స్వభావము, ఇత్యాది కల్యాణాత్మకమైన ప్రజాస్వామ్యస్వరూప స్వభావాల నన్నిటినీ, ప్రణాళిక నిర్ణేతలు, ఈ ప్రణాళికద్వారా ప్రజలకు విదితమొనర్చారు.

నేటి భారత ప్రభుత్వం నియంతృ రాజ్యాలలాగా, సర్వ ఆర్థిక వ్యాపారాలను జాతీయం చేయ చూపటం లేదు. అల్లాఅని పూర్తిగా స్వేచ్ఛావ్యాపారాన్ని ప్రోత్సహించ దలచుకోలేదు. రెండు ప్రపంచ సంగ్రామాల అనంతరం ప్రజాస్వామ్యదేశాలుకూడా, వ్యక్తిగతమైన స్వేచ్ఛా వాణిజ్యవ్యాపారాలను, నియమిత మొనర్చకుండా ఉంచటం, దేశ భద్రతకు, దేశ సంపదకు, క్షేమకరం గాదని గ్రహించాయి. అందుకని ఈ ప్రభుత్వాలు మిశ్రమ ఆర్థికవిధానాలను పరిమిత విభేదాలతో అనుసరింపవలసి వచ్చింది. బ్రిటన్ "వెల్ఫేర్ స్టేట్" ఆదర్శంతో కొన్ని పరిశ్రమలను జాతీయం చేసింది. కొన్నిటిమీద కంట్రోలు అట్టి పెట్టుకొంది.

కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజ నిత్యనైమిత్తిక అవసరాలు కాక దేశక్షేమాని కవసరాలయిన, ముఖ్య పరిశ్రమలను మాత్రమే తన అధీనం చేసుకొంది. ప్రజల నిత్య అవసరాలపైన తన అజమాయిషీ, అనుజ్ఞా, నిషేధాల రూపంలో, అట్టే పెట్టుకొంది.

ఆహారవస్త్రాల, ఉత్పత్తి విషయంమీద బాధ్యతను స్వీకరించక, సరఫరాది నియమాలమీద మాత్రమే పెత్తనం వహించింది. ఆహారం సరఫరావిషయంలో చాలవరకు బాధ్యతకూడా స్వీకరించింది. ఈబాధ్యతను మరింత విశిష్టమొనర్చుకొంటూ అధికోత్పత్తికి ఇన్నాళ్లవలె సబ్సిడీల మాత్రంతో తృప్తిచెందక, ప్రత్యక్ష సహాయంగా, భారీ ఎత్తున నీటివనరు ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించి, ప్రణాళికలో వాటికి ముఖ్య స్థానం ఇచ్చింది. ఇదిగాక అధికోత్పత్తికి, సహకార సాముదాయిక వ్యవసాయాభ్యుదయాన్ని ప్రణాళిక సూచించింది. ఈ వ్యవసాయ విధానం, సంఘ స్వరూపాన్ని మార్చటానికి ఉద్దేశించిన ఒక ఆదర్శ విధానంలో, భాగంగానే ప్రణాళిక ఉద్దేశించింది.

పల్లెటి సంఘస్వరూపంలోనే సంపూర్ణమైన మార్పు రావటంమీద ఈ విధానంయొక్క బాగోగులు ఆధారపడి ఉన్నాయి. పల్లెటి ప్రజలే తమంత తామే సహకార సంఘాలుగా ఏర్పడి, సాముదాయక వ్యవసాయ విధానాలు అవలంబించాల్సిందని ఈ ప్రణాళిక అపేక్షిస్తోంది.

ఇందుకు ప్రజలు భరించవలసిన ఖర్చు కరామ్మతులకు గాని, ఉపకరణ సంపత్తికిగాని, ప్రస్ఫుటంగా ప్రభుత్వం బాధ్యత వహించలేదు. ప్రభుత్వ సలహా, అజమాయిషీలను మాత్రమే ప్రభుత్వం ఇయ్యగలుగుతుంది. ట్రాక్టర్లు, ఇంజన్లు, మోటార్లు, ఇతర ఉపకరణాలకైన ముడి ఇనుము, యంత్రసామగ్రి

మొదలైనవాట్లను దేశవిస్తృతంగా ఎంతమాత్రంగా సరఫరా చేయగలిగి, ఎన్ని గ్రామాల సహకార సాముదాయిక సంఘాలకు తక్షణ యంత్రసామగ్రిని ప్రభుత్వం సమకూర్చిపెట్టగలదో, బయల్పడిన సంగ్రహ ప్రణాళికలో స్ఫుటంగా లభ్యం కావటం లేదు.

ప్రజలు సాముదాయిక సహకార విధానానికి, ప్రోత్సాహంతో ఎగబడ్డాకూడా, ఉపకరణ సంపత్తి లేమిచే నిరుత్సాహపడి, కృషి విఫలంకాగల అవకాశం ఎంతవరకూ తగ్గగలదో, ప్రణాళికలోని, ఇనుము ఉత్పత్తి, వ్యవసాయయంత్ర ఉత్పత్తి, వీటికై ప్రభుత్వం ఖర్చుపెట్టదలచిన, మొత్తాలవల్ల నిస్సందేహంగా తేలటం లేదు. ఈ కృషి ప్రారంభించటానికై కావలసిన యంత్ర సమృద్ధిలో, విదేశాలనుంచైనా, ఎంతమాత్రంగా భారతదేశానికి లబ్ధి కాగలదో, ఆ అంచనాకూడా సరిగ్గా తెలుపడలేదు.

విదేశమారకపు విలువలను, దేశానికి కావలసిన ఆహారధాన్యాల భర్తీచేసుకోవలసిన దిగుమతి ధాన్యాలకయ్యే వ్యయానికే ముఖ్యంగా ఖర్చుచేసుకోవలసి ఉంటుందని ప్రణాళికలో అంచనా వేయబడి ఉంది. ఇక ప్రాజెక్టుల నిర్మాణానికే భారీ మొత్తాలు తక్షణావసరాలుగా, విదేశాలనుంచి పుచ్చుకొన్న అప్పులలోనుంచి వినియోగ పరచుకోవలసి ఉంటుంది.

అంటే సామాన్య ప్రజ ఈనాటి హెచ్చు పన్నులు కాక ప్రణాళిక ఖర్చులకై దాదాపు తలకు ఏబది రూపాయలచొప్పున అదనంగా ఖర్చు భరించవలసి రావటమే కాకుండా, స్టెర్లింగ్ నిల్వలు పోయి, ప్రపంచసమితులకో, అమెరికాకో, ఏటేటా అధికంగా చెల్లించవలసిన ఋణాలతో కొన్ని సంవత్సరాల తరబడి ఋణంలో పడిపోవలసి ఉంటుంది.

దేశంలో వస్త్రసమృద్ధిని కల్పించటానికీ, ప్రజలకు వృత్తులను కల్పించటానికీ, నిత్యనైమిత్తిక వస్తువుల ధరలు పెరగకుండా చేయటానికీ, ప్రణాళిక పారిశ్రామికాభివృద్ధిమీద కాక, ప్రజలలోనూ పరిపాలనాయంత్రంలోనూ, అకస్మాత్తుగా రాగల నైతిక పరివర్తనంమీదే ఎక్కువ ఆధారపడింది. ఉదాహరణకు మిల్లు వస్త్రాలకూ, మిల్లు నూలుకూ, ఈ ఐదేళ్లలోనూ, మిల్లుల సంఖ్య అభివృద్ధి జరగటంవల్ల కాక, ఉన్న మిల్లులే మూడింతలు, గుడ్డనూ, నూలునూ ఉత్పత్తి చేయటంమీదా, ప్రభుత్వ పాలనా యంత్రమూ, వర్తకప్రజా తన నీతిని వృద్ధిపరుచుకొని ఈ బట్టను ప్రజలకందరికీ సరఫరాచేయటంమీదా, అత్యాశలు పెట్టుకొని ప్రజలకు సౌభాగ్యం సమకూర్చగలమని ప్రణాళిక ఆశిస్తోంది.

ఇల్లాగే అత్యవసర పరిశ్రమ లన్నిటిలోనూ, పరిశ్రమయంత్రాంగ వృద్ధి ప్రస్తుతంలో అధికంగా సాధ్యం కాదని, ప్రణాళికలో యంత్రివృద్ధి సంఖ్యలే సూచిస్తున్నాయి. అయితే ఉన్న ఉపకరణ సంపత్తితోనే, కార్మిక - యాజమాన్య సంబంధాలు, తదితర పారిశ్రామిక పరిస్థితులు వాటంతట అవే బాగుపడి, చక్కెర, నూలు, ఇనుము, సిమెంటు, మోటారు యంత్రాలు, సబ్బులు ఇత్యాది అవసర వస్తువుల ఉత్పత్తి, ఒక్కొక్కచోట మూడింతలు నుంచి, ఒక్కొక్కచోట పదింతలు వరకూ పెరగగలదని ప్రణాళిక ఆశిస్తోంది. కాని ఈ సంబంధాలను, సరిదిద్దటం ప్రభుత్వం ఉన్న చట్టాలు ఇంకా తీవ్రంగా అమలుపరిచి చేయగలుగుతుందో, లేక ఉసులుబాట్లను హెచ్చించి చేయగల్గుతుందో, లేక ఉభయులలోనూ నైతికవృత్తి అకస్మాత్తుగా ప్రబలం అయిపోవటంవల్ల లభిస్తుందో తెలియటం లేదు. యజమానుల సౌకర్యాలు తగ్గిస్తే, ప్రయివేటు వ్యాపారము, ప్రభుత్వం వ్యాపారానికి దోహదంగా, పెట్టుబడులతో ముందుకు రాదేమోనని గత నాల్గేళ్ల అనుభవం చెప్తూంది. కార్మికుల సౌకర్యాలు హెచ్చించకపోతే, పరిశ్రమలకే మోసం వాటిల్లుతుందేమోనని ప్రస్తుత కార్మిక పరిస్థితులు భీతావహం కల్గిస్తున్నాయి. ప్రణాళిక దేశ క్షేమార్థం, ఉభయులూ త్యాగాలు చెయ్యవలెనన్న ప్రబోధం వల్లనే ఈ సామరస్యం సమకూర్చుకు రాగలదని అత్యాశలు పెట్టుకుంది.

మిశ్రమ ఆర్థికవిధానం అవలంబించటంలో, ప్రభుత్వానికి చట్టబుద్ధికన్నా ప్రజల్లో నైతికబుద్ధి, పరహితార్థమై సొంతలాభం కొంత మానుకోటం, ప్రణాళికల ఆచరణకు, ఫలసిద్ధికి అత్యవసరా లవుతాయి. అందుచేతనే ప్రణాళిక ప్రత్యంశంలోనూ, ఈ ప్రబోధం విరివిగా కనబడుతూ వస్తుంది.

చిన్ని చిన్ని పరిశ్రమలు, కుటీరపరిశ్రమల విషయంలో, ప్రణాళికలో ప్రబోధం మరింత హెచ్చుగానే ఉంది. గాని విద్యుచ్ఛక్తి సరఫరామీద చిన్న చిన్న పట్టణ పరిశ్రమలను వృద్ధిచేసుకోగలమని ప్రణాళిక ఆశిస్తూంది. కాని విద్యుచ్ఛక్తి యాథార్థ్యమైతే తప్ప, వీటి బాగోగులు నిర్ణయం కావు.

కాక చిన్నిపరిశ్రమలలో కూడా దేశంలో ఏయే పరిశ్రమలకు సహజమైన వాణిజ్య ఆస్కారముందో, ఏయే పరిశ్రమల ముడిపదార్థాలు దేశంలో సరఫరాకు తగినంత విరివిగా దొరుకుతున్నాయో, ఏవేవి, ఈ చిన్ని మొత్తాల పెట్టుబడిదారులకు ధరలు తగ్గిపోగలనంత సుకరంగా, చవుకగా

ప్రభుత్వం సరఫరాచేసి ప్రోత్సాహమిచ్చి, దేశీ సరుకులను ప్రజలకు ఆకర్షణీయమైన చౌకధరలలో అందుబాటుచేయ గలదో, ఈపరిశ్రమలలో తమకున్న కొద్ది డబ్బు పెట్టుబడిగా పెట్టి నష్టపోకుండా పరిశ్రమదారులకు ఏమేమి హామీలు ప్రభుత్వం యియ్యగలదో ఇవన్నీ, పరిశోధనలమీద తేలవలసిన విషయాలు. చిన్నపరిశ్రమల విషయంలో ఇంకా విచారిస్తున్నామని ప్రణాళిక హామీ యిచ్చింది.

ఏమైనా, ఇది మొదటి ఐదు వత్సరాలలో జరుగగల అభివృద్ధిగా సూచితం కావటంలేదు. అందుచేత ఈవిషమైన నిరుద్యోగ సమస్యా పరిష్కారమూ, చిన్నపరిశ్రమల వస్తుసంపద విరివిగా చౌకగా ప్రజలకు దొరకి, జీవన ప్రమాణాలు పెరిగే ఆస్కారమూ, మొదట విద్యుచ్ఛక్తి అపారంగా దొరికేటంతవరకూ అంచనా వేసికోవటం అత్యాశే కావచ్చును. అదీగాక ఈపరిశ్రమల అభివృద్ధి, శాస్త్రవిజ్ఞానాధికులై, తగినంత ధనముండి, ఉత్సాహమున్న వారివల్ల కావలసిఉంది. కాబట్టి ఇట్లాంటి వారి సంఖ్య ప్రజలలో అధికంగా ఉండి ప్రజలలో విజ్ఞాన ప్రచారం సాగితే ప్రణాళిక ఆశయం అనాటి నుంచే ఫలితం చూపించవచ్చును.

కుటీర పరిశ్రమలవిషయంలో, ప్రణాళిక— ఖద్దరు, తివాచీలు, తాటిబెల్లం, బెల్లం, నూనెగానుగలు, దంపుడు బియ్యం, చేతికాగితం—వీటికే పరిమిత మొనర్చుకొంది. కాని ముప్పదియేళ్లుగా ఈవస్తువుల కుటీరపరిశ్రమ రోకంటిపాటగా ప్రజలకు విసుగు కల్పించటంవల్లనూ, ఈ వస్తువులలో ప్రతి ఒక్కటీ, యంత్రాలద్వారా, దేశానికి సమృద్ధిగా సమకూర్చగల వస్తువులకే తాత్కాలిక ప్రత్యామ్నాయాలుగా, త్యాగబుద్ధితో, పురాణ మనస్తత్వంతో తయారుచేసుకోవలసినవస్తువులవటం వల్లనూ, వీట్ల ఉత్పత్తి గాని, వినియోగం గాని, ప్రజలలో ఆకర్షణ కల్పించలేకపోయాయి.

రాష్ట్రప్రభుత్వాలు వీట్ల అభివృద్ధికై ఇంతవరకూ పెట్టిన కొద్ది ఖర్చుమాత్రానికైనా సరితూగే, ఫలితాలు గాని ప్రబోధం గాని ఇన్నాళ్ళవరకూ ప్రజలలో కలగకపోవటమే, ఈ ప్రత్యామ్నాయాలను కుటీరపరిశ్రమలుగా ప్రోత్సహించటం, ప్రజాప్రకృతికి సహజంగాని స్వభావాన్ని కల్పించగలమనుకొనే ఆదర్శవాదుల అడియాసే యేమో ననిపిస్తుంది.

కాని ఈ సమస్య లన్నిటినీ వాస్తవికంగా అర్థం చేసుకోవలసిన దృష్టినీ, ప్రయోజనకరమైన కృషికి బాటనూ, ఈ ప్రణాళిక సూచిస్తోందన్నది నిర్వివాదాంశము. "ప్రణాళికలో బాగోగులుకాదు ముఖ్యం. వాస్తవిక పరిస్థితులను గ్రహించి, క్రమబద్ధంగా ఒక ప్రణాళిక ప్రకారంగా సమిష్టి సహకార పద్ధతిని ప్రజ యావత్తూ కృషిచేస్తే తప్ప మన దేశాభ్యుదయానికి మార్గాంతరం లేదని, దేశప్రజలం ప్రతిఒక్కరం గుర్తించటం అత్యవసర" మని, పండిట్ నెహ్రూ ప్రబోధ మొనర్చారు. ఈ ప్రణాళికను తయారుచేసిన నిపుణులు, గతంలోని వాస్తవిక పరిస్థితులతోనూ, ఆర్థిక, పారిశ్రామిక, విషయాలతోనూ, పరిపాలనా సమస్యలతోనూ, ప్రత్యక్ష పరిచయంగల్గిన ఆర్థిక, తాత్విక నిపుణులు. ప్రతి విషయంలోనూ, దేశంలోఉన్న సంపద ఎంతో, వినియోగంలోకి రాగల్గిన దెంతో, దేశ జనాభా పెరుగుదలలు, సామాన్య ప్రజలకు ఏయే వస్తువులు ఎంతెంతమాత్రం లభ్యంకాగల సంఖ్యా, ప్రజలకు తలకు లభించగలవస్తు పరిమాణం, అభివృద్ధి జరగాలన్నా, అధమం ఇంతమాత్రపు పరిస్థితి అన్నా నిలవాలన్నా, భవిష్యత్తు నిర్మాణంకై ప్రజలు భరించవలసిన కనీసపు ఖర్చులు, అన్నీ యథార్థంగా, క్షుణ్ణంగా తెలిసినవారు. ప్రణాళికలోని ఏయే ఆదర్శాలు ఎంతవరకూ కార్యరూపం దాల్చగలవో, పాలనా యంత్రపరంగానూ, ప్రజాపరంగానూ, వాట్లకువచ్చే అభ్యంతరాలూ, కృషిదోహదాలూ, కూడా అనుభవైక్యంగా ఎరిగున్నవారు. కాబట్టి, ప్రస్తుతపరిస్థితులలో, ఈపరిమిత వ్యయాలలో ఇంతకన్న ఎక్కువ ఆశలు చూపించగల ప్రణాళికలు రాగల వేమో తప్ప ఇంత మాత్రపు ఫలసిద్ధిని సమకూర్చగల ఆచరణ యోగ్యమైన ప్రణాళికలు రాగల్గటం కష్టం. అదీకాక ప్రజా సహకారంతో, అవసరమైన అభివృద్ధులు, మార్పులూ, ప్రణాళికలో తెచ్చుకునేందుకు ప్రజాస్వామ్య విధానంలో అవకాశం హెచ్చుగా నే ఉంది. కాని ప్రణాళిక ఫలితాలకైన ఆచరణ సర్వస్వమూ, ప్రజలలోనూ, ప్రభుత్వోద్యోగులలోనూ, ఆకస్మిక నైతిక పరివర్తనం కలగటంమీద ఎక్కువ ఆధారపడిఉంది. నైతికాచరణం నష్టదాయకం కాని పరిస్థితులను దేశంలో ప్రభుత్వం కల్గించగల్గినవాడు తప్ప, నీతి, నీరసగుణంగానూ, అవ్యక్తతిగానూ, ప్రజలు భావించక తప్పదు. ఈ పరిస్థితుల కల్పన, పరిపాలనా యంత్రాన్ని నియమవంతం చేసికోటంమీదే ఆధారపడిఉంది. ప్రజలకన్నా ప్రభుత్వోద్యోగిలో, అలసత, అవినీతీ, ఉద్యోగులకే ప్రమాదకరాలన్న కఠోర నియమాలను ప్రభుత్వం అవలంబిస్తే తప్ప, ప్రభుత్వం ప్రజలలో ప్రజాస్వామ్య స్వభావాన్ని, వృద్ధిపొందించి, ప్రజలకున్న నిసర్గ నైతికాచరణాన్ని దేశాభ్యుదయాకరంగా మల్లించలేదు.

శిప్రామిథునము

★

శ్రీ దిగుమర్తి సీతారామస్వామి

*

కాళిదాసు

మూతులరవిచ్చు తమ్ముల మొదటి తావి
కానుకలు పెట్టు వేకువ కమ్మగాలి
వెలుగు చీకటి భేదింప నలవిగాని
వేళ-నీరవ శిప్రా తమాలవీథి

వరణోత్తుంగనగార్పిత ప్రసవ సంపర్కమ్ము శైతల్యంబు
ఘురశిప్రాసలిలావగాహమునకున్ బూన్చెన్ రత శ్రాంతులన్
పరగెన్ ప్రాత రుపోఢ చక్రమిథున స్వానమ్ము కల్హారకే
సరళయ్యా సుఖసుప్త మత్త మధుపస్వామిన్ ప్రబోధించుచున్
రమ్ము మాళవికా యౌవనమ్ముగాక
ప్రణయ సౌందర్యములు శరీరతః జలింప
మలయవాయువుపగిది భూతలమెగాక
దివ్యలోకాలు స్పృశియించు దీప్తిమతివి.

మాళవిక

రాకెటు లుందునోయి కవిరాజ! యమాయిక మామకీన రే
ఖాకిమసీయతల్ మధుర కావ్యముఖమ్ముల భిన్నభంగులన్
చేకొని దిద్ది తీరిచిన శిల్పివి-కీర్తి సపత్నితోడచీ
కాకయి పోవునట్టి వెత కైపున మాన్చు భుజంగ కేళికిన్.
ఈకురంటక వృతినిభృతైకమంట
పమున నవతాలినై సరస్వతి భజింతు
నోయి తారుణ్యశాలి యూహోజ్జ్వలముగ
భావి రసికులు దర్శించి పరవశింప.

కాళిదాసు

కవితయును కీర్తియును నాకు కన్నబిడ్డ
లట్టివారితో సవతిపోరగుట యెట్లు
తెలియకాడితి మనదైన చెలిమి తడిమె
నీఫలద్వయి రాణించె నిది నిజమ్ము.

భవదీయాంకమునన్ శిరం బునిచి వైవశ్యస్థిరాలోకనో
త్సవ దేవత్వమునన్ పురాణ మధురస్వర్గమ్ము లెన్నేని మా
నవ సంసారికి చూర యిచ్చితివి-మానస్యంబైన యీశాద్వలా
ర్ద్రవిశిష్టావని నీరహో మిథున గీతుల్ భావుకుల్ వింద్రుపో;
యుగయుగమ్ములు గా మన మొకరినొకరు
వెదకికొనుచుంటి మీక్షణముదముకొరకు
ఈ క్షణానుభవమ్ము సాహిత్యనిత్య
పథికులకు కల్పముల్ దారిబత్తెమిచ్చు.
అదె నందనము రాజసదనమాశ్రమమున
గాధిరాడ్వనతి నీవలరుచోటు-
ఆమూర్తి యుర్వసి దగునా నీదగునొక
కుంతల పార్వతి పంతమాడ-
అటపురూరవుడు మా అగ్నిమిత్రుండు దు
ష్యంతుడెగా దీక్షుడైన వరుడె-
అదియొకనాడుండి ముదిమిని బొందురూ
పముగాదు సర్వర్తుభవ్యమిట్లు
నిన్ను చిత్రించుకొంటి నెన్నియొ విధాల
యక్షివో కామరూపిణి వద్భుతముగ
ఈ సమాగతియే లభియింప దేని
కవికి ప్రేయసి జగతికి కవియు లేరు.
వ్యయపడి యాకురాల్చు శిశిరాగమ జీవితహోషన ప్రియా
ధ్యయనవసంత శోభనెదురైతి వదృష్టము దృష్టమిట్టు లె
మ్మెయి ఋణమీగ వచ్చు నని మీలద మర్త్య సరోజనేత్ర ?
నయనమనీష కంకిత మొనర్చక జీవితకావ్యబంధముల్.

మా ళ వి క

వినయానిచుళితమైన యీ గానమె నన్ను
నీకు సాహిత్య సహధర్మిణిగనొనర్చె
నొకమహా శిల్పికుద్దీపనకరమైన
రేఖగలయట్టికన్య ధరిత్రి ధన్య.
అవశుభాల కృతజ్ఞతనైన తెల్పు
కొనగలేనెట్లు పాలించుకొందొ నన్ను
బాలమందారమిది నీరవప్రియాళి!
యింతకును సాక్షి శిప్రాస్రవంతియొకడె.

కాళిదాస మహాకవి

తాత్త్వికదృక్పథము

★

శ్రీ పి. గణపతిశాస్త్రి

ఒక కవి కావ్యపరిశీలన చేసే సమయంలో అతని తాత్త్విక దృక్పథాన్ని గురించి తెలుసుకోవాలని పాఠకులకు కుతూహలం కలగడం సహజము. తాత్త్వికదృక్పథం అంటే కేవలం వేదాంత (*Philosophical*) దృక్పథమే కానక్కరలేదు. ప్రతి కవికీ జీవితాన్ని గురించి, సాంప్రదాయికంగాగాని, సహజంగాగాని కలిగిన కొన్ని అభిప్రాయాలుండవచ్చును. ఆ అభిప్రాయాలతని కవితలో ప్రతిఫలించి ఆ కవితకొక ప్రత్యేక వ్యక్తిత్వము, స్వరూపము కలిగిస్తాయి. భిన్నభిన్న దేశీయులైన కవులలో ఆయా దేశాలలో సంప్రదాయానుసారంగా వస్తున్న సంస్కృతిగాని, జాతీయ జీవనంగాని ప్రతిబింబించినపుడు ఆయాదేశాల ఆధ్యాత్మిక జీవనం సంపూర్ణంగా అవగాహన మైనపుడే ఆ కవితాస్వభావం సంపూర్ణంగా తెలుస్తుంది.

కాళిదాస మహాకవి కావ్యాలలో అంతటా ఒక విశిష్టమైన తాత్త్వికదృక్పథం అంతర్లీనంగా ధ్వనిస్తున్నది. అయితే దీన్ని ఇదమిత్థమని దృఢంగా నిర్ణయించడానికి తగిన చారిత్రిక ఆధారాలేవీ లభించలేదు. ఈ కవి కావ్యాల్లో ఆత్మగతంగా చెప్పకున్న వృత్తాంతం ఎంత వెదికినా ఏదీ కనబడలేదు. అపైన ఇంతవరకు జరిగిన పరిశోధనలవల్లకూడా ఈ విషయంలో ఇదమిత్థమని నిర్ణయించడానికి తగిన ఆధారాలేమీ దొరకలేదు. అందుచేత కేవలం కాళిదాస కావ్యాల్లో లభించిన అంతరంగిక సాక్ష్యంవల్లనే ఈ విషయం నిశ్చయించవలసి ఉన్నది.

అంతరంగిక ఆధారాలు

కాళిదాస కవి తన కావ్యాల్లో రఘువంశంలో మాత్రమే, పార్వతీ పరమేశ్వరులను స్తుతించాడు. మిగిలిన ఋతుసంహార, కుమారసంభవ, మేఘ సందేశాలలో ఈశ్వరస్తుతి లేదు. నాటకాల్లో మూడింటిలోను ఈశ్వరస్తుతి కనిపిస్తున్నది.

అయితే ఈ నాటకాల్లో సూత్రధారుడు చేసిన ఈశ్వరస్తుతి మహాకవి వ్యక్తిగతంగా చేసిన ధ్యానం అవునా కాదా అన్న సందేహం కలగవచ్చును. కొందరు కవులు తమ కావ్యాల్లో ఒక ప్రత్యేక వ్యక్తిత్వం అవలంబించి ఆ వ్యక్తిత్వంతో కావ్యరచన చేసి ఉండవచ్చును. అదీగాక 'కాళిదాస రూపకాల్లో సూత్రధారుని అభిప్రాయాలు కాళిదాస మహాకవివే అని నిశ్చయించవచ్చునా?' అని ఎవరికైనా సందేహం కలగవచ్చును. కవి వ్యక్తిగతాభిప్రాయాలకు, కావ్యంలోని కవి అభిప్రాయాలకు కొంత భేదం ఉండడం వాఙ్మయంలో సర్వసాధారణంగా కనబడుతూనే ఉన్నది.

కాని ఈవిధంగా కవివ్యక్తిగతాభిప్రాయాలకు, కావ్యగతాభిప్రాయాలకు భేదం ఏర్పడడం అధునాతనలయిన ప్రాచ్యపాశ్చాత్యకవులలోను, వాస్తవికము (*Objective*)లయిన నాటకాది రచనలలోను ఎక్కువగా కనిపిస్తున్నది. అయితే కాళిదాస రూపకాలలో సూత్రధారుడు నాటకీయ పాత్రలలో చేరినవాడు కాజాలడు. అందుచేత ఇతని నాందీ శ్లోకాలను కాళిదాసీయ మనోభావాలుగా మనం స్వీకరించవచ్చును.

అదీగాక ప్రాచీన భారతీయ కవితా సంప్రదాయంలో కవి తన కవితాసృష్టిలో ప్రత్యేక వ్యక్తిత్వం స్వీకరించడం కనబడదు. మరిన్ని ప్రాచీన భారతీయుల జీవన దృక్పథం జీవిత విభాగాలన్నిటినీ సమగ్రంగా ఆకళించుకొన్న తాత్త్వికదృక్పథము. అందుచేత వ్యాసభారతంవంటి అత్యంత వాస్తవికమైన విశ్వతోముఖసృష్టిలో కూడా వ్యాస మహాకవి వేదాంత దృక్పథం అతి సులభంగా అవగాహన అవుతున్నది. కాళిదాస రూపకాలలో వ్యాసునిలో ఉన్నంత వాస్తవికత కనబడదు. అందుచేత ఈ నాట

కాల నాందీ శ్లోకాలనుబట్టి కాళిదాస తాత్త్విక దృక్పథం నిర్ణయించడంలో అనౌచిత్య మేమీ లేదు.

కాళిదాస రచనలలో అంతటా పరమేశ్వర స్తుతి విస్పష్టంగా కనిపిస్తున్నది. కాళిదాస నామధేయాన్నిబట్టి కూడా అతడు శైవసంప్రదాయం అవలంబించిన కుటుంబంలో జన్మించి ఉండవచ్చునని ఊహించవచ్చునే. కాళిదాస స్తోత్రాలలో సాంప్రదాయికమైన భారతీయతాత్త్విక దృక్పథమే కనిపిస్తున్నది. అయితే భారతీయ వేదాంత దృక్పథం విభిన్నవిధాలుగా ఉన్నది. షడ్దర్శనాలు, వాటికి సంబంధించిన భిన్నభిన్న ప్రస్థానాలేగాక అద్వైతాది ప్రస్థానాలలో కూడా అనేకమైన శాఖలు, విభేదాలు ఏర్పడ్డాయి. సూక్ష్మసూక్ష్మంగా విభిన్నమైన మన వేదాంత ప్రస్థానాల్లో కాళిదాసకవి అవలంబించిన ప్రత్యేక ప్రస్థానం ఏమై ఉంటుందో ఈ కవి కావ్యాలనుబట్టి నిర్ణయించాలి.

కాళిదాస కాలనిర్ణయం ఇదమిత్థంగా ఇప్పటికీ తేలలేదుగాని చరిత్రకారులు ఇతని జననకాలానికి ఒక విధంగా పూర్వాపరావధులు నిర్ణయించారు. క్రీస్తుశకం ఒకటవ శతాబ్దానికంటె ఇతడు పూర్వుడై ఉండడనీ, అల్లాగే క్రీస్తుశకం ౬ శతాబ్దికంటె తరవాతివాడై ఉండడనీ వీరందరు అంగీకరిస్తారు.

ఈ రెండు కాలావధులకు మధ్యనే కాళిదాస కవి జీవించి ఉండవచ్చునని నిశ్చయించడానికి తగిన చారిత్రకాధారాలు దొరకడంవల్ల ఈ కాలం మనమూ అంగీకరించవచ్చును. అయితే ఈ కాలంనాటి భారతీయ వేదాంత గ్రంథపరిచితి కాళిదాస కవితలో ఎంతవరకు ప్రతిఫలించినదో పరిశీలిద్దాము.

పరమేశ్వరస్తుతి

కాళిదాస కవితలోని ప్రధాన గుణం జీవిత సౌందర్య లోలుపత. ఈ కవికి జీవితం ఒక మాయగాని, ఆభాసగాని కాదు. శంకరుడు కాళిదాస కవి తరవాత జన్మించినవాడని చరిత్రకారుల నిశ్చయము. అందుచేత శంకరుని మాయావాద ప్రభావం కాళిదాస కవిపై ప్రసరించే అవకాశమే లేదు. శంకరునికి పూర్వమే విరచింపబడిన కొన్ని వేదాంత గ్రంథాలలో మాయావాద సిద్ధాంత బీజా లున్నా ఇవి శంకరుని కాలంనాటికిగాని బాగా వ్యాప్తిలోకి రాలేదు. ఒకవేళ ఈ సిద్ధాంతం కాళిదాసకవికి పూర్వమే వ్యాప్తిలో ఉన్నా కాళిదాస కవితలో మాత్రము ఈ మాయావాద సూచనలు లేవని స్పష్టంగా చెప్పవచ్చును. ఉదాహరణకు రఘువంశ ప్రారంభములోని ఈ ప్రార్థనా శ్లోకం తీసుకుందాము—

'వాగర్థా వివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ.'

ఇక్కడ కవి నమస్కరించిన పార్వతీ పరమేశ్వరులు వాగర్థాలవలె నిత్యసంయుక్తులు. వాక్కు లేని అర్థంగాని, అర్థంలేని వాక్కుగాని కేవలం ఊహాతీతములైన తాత్త్విక విషయాలు. అలాగే పార్వతీ పరమేశ్వరాతీతమైన, తత్త్వస్వరూపం కూడా అచింత్యమే. కాళిదా సీ అచింత్యస్వరూపానికి నమస్కరించక ఊహాగమ్యమైన పార్వతీపరమేశ్వర స్వరూపానికే నమస్కరిస్తున్నాడు.

అభిజ్ఞాన శాకుంతలంలోని నాందీ శ్లోకం ఈ విషయాన్నింకా స్పష్టపరుస్తున్నది.

"యా సృష్టిః స్రష్టు రాద్యా వహతి విధిహుతం
యా హవి ర్యా చ హోత్రీ
యే ద్వే కాలం విధత్తః శ్రుతివిషయగుణా
యా స్థితా వ్యాప్య విశ్వమ్
యా మాహుః సర్వ భూత ప్రకృతి రితి
యయా ప్రాణినః ప్రాణవంతః
ప్రత్యక్షాభిః ప్రపన్నః తనుభి రవతు
వః తాభి రష్టాభి రీశః"

ఇక్కడ కవి పృథివ్యాద్యష్ట మూర్తులలో ఇంద్రియ గోచరుడై సాక్షాద్దర్శనీయుడయిన అష్టమూర్తికే తన నమస్కృతి సమర్పిస్తున్నాడు.

కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలంలోనే గాక మాళవికాగ్నిమిత్రంలో కూడా అష్టమూర్తి అయిన ఈశ్వరునికి సూత్రధారుని ముఖతః నమస్కారం చేయించాడు.

"ఏకైశ్వర్యే స్థితోపి ప్రణతబహు ఫలే
యః స్వయం కృత్తివాసాః
కాంతా సమ్మిశ్రదేహో ప్యవిషయ మనసాం
యః పరస్తా ద్యతీనామ్
అష్టాభి ర్యస్య కృత్స్నం జగదపి తనుభిః

బిభ్రతో నాభిమానః
సన్మార్గాలోకనాయ వ్యపనయతు స వః
తామసీం వృత్తి మీశః"

ఈ శ్లోకంలో కవి స్తుతించిన పరమేశ్వరుడు, విశ్వైశ్వర్యశాలి; అయినా అతడు కేవలము కృత్తివాసన్ను మాత్రమే ధరించినవాడు; ఈతని దేహము కాంతాసమ్మిశ్రమైనది. అయినా, ఇతడు విషయాతీతులయిన యోగుల కందనివాడు. తన అష్టమూర్తులతో ప్రపంచం అంతా ధరిస్తున్నా ఈతని కా విషయమయిన అభిమానమే లేదు. ఇలాంటి పరమేశ్వరుడు సన్మార్గాలోకనం కొరకై తామసవృత్తిని నశింపజేయవలెనని సూత్రధారుని ముఖతః కవి పారిషదులను ఆశీర్వదిస్తున్నాడు.

కాళిదాసు తన కవితలో ఇంద్రియాతీతమైన పరమేశ్వర తత్త్వం సూచించినా, పృథివ్యాదిమయుడైన పరమేశ్వరునియందే తన భక్తిభావం ప్రసరింపజేశాడు. విక్రమోర్వశీయంలోని నాంది శ్లోకంలో పరమేశ్వరుడు స్థిరభక్తియోగ సులభుడని కాళిదాసు పేర్కొన్నాడు. విక్రమోర్వశీయంలో ప్రస్తుతింపబడిన పరమేశ్వరుడు నియమిత ప్రాణులయిన ముముక్షువులచే అన్వేషింపబడినవాడు. అయినా ఇతడు రోదోంతరాళం వ్యాపించిన ప్రత్యక్షమూర్తి. ఈశ్వరుడనే నామం ఇతనియందే యథార్థమైనది. ఇతడు పారిషదులకు నిశ్శ్రేయసం ప్రసాదించవలెనని విక్రమోర్వశీయ నాంది శ్లోకంలో సూత్రధారు డాశీర్వదించాడు.

కు మా ర సం భ వం

కాళిదాస తాత్త్విక దృక్పథానికి కుమారసంభవం ఒక పరమోదాహరణం. బహుశః ఇది కాళిదాస కావ్యా లన్నిటిలోను చిట్టచివరి కావ్యమై ఉండవచ్చును. దీనిలో కాళిదాసకవి ఆధ్యాత్మిక దృక్పథం ప్రతిబింబించినంతగా మరి ఏ ఇతర కావ్యంలోను ప్రతిబింబించలేదు.

కేవలం ఎవరో ఇద్దరు నాయికా నాయకుల అనురాగవర్ణమే తన అభిప్రాయమైతే కవి మరి ఏ ఇతర కథావస్తువైనా స్వీకరించి ఉండేవాడు. పార్వతీ పరమేశ్వరుల పరిణయం కావ్యేతివృత్తంగా స్వీకరించి కుమారస్వామి జననం ఆ పరిణయ ప్రతిఫలంగా సూచించడంలో కవి ఉద్దేశ్యం ఏమై ఉంటుంది? ఈ వివాహంలో ప్రకృతి స్థానీయురాలైన పార్వతి తన తపఃఫలితంగా పరమేశ్వరుని శరీరంలో శరీరమై క్రమంగా అతనిలో అర్థభాగం స్వీకరిస్తుంది. బ్రహ్మాదులైన దేవత లందరు తారకాసుర సంహారార్థమై కుమారస్వామి జననం అపేక్షించి, పార్వతిపై పరమేశ్వరునికి అనురాగం కలిగించవలసిందని మన్మథుని ప్రోత్సహిస్తారు. అదీగాక ఈశ్వరుని వివాహం మన్మథదహనానంతరమే జరిగింది.

అందుచేత కేవలకామప్రవృత్తికి దీనిలో అవకాశమే లేదనీ, లోకోపకారకమైన అలౌకిక దివ్యప్రేమ వర్ణనమే కవి అభిప్రాయమనీ తేలుతున్నది. కనకనే కాళిదా సీ ఇతివృత్తమే ప్రత్యేకంగా స్వీకరించి ఒక మహాకావ్యంగా రచించాడనీ, చివరి అష్టమసర్గలో పార్వతీపరమేశ్వరుల సంభోగవర్ణనవల్ల కవి, కుమారస్వామి సంభవం వ్యంగ్యంగా సూచిస్తున్నాడనీ సులభంగానే ఊహించవచ్చును. ఈ అభిప్రాయంతోనే కవి కుమారసంభవం ఆ సర్గతోనే ముగించాడనీ, ఈ వ్యంగ్యం తెలియని ఇటీవలి కవి ఒకడు మిగిలిన సర్గలన్నీ వ్రాసి కావ్యం పూరించాడనీ నిశ్చయించవచ్చును.

కాళిదాసకవికి ప్రకృతి పురుషు లిద్దరు సమాన ప్రాముఖ్యం కలవారే. కనకనే రఘువంశప్రారంభంలో కవి పార్వతీపరమేశ్వరుల నిద్దరినీ సమానంగా వాగర్థాలతో పరిపోల్చడం జరిగింది. ఇంతేకాదు; కాళిదాసకవికి ఇంద్రియానుభూతిగాని, ఇంద్రియగోచరమైన ప్రకృతి సౌందర్యాదికంగాని ఏహ్యము, పరిహరణీయము అయిన మిథ్య కాదు. ఇంకా ఒక అడుగు ముందుకు వేస్తే ఇంద్రియానుభూతి జన్యమైన ఆనందం అనాసక్తతతో ఆస్వాదిస్తూ, జీవితసర్వం నిర్వర్తించుకుంటూ పరమేశ్వర సాక్షాత్కారం పొందడమే అతని ఆధ్యాత్మిక సాధన సారాంశమని నిర్ణయించవచ్చును. ఈ కారణంచేతనే అతడు కుమారసంభవంలోని అష్టమసర్గలో పార్వతీపరమేశ్వరుల సంభోగశృంగారం యథాతథంగా వర్ణించడానికి వెనుదీయలేదు. రఘువంశంలో సాక్షాత్తుగా తాను జగత్తుకు తలిదండ్రులని వర్ణించిన పార్వతీపరమేశ్వరుల సంభోగశృంగారం ఇటువర్ణించడంలో ఇదే పరమార్థము. ఆనందవర్ధనాచార్యుడు ఈ విషయం గ్రహించక

పోవడంవల్లనే తన ధ్వన్యాలోకంలో "పార్వతీ పరమేశ్వరుల సంభోగ శృంగారవర్ణనము తల్లిదండ్రుల సంభోగ వర్ణనంవలె చాలా అసహ్యంగా ఉన్న"దని ఈకవిని తీవ్రంగా అధిక్షేపించాడు.

కేవలం సంకుచితమైన ఆలంకారిక దృక్పథంతో కాళిదాస కవిత సమీక్షించడం వల్లనే ఆనందవర్ధను డీవిధంగా కాళిదాస కవిత విమర్శించాడు.

కట్టుకథలు

కాళిదాసకవి జీవితాన్ని గురించి అణుమాత్రమైనా చారిత్రికాధారం లభించలేదని అనుకున్నాము. కాని ఇతనినిగురించి కట్టుకథ లెన్నో ప్రాచీన పండిత లోకంలో వ్యాపించాయి. ఇతడు వేశ్యాలోలుడనీ, చివరికి ఒక వేశ్య చేతుల్లోనే ప్రాణాలు కోల్పోయాడనీ ఒక కట్టుకథ పండితలోకంలో వ్యాపించి ఉన్నది.

కాని ఈ కవి కావ్యాలన్నీ సూక్ష్మంగా పరిశీలించిన వారికి ఒక విషయం ముఖ్యంగా గోచరిస్తుంది. కాళిదాసకవి ఇంద్రియ సౌందర్య రసాస్వాదన లోలుపుడు. ఆ సౌందర్య వర్ణనం అతని కవిత్వంలో అంతటా ప్రత్యక్షమౌతూనే ఉంటుంది. కాని ఈ సౌందర్యం దివ్యలీలగానే అతడుపాసించాడు. కనకనే అతనిలో ఈ సౌందర్యారాధనతో బాటు ఆధ్యాత్మికమైన అనాసక్తత కూడా సమ్మిళితమై కనిపిస్తుంది. ఈ అభిప్రాయం అభిజ్ఞాన శాకుంతలంలోని ఈ క్రింది శ్లోకంలో అత్యంత మనోహరంగా నిరూపితమైనది.

"ప్రాణానా మనిలేన వృత్తి రుచితా
సత్కల్ప వృక్షే వనే
తోయే కాంచనపద్మరేణుకపిశే
ధర్మాభిషేకక్రియా
ధ్యానం రత్న శిలాతలేషు విబుధస్త్రీ
సన్నిధౌ సంయమః
యత్కాంక్షంతి తపోభి రన్యమునయః
తస్మిన్ తపస్యంత్యమీ"

ఇది కశ్యపాశ్రమంలో తపోనిరతులైన మహర్షులను వర్ణించే శ్లోకము. వీరు కల్పవృక్ష పూర్ణమైన అరణ్యంలో కేవలంగాలి పీల్చి జీవం నిల్పుకొనేవారు. బంగారు తామరపూవుల పుప్పొడితో పచ్చనైన ఉదకంలో ధర్మార్థమే స్నానం చేసేవారు; రత్నశిలా తలాలపై ఆసీనులై ధ్యానంచేసేవారు; అప్సరఃస్త్రీల సాన్నిధ్యంలోనే నిగ్రహం అవలంబించిన ధీరులు! అన్య మునులు ఏమేమి కావాలని కోరి తీవ్రంగా తపస్సు చేస్తూంటారో అలాంటి సకల సంపత్సంపన్నమైన ప్రదేశంలోనే నివసిస్తూ వీరింకా తపోనిరతిలో ఉన్నారట!

ఈ ఆశ్రమంలోని మహర్షులు జీవితసౌందర్యం ఒక 'మాయా వాగుర' అని భయపడి పారిపోయిన వైరాగులూ కారు; అలాగని ఆ సౌందర్యాగ్నిలో శలభాలై ఆత్మవిస్మృతిలో పడిపోయిన కామాంధులూ కారు. వీరిలోని ఆధ్యాత్మిక భౌతికప్రవృత్తులు పరస్పర విరుద్ధభావం విడిచి, మనోహరమైన పరస్పర సమ్మేళనం పొందాయి. ఆధ్యాత్మికతా విహీనమైన కేవల భౌతిక సౌందర్యార్చన గాని అలాగే భౌతిక సౌందర్యదూరమైన శుష్కాధ్యాత్మికలబ్ధి గాని కాళిదాస కవికి అభిమతం కాదు.

ధర్మదృష్టి

అయితే ఆధ్యాత్మికపూర్ణమయిన సౌందర్యారాధనమే కాళిదాసాదర్శమనీ, జీవితంపై ఈకవికి వేరే అభిప్రాయాలేవీ లేవనీ, ఇతడు కళలో కేవలం సౌందర్యమే ప్రధానాదర్శంగల కవి అనీ భావించకూడదు. కేవలం కళకోసమే కళ అనే దృక్పథం ప్రాచీన భారతీయ కవులలో లేనేలేదు. ఇతని సౌందర్య దృక్పథంలో సంపూర్ణమైన ధార్మికభావం ఒక ప్రధాన లక్షణం. ఈ లక్షణమే ఈతని సౌందర్యదృష్టికొక అలౌకిక మనోహరత్వం కలిగించింది. ఈవిధమైన ధార్మిక భావానికి ఇతని రఘువంశం ఉదాహరణంగా ఇవ్వవచ్చును.

రఘువంశ ధార్మికత

ఈ కావ్యం ప్రారంభంలోనే కాళిదాస కవి ఆదర్శమూర్తులయిన రఘువంశరాజులచరిత్ర వర్ణిస్తున్నానని ప్రతిజ్ఞ చేశాడు. వీ రందరిలోను రఘురాజు చరిత్ర కాళిదాస ధార్మిక జీవనదృక్పథానికి పరమోదాహరణము. ఈ రఘువు దిగ్విజయంచేసి భారతదేశచక్రవర్తియై, సర్వజిద్యాగంచేసి తన సర్వస్వము ఆ యజ్ఞంలో దక్షిణార్థంగా వినియోగించి

కేవలం మృణ్మయపాత్రతోను, కట్టుబట్టలతోను నిలిచిన పరమధార్మిక మూర్తి.

ఈ ఇతివృత్తంలో కూడా కాళిదాసు కేవలం రిక్తుల వైరాగ్యం వర్ణించలేదనీ, సర్వంసహాచక్రవర్తిఅయిన సార్వభౌమునిలోనే ఈ వైరాగ్యం అభివర్ణిస్తున్నాడనీ గ్రహించవలసిఉన్నది.

కౌత్సుని కథ

రఘువంశంలో కౌత్సుని కథలో మహాకవి ధార్మికదృక్పథం పరాకాష్ఠ పొందింది. రఘువు సర్వజిద్యాగం చేసి సమస్తము దానంచేసి మృణ్మయ పాత్రావశిష్టుడై ఉన్నాడు. ఈ సమయంలోనే తనగురువుకు ౧౪ కోట్ల సువర్ణం గురుదక్షిణ ఇవ్వ దలచిన కౌత్సుడితన్ని ఈ సువర్ణం ఇవ్వవలసిందని అర్థిస్తాడు. రఘువు దగ్గర ధన మేమీ లేదు. అయినా అతడు కుబేరునిపై దండెత్తి ఈ ధనం సంపాదించి కౌత్సునికివ్వాలని నిశ్చయిస్తాడు. అరాత్రేకుబేరుడతని కోశాగారంలో కనకవర్షం కురిపిస్తాడు. ఉదయాన్నే కోశరక్షకులు రఘు రాజుకు ఈ విషయం తెలియ జేస్తారు. రఘువు ఆ ధనంఅంతా కౌత్సునికివ్వబో తాడు. కాని కౌత్సుడు తన గురుదక్షిణా ధనంకంటె ఒక చిల్లిగవ్వ అయినా ఎక్కువ స్వీకరించనని అంటాడు. నీ ధనంకోసం చేసిన ప్రయత్నంలో వచ్చిన ధనం కాబట్టి ఇది అంతా నీవే స్వీకరించవలసిందని రఘురాజు కౌత్సుని బలవంతం చేస్తాడు. వీరిద్దరు ఇలా వివాదపడే సందర్భంలో కవి వ్రాసిన శ్లోకం అతని సమున్నత నైతికదృష్టి కొక సముజ్జ్వలోదాహరణము!

> "జనస్య సాకేతనివాసిన స్తౌ
> ద్వావేవ జాతౌ వభినంద్యసత్త్వౌ
> గురుప్రదేయాధిక నిస్పృహోర్థీ
> నృపోర్థి కామా దధికప్రదశ్చ"

సాకేతంలో నివసించే జనానికి ఇద్దరే వ్యక్తులు అభినందనీయు లైనారట! వారిలో ఒక వ్యక్తి గురువు దక్షిణకంటె ఎక్కువధనం అక్కరలేదనే అర్థి! రెండవవ్యక్తి అర్థి అడిగినదానికంటె ఎక్కువధనం ఇస్తానని బలవంతంచేసే రాజు!

అగ్నివర్ణ చిత్రణము

కాళిదాస కావ్యాలలో రఘువంశము, కుమార సంభవము కవి పూర్తిచెయ్యకుండా విడిచివేసిన గ్రంథాలని కొందరు విమర్శకులు అభిప్రాయ పడుతు న్నారు. కాని ఇది కాళిదాస కావ్యశిల్పం అవగాహన చేసుకోకపోవడంవల్ల ఏర్పడిన అభిప్రాయము. కాళిదాసు కథాకథనంలో కూడా నిశితమైన వ్యంగ్య ధోరణి అవలంబిస్తాడు. కుమార సంభవం చివరి సర్గలోని వ్యంగ్యం గ్రహించకపోవడంవల్లనే మరి ఒక కవి ఆ కావ్యం పూర్తి చెయ్యడం జరిగిందని ఇదివరకు అనుకున్నాము. రఘువంశంలో కూడా ఇల్లాంటి వ్యంగ్యమే కనిపిస్తున్నది. కాళిదాసకవి కేవలం ఆదర్శమూర్తులయిన రఘురాజుల చరితమే వర్ణిస్తున్నానని కావ్యాదిలో ప్రతిజ్ఞ చేశాడు. అందుచేతనే అతడు పురాణాలలో ఉన్న రఘువంశ క్రమం విడిచిపెట్టివేశాడు. ఇంకా మధ్యనఉన్న అనేక రఘురాజుల పేరులైనా రఘువంశంలో కనబడడం లేదు. అందుచేత కేవలం ఆదర్శమూర్తులయి, తన ధర్మదృష్టికి అనుకూలురయిన రాజుల చరితమే కాళిదాసు లక్ష్యమైనట్లు మనం నిశ్చయించవచ్చును. ఒకవేళ వీరు అంతగా ఆదిర్శధర్మమూర్తులు కారని తోచినపుడు కవి ఆయా రాజుల చరిత్రలు సంక్షేపంగా ఒకటి రెండు శ్లోకాలలో వర్ణించి విడిచి వేశాడు.

అయితే రఘువంశ కావ్యం చివర అగ్నివర్ణ చరిత్ర అంత విస్తారంగా చిత్రించడంలో కవి అభిప్రాయం ఏమైఉంటుంది? అగ్నివర్ణునిలో రఘురాజులలో ఉన్న ఉదాత్త పురుషగుణాలేవీ లేవు. అతడు నిత్యము కామినీలౌల్యంతో కాలక్షేపం చేసేవాడు. కేవలం కామలౌల్యానికీ రాజధర్మ పరిత్యాగానికీ ఈ అగ్నివర్ణ చరితం ఉదాహరణగా ఇవ్వవచ్చును. చివరికి అతి లౌల్యంవల్ల ఈ రాజు శరీరంలో క్షయ రోగం ప్రవేశిస్తుంది. ఆ రోగంతోనే అగ్నివర్ణుడు మరణిస్తాడు. ప్రజ లెవ్వరికీ ఇతని మరణ విషయం తెలియనీయకుండా మంత్రులు అతి రహస్యంగా అగ్నివర్ణ శరీరానికి దహనసంస్కారం జరిపిస్తారు. అనంతరం గర్భవతిఅయిన అగ్నివర్ణునిభార్య గర్భానికి రాజ్యాభిషేకం జరుగుతుంది. ఆ రాజ్ఞికవోష్ణ బాష్పాలతో కూడా ఆ గర్భానికి అభిషేకం జరిగిందని కాళిదాసే అభిషేకం వర్ణించాడు. సరిగా ఈ శ్లోకంతోనే రఘువంశ కావ్యం ముగిసిపోతుంది!

ఈ ధోరణిఅంతా మహాకవి రఘువంశ ప్రారంభంలో చేసిన ప్రతిజ్ఞకు కేవలం విరుద్ధం. అయితే

కవిచేసిన ఈ అగ్నివర్ణ చిత్రణంలో అంతరార్థం ఏమిటి? సూక్ష్మదృష్ట్యా చూస్తే దీని కొక ఉపపత్తి చూపించవచ్చును.

మహాకవి జీవిత సౌందర్యార్చకుడే కావచ్చును. అగ్నివర్ణుని చరిత్రలోకూడా కవి అతనిపై సానుభూతి కనబరుస్తున్నట్లే అతని భోగలాలస వర్ణిస్తాడు. ఈ భోగలాలస ధర్మబాహ్యమైనపుడు వ్యక్తి వినాశానికి దారి తీస్తుందని వ్యతిరేకోదాహరణం ద్వారా సూచించడానికే కాళిదా సీతనిని గురించి ఇంతగా అభివర్ణించినట్లు కనిపిస్తుంది. అనేకమైన ప్రాచీన రాజవంశాలు, ఆయా వంశాలలో జనించిన కేవల భోగలాలసులవల్లనే నశించాయని మన భారతదేశ చరిత్ర ఉద్ఘోషిస్తున్నది. మహామహులతో ప్రారంభించిన రఘువంశం కూడా ఈకారణంచేతనే విలుప్త ప్రాయం అయిపోయినదని సూచించడానికే కాళిదాసీ ఇతివృత్తం స్వీకరించి ఉండవచ్చును. దీనినిబట్టి కాళిదాసు సౌందర్యార్చనం కేవలం ఆత్మవిహీనమైన శుష్కారాధనం కాదనీ నైతికధర్మ పూర్ణమైన బాహ్యాంతర సౌందర్యమే అతని లక్ష్య మనీ మనం నిర్ణయించవచ్చును.

అభిజ్ఞాన శాకుంతలము

కాళిదాస కృతులలో అభిజ్ఞాన శాకుంతలము, ప్రపంచప్రఖ్యాతిపొందింది. ఇంచుమించుగా ప్రపంచ భాషలన్నిటిలోకి ఈ రూపకం అనువదింపబడినదని తెలుస్తున్నది. దీనిలోని ఉదాత్త కవిత్వమే దీని ప్రపంచ ప్రఖ్యాతికి కారణమని చెప్పవచ్చును. కాళిదాస రూపకాలన్నీ భావప్రధానమైన (*Lyrical*) రూపకాలని చెప్పవచ్చును. అయితే వీటిలో సున్నితమైన స్వభావోక్తులన ఉంటుంది. కాని ఈ స్వభావచిత్రణంలో కాళిదాసొక సూక్ష్మ పద్ధతి అవలంబిస్తాడు. ఒక పాత్ర సృష్టించవలసి నప్పుడు ఆ పాత్ర స్వభావాలు లక్షణాలు ఏకరువు పెట్టక ప్రధానమైన ఒక గుణంతో ఆ పాత్ర మన కళ్లకు కట్టేటట్లు చేస్తాడు. ఇలాగే అభిజ్ఞాన శాకుంతలంలో కృత్రిమమైన పౌరజీవితానికి, ఆధ్యాత్మికతాపూర్ణము, సరళమునయిన ఆశ్రమజీవితానికి తారతమ్యం చాలా సూక్ష్మంగా ప్రదర్శింపబడింది. కణ్వాశ్రమాన్నించి శకుంతలతో రాజసమీపానికి వచ్చిన కణ్వశిష్యుడు జనాకీర్ణమయిన ఈ నగరం, ఆశ్రమంనించి వచ్చిన తనకు అగ్గి దరికొన్న గృహంలా ఉన్నదని అభివర్ణిస్తాడు. కాళిదాసు దూర్వాసశాపము మొదలైనవి కల్పించి నాటకంలోని దుష్యంత స్వభావం బాగా ఉదాత్తంగా చిత్రించాడు. కాని ఆశ్రమసంజాతఅయిన శకుంతల సౌమ్యజ్యోతి ఎదట అతని జీవనచిత్రణం రంగువెలసిన బొమ్మలా వెలవెల బోతుంది. కేవలం ఒక అనురాగగాథగా తీసు కున్నప్పుడు అభిజ్ఞాన శాకుంతలంలోని అంతరార్థం పూర్తిగా విలుప్తమైపోతుంది. స్వర్గమర్త్యలోకాలు రెండూ శాకుంతలంలో మేళవించాయని గటే మహాకవి శాకుంతల నాటకం ప్రశంసించాడు. యౌవనాకృష్టమైన శకుంతలా దుష్యంతుల అనురాగం పశ్చాత్తాప, వేదనాతప్తమై చిట్టచివరికి అమరత్వం అందు కొన్నదని గటే మహాకవి అభిప్రాయం. మొదట ఆశ్రమంలో కలుసుకొన్న శకుంతలా దుష్యంతులకు మళ్లీ మారీచాశ్రమంలో—స్వర్గసమీపప్రదేశంలో సంయోగం కలిగించడానికి ఇదే అంతరార్థం.

ప్రత్యభిజ్ఞాన వేదాంతము

అభిజ్ఞాన శాకుంతలంలో మానవ, దైవతీతాను రాగాల తారతమ్యము, ఆశ్రమ నగర జీవితాల తార తమ్యము అతి సూక్ష్మంగా అభివ్యంజితమైనవని అను కున్నాము.

అభిజ్ఞాన శాకుంతలము తాత్త్వికదృష్టితో పరిశీలించిన లక్ష్మీధరకల్లా అనే ఉత్తరాహ పరిశోధకు లొకరు తాము వ్రాసిన (*The Birth place of Kalidasa*) అనే గ్రంథంలో అభిజ్ఞాన శాకుంతలంలో తాత్త్విక వ్యంగ్యంకూడా అంతర్గర్భితంగా ఉన్నదని నిరూపించారు. దీనికోసమై ఆయన కాళిదాస గ్రంథాలనుబట్టి కాళిదాస జన్మస్థానం కాశ్మీర దేశమై ఉండాలని కొన్ని ప్రబల కారణాలు పేర్కొన్నారు. కాశ్మీరంలో ప్రసిద్ధమయిన వివాహోద్యాచారాలు యథాతథంగా కాళిదాస కావ్యాలలో కనిపిస్తున్నాయనీ, ఇంకా యక్షులనే ఒక జాతి కాశ్మీరంలో ఉన్నదనీ వీరు నిరూపించారు. ఇల్లాగే కొన్నికొన్ని కాశ్మీర దేశీయములయిన పుణ్యతీర్థాలు కాళిదాస కావ్యాలలో వర్ణింపబడ్డాయనీ దీనివల్ల కాళిదాసకవి కాశ్మీరదేశీయుడే అయిఉండవచ్చు ననీ వీరి వాదం.

కాశ్మీర శైవము

ఇంకా కాశ్మీర శైవానికీ, కాళిదాస కావ్యాలలో కనబడే శివప్రశస్తిపరమైన శ్లోకాలకూ, వీరు చూపించిన సామ్యం చాలా ముఖ్యమయినది. కాళిదాసు కాశ్మీర దేశీయుడయినా కాకపోయినా, ప్రత్యభిజ్ఞాన ప్రస్థానమిశ్రితమైన కాశ్మీర శైవానికీ, కాళిదాస గ్రంథాలలో కనబడుతున్న తాత్త్విక దృక్పథానికీ చాలా దగ్గిర పోలికలున్నమాట నిశ్చయము. అందుచేత కాశ్మీర శైవ వేదాంతప్రభావం కాళిదాస కృతులలో ప్రసరించినదని నిశ్చయించవచ్చును. ప్రత్యభిజ్ఞాన ప్రస్థాన సమ్మిశ్రితమైన కాశ్మీర శైవానికీ కాళిదాస తాత్త్విక దృక్పథానికీగల ఈ ముఖ్యమయిన సామ్యాలు ప్రత్యేకంగా పరిగణించదగినవి.

౧. కాళిదాస కావ్యాలలోను, కాశ్మీర శైవంలోను మాయావాద ప్రసక్తి కనిపించడంలేదు.

౨. రెండిటిలోను భక్తిభావం ప్రధానమయినది.

౩. అష్టమూర్తిఅయిన పరమేశ్వరారాధనం కాశ్మీరశైవంలో ప్రధానంగా కనిపిస్తున్నది. కాళిదాస రూపకాలలో అష్టమూర్తిప్రశస్తి మాళవి కాభిజ్ఞాన శాకుంతలాల్లో కనిపిస్తున్నది.

౪. అభిజ్ఞాన శాకుంతల నామధేయాన్నిబట్టి చూస్తే దీనిలో ప్రత్యభిజ్ఞాన వేదాంతస్ఫురణ స్పష్టంగా కనిపిస్తున్నది.

౫. కాశ్మీర శైవసంప్రదాయంలో జీవేశ్వరుల భేదం విస్మృతివలన ఏర్పడుతున్నది. ఈ విస్మృతి పోయి తిరిగి ప్రత్యభిజ్ఞ (పునఃస్మరణ) కలిగినప్పుడు జీవునికి స్వస్వరూపజ్ఞానం కలుగుతుంది. అభిజ్ఞాన శాకుంతలంలో దుష్యంతుని విస్మరణము, అంగుళీయక దర్శనంవల్ల శకుంతలా ప్రత్యభిజ్ఞానము, శాకుంతలం ప్రథమాంకంలో దుష్యంతుని "మృగానుసారిణం సాక్షాత్పశ్యామివ పినాకినమ్" అని ఈశ్వరునితో పోల్చడము, మొదలైన కారణాలవల్ల కవి ప్రత్యభిజ్ఞా వేదాంతం తన రూపకంద్వారా స్ఫురింపచేస్తున్నాడని లక్ష్మీధరకల్లాపండితుడు తనగ్రంథంలో నిరూపిస్తున్నాడు. కాళిదాసకవిపై కాశ్మీర శైవ ప్రభావం పడిందని ఈ పరిశోధకుడు చూపించిన కారణాలు నమ్మదగినవిగా ఉన్నాయి.

కాని అభిజ్ఞాన శాకుంతలం చదివేవారికి ఈ భావాలన్నీ నిగూఢ వ్యంగ్యాలుగానే స్ఫురిస్తాయి. వీటిలో అణుమాత్రమైనా వాచ్యతకనబడదు. శాకుంతలంపఠించేవారికి నాటకకథ ఒక సుందర ధోరణిలో నడచిపోతున్నట్లనిపిస్తుంది. దానితోబాటు మనోహరమైన వ్యంగ్యభావాలనేకం తరంగభంగిమలతో పాఠకుల హృదయాలపై ప్రసరిస్తూఉంటాయి. కాళిదాస కవితలో మనోహరమైన తాత్త్వికదృష్టి, ధార్మికదృష్టి సౌందర్యదృక్పథము, పేశలాతిపేశలమైన వ్యంగ్య ధోరణితో సమ్మిళితమై ఈతని కవిత కొక వినూతనమైన అతిలోకమైన మనోహరత్వం ఆపాదిస్తున్నాయి. వాల్మీకి, వ్యాస, కాళిదాసులలో భారతీయ కవిత త్రివిధంగాపరిణమించినదనీ, వాల్మీకికవిత ధర్మప్రధానమయినదనీ, వ్యాసకవిత మేధా ప్రధానమయినదనీ కాళిదాసకవిత రసప్రధాన మయినదనీ, అరవిందులు కాళిదాస విమర్శలో వ్రాశారు. కాళిదాసకవిత రసప్రధానమయినా ధార్మిక మేధాదృక్పథాలు రెండు అంతర్లీనంగా ఉండడంవల్లనే ఈతని కవిత కింతటి అతిలోకమాధుర్యం సిద్ధించింది.

ఈ కవికి సమస్త జీవితము పరమేశ్వర స్వరూపమే. భక్తిభావనద్వారా, ధార్మికజీవనంద్వారా జీవితసౌందర్యానుభూతిలో తన్మయత్వం పొందడమే, ఈ మహాకవి తాత్త్వికసాధన. తీవ్రమైన మనోవేదనలుకాని మరణాది తీవ్రదుఃఖానుభూతులుగాని ఇతని దృఢ తాత్త్విక దృక్పథం చలింపజేయలేవు. ఇతనికి మరణమే ప్రకృతి, జీవనమే వికృతి; క్షణకాలం జీవించినా ప్రాణి ఎంతో అదృష్టవంతుడని రఘువంశంలో అజవిలాప ఘట్టంలో వసిష్ఠునిముఖతః బహుశః కాళిదాసే పలికిఉండవచ్చును.

> "మరణం ప్రకృతిః శరీరిణాం
> వికృతి ర్జీవిత ముచ్యతే బుధైః
> క్షణమప్యవతిష్ఠతే శ్వసన్
> యది జంతుర్నను లాభవానసౌ."

అయితే కొందరిలో కనిపిస్తున్నట్లు ఈతాత్త్విక దృక్పథం ఆతని కొక శుష్క విశ్వాసం కాదు. కాళిదాస కవితలో అడుగడుగునా అంతర్గర్భితమైన ఈ దృక్పథం సర్వాంగసమగ్రమై అతని కవితాత్మకు నిత్యమైన ప్రాణస్పందనంలా వినిపిస్తుంది.

కాళిదాస కవి తాత్త్వికదృక్పథంలో వీక్షించని సహృదయులు కూడా అతని కావ్యాస్వాదన సమయంలో ఇంద్రజాలమోహితులైనట్లు తెలియకుండా ఆ దృక్పథంతో వీక్షిస్తారు. ఈ ప్రత్యేక శక్తివల్లనే ఆ మహాకవివాణి ప్రపంచమేధావుల మన్ననలందుకొన్నది. అదీగాక ఈవిధంగా భారతీయాత్మ అతని కవితలో ప్రతిఫలించడంవల్లనే ప్రాచీన సంస్కృత కవులలో ఈ మహాకవి ప్రథమగణ్యుడైనాడు.

కవి నిర్లిప్తత

కాళిదాసకవితలో స్ఫురించే ఇంకొక విషయం ఇక్కడ ముఖ్యంగా పేర్కొనవలసి ఉన్నది. కాళిదాసకవి తన కావ్యాల్లో ఎక్కడా తనను గూర్చి ప్రస్తావించుకోలేదనీ, దీనివల్ల పరిశోధకులకు ఇతని కాలనిర్ణయం దుష్కరం అయిపోయినదని అనుకున్నాము. రఘువంశప్రారంభంలో ఈ కవి తాను మందుడననీ, కవియశస్సు ప్రార్థించే తాను పొడగరులు అందుకోదగిన ఫలం ఆశించిన వామనుని వలె అపహాస్యపాత్రుడను కాగలననీ వ్రాశాడు. తిరిగి మాళవికాగ్నిమిత్రంలో ప్రాచీనమైనదల్లా యోగ్యమైనది కాజాలదనీ, నవ్యకావ్యమైనంత మాత్రంచేత అది నింద్యం కాజాలదనీ, సహృదయులు ఈ రెండిటినీ అతిక్రమించినవారనీ సూత్రధారుని ముఖతః పలికించాడు. ఇంతకంటె ఈ కవి ఆత్మగతాభిప్రాయాలు ఇతని కావ్యాల్లో ఇంకెక్కడా లక్షించడంలేదు.

ఈ కవి తన వ్యక్తిచరిత్ర విషయంలో అవలంబించిన మౌనాన్ని బట్టికూడా నిర్లిప్తమైన ఇతని జీవిత దృక్పథం ఊహించుకోవచ్చును. అసలు ప్రాచీన కవితా సంప్రదాయంలో కవికి నేటి కాలంలో బయలుదేరిన 'స్వాతంత్ర్యం, అస్వాతంత్ర్యం' వంటి సమస్యలు బయలుదేరనే లేదు. ఇంకా నేటికాలంలో కవి వ్యక్తిత్వానికి వచ్చినంత అసహజప్రాధాన్యం ఆ కాలంలో లేనేలేదని చెప్పవచ్చును. ఆ కాలంలోని భారతీయకవులు భారతీయమైన ఆధ్యాత్మిక సంప్రదాయం సహజంగా ఆకళించుకొన్నవారు. అప్పుడు వ్యక్తిస్వాతంత్ర్యం సాంప్రదాయికమైన సాంఘిక ధర్మం అతిక్రమించి పెడదారులు తొక్కనూ లేదు; లేక యాంత్రికమైన ఒక శుష్కసంఘ శాసనానికి కట్టుబడనూలేదు. ఆధ్యాత్మిక దృక్పథంలో సంఘవ్యక్తులకు పరస్పరాశ్రితమైన సహకారం సహజంగా పెంపొందింది. కనకనే ఆనాటి కవులెవరూ వ్యక్తిచరిత్రలు తమ కావ్యాల్లో వ్రాసుకోలేదని తోస్తుంది. అదీగాక భారతీయాధ్యాత్మిక సంప్రదాయం సంపూర్ణంగా ఆకళించుకొన్న కాళిదాసకవి తన వ్యక్తిత్వం విషయంలో గంభీరమైన ఔదాసీన్యవైఖరి అవలంబించి ఉంటాడు. కనకనే ఇతని చరిత్ర నేటి పరిశోధకులకింత గడ్డుసమస్యగా పరిణమించింది.

కాని ఆ మహాకవి భౌతికవ్యక్తిజీవితం కాలగర్భంలో, మరుగుపడిపోయినా మనోహరమైన అతని ఆధ్యాత్మికత, ధార్మికత ఈ రెండిటినీ మించిన జీవితసౌందర్యార్చన అతని కావ్యాల్లో త్రిపథగాములై అతని కవితకు మందాకినీగౌరవం కలిగించాయి!



అంతర్లాపి

శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి

౧

ఎవరే నీ నునురెక్కలన్ నయనసంహ్లాప్యవృత్త-సద్వర్ణముల్
త్రివిధమ్ముల్ సవరించి పెండిలి కుమార్తెం జేసి నారోప్రశాం
త వనోపాంత చరద్విలాసవతి, సీతాశోకచిల్కా, వచిం
పవనాతో, అతిలోక సుందరత సంపాదించి నావెట్టులే?

౨

చదలన్ వెల్గెడు చిన్నచుక్క! భవదాస్యస్నిగ్ధ దేశమ్మునని
వెదజల్లేదెవరే యమర్త్యమగు కాంతిన్? నీకు నాధారమె
య్యది శూన్యాభ్రమహాధ్వ మధ్యమున నిత్యమ్మాగతిన్ యాత్రిన
ల్పెదు, విశ్రాంతి నెఱుంగబోవెవరి నన్వేషింతువే తారకా!

౩

చివురుల్ నిండిన మావిగున్నను రసశ్రీగుంఫితంబైన మొ
ల్గు విజృంభింపగ జేసి రాగధునిలో లోనమ్ములుయ్యాలలూ
పు వసంతశ్రీయ! ఈ యుపజ్ఞకు కతమ్మున్ దెల్పుదే? ఏఅలో
కవిలాసప్రవణప్రభన్ స్ఫుటము లీ గానామృతస్థాస్నువుల్?

౪

మృదు మందానిలు కోమలాంగుళులు నీ రేకుం దెరల్ విప్పక
మ్మదనమ్మూ్మరెడు తేనియల్ గురిసెదో మందారమా! మేనసీ
ముదురెఱ్ఱందనపుల్ హొరంగు సొబగుల్ పూరించినారెవ్వరే?
నుదుటన్ చక్కని పుప్పొడిన్ తిలక కాంతుల్ దిద్దినారెవ్వరే?

౫

అతినీలచ్ఛవి సుందరాంబుద పరివ్యాప్తాభ్రసీమాలన
త్స్నిత విద్యుల్లత! నీ విలాసములు రాశీభూత మౌహేతువే
గతిజ్ఞానుల్ వివరించినన్ మనసు లాక్రాంతమ్ములైపోవు న
ద్భుత భావమ్మన-నిన్ సృజింతు రెవరంభోహ సంఘర్షణన్?

౬

అటు జన్మమ్మిటు మృత్యువున్ తటములై ఆకీర్ణ భావవ్రజో
త్కట భంగప్రసృతంబుగా తనరు అంతర్వాహినీ! ఓహ్రాదీ
ఎట నుండీ వరుదెంతువో, ఎటు ప్రయాణింతో? భవన్మార్గియు
స్ఫుటమత్యద్భుతమే మహోమయుని అస్తోకప్రభన్ జన్యమే?

గురుదేవుని - ఘనత

★

శ్రీ మోచర్ల రామకృష్ణయ్య

నవభారత సారస్వతమునకు రవీంద్రనాథుడు గురుదేవుడు. ఆయన ఆసియావాసుల హృదయము ప్రపంచములో నవ్యఖండ ప్రజల కెఱుగజేసిన రాయబారి. ఇంచుమించు విశ్వమంతయు అతడు పర్యటనము కావించినవాడు. ఆతడు శబ్దములను శాసించినవాడు: జనక్షేమమునకు జగన్మంగళమునకు దారి చూపినవాడు.

ఈ యుగమున ప్రపంచమున కవు లెందరో వర్ధిల్లిరి: కావ్యసృష్టి చేసిరి. కాని రవీంద్రునిలో గల విశిష్టత యొకటి గుర్తింపదగియున్నది. అతడు మైత్రీదేవతను గూర్చి తీవ్ర తపస్సుచేసి, యామెను భూమికి దెచ్చి, యామెకు సువర్ణమయమైన గుడికట్టి, యామెను దానిలో నెలకొల్పి, సర్వఖండముల యాత్రికులు జాతి మత వర్ణ నిరపేక్షముగా నిరంతర మీ పుణ్యక్షేత్రము సేవింప వీలుకలిగించినాడు.

గాంధిమహాత్ముడు — రవీంద్ర కవీంద్రుడు: ఇరువురును ప్రేమమూర్తులు. ఇరువురును లోకబాంధవులే. ఇరువురును సత్యవ్రతులే. ఆతడు యోగి—ఇతడు కవి. నవభారతమునకు ఉభయులు సూర్యచంద్రులు.

ఎవ్వ రే భాష మాటాడిన నేమి? ఏ మూల నివసించిన నేమి? ఏ కులమువారైన నేమి? ఏ వర్ణమువారైన నేమి? అందఱము విశ్వకుటుంబమునకు జెందినవారమే, యను తుష్టితో పుష్టితో మన హృదయములు నిండి పొంగునట్లు చేయగల కవిత్వమును రవీంద్రునివలె మన కిచ్చిపోయిన కవు లెంద ఱున్నారు?

శాంతినికేతనవాసులకు విశ్వభారతీ విద్యార్థులకు మాత్రమే కాక కళోపాసకుల కందఱకును రవీంద్రుడు గురుదేవుడుగా జగద్విఖ్యాతు డైనాడు. అన్ని జాతుల యాదరాభిమానములు చూఱగొని విశ్వసాహిత్య పరీక్షక సమితివారి మన్నన వడసిన మతిమంతుడని మాత్రమే కాదు రవీంద్రునికి ప్రపంచము జోహారు లర్పించినది. గీర్వాణవాణి యెవ్వరి వాగ్దేవతయో, భూతదయ యే మనుజుల మతమో, సత్యము ఏ మానవుల వ్రతమో, అహింస యే పురుషుల భూమిలో బుట్టెనో సర్వజన సౌఖ్యము ఏ దేశీయుల ఆశాస్యమో, ఆ భారతీయుల సనాతన సారస్వత సంస్కృతికి నవయుగ ప్రతినిధియని రవీంద్రుని లోకము జయ పెట్టినది.

విశ్వ జనీనత రవీంద్రుని కవితాగుణము. ఆతడు సత్యశివములతో గూడిన సౌందర్యమును ఉపాసించిన యోగి. నియమాంచితమైన ధర్మజగత్తును సుందరముగా సృష్టిచేయగలిగినప్పుడే కవి కృతార్థుడగుచున్నాడని రవీంద్రుని సందేశము.

నియమ రహితమైన ధర్మదూరమైన వస్తుసృష్టికి కవి కారకుడైనప్పుడు, ఆ సృష్టి పరులకు రుచింపదు. నిర్దుష్టమైన కళవలన సంఘనీతి వర్ధిల్లును. సౌందర్యమే సత్యము. అనగా సాధుకళావిదుని చేతిలో బడి, అతని హృదయకమల గంధముతో వెలువడిన సౌందర్యము సత్యమగునని యర్థము. అపవిత్ర హృదయులైన రచయితల చేతులనుండి యవతరించిన రచనల పూత మెఱుగులకు భ్రమసి మోహించి, యదే సౌందర్యమని దానిలో మునిగిపోవుట అనర్థదాయకమని సూచించుటకే రవీంద్ర కవీంద్రుడు క్రొత్తగా లోకోత్తరయైన "ఊర్వశి"ని సృజించినాడు.

దేవదానవులు పాలసముద్రము చిలికినప్పుడు అమృతమే కాదు, హాలాహలము నైత మావిర్భవించినది. ఊర్వశియు పుట్టినది. ముగ్గురును క్షీరాంబుధి నుండి పుట్టిన వారగుటచేత—ఊర్వశి ఒకచేత అమృతము రెండవచేత విషము గొని వెల్వడినట్లు రవీంద్రుడు వర్ణించినాడు. ఆ మహాకవి రచించిన ఈ

'ఊర్వశి' యను కవితాఖండములోని భావములు పై యభిప్రాయమును స్పష్టీకరించుచున్నవి.

ఊర్వశి దివ్యమంగళ విగ్రహమును దన ప్రేమల ప్రత్యక్షము చేసికొని రవీంద్రు డామెను బల్కరించినాడు. ఏమన్నాడు? ఇదిగో, వినుడు.

తోడిమ లేని పూవు ఋజువున వికసించి
ఠావు నీకు నీవె, వాసుఁ దెల్పు
ఇందువదన! ఊర్వశీ, యెప్పు డే నాఁడు
పరువ మెప్పు డెరియఁ బారివావు?

పొడమి నావె పాలకడలి గర్భమునందు
అల్ల తొలి వసంతమందుఁ గాంత!
కుడి కరమున అమృతకుంభంబు — డా చేత
విష ఘటంబు పూని వెడలినావె?

బాలవై యున్నవాఁడు నీలాలయమున
లీల ముత్యాలతోడ రత్నాలతోడ
ఆడుకొను వేళ నీ కెవరమ్మ చెలులు?
మెలఁగితివె నీ వొకర్తవు కలికి మిన్న?

హారిమణి దీప దీప్త శుద్ధాంతమందుఁ
బవళపుం బాన్పుమీఁద నీ ప్రక్క నెవరు
కుదురుకొని పండుకొని నిన్ను నిదురబుచ్చిరి
ఓలి సాగర వీచికల్ జోలపాడ?

ఊర్వశీ! పెక్కు యుగములనుండి నీవు
జగతికిం బ్రేమపాత్రవై నెగడినావు
లేరు లావణ్యవతులు నీ లీల వార
లింక నిను మీఱగలిగిన యింతు లెవరు?

నీ కటాక్షపు సోకు తాకి నంత జగత్ర
యమున దారుణ్యంపు హాళి గ్రమ్ము:
కైపు కల్పించు నీ కమ్మని తావిని
విరజిమ్ము గ్రుడ్డితెమ్మెరలు దెసల:
మకరందమానిన మధుపంబువలె గవి
ప్రేమార్తి గూరి పరిభ్రమించు;
ముగ్ధచిత్తములు మోహముల వెఱ్ఱిసంతోష
ములు గల్గి చరియించు బురుషజాతి:

నీవు మాత్రము కాళ్ళయందియలు గల్లు
గల్లుమన జీర జీరాడగా దటిల్ల
తా లఘుత్వంబుతో బోదువో లతాంగి,
యొమ్మెల్లలను జూపి, కన్నుల దుమ్ముచల్లి.

రవీంద్రుని యూర్వశి నవలోకించితిరిగదా! ఆమె మోహన మంత్రాధిదేవత. మూర్తీభవించిన దివ్య సౌందర్యము. ఇంద్రియ నిగ్రహము సాధించినవారికి సౌందర్యోపాసనము రససిద్ధిని హస్తగత మొనర్చి యమృతత్వము నిచ్చును. జితేంద్రియులు కాని వారికి అది యనర్థదాయక మగును. కావుననే రవీంద్రుని యూర్వశి యొకచే అమృతకలశము వేఱొకచే విషఘటము గొనివచ్చినది. రవీంద్ర కవీంద్రుని హృదయములోని రహస్య మిది.

రవీంద్ర కవీంద్రుడు భారతమాతకు విద్యా గౌరవము కవిత్వకీర్తి ఖండాంతర విస్తారముగా సమకూర్చిన మహనీయుడు. తన పదునొకటవ యేటనే పద్యములు వ్రాయ మొదలు పెట్టినవాడు. బాల్యము నుండియు సౌందర్యము నెడ సారస్యముపట్ల ఆయనకు మిక్కిలి మక్కువ. చిన్నప్పటినుండియు అతడు గానప్రియుడు.

రవీంద్రుని హృదయము విశ్వమయము. పరోపకార పరాయణత్వము ఆయనకు పుట్టుకతో బుట్టిన గుణము. ౧౮౯౮ లో కలకత్తా పురమందును దాని పరిసరములందును ప్లేగు జాడ్యము రేగి, అనేకుల ప్రాణములు హరించినప్పుడు రవీంద్రు డొనర్చిన మానవసేవ మఱచిపోరానిది. ఆ పన్నుల కెంతో ఊడిగము చేసి వారి కృతజ్ఞత కాతడు పాత్రుడైనాడు.

స్వదేశీ వస్తువులను ప్రచారమునకు దెచ్చి, భారతీయ పారిశ్రామికుల జీవనమునకు దోహదము కల్పించినవాడు రవీంద్రుడు. గాంధిమహాత్ముడు రంగమునకు వచ్చుటకు ముందే రవీంద్రుడు చక్కని దారి జూపి భారతీయులకు నిష్కల్మషమైన దేశహిత వర్తనము సూచించినాడు.

విశ్వకళాకేంద్రమై విద్యార్థులకు విశ్వవిజ్ఞాన సంధాయకమైన 'విశ్వభారతి' గురుకులమును స్థాపించిన గురుదేవుడు నిశ్చయముగా అమరజీవి. ఆ విజ్ఞాన కేంద్రమునే భారతప్రభుత్వమువారు ఇటీవల తమ పరిపాలనము క్రిందికి తీసికొని పోషించి పెంపొందింప బద్ధకంకణు లగుటచే, వారు సర్వప్రపంచ ప్రజల కృతజ్ఞతకు బాత్రులైనారు.

విశ్వభారతికి దోడు 'శ్రీనికేతము'ను స్థాపించి రవీంద్రుడు జానపదుల యభ్యుదయమునకు మార్గదర్శకుడైనాడు. శ్రీనికేతనమున రవీంద్రుడు శిల్ప

భవన మొకటి నెలకొల్పినాడు. అది వృత్తి విద్యాశాల. కొయ్యపని నేతపని చర్మవస్తువులుచేయు పని పుస్తకములు కుట్టుపని మట్టిపాత్రలు చేయు పని మున్నగు వృత్తుల నభ్యసించువారికి ఈ భవనము కామధేనువు. భారతదేశములోని జనపదము లన్నియు శ్రీనికేతనములు కావలయునని రవీంద్రుని యాశయము. ఈ యాశాస్వప్న మెన్నటికి ఫలించునో!

రవీంద్రుడు విశ్వపౌరుడు. ఆయన విశ్వకవి. మూర్తీభవించిన కారుణ్య మనదగినవాడు. ఎచ్చోట బట్టి చూచినను ఆయన కవిత్వమున భగవంతుని సర్వభూతమయత్వ మంతో యింతో గోచరించుచునే యుండును. ఆ పరమేశ్వర తత్త్వము నే ప్రధానీకరించి ఆయన బంగాళీభాషలో రచించిన "నైవేద్యము" 'గీతాంజలి'గా ఆంగ్లమున ప్రకటితమైనది. నోబెల్ బహుమానమునకు పాత్రమైనది. ప్రపంచ విఖ్యాతికి కారణమైనది. గీతాంజలి కవితా మంజులతను గూర్చి చేయబడిన ప్రశంసలు సమీక్షలు నానా భాషలలో ఎన్నో యున్నవి. పరమేశ్వరుని విభూతి గీతాంజలియందు ప్రత్యక్షరమునందును ప్రతిఫలించుచుండును. దానిలోని ఒక్క గీతికను గూర్చి మాత్రము మనవి చేయుదును. దీనుడైన భక్తుడు భగవంతుని గూర్చి యిట్లు ప్రార్థించుచున్నాడు—'స్వామీ, నా హృదయము ఎండిపోయినది. నా జీవితములోని మనోజ్ఞత మాసిపోయినది. చిక్కుపనుల త్రొక్కటలో బడి క్రుంగిపోవుచున్నాను, ఈ నా బిచ్చపు గుండె మూల ముచ్చుముడిగి వాకిలి మూసికొని కూర్చుండి యున్నది. దానికి దుమ్ము క్రమ్ముకొని యున్నది. దాని చుట్టును నిండార మాయ యావరించినది. ఇట్టి పరిస్థితిలో నీ చేయి నాకు వాటెల్లినను, నన్ను తిన్నగా పాటున బడద్రోయు భారము నీదే! చరాచరములతో గూడిన యనంతకోటి బ్రహ్మాండములకును నీవు సార్వభౌముడవు. రాజలాంఛనములైన గర్జాపటహ ఢక్కా ఢమామికా ధ్వనులతో దయచేసి నాపయి కరుణ వర్షింపుము. రమ్ము. నాద వినోదము వెలయింపుము. శాంతి ననుగ్రహింపుము. నా లోపల ప్రవేశింపుము.—ఇది ప్రార్థనము. ఈ భావములే ఇట్లు ఛందోబద్ధములైనవి.

సీ॥ శుష్కించి నా మనస్సు కఠోరమై యుండ,
దయను వర్షింప నా పయికి రమ్ము,
నా జీవితంపు టందము మందమైయుండ,
గానంబుతోడ నా కడకు రమ్ము,
అలజడి పనులు నన్నావరించిన యట్టి
తఱి శాంతితోడ నా దరికి రమ్ము,
నా తిరిపంపు డెందము మూలబడియుండ,
దలుపు ఛేదించి లోపలికి రమ్ము,
మాయచే ధూళిచే నాదు మానసంబు
కప్పబడి గ్రుడ్డిదైయున్న యప్పు డీవు
స్వామి, రావయ్య రాజ లాంఛనములూని
రావకీన తటిద్గర్జితములతోడ.

రవీంద్రుడు తత్త్వవేత్త. ఎన్నో జాతుల సంస్కృతి పరిశీలించినవాడు. ఎంతో వాఙ్మయము చదివినవాడు. అతడు చిత్రకారుడు. అతని లేఖిని యనేక మార్గములలో అఖండ నైపుణ్యముతో అప్రయత్నముగా విహరించినది. అతనిది కళావిదుని వాక్కు. కాని యతని దృష్టి తత్త్వవేత్తది. అతని చూపులో జగత్తంతయు అఖండస్వరూపము తాల్చినది. అతడు ఆనందమయుడు. మానవత్వముతో ఏకీభావమందిన భగవద్విభవమును కళారంగమునకు తెచ్చిన మాంత్రికుడు. భూమికి స్వర్గమునకు రాకపోకలనిమిత్తము అతడు వంతెన నిర్మించుకో గలిగినాడు.

ఒక్క తిమిరప్రవర్తి నా యుల్లమందు
గలదు - నా కన్నులం దొక్క కాంతి తటిని
గలదు - నాపాట స్వర్గసీమలకుఁ బోవుఁ
గాని నాకూట మర్త్యలోకమ్మునందె.
అని పాడినవాడు గురుదేవుడు.

ఆ కవీశ్వరుని లేఖినిలో స్పర్శవేధి కలదు. అతడు పట్టినదంతయు బంగారమే. ప్రతి సంవత్సరము సారస్వతరంగమున ప్రపంచమున మకుటాయమానము పదవి నాక్రమించు రచయితకు నోబెలు బహుమాన మీయబడుచునే యున్నది. రవీంద్రుడు ఈ బహుమతి నొందినపిదప దానినే నలుబదిమంది వాఙ్మయ ధురంధరులు సంపాదింపగలిగిరి. కాని యిలలోగల యక్షరాస్యులలో రవీంద్రునికున్న పలుకుబడి మఱొక్క కవి కేల రాలేదు? ఆయన కవితా గుణమైన విశ్వజనీనత మఱొక్కని రచనలో లేకపోవుటయే కారణము.

ఆర్థిక సంపత్తిలో సాటి భూరమణులతో దుల తూగలేకున్నను, భరతమాత రాధాకృష్ణునివంటి వేదాంతిని, బోసువంటి భూతతత్త్వజ్ఞుని, రామన్ వంటి భౌతిక శాస్త్రవేత్తను గాంధివంటి మహాత్ముని, రవీంద్రునివంటి కవీంద్రుని తన కిచ్చినదని లోకమా కల్పాంతము కృతజ్ఞతాంజలితో ఈ తల్లికి ధన్యవాదము లర్పింపదా!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

నాటిక :

కురువృద్ధు

శ్రీ వి. డి. ప్రసాదరావు

పాత్రలు

ధృతరాష్ట్రుడు	సుబలుడు
యుధిష్ఠిరుడు	శంబు-పురజనులు
భీముడు	గాంధారి
కృష్ణుడు	కుంతి
విదురుడు	దున్నల

యుధిష్ఠిరుడు; తండ్రీ ధృతరాష్ట్రమహారాజా! అశ్వమేధయాగ ప్రయత్నాలన్నీ సమకూడాయి. యాగదీక్షాప్రయాసం, ఈ వృద్ధాప్యంలో తమరనుభవించలేరని తమకు ప్రతినిధిగా ఈ యాగము చేయ సమకట్టాను. వ్యాసమహర్షులు, కృష్ణభగవానులూ కూడా అనుజ్ఞఇచ్చియున్నారు. మీరు యాగశాలలో వేంచేసి అనుభవశీలునుడైన నాచేత, తమకు ప్రతినిధిగా, ఈ యజ్ఞం చేయించవలెనని వేడుతున్నాను. తల్లీ, గాంధారీదేవీ! నీవుకూడ పెదనాన్నగారిని ఒప్పించి యజ్ఞశాలలో అధివసించేటట్టు చేయాలమ్మా. తండ్రీ, ఈ యజ్ఞం నీది. ఈ యజ్ఞఫలం నీది. నేను కేవలం నీ అనుజ్ఞగొన్న ఉద్యోగిని, ఉపకరణమాత్రుడను. నావలని దోషాలెల్ల క్షమించి, నాకోరిక చెల్లించాలని వేడుతున్నాను.

ధృత : అయ్యో తండ్రీ, సాక్షాత్తు ధర్మదేవతవు, కురుకులవంశోద్ధీపకుడవు. నిత్యసత్యవ్రతుడవు. అజాతశత్రుడవు, హస్తినాపుర చక్రవర్తివి, ధర్మపరిపాలకుడవు, నీయందు దోషాలుంటాయా ? నాకు ఏనాడు, ఏ అపచారం చేశావని ఈనాడు నా క్షమాపణ వేడవలసిఉంది? నువ్వు ఏం ఆజ్ఞఇస్తే పాలించను?

యుధి : ప్రభూ ! నా నేరమింకా క్షమించబడలేదా ? సర్వకురుకులనాశకుడను. కురువృద్ధులు, తమకు, నేను, చేయని అపచారమేది ? ఈ సామ్రాజ్యము మీది. నా ఉనికి, నామనుగడ, సర్వం, మీ అధీనాలు. మీరు నాకు ప్రభువులు. నామాటలు మీరు కూడా ఆజ్ఞలుగా అపార్థంచేసికొంటే ఇంక ఈ యుధిష్ఠిరుని బ్రతుకే వ్యర్థం. తమరనుజ్ఞ ఇస్తే తమరెన్నుకొన్న ప్రతినిధికి పట్టంకట్టించి, జటావల్కలధారినై, అడవులకుపోయి, జన్మ జన్మలకూ తీరని నా మహాపాప భారాన్ని నిర్మూలించుకోటానికి తపశ్చర్యలో నిమగ్నుడనై పోతాను. ఇదే మీపాదాల సాక్షి. తండ్రీ మీరు క్షమించకపోతే నాకు వేరు గతి యేముంది ?

ధృత : ఆఁ! ఆఁ! నాయనా లే! లే! ఈ పాపాత్ముని పాదాలంటకు. నేను క్షమించవలసిన నేరం కించిత్తైనా నీయందు లేదు. అయినా నీ మనశ్శాంతికోసం ఇదే క్షమిస్తున్నాను.

యుధి: అమ్మా! నీవుకూడ క్షమించాలి.

గాంధా: నాయనా...నీయందు దోషమున్నదని నా మనస్సులో లేనప్పుడు, క్షమించటం బూటకం అవదా ? సత్యవ్రతుడవు. నీకు తెలియదా !

[కుంతి ప్రవేశము]

యుధి : అమ్మా! నమస్కారము.

కుంతి : చిరంజీవ! అక్కా! నీవూ బావా యింకా భోజనం చేయలేదా! అపరాహ్ణం దాటిపోవటం లేదా ? ఏమి నాయనా! పెదతండ్రిగారిని మళ్లీ ఇప్పుడెక్కడకు బయలుదేరదీస్తున్నావు.

యుధి : అమ్మా! అశ్వమేధ యాగశాలలో వేంచేసి, రాజన్యులందరి మన్ననలు స్వీకరిస్తూ నాచే యజ్ఞం జరిపించి సేవలందుకోమని, పెదనాన్నగారిని ప్రార్థించటానికే వచ్చాను. తల్లి గాంధారి నా పాపాలకు నన్ను క్షమించలేకుండా ఉంది.

కుంతి : ఏ మొగం పెట్టుకొని మనం వాళ్లను క్షమాభిక్ష వేడుకొంటాము? కడుపులో అర

చిచ్చులు రగిల్చి, ఆ కర్తృత్వపాపం మాకు అంటకుండా క్షమింపమని అనగటం కృపణత్వంగాదా ?

గాంధా : ఆఁ ! ఆఁ ! కుంతీ అదేమి మాటమ్మా! ధర్మజునివల్ల ఏ అపచారమూ లేదు.

ధృత : మా పాపాలను మేం అనుభవిస్తున్నాము. దుఃఖంకూడా మనస్సుకు అంటనీయకుండా నిత్యం మమ్ము కాపాడుతున్న కుమారుని విషయం అటువంటి మాట అనకమ్మా! పద నాయనా వస్తున్నాము పద......

కుంతి : మామా ! వద్దు. కూర్చోండి. నాయనా యుధిష్ఠిరా! నీ మనస్సు నిష్కల్మషమని వాళ్లు ఎరుగుదురు. కాని దుఃఖపరిస్థితులలో ఉన్నవారికి మనం మానుషోపచారాలు చెయ్యాలిగాని, మహారాజోపచారాలపేరిట పూర్వస్మృతులను రెచ్చగొట్టా వ్యథపాలు చేయడం తగదు. భూమండల రాజులను స్వయంగా పలుకరించినా పలుకరించకపోయినా, కురుకుల చక్రవర్తి మీ పెదతండ్రిగారే. మీ తండ్రిగారేమి, పుత్రుడు దుర్యోధనుడేమి, నీవేమి, అంతా ఆయనకు ప్రతినిధులై రాజ్యమేలినవారే. వస్తుతః ఉజ్జ్వలంగా ఉన్న విషయాన్ని, నిత్యం కృతకంగా, ప్రతిభావంతంచేసి చూపించాలన్న ప్రయత్నంతో వారిని ఆయాసపెట్టకు.

యుధి : అమ్మా! నే నావిధంగా ఆలోచించడం లేదు.

కుంతి : అక్కా గాంధారీదేవీ, బావగారూ కూడా ఇంకా భోజనంచేయలేదు. ఇప్పుడు వేధించకు.

ధృత : కుంతీ! పిడికెడుకూడు, ప్రియపుత్రుని కోరికకు అడ్డుగా విసురుతావేటమ్మా! పద నాయనా వస్తున్నా—గాంధారీ......

గాంధారి : ఇదిగో దేవా ! ఈ చెయ్యి ఊతగా పట్టుకోండి.

కుంతి : వద్దమ్మా కూర్చోండి. నాయనా, సాయంత్రం, కొలువువేళలకు, మహారాజును అక్కడకు, నేను పంపిస్తాను. అక్కా...

యుధి : ఔను తల్లీ అల్లా, చేయండి......

ధృత : నాయనా తిండి అభ్యంతరం గాదు... నీమనస్సుకు కష్టంతోపించుకోనీయకు...

భీమ : (ప్రవేశిస్తూ) అన్నా...ద్వారకనుండి శ్రీకృష్ణులు బంధుసమేతంగావచ్చి వేచియున్నారు.

ధృత : ఆఁ! ఆఁ! శ్రీకృష్ణులేవేచియున్నారా...పద నాయనా పోయి వారికి స్వాగతమియ్యి. నేను కూడా, శ్రీకృష్ణులకు స్వాగతమియ్యటానికి రావద్దా! చెప్పు వస్తాను.

కుంతి : మామా ! ఇక్కడనే ఆగండి. కృష్ణుడు పరాయి వాడుకాడు. పెద్దలు మిమ్మల్ని అతడు మన్నించవలసినవాడుకాని మీరతనికోసం కదలవలసిన వారు కారు...కూర్చోండి.

ధృత : ఆఁ! ఆఁ! అల్లా. అనకమ్మా. సాక్షాత్తూ పరమాత్మ—అతనికి ఎన్ని ఉపచారాలు చేస్తే మా పాపాలు తీరవు.

యుధి : తండ్రీ ! ఇక్కడే ఆగండి, మీబదులు నేనే కృష్ణదేవుని ఆహ్వానించి తీసుకువస్తాను.

గాంధారి : అల్లా చెయ్యి నాయనా...యీ ముసలిరాజును క్షమించమని చెప్పు.

యుధి : తమ ఆజ్ఞ! సెలవు తీసికొంటాను.

[నిష్క్రమిస్తాడు]

కుంతి : భీమసేనా... పెదనాన్నగారికి, పెదతల్లికి భోజన ప్రయత్నాలు చేయించావా?

భీమ : వాళ్లభోజనాలు కూడా చూడాలని ప్రొద్దున్నే చెప్పించాను—అమ్మా నువ్వు తిండి తినలేదా? పద నేనే వడ్డిస్తాను.

కుంతి : (నిట్టూర్చి) అల్లాగా !

భీమ : ఇప్పుడే వెళ్ళి చూస్తానమ్మా ?

కుంతి : వద్దులే నాయనా... నేనే అందరి భోజన ప్రయత్నాలు చేయిస్తానులే. అక్కా, మహారాజును వెంటబెట్టుకొనిరా అమ్మా...వెళ్తున్నా....

(నిష్క్రమణ.)

గాంధా : హుఁ ! భోజనం (నిట్టూరుస్తుంది.)

ధృత : గాంధారీ, ఎందుకు నిట్టూరుస్తావు. సుఖం అనుభవించలేని ప్రాణివైపోతున్నావేమి?

భీమ : ధృతరాష్ట్రప్రభూ ! ఆనాడు ఆత్మాశలకు పోక, బిడ్డలకు బుద్ధిచెప్పుకొంటే ఈనాడు ఈమెను ఇంత వ్యథలపాలు చెయ్యకపోదువుకదా !

ధృత : నిజం! భీమసేనా, నిజం. అపార లోభంతో సర్వకులనాశనం చేసుకొన్నాను. కురు

పితామహులను భీష్మబాహ్లీక సోమదత్తులను, ద్రోణాదులను, పసివాళ్లయిన అభిమన్యు ఘటోత్కచులను నా లోభంతో కాల్చి చంపుకొన్నాను.

గాంధా: దేవా! మీమాట ఎవరు విన్నారని తప్పు మీమీద పెట్టుకొంటారు? తమ దురహంకారాలవల్ల సుయోధనాదులు నశించారు. కురువృద్ధులు క్షత్రధర్మ మనుసరించారు. కురుకుమారుల విషయంలో, భీమసేనుడు తన ప్రతిజ్ఞాపాలనం చేసుకొని క్షత్రధర్మం అనుసరించాడు.

భీమ: (పశ్చాత్తాపంతో) అమ్మా! అల్లా అనకు. సుయోధన దుశ్శాసనులను ఆత్మరక్షణకోసం చంపుకొన్నాను. ప్రతిజ్ఞలు కావు, దురహంకారాలు. ఒళ్లు తెలియని రాక్షసాలు.

గాంధా: (దీనంగా) నాయనా! నూర్గురు కొడుకుల్లో ఒక్కడూ బ్రతకతగినవాడు కనబడలేదా! వృద్ధాప్యంలో మా ఆర్తితీర్చేందుకు ఒక్కణ్ణి మిగిలిస్తే, మీ రాజ్యానికి వాడు అపకారం చేసేవాడు కాదే—దుశ్శాసనుని రొమ్ము రక్తపానం చేస్తేగాని కసి తీరలేదా!—ఔనులే వాళ్లు చేసిన పాపాలటువంటివి!

ధృతరా: గాంధారీ! గాంధారీ! భీమసేనుణ్ణి మనకు (భీమునితో) నాయనా నీ పెదతల్లి నీరసురాలు! అవ్యక్త. ఏమీ అనుకోకు. గాంధారీ, అవన్నీ యుద్ధ ధర్మాలు. ఏమనకు.

గాంధా: నేను ఏమీ అనలేదు దేవా!

భీమ: అమ్మా... దుశ్శాసనుడి రక్తం పానం చెయ్యలేదు, అమ్మా...చుట్టూ ఉన్న వాళ్లను జడిపించటానికి అల్లా నటించాను. కురుకుమారులు ఘోర యుద్ధం చేస్తోంటే ఒళ్లు తెలియని శివమెత్తేది. ముందు వెనుక ఆలోచించలేని మూర్ఖుడనని, చిన్ననాటి నుంచీ నన్ను పెంచిన మీకు తెలియదా! తమ్ముడి రక్తం తాగుతానా. అంత రాక్షసుడనా...

ధృత: ఛా;...ఛా...నువ్వల్లా చెయ్యలేదు భీమసేనా—గాంధారి తెలియక అన్నది క్షమించు.

గాంధా: నిజం నాయనా...పొరపాటు ఆలోచించాను. మనస్తాపం తెచ్చుకోకు. అంతా విధి విలాసం—పరమాత్ముని లీల, మా పూర్వజన్మ సుకృతం.

(కృష్ణుడు, దుస్సల, సుబలుడు ప్రవేశం)

కృష్ణుడు: (సంతోషంతో) మామా, అత్తా—నమస్కారం. మీ కొక శుభవార్త వెంటపెట్టుకొని వచ్చాను. ఏం బహుమానం ఇస్తారు?

గాంధా: చిరంజీవ! మాకు సౌఖ్యాలా కృష్ణా—

ధృత: కృష్ణస్వామీ! చిరంతనుడవు, లోక సంగ్రహార్థం చిరంజీవ అంటున్నాను—వృద్ధుడను—పరమేశ్వరుడివి నిన్నాశీర్వదించటానికి నేనెవరను...

కృష్ణ: మామా! అవన్నీ ప్రస్తుతం మరచిపొండి. మీ మేనల్లుడను—మీ ఆశీర్వచనంలో వృద్ధి పొందదలచినవాణ్ణి.

భీమ: యుధిష్ఠిరులు తమ దర్శనానికి వచ్చారు, కనబడలేదా?

కృష్ణ: ఓయ్! భీమన్న కూడ రాచమర్యాదలు నేర్చాడే ... ధర్మరాజులవారు హస్తిపుర మహారాజులయ్యా! కురుకులచక్రవర్తులు, వారితో నాకేం పని—సామంతుణ్ణిగా కప్పంకట్టుకోవలసినప్పుడు వారిదర్శనం చేసుకొంటాను. మా అత్తమామలు, గాంధారీ ధృతరాష్ట్రులు, నాకు ముఖ్యులు. ఏమి అత్తా, నాకు బహుమతి చెప్పావుకావు. పోనీలే! ఏమమ్మా దుస్సలా! అల్లా ఊరక నిల్చున్నావు—మునిమనవడిని, ప్రపితామహుల కందించకుండా—

దుస్సల: (దుఃఖంతో) అమ్మా, తండ్రీ! ఎల్లా అయిపోయారమ్మా...నోట మాట రాటంలేదు. అమ్మా (అని గాంధారిని ధృతరాష్ట్రుని కౌగలించుకొంటుంది.)

గాంధా: } దుస్సలా! దుస్సలా! అమ్మాయీ,
ధృత: } బిడ్డా...అమ్మా...

(అని దుఃఖంతో కౌగిలించుకొంటూంటారు.)

భీమ: చెల్లీ! దుస్సలా క్షేమమా అమ్మా—కుమారు డేడీ, మనుమడిని ఒక్కడినే తెచ్చావు?

కృష్ణుడు: భీమన్నా! కుశలప్రశ్నాదులు తర్వాత చూడబ్బా! ముందు అందరి భోజనప్రయత్నాలూ చేయించు (నెమ్మదిగా) నువ్విక్కడుండకు, వెంటనే వెళ్లు. ఇది అగ్నిపర్వతాలు బ్రద్దలయే సమయం. ముఖ్యంగా నువ్వు ఇక్కడుండవలసినవాడివు కావు. పో...

భీము: సెలవు పెదతండ్రీ! (నిష్క్రమిస్తాడు)

కృష్ణ: రావోయి తమ్ముడూ! రా! సుబలవంశోత్తమా! అత్తా! నీ మేనల్లుడు అర్జునునిచేత 'జితోస్మి' అనిపించి తాతపేరు నిలబెట్టాడు. నువ్వు ఊర్కోవోయ్ తమ్ముడూ! నే చెప్తున్నాగా! మామా! ఇతడు, శకుని పుత్రుడు, ఎంత యుద్ధం చేశాడనీ! ద్వారకలో అర్జునుడు కనబడి ఒకటే మెచ్చుకున్నాడు. తన చేతి గాండీవం మూడుమార్లు జేలపడి పోయిందట. తమ్ముడూ...మహా వీరుడవోయి!

సుబల: అత్తా! మామా! అర్జునుని కరుణచేత ప్రాణం గాచుకున్న మీ మేనల్లుడను. నమస్కరిస్తున్నాను.

గాంధా: నాయనా! నావాడవు, ఒక్కడవు మిగిలావా...

ధృత: నిజం నాయనా...నిజం...ధర్మార్జునులను కరుణాస్వభావులు. గాంధారి కీ కృప చూపించి నీ మనుగడ, గాంధారికి భిక్షగా అర్పించారు.

దుస్సల: (ఏడుస్తూ) అమ్మా...నీ మనుమడి సంగతి అడగవేం!

గాంధా: అడిగే దేముందమ్మా! క్షాత్రధర్మంలో తాత తండ్రులను అనుసరించి ఉంటాడు. అర్జునుని చేతిలో మృతిపొందటం వీరస్వర్గం కాదా? నా కూతురివి, నా పుణ్యఫలాలు నువ్వు పంచుకోవద్దా!

కృష్ణ: అత్తా! అపార్థం చేసుకొంటున్నావు అర్జునుడు సైంధవులపట్ల క్రౌర్యం వహించలేదమ్మా.

దుస్సల: నిజమమ్మా. అన్న నిజంగా కరుణామయుడు. మా సింధువంశీయులే, అవమాన ద్వేషాలతో, యాగాశ్వంవెంట ఒంటరిగా వస్తున్న అర్జునునిపై దాడి జేశారు. అన్న ఒక్కరి నీ సిగపూవునైనా వాడనీయలేదు. నీ మనుమడు అర్జునుని పేరువిని, నా భర్త విషయంలో ప్రతిజ్ఞ తలచి, నాతోనైనా చెప్పకుండా అంతఃపురంలోనే భయంతో ఆత్మహత్య చేసుకున్నాడు. నీ మనుమడిని వెంటబెట్టుకొని వెళ్ళి అన్న పాదాలమీద పడేశాను.

ధృత: తల్లీ, మంచిపని చేశావు. ఏదీ మనుమడి నిల్లా అందియ్యమ్మా! నాయనా! (అని కౌగిలించుకొని ముద్దిడుతోంటాడు.)

గాంధా: ఛీ క్షాత్రధర్మం! బ్రతుకూ, చావూ, రెండూకూడా నికృష్టాలేకదా!

దుస్సల: అమ్మా! అన్న అదేమాట అన్నాడు. నన్ను చూసి గాండీవం నేల పడేశాడు. నన్నూ మనుమడినీ అక్కున చేర్చుకున్నాడు. కంట నీరెట్టుకొని, "మాటవరుసకు ఒక్క చెల్లెలివి, తల్లీ, అన్నలమంతా కలిసి, నీ బ్రతుకు ఎంత దుఃఖకరం చేశాము, ఛీ, ఏం క్షాత్రధర్మం" అని వలవలా ఏడ్చాడు.

ధృత: అమ్మా! ధర్మార్జునులు దేవతాస్వరూపులు. మనం నికృష్టమానవులం—మనం వారిని ఏమని అభినందించగలమమ్మా—

గాంధా: అర్జునుడు నిజంగా కరుణాస్వరూపుడే నమ్మా. ఏదమ్మా మునిమనుమడి నిల్లాయియ్యి.

కుంతి: (ప్రవేశించి) అక్కా రండి. ఎవరు, దుస్సలా! (అమ్మా అని కౌగలించుకొంటుంది). కృష్ణా! వచ్చావా. ఓహో సౌబలుడా. దీర్ఘాయుష్మాన్, నాయనా క్షేమమా—రండి. అందరూ లోపలికి రండి.

కృష్ణ: (నవ్వుతూ) అత్తా! నాకాకలి వేసింది— ఈ అత్తమామలు నావిషయం చూసేట్టులేరు.

గాంధా: వృద్ధులం, పరోపజీవులం! పరమాత్మవు, నీవిషయం చూడగలమా తండ్రీ—

కృష్ణ: (గారాబంగా) కాదు ఇవ్వాళ గాంధారి అత్తయ్యచేతి అన్నం తప్ప తినను.

గాంధా: ఈ దీనురాలిమీద అంత దయ ఉన్నదా నాయనా, రా! నా భైక్షుకపాత్రలోది నీకూ విదిలిస్తాను—రా!

కుంతి: (నవ్వుతూ) అక్కా! కృష్ణుడికి దరిద్ర కుచేలుని అటుకులూ, దీనస్థితినున్న ద్రౌపది వంట పాత్రలో మిగిలిన చేమకూరా, ఇట్లాంటివి తప్ప రుచించవు. నాచేతి తిండి తినిపించేభాగ్యం నాకీనాటికి దక్కలేదు.

కృష్ణ: (నవ్వుతూ) అత్తా, అబద్ధం ఆడకు. నువ్వు నాకు అన్నం పెట్టని దెప్పకు!

గాంధా: నిజమే చెల్లీ! అతని కేం కావాలో, గుడ్డిదాన్ని నే నేం చూడగలను—నువ్వే పెట్టమ్మా—

కుంతి: అక్కా! అతనికి కావలసింది మనసు—ఈనాడు నీ హృదయంలాగా అతనిపట్ల

లక్షణంగాగల మనవన్న ప్రపంచంలో లేదు—నువ్వే పెట్టుదుగానిలే అమ్మా...

నీ సౌభాగ్యమే, నా భాగ్యంగా తలుస్తాము రండి—

(అందరూ నిష్క్రమిస్తారు)

రెండవ రంగము

(పదిహేడేళ్ల తర్వాత...

ధృతరాష్ట్రుని అభ్యంతర మందిరము—తెల్లవారు ఝాము. ధృతరాష్ట్రుడు చేతో తడుములాడుకొంటుండగా పాత్రలు దొర్లిన చప్పుడు. గాంధారి నిద్రలేస్తుంది.)

గాంధారి : దేవా! ఎక్కడికి కదిలారు. పాదదాసిని నే లేనా—

ధృతరాష్ట్రుడు : (నవ్వుతూ) గాంధారీ! పుట్టుగ్రుడ్డినై, వృద్ధుడనైనా, ఈనాటికి స్పర్శజ్ఞానమైనా అలవడలేదు. దాహం వేసి మంచినీళ్ళకు కదిలి, ఇవన్నీ పడగొట్టి నీకు నిద్రాభంగం చేశాను. పాపం రాత్రంతా నిద్రలేక ఇప్పుడే కాస్త కునికినట్టున్నావు.

గాంధారి : స్వామీ! ఇదిగో మంచినీరు. నేను బాగానే నిద్రపోయాను.

ధృతరా : (నీరు త్రాగి) అమ్మ! దప్పిక తీరింది.

గాంధారి : ద్రాక్షరసం ఈ పాత్రలో వుంది. ఇయ్యనా—కొంచెం నిద్రపడుతుందేమో.

ధృతరా : వద్దు! వద్దు! నిద్రపోయాను—అయినా అహోరాత్రాలు ఒకటిగానే ఉన్న యీ అంధ వృద్ధాప్యంలో ఇంకా నిద్ర యేమిటి. ఇల్లా మేను వాలిస్తే చాలు.

[కోడికూతలు వినబడుతాయి]

ధృతరా : అదుగో తెల్లవారివస్తుంది. భీమసేనుల మహోపసగ్రహం ముందర తొలిజాముకోళ్లు కూస్తున్నాయి. ఈ కోడికూతలో ఎంత ప్రగల్భమో!

గాంధారి : ఒకటి కాదు, నూరుకోళ్లు. శతకోటి ప్రగల్భాలతో కూస్తున్నాయి. మరుదుఝామునకు, యీ కోళ్లన్నీ భీమసేనుల మహో నప యజ్ఞంలో రూపుమాసిపోతాయి. సుయోధనా! సుయోధనా!

ధృత : అమ్మా! భీష్ములవారు తనువు చాలించి పదిహేడేళ్లయింది. యుధిష్ఠిరుల దయచేత బిడ్డలకు పదునెన్మిది మార్లు తర్పణాలు వదలగలిగాము.

గాంధారి : నిజమే స్వామీ! దయ! ఏ దయ వెక్కసమౌతుందో, ఆ దయని ఈ పదేడేళ్లూ చిచ్చాడి గట్టుకున్నట్టే ధరించాను. పుత్రశోకంతో ఏ భోగభాగ్యాలూ భరించలేని స్థితిలో బలవంతంగా శాంతి సౌఖ్యాలు అనుభవించవలసివచ్చింది. అయ్యో! రోజు రోజూ, తమ పేరిట నిన్ను పెట్టేబాధలు, మహారాజువని నిన్ను చూపి చెప్పుకొని ప్రయాసపెట్టే ప్రేమలూ, చూసిచూసి హృదయం రగిలిపోతోంది.

ధృతరా : శాంతించు గాంధారీ! యుధిష్ఠిరుడు నిజంగా ధర్మప్రియుడు. పాండుడు నన్ను రాజుగా మన్నించలేదా—సుయోధనుడు మన్నించలేదా—వాళ్లకన్న వెయ్యిమడుగులు గౌరవంతో నన్ను యుధిష్ఠిరుడు మన్నిస్తుంటే మనం అపార్థం చేసుకోకూడదు. జన్మతః గుడ్డివాడినైనవాడిని, మహారాజస్థానార్హుడనై జన్మించడం లోనే ఉన్నది ఈ అసంగతమంతా! ఏ బీద భిక్షుకుడనో అయి జన్మించి ఉంటే ఉదాత్తంగా కాలం గడిచిపోయి ఉండేది. హుం! గాంధారీ! నీ తండ్రి కర్కోటకుడు! అమాయకుడు. నాలాంటి పుట్టుగుడ్డికి, రాజ్యం, వంశం చూసి నిన్ను ఇచ్చి నీ గొంతుక కోశాడు. అమాయకురాలివై నన్ననుసరించావు. నామీది ప్రేమతో కళ్లు కట్టుకొని గుడ్డితనం తెచ్చుకొన్నావు—నా మోహాలోభాలతో నీ తనయుల జీవితం, నీ జీవితం భస్మీపటలం చేశాను. నీ కడుపులో అరని చిచ్చు రగిల్చాను. గాంధారీ!

గాంధారి : స్వామీ! ఎన్ని ఏళ్లు ఈ పశ్చాత్తాపవహ్నితో దహించుకుపోతారు? నాకన్న పుణ్యరాలెవరు! నా కుమారులు యుద్ధంలో వెనుకాడక, క్షత్రియధర్మంలో వీరస్వర్గ మలంకరించారు. అజన్మం అంధులయిన మీ సేవ చేసుకొని, మీరు ఆధారంగా, పూర్వజన్మ సంచిత పాపాలన్నింటినీ దహింపచేసుకొని, ఎన్ని జన్మాలకూ తీరని పుణ్యాన్ని సేకరించుకోగలుగుతున్నాను. ప్రభూ! నా అదృష్టాన్ని తృణీకరించకండి. తమ దుఃఖాన్ని మాత్రమే నేను భరించలేను.

ధృతరా : పిచ్చిదానా, ఇప్పుడే కదా సుయోధనా, అని కలవరించావు! నేనో రాతిమనిషిని—శతసహస్ర గజబలుడ ననుకొనేవారు—అది కాదు. అన్ని ఏనుగులదర్పాల దళసరితనం, కవచమై హృద

యాన్ని మొద్దుబారించి ఆవరించి రాగద్వేషా లేమీ లేకుండా చేసింది. తిరస్కార గౌరవాలు, కోప శాపాలు, ఏవీ భరించలేని జడుడను. కాని యోగిని మాత్రం కాలేకపోయాను. ఈ నికృష్ట హృదయం లోని అరిషడ్వర్గమే, హీనమానవత్వమే, ఇన్ని కవచాలను ఛేదించుకొని ఉబికి వచ్చి, అసమర్థుని వినయస్వరూపంతో నేన్నల్లో కాలను కాల్చి నాకు తగ్గపాపఫలాలను, ముందురాగల శతసహస్ర జన్మలకు సంతరించిపెట్టింది. గాంధారీ, నాపాపభారంలో భాగం, అమాయకురాలివి నువ్వు భరించతగవు. పుత్రశోకంతో గట్టిగా అర్చేయ్. బావురుమని, ఉద్రేకం ఒక్కసారి తీర్చుకో. కన్నులతో కొడుకులను పుటిన తర్వాత ఒక్కసారైనా చూసుకొనే భాగ్యం నీకు లభించలేదు.

గాంధారి: స్వామీ! అదే చెప్తున్నాను. దుఃఖించ వలసిం దేముంది? బావురు మనవలసింది ఏముంది? మనకు కొడుకులుకూడా స్వప్నాలేకదా. నూర్గురు నూరు కంఠాలు. ఆ నూరు తనూగత స్పర్శసుఖాలు వారి బాల్యంలోనే మరిచిపోయాను. పెద్దలయ్యారు, పిల్లలగన్నారు. మహావైభవం అనుభవించారు. క్షత్ర ధర్మంతో స్వర్గం చూరగొన్నారు. నూరు కంఠ స్వరాల జ్ఞాపకాలు మాత్రం మిగిలిపోయాయి. అవీ ప్రకృతికల్లోలంలో అణగి మణగి అణగారి పోతు న్నాయి. ప్రభూ! అబలను, దుఃఖించమని నన్ను ప్రేరే పించకండి.

ధృత: గాంధారీ! ఈ యిల్లు, ఈ పరిసరాలు-అబ్బా! ఇక్కడెక్కడ బిడ్డలను పెంచాము. ఇక్కడ బిడ్డలు ఆడుకొన్నారు. ఇక్కడ అక్కున చేరారు. ఇక్కడ బాధతో దగ్గరకు వచ్చారు. ఇక్కడ సంతోషించి మనను సంతోషించమని కలకల నవ్వారు, నవ్వించారు. ఇక్కడ ఈ కానుకలు తెచ్చియిచ్చారు. ఇక్కడ యీ పూజలు చేశారు. ఇక్కడ బిడ్డపురుడు పోశాము. పతి దుఃఖంతో దుస్సల ఇక్కడ ఒళ్లో పడి ఏడ్చింది.

గాంధారి : స్వామీ, అన్నీ జ్ఞాపకం చెయ్య కండి. ఇక్కడ ఉండటం దుర్భరం చెయ్యకండి.

ధృతరా : వద్దు గాంధారీ! ఇక్కడ వద్దు అవతలకు పోదాం.

గాంధారి : నిజమా దేవా? నిజంగా వెళ్లామా! రండి పోదాం. ఈ పదిహేనేళ్లబట్టి ఒక్కటే భయం. ఇక్కడ ఈ సౌభాగ్యవంతులతో మెలగుతూ, ఏ నిముషాన్న ఏ బిడ్డడు జ్ఞప్తికి వచ్చి ఏ దుఃఖభారం సహించలేక ఎవరికి ఏ శాపం ఇస్తానో - మళ్ళీ ఏమి పరితాపపడవలసివస్తుందో, అని గజగజ వణికిపోతు న్నాను. ఆ అడవిలో బిడ్డలు జ్ఞాపకంవచ్చినా ఫర్వా లేదు. అబ్బా గుండెలనుండి ఎంత బరువో తీసేశారు.

ధృతరా : గాంధారీ! ఇన్నాళ్లు నాకు సూచించ నైనా లేదేమి, పిచ్చిదానా—

గాంధారి : ప్రభూ! మీరు అరణ్యవాస క్లేశం సహించలేరనుకున్నాను. మీ సహనశక్తిని తప్పు తలచాను.

ధృతరా : ఎవరో వస్తున్నారు, కన్నులు తుడు చుకో, నా మొగం తుడు.

[విదురుడు ప్రవేశం]

విదు : అన్నా! వదినా! విదురుణ్ణి. నమస్క రిస్తున్నాను.

ధృత : రా, నాయనా విదురా! రా!

గాంధారి : బాబూ! మూడునాళ్లుగా నీమాట వినిపించలేదోయి. మీ అన్నగారికి మనస్సు కలత పడి వుంది.

ధృత : ఔనయ్యా, విదురా! ఏవైనా మంచి మాటలు చెప్పి నా మనస్సు కాస్త కలత తీర్చు నాయనా! అజ్ఞానంలో ఉన్నప్పుడెల్లా, తెప్పలాగా నన్ను దరిజేర్చేవాడివి.

విదు : అన్నా మీకు చెప్పగలవాడనా! క్షమిం చండి. ఎన్నిమార్లో మిమ్మల్ని వృథాగా నిందల పాలు చేశాను. గొడ్డువోతును. పుత్రప్రేమ అంటే ఏమిటో తెలియనివాడిని. ప్రజలకందరికీ సుముఖు డైన పుత్రరత్నాన్ని సుయోధనుని విషనాగమని హితవుపేరిట ప్రేలుళ్లు ప్రేలాను. స్వల్పబుద్ధినై మీకు నీతులు చెప్పే పాటివాడననుకొన్నాను. నూర్గురు కొమారులచావు సహనంతో సంతోషంతో స్వీకరించిన, దాయలను దయచూసిన, మహా యోగు లైన దంపతులను మిమ్మల్ని చూసి, సిగ్గుతో కృపణుడనై కుమిలిపోతున్నాను. అన్నా క్షమించు. వదినా, దాసీపుత్రుణ్ణి స్వంత తమ్మునిలాగా సాకిన నీ కరుణ ప్రభావం ఏమని చెప్పను! అమ్మా! నన్ను అమ్మా అని పిలవనీయి చాలు. ఆ పుణ్యానికి నోచుకోనీయి.

ధృత : పరుషవాక్యం, అధర్మవాక్యం, గౌరవం తొలగిన వాక్యం, ఏనాడు నీనోట వచ్చిందని ఈనాడు పశ్చాత్తాపపడుతావు? ఈనాటికీ మా జీవితానికి చుక్కాని నీవే! నీయంతటి ధర్మస్వరూపుడు యుధిష్ఠిరుడు — ఇక్కడ మాకున్న సౌఖ్యం ఎవరి కుంటుంది నాయనా—

విదు : అన్నా ధర్మాలపేరెత్తవద్దు. మీ ధర్మాల స్వరూపం నాకా తెలుసును? నాకు మనుష్యులహృదయాలు తెలియవు. ప్రేమలు తెలియవు. కడుపు తీపు తెలియదు. వాత్సల్యం, అభిమానం తెలియవు. నా కున్నటువంటి ధర్మనిరతి జడస్వరూపాలైన రాతి కీ రప్పకూ కూడా ఉంటాయి. సుయోధనుని చావుకు, నీవు మహాయోగివై కంటనీరుకూడా ఇంకింపచేసుకొన్నావు. ఆనాటిదాకా, కొడుకుమీద వల్లమాలిన మోహమంటూ, నిత్యం నిన్ను నేను తిడుతూవచ్చాను. యుగయుగాలకూ మాసి చెప్పకో దానికి చాలినంత వైభవంతో వెలిగిన మహారాజు అతడు. ప్రజలకు సుముఖుడు. శత్రుభయంకరుడు. పద కొండక్షౌహిణుల ముందునిలిచి, దినకర తేజుడై యుద్ధానికి కదులుతూంటే, ఆ వైభవం చూసి ఆశ్చర్య పోయాను. అంతటి రాదల్చి యుద్ధంలో ఏ కాకినైనా తొడలు విరిగిపడి భీముడిచేతకిరీటం కాలదన్నించుకునీ కూడా, నీదపదక మహోరగవిభవంతో పడగ వాల్చి గంభీరంగా ప్రాణాలు వదలటం చూసి మహాశ్చర్య నిమగ్నుడనై పోయాను. అంతవరకూ నా మనస్సు ఎరుగని, మహా ఉద్రేకాలన్నీ ఈ యుద్ధంతో తెలిసి వచ్చాయి. మానవుడంటే ఏమిటో, మానవునికి జన్మతో కలిగే బాధ లేమిటో, మనిషి ఎదిగినకొద్దీ, సంసారి అయి వృద్ధిపొందినకొద్దీ, హృదయ మున్నందువల్ల కలిగే బాధ లేమిటో అర్థం చేసికొన్నాను. ఏమీ తెలియని నాటి గ్రంథస్థసూక్తులు, అవ్యక్తుడనయి నీతో పల్కిన ప్రవచనాలు, ఎంత పేలవాలో, నావంటి వాడినోట అర్థహీనాలో తెలిసివచ్చాయి. ఆనాటి నుంచీ ఈ పది హేడేళ్లు, మీ దంపతుల సహనం మాసి గుండె చెరువై పోతోంది.

ధృతరా : నాయనా! జాలిగుండె వాడవు కనుక లేనిపోని కష్టాలు మాకు ఆరోపించుకొని బాధ పడుతున్నావు.

గాంధారి : బాబూ! మీ అన్నగారికి వాన ప్రస్థాశ్రమంపై - అడవిలో తపస్సుచేసికొని తనువు చాలించుటపై - దృష్టి మళ్ళింది.

విదుర : అమ్మా! ఆమాటే చెప్పదామని నేనూ వచ్చాను. ఎంత ఆప్యాయంతో పెట్టిన కూడైనా దాయల కూడు. 'బిడ్డలకు బుద్ధిచెప్పని గుడ్డికి పిండము కొనిపొండని' భీము డంటూ ఉంటాడని నే నెరుగుదును.

ధృత : అబ్బెబ్బె! పాపం అతను అన లేదయ్యా.

విదుర : స్వామీ! నాకు తెలుసును. ఈ సుఖాలు అనుభవించగలస్థితి మీలో ఏనాడో తప్పి పోయిందని నేను ఎరుగుదును. ఏకాంతవాసంలో తపోనిరతిలో తప్ప మీ మనోవ్యథలు తీరవని నాకు తెలుసును. పదండి, తప్పక అడవులకు పోదాం.

ధృత : అల్లాగే నాయనా! ఎల్లుండి కార్తిక పూర్ణిమ—శ్రాద్ధ విధులు పూర్తిచేసి, యుధిష్ఠిర రాజేంద్రుల అనుమతి పుచ్చుకొని బయలుదేర్తాను. ప్రస్తుతం ఈమాట యుధిష్ఠిరులకు చెప్పకు.

గాంధారి : ప్రభూ వనవాసానికి కూడా అనుమతి కావాలీ?

యుధిష్ఠి : కావాలి, గాంధారీ కావాలి. ప్రజల సుకృత, దుష్కృతాలన్నింటిలోనూ రాజుకుకూడా పాలు ఉంది. అతని ప్రజలము. అతని ఆజ్ఞలేనిదే ఏపనీ చెయ్యవలసినవాళ్లము కాము. విదురా! ధృతరాష్ట్రుడు పితృ పుత్రులకు శ్రాద్ధాలొనరించడానికి ధర్మరాజుల అనుమతి అడుగుతున్నాడని వేడుకొనిరా, అన్నా!

విదు : చిత్తం సెలవు—

(మూడవ రంగం)

(౧౫ రోజుల తర్వాత.

హస్తినాపుర రాజప్రాసాదం బయటికొలువు.

ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి, విదురులు)

యుధి : (ఆత్రంతో ప్రవేశించి) ఇదేమిటి తండ్రీ, ఇక్కడ నిల్చున్నారు. అమ్మా! గాంధారీ ఇదేమమ్మా! అమ్మా అందరూ ఈ నారచీరలేమిటి.. విదుర స్వామీ! ఇదంతా ఏమిటి! తండ్రీ మీకు ఏ అపాఖ్యం జరిగింది? నాకు ఎందుకు చెప్ప లేదు?

ధృత: నాయనా! కంగారు పడకు—విదురా వృద్ధప్రజలను బ్రాహ్మణులను రాజబంధువులను అందరను పిలిచి వచ్చావా? అందరూ వచ్చారా?

విదు: ఇదుగో అందరూ వచ్చారు.

ప్రజలు: జయము జయము ధృతరాష్ట్రచక్రవర్తికి, జయం ధర్మరాజులవారికి జయము.

విదు: మానవోత్తములారా! ఈ మహారాజు మీకు చేసుకొనే విన్నపం ఒకటుంది. ఆయన నీరస స్థితిలో ఉన్నారు. ఆయన చెప్పే వాక్యాలు సావధానులరై విని ఆయన అభీష్టం తీర్చండి. అన్నా! చెప్పండి.

ధృత: యుధిష్ఠిర మహారాజా! ప్రజాశ్రేష్ఠులారా! ఈ రాజ్యాన్ని కురు వంశీయులు పూర్వం నుంచీ అతి ప్రశస్తంగా పాలించుకుంటూ వచ్చారు. మా తాత, శంతన మహారాజులు మహాజనరంజకంగా ప్రజలపాలించారు. మా తమ్ముడు పాండురాజు కురువంశగౌరవం నిలబెట్టూ మీకు శాంతి సౌఖ్యాలు సమకూరుస్తూ రాజ్యం ఏలాడు. తరువాత నేను, నా కుమారుని ప్రలోభ, ఆత్మాభిమానాలకు లోనయి, పాండు కుమారులను అడవులకు తోలి, ప్రజను భీభత్సంచేసి, మీ కష్టసుఖాలు ఆలోచించకుండా మహా యుద్ధాన్ని ప్రేరేపించి వినాశనం సమకూర్చాము. నా కుమారుడు ఈనాడు లేడు. అతన్ని సరిగా త్రిప్పుకొనిరాక తప్పుత్రోవ పెట్టిన వాడను నేను. కాబట్టి ఆ పాపాలన్నిటికి అందరి పక్షానా నేను మిమ్మల్ని క్షమాపణ వేడుకొంటున్నాను. ఈ పదిహేడేళ్ల బట్టీ ధర్మపుత్రుడు సుభిక్షంగా రాజ్యం ఏలుతూ వెనుకటి కష్టాలుమీకు జ్ఞప్తికి రాకుండా శాంతి సౌఖ్యాలలో మిమ్మల్ని తేలించగలుగుతున్నాడు. అతని దయాధర్మాన్న మీరంతాగూడా, నన్ను మహారాజ గౌరవంతో చూసి, నా తప్పులను మన్నించి, నన్నెంతో ఆదరంతో చూశారు. ఈనాడు, మీ అనుజ్ఞ, ధర్మరాజుల అనుజ్ఞ, తీసుకొని వనవాసం ఏగి తపస్సు చేసికొని నన్ను నేను తరింప చేసుకోవాలనుకొంటున్నాను. మీ అనుజ్ఞ ఇయ్యండి. మీ మహారాజుచేత అనుజ్ఞ యిప్పించండి. ఇదిగో ఈ వృద్ధ, జీర్ణదేహ, పుత్రశోకార్త, దీనురాలు, కృపణ, ఈ గాంధారిని చూడండి. ఈమెను చూసైనా మీరు అనుజ్ఞయియ్యండి. మిమ్మల్ని సుభిక్షంగా ఏలిన, శంతనుల మనుమడననీ, పాండురాజు అన్ననీ, ధర్మరాజు పెత్తండ్రిననీ, నన్ను దయచూడండి. నీరస స్థితిలో ఉన్నాను. ఎక్కువ మాట్లాడలేను. క్షమించి నా కోరిక తీర్చండి.

(ప్రజలలో హాహాకారాలు, మహారాజా వెళ్ల వద్దు. మమ్మల్ని పితృహీనుల్ని చెయ్యకండి. అని నినాదాలు. అన్నీ అణగిపోయాక శంబువను బ్రాహ్మణుడు ముందుకు వస్తాడు.)

శంబు: ధృతరాష్ట్ర మహారాజా! పాండు మహారాజు రాజ్యం చేసినా, రాజరాజు సుయోధన చక్రవర్తి రాజ్యంచేసినా, ధర్మరాజులు రాజ్యం చేసినా, కురు రాజేంద్రుడవయిన నీకు ప్రతినిధులుగానే రాజ్యంచేశారు.

ఇన్ని సంవత్సరాలు కూడా, మీయొక్క ఉత్సాహ ప్రభుమంత్ర శక్తులవల్లనే సుభిక్షమైన మీ రాజ్యంలో శాంతి సౌఖ్యాలలో ఓలలాడాము. సుయోధన మహారాజు పాండవులతో క్షత్రధర్మాన వైరం అవలంబించి ఉండవచ్చును తప్ప, ప్రజలపైన మమ్మల్ని బిడ్డలుగా చూసి, మహా వైభవంతో మమ్మల్ని పాలించాడు.

ఈనాడు ధర్మరాజులవారు సాక్షాత్తూ ధర్మదేవతై ఆదరంతో పాలిస్తూ రాజ్యం చేస్తున్నారు.

భీష్మద్రోణ కర్ణాదులు, ద్రుపద పాంచాల విరాటాది మహారాజవీరులు, విధివశాత్తూ యుద్ధముఖాన్న నిలచి క్షత్రధర్మంలో వీరస్వర్గ మలంకరించారు. దానికి, మహా వినయసంపన్నుడవై, సౌజన్యశీలుడవై, ఉదాత్తప్రేమ స్వరూపుడవైన, నిన్ను తప్పు పట్టడం, మహా నికృష్టుడైనవాడో చేయవలసిన పని తప్ప, మానమున్నవా డెవడూ అనవలసిన మాటకాదు. ఈనాడు, క్షత్రియోచితంగా, తపశ్చరణకై వనవాసం వెళ్తామని మీ రంటున్నారు. మీ వియోగం మాకు దుఃఖకారణమే, కాని వృద్ధులైన మీ కోరికకు ఎదురు చెప్పగలవాళ్లముగాము. యుధిష్ఠిరుల మన్ననతో సుఖులై వెళ్లిరండని మేము అర్థిస్తున్నాము. ప్రజలందరితరఫున మా వీడ్కోలు నమస్కార మర్పిస్తున్నాము.

యుధి: తండ్రీ! ఇన్నాళ్లా, ఇంత దుఃఖం మనస్సులో పెట్టుకొని గూఢబుద్ధివై, సుఖంగా ఉన్నానని

నన్ను మోసంచేస్తున్నారని తెలుసుకోలేని మూర్ఖుడనై పోయాను. ఇదుగో యీ యుయుత్సునికి పట్టం గడతాను. అడవులకేగి మీ అందరి తరఫునా నేను తపస్సు చేస్తాను. మీరు వనవాసక్లేశం భరించలేరు. మీరు ఆగండి! నేను వెళ్లివస్తాను.

ధృత : నాయనా! ఎక్కువ మాటాడలేను. అదేమీ లేదు. ఇంకోవిధంగా మనస్సులో ఆలోచించకు. తపశ్చరణకు నాకు అనుజ్ఞయియ్యి.

యుధి : తండ్రీ! నేను సేవకుడను, మహారాజువు నీకనుజ్ఞ యియ్యటానికి నేను ఎవ్వడను? నాకే అనుజ్ఞయియ్యి, ఇదిగో వెళ్తాను.

ధృత : ధర్మనందనా! అల్లా అనకు. క్షత్రియుడను. రణమరణమో, తపశ్చర్యలో మరణమో, మన వంశీయులకు కర్తవ్యము. నీపాలి ప్రజను - పాలితుల పుణ్యపాపాలలో నీకూ పాలు ఉంటుంది కదా! వనవాసానికి అనుజ్ఞయియ్యి.

యుధి : తండ్రీ, నేనూ వస్తాను తీసుకొని వెళ్లండి.

ధృతరా : వద్దు నాయనా! అబ్బా! మాట్లాడలేను. అనుజ్ఞయియ్యవా? గాంధారీ నన్ను పట్టుకో (సోలిపోతాడు.)

ప్రజలు ఆ! ఆ! ధృతరాష్ట్రమహారాజా అయ్యో!

యుధి : అయ్యో! అయ్యో! తండ్రిగారు మూర్ఛపోయారు. అమ్మా ముఖం తుడవండి. మహారాజా! ఈ పాపాత్మునివల్ల మీకెంత దుస్థితి వచ్చింది.

గాంధారి : నాయనా! వనవాసం వెళ్లటానికి నీ అనుజ్ఞలేనిదే అన్నం నీరు ముట్టనని మీ తండ్రి మూడు రోజులనుంచి మంచినీళ్లైన తాగలేదు. ఆనీరసంతో ఇల్లా శోష్కిల్లి పడిపోయారు.

యుధి : తండ్రీ! తండ్రీ!

ధృత : ఆ! నాయనా, అనుజ్ఞయిచ్చావా?

యుధి : తర్వాత చూద్దాం ముందు భోజనం చెయ్యండి, మంచి నీరు పుచ్చుకోండి. మీరు పుచ్చుకొనే దాకా నేనూ పుచ్చుకోను.

ధృత : విదురా! ఎక్కువమాట్లాడలేను, అతనికి నచ్చచెప్పుబాబూ.

విదుర : ధర్మజా! ఆయన కోరికను చెల్లించు.

గాంధారి : నాయనా! ఈ వృద్ధులను కరుణించి, ప్రతి భీష్మించక మాకిది ధర్మం మమ్మల్ని కాపాడుకోనియ్యి.

యుధి : తండ్రీ! అమ్మా! అల్లాగే వెళ్లిరండి. ముందు సేద తీర్చుకోండి.

ధృత : గాంధారీ జలం యిల్లా యియ్యి (తాగుతాడు) నాయనా తేరుకొన్నాను, బయలుదేరుతాం. ప్రజలారా సెలవు. గాంధారీ!

కుంతి : అక్కా! మామగారి చెయ్యి పట్టుకో! ఇదిగో నా చెయ్యిపట్టుకుని నడు. పద విదురా, సంజయా పదండి. త్రోవ చూపండి.

ప్రజలు : హా! ధృతరాష్ట్ర మహారాజా వెళ్లిపోతున్నావా మమ్మల్ని విడిచి.

భీముడు : (కుంతితో) అమ్మా నీ వెక్కడికి?

కుంతి : నాయనా! వీరిద్దరూ నాకు అత్తమామలు. నా చిన్ననాటినుంచి అత్తింట నన్ను సాకినవారు. వాళ్ల సేవచేసుకొని ఈ వృద్ధాప్యం గడుపుకొంటాను.

యుధి : అమ్మా! ఆగమ్మా, ఆ సేవలకు నేను వెళ్తాను. కొడుకులచేత రాజ్యం చేయిస్తూ నువ్విక్కడ ఆగు.

కుంతి : నాకు రాజ్యాలు వద్దు నాయనా. ఈ వృద్ధులసేవకు మించిన సుఖం ప్రపంచంలో నాకు మరేదీ లేదు. వీరికి సేవ నేనుతప్ప ఎవరూ చేయలేరు.

భీముడు : అమ్మా ఎందుకు మాచేత యుద్ధం చేయించావు? ఇన్ని పాపాల కొడిగట్టనిచ్చావు? ఇంత రాజ్యం సంపాదింపచేశావు. రాజమాతవై, వ్రతాలు దానాలు చేస్తూ ఇక్కడుండకుండా అడవులకు పోతానంటా వేమిటి? మాకు దిక్కెవరు?

కుంతి : భీమా! ఎవరికి ఎవరం దిక్కు కాము. రాచబిడ్డలు అవమానాలపాలయి అడవులబట్టి, గిట్టని వాళ్లవల్ల 'చేతకాక సంధి చేసుకొన్నార'న్న నింద శాశ్వతంగా పడిపోతారేమోనని అన్నాను. నాకోసం కాదు.

భీము : } అమ్మా క్షమించు.
యుధి :

కుంతి : (నవ్వుతూ) నవ్వుల కన్నానయ్యా.

గాంధారి : చెల్లీ, ధర్మరాజెల్లా చెప్తే అల్లా చెయ్యమని మీ బావగారు చెప్తున్నారు.

కుంతి : లేదు అక్కా నేనూ వస్తున్నాను. సెలవు నాయనలారా! యుధిష్ఠరా, తమ్ముళ్లను జాగ్రత్తగా చూసుకో తండ్రీ. సహదేవుడి పన్నెళ్లు వచ్చినా పసివాడే. వాడిని కనిపెట్టివుండు. భీమా, మనసు నొచ్చుకోకు నాయనా - యుధిష్ఠిరా భీమార్జునులను మన్ననలతో కనిపెట్టిచూడు. ద్రౌపది మనస్సు నొవ్వనీయకండి. క్షేమంగా ఉండండి. వెళ్ళొస్తా. సెలవు. పద అక్కా పదండి.

యుధి : } అమ్మా! పెదతండ్రీ! మమ్మల్ని
భీము :

ఎంత దౌర్భాగ్యులను చేశారు. హాఁ (అంటూ కూఁబడుతారు.)

కోయిల!

★

శ్రీ కృష్ణమూర్తి

శారీ కీర మయూరీ
పారమ్యమనోజ్ఞ గాన భంగిమలవి యిం
పారం జేయవె? కోయిల!
ఈరములో నీదు పాటయే తీయనిదా?
ఆ లేమావి చివుళ్లు మత్తుగలవా?
ఆనంద సంధాయులా?
ఏలా మెక్కిన యంత నిక్కెదవు? గొం
తే తీరుగా దిద్ది నీ
వాలాపింపఁగ మంచి మందె యది? పి
ట్టా! కోయిలా! గ్రామక
న్యా లావణ్య మనోజ్ఞగీతికల కా
హా! దోహదం బిచ్చెదే?
అందము చందమ్మున్ సుఖమ
యంబగు జీవన మింత లేక సం
క్రందన వై భవంబనిన
లాభమె? లోభము మాని కాక మే
పొందుగ నిన్ను పెంచినది
పోలిక నీకును గొంత కల్గెఁ జి
న్నందనమందె తల్లి చను
నాఁడె పరాయి కరాదు తారెనే?
నవ్యతగన్న భావకల
నకన్ మధురంబుగాఁ బాడనేర్చితే?
అవ్యయమైన పూర్వజన
నార్జిత పుణ్యఫలానఁ దత్పురా
కావ్యకళల్ గ్రహింపు మిటు
గన్నుల మాటున నున్నవెన్నొ? మం
తవ్యములవ్వి క్రొత్తలకు
దారులఁ జూపెడి దీప్తిమంతముల్.
తుమ్మెద దిమ్మరీఁడు నిను
ధూయని పించునో? యేమొ? క్రొన్ననల్
కమ్మని తిండి నీకు-అతని
కా? మృదుల ప్రసవామృతమ్ము ని
త్యమ్ము సుభోజ్యము-ఇంక నిన
దమ్మది ఝుమ్మనెడన్ గభీరమై
ఇమ్ములఁ బట్టి సారముల
నెల్లగ్రహించి మదించి పాడెడిన్.

విశ్వకవులు :

మారిస్ మేటర్ లింక్

శ్రీ పారనంది జగన్నాథస్వామి

మారిస్ మేటర్లింక్ బెల్జియంలో ఒక సుప్రసిద్ధమైన కుటుంబమందు జననమొందెను. చాలా రోజులు ఫ్రాంసు దేశంలో అద్భుత కవుల సహవాసాన్న కాలముగడిపి తండ్రి కాలంచేయగానే స్వదేశానికి తిరిగివచ్చివేసెను. తన గ్రామంలో తనతోటలో ఒంటరిగా ఎవరితోను సంభాషణ చేయకుండా కేవలం మౌనము గాకపోయినా ఒకవిధమైన ధ్యానములో చాలాకాలము గడిపి, అనిర్వచనీయమైన అనుభవాన్ని సంపాదించినాడు. ఫ్రాంసు దేశంలో పండితులతోను కవులతోను కలిసి మెలిసి యున్నప్పుడు సంపాదించిన సారస్వత అనుభవాన్ని కవిహృదయాన్ని మౌన—అనుభవముతో మేళవింపజేసి, కవనాలు చెప్ప ప్రారంభించాడు. అతడు ఉపయోగించిన భాషమాత్రము తనకు సారస్వత పరిచయము ప్రసాదించిన ఫ్రెంచిభాష. భాష అన్యమైనది అయినా భావాలు ఆశయాలు జీవన—అనుభవాలు స్వదేశ సంబంధమైనవే. ఇతని కవనములు ఎక్కువగాను ముఖ్యముగాను నాటకాలు. వీటి ప్రాశస్త్యమును గ్రహించిన బెల్జియం పండితులు ఇతనికి బెల్జియం షేక్స్పియర్ అనే సార్థక నామకరణము చేశారు. ఈ బిరుదు సమర్పించడానికి ముఖ్య కారణము ఆ ఇద్దరి నాటక నిర్మాణ సామ్యముకంటె ఎక్కువైనది మేటర్‌లింక్‌కు షేక్స్పియర్ మీద గల గౌరవము. మేటరులింక్ ప్రథమనాటకాలలోనిది ఒకటైన జాయిజెల్లి (*Joy Zelle*) అనేది షేక్స్పియర్ యొక్క సుప్రసిద్ధమైన తుది నాటకాలలోనిదైన టెంపెస్టు (*Tempest*) చేత ప్రేరేపింపబడ్డది అని మేటరులింక్ సగర్వముగా ప్రకటించాడు.

ఇతని నాటకముల ఘనతను గ్రహించిన ప్రపంచ సారస్వత పండితులు ఇతని కవనాలను అన్ని భాషలలోనికీ తర్జుమా చేశారు. ఈ ఖ్యాతిని స్థిరపరుస్తూ జగత్ ప్రసిద్ధమైన నోబెల్ సారస్వత పారితోషికము ఇతని 49 వ వయస్సున అనగా 1911 సంవత్సరములో ఒసంగబడినది. నోబెల్ బహుమానమును ధనాపేక్షను చూచినా, ప్రఖ్యాతి - అపేక్షను చూచినా, విశేషమైన విలువగలది. సంవత్సరానికి ఒకమారు ఆనాటికి ప్రపంచమందు అత్యుత్తీర్ణులైన విజ్ఞానవంతులను ఎంచి, ఈ పారితోషికాన్ని ఒక కమిటీవారు అర్పింతురు. ఇది అనన్యమైన కీర్తిని ప్రకటించునది. మనదేశంలో ఇది 1918 లో పార్వతానికి శ్రీ రవీంద్రనాథ ఠాకూరుగారికిన్నీ, అలాగే పదార్థశాస్త్రములో అగ్రగణ్యులైన శ్రీ సి. వి. రామన్‌గారికిన్నీ, ఇవ్వబడినది.

ఇతడు గద్యరచనలో చాలా నిపుణుడు. ఇతని నాటకాలన్నీ గద్యలోనే ఉన్నవి. కవిత్వానికి గణయుక్తరచన ప్రప్రధానమైనది కాదు. గణయుక్తమైనది చెవికికూడ శ్రావ్యమైనందున, పద్యమందు ఇమిడినట్లు భావగాంభీర్యము గద్యలో కుదరదని సమ్మతమైనా, కేవలగద్యద్వారానే భావ వ్యక్తీకరణము సముంజసముగా నడిపించసాధ్యమని మహాకవులు చాలామంది నిదర్శన పూర్వకముగా రుజువుచేసియున్నారు. వారి గద్యలో ఒక విధమైన సంగీత మాధుర్యము గర్భీకృతమై ఉన్నదని వ్యాఖ్యానము. ఈ చర్చ ఇప్పుడు అప్రస్తుతము. కాని ఒకటిమాత్రము నిర్వివాదముగా స్పష్టపరచవచ్చును. మేటరులింక్ పదసుంభిత అనన్యమైన శోభను వెదజల్లుతూ ఉంటుందని విమర్శకుల అందరి అభిప్రాయము. ఇతడు ఉపయోగించేభాష సంగీత సంబంధమైనది. పాటలో ఇమిడే ఉండేహాయి ఇతని పదములలో చక్కగా ఇమిడిఉందని, ఆభాషను ఎరిగినవారి అనుభవము. ప్రతీమాట ప్రతీ స్వరమూ అతడు తూచి

ఉపయోగించినట్లు ధ్వనించును. పదములు ఏవో చాలా సులభమైనవి; భాష చాల సులువైనది; వాక్యాలు చాలా చిన్నవి. వీటినిపట్టిచూస్తే ఇతని గ్రంథాలు చిన్న తరగతులలో పఠన పుస్తకాలుగా నియమించడానికి తగిఉన్నట్లు తోస్తుంది. ఒక్కమాటకై నానిఘంటువు చూడనక్కరలేదు. మొత్తముమీద, ఇతని నాటకాలకు విషయమైన ఆధ్యాత్మిక సౌందర్యాన్ని ప్రదర్శించుటకు అనుగుణమైన భాషాసౌష్ఠవము ఈ మహాకవిసొమ్ము; అందుకు కావలిసిన ఒక అద్భుత సృష్టిశక్తి ఇతనికి కలదు. నాటకాలే కాకుండా అనేక వ్యాసాలను కూడా ఇతను వ్రాసియున్నాడు. కాని ఇతనికీర్తి శాశ్వతముగా ఇతని నాటకాలపై నిలిచి ఉంటుంది. కాబట్టి ఇతని నాటకాల గురించే ఈ వ్యాసంలో ప్రసంగిస్తాము.

మేటరులింక్ నాటకాల ప్రాశస్త్యము వాటి విషయాన్ని ఆశ్రయించినది. ఒక కథనుగాని ఒక మహావీరునిగాని, ఒక అద్భుత కృత్యాన్నిగాని, ఒక క్లిష్ట సమస్యనుగాని—ఇట్టి ఏ భౌతిక విషయాన్నిగాని ఇతడు ఇతివృత్తంగా ఎంచలేదు. ఇట్టి ఉద్రేక సంగతులు ఏవీ అతని నాటక వస్తువులు కావు. ఇతరుల నాటకాలవలె కృత్యాలతోను చేష్టలతోను వ్యాపారాలతోను కదులుతూ నాటకము నడుస్తూ ఉండదు. పాతివ్రత్యాన్ని సంశయించిన ప్రేమికుడు హఠాత్తుగా తన ప్రియురాలిని హత్యచేయడము, యుద్ధములో గెలిచిన వీరుని సాహస కార్యము,—ఇట్టివేవిన్ని ఇతని నాటకవస్తువులో కానరావు. వ్యాపారము చేష్ట ఎట్లు అంతగా కానరావో, అలాగే శీల వివరణముకూడా అంతగా ప్రధానంగా కనబడదు. ఈ నాటకాలకు విషయము ఆధ్యాత్మిక సౌందర్యము. ఆత్మనే వస్తువుగాచేసి కవిత్వము చెప్పడము చాలా అరుదు. అట్లు చెప్పి అఖండ విజయాన్ని సంపాదించిన వారిలో ప్రధానుడు మేటర్‌లింక్. ఇతర నాటకకర్తలు ఎట్లు బాహ్య ప్రపంచాన్ని సులభముగా వర్ణించగలిగారో, అంత తేలికగా ఇతడు ఆత్మవృత్తులను వర్ణించాడు. ఆత్మవృత్తి అంటే ఏమిటి అనే సందర్భంలో అతడు ఇట్లు ఒకచోట వ్యాఖ్యానించాడు. "ఉత్కృష్టము లోనే మనము నివసింతుము. ఘనత అంతటా ఆవరించి ఉన్నది. సౌందర్యము బయటకంటె లోపలను ఎక్కువ గాఢముగా వ్యాపించియున్నది. ఇవేకదా జీవన ప్రయోజన పదార్థాలు. వాటిని సాధించడమే ఆత్మవృత్తి." సాధారణ ప్రపంచములో ఉండే భౌతిక వస్తువులద్వారా తృప్తిచెందలేక, మనస్సులో తీవ్రమై ఉండిపోయిన కోరికలతో ఊగులాడుచుండే మనో వ్యాపారాలు ఆ ఆత్మవృత్తి. జన్మతో సంక్రమించే ప్రాథమిక వాసనలపై ఆధారపడియుండి బాహ్య పరిసరాల ప్రభావానికి లొంగిపోకుండా ఉండే జీవ నిర్మాణము యొక్క ప్రవృత్తి ఈ ఆత్మవృత్తి. అగాధమైన లోతుకలిగి పైకి సులభముగా తేలని స్వభావము గలది ఈ ఆత్మ. కదలలేని నిశ్చల తటాక జలములో పుట్టే చిన్న అలలవలె కేవల తల భాగమందే పుట్టే వృత్తులు కావు ఇవి, అగాధమైన లోతునపుట్టి పైకి వచ్చేసరికి ఎన్నో మార్పులు చెంది ప్రథమ రూపాన్ని విడిచి, మరొక రూపాన్ని పొందే సముద్రంఅలల లాంటివి ఇవి; అలాగని అతివేగంతో పరిగెత్తి తీరాన్ని ముక్కలైయే పెద్ద అలలుకూడా కావు. మీదకనపడే తరంగాల ఆవేగంతో ఆకర్షింపబడ్డవాడు అగాధ తలాన్ని బోధపరచుకోలేడు; అలాగే పైకి కనబడే మనోవ్యాపారాలను చూచి తృప్తిచెందేవాడు ఆత్మలోతున విజృంభించే శక్తులను గ్రహించలేడు. మానవ ప్రకృతి గ్రహించాలంటే, ఈ అగాధాన్ని మథించాలి. అనిర్వాణమే ఆత్మ.

ఈ ఆత్మయొక్క బీజ పదార్థాలు రెండు; సౌందర్యము, ప్రేమ. ఆత్మవంటి సౌందర్యనిధి మరి ఒకటి సృష్టిలో లేదని మేటర్‌లింక్ ఆశయము. మరి దేనికీ సౌందర్యము చక్కగా అతకదట. బాహ్య ప్రకృతి సౌందర్యము ఆహ్లాదకరమైనదే కాని, అంతకంటె వెయ్యిరెట్లు అద్వితీయమైనది ఆత్మసౌందర్యము. ఈసౌందర్యము ప్రేమలో బాగా వ్యక్తమవుతుంది. ప్రేమ శారీరకము కాదు. ఆధ్యాత్మికానుభూతి. సర్వసుఖము జీవన పరిపూర్తి. ప్రేమయొక్క సౌందర్యాన్ని గ్రహించగలవారే ప్రేమయొక్క అపారావధిని చేరగలరు. ఈ ప్రేమలోతును తెలుసుకొన్న వారికి జీవనరహస్యము చక్కగా విశదపడుతుంది. వారి దృష్టిలో పవిత్రత ఆధ్యాత్మికముగాని శారీరకము గాదు. లోకకల్యాణము, అనాథుల శరణ, మానవరక్షణ మొదలైన మహత్కార్యాలలో విశదమైనదే ప్రేమ ఎక్కువైన మానవధర్మము. ఈ

కార్యాలు ఆత్మపరిపూర్ణత కొరకేగదా; అందుచేత ఆకార్యాలు ప్రేమజీవనా విర్భావాలు.

ఈ ప్రేమ సౌందర్యములయొక్క పరిణత జీవనము ధర్మము. ఈ తత్వదర్శనము అతని కవితాసృష్టిలో క్రమంగా పరిణమించింది. ఆరంభదశలో అతని దృష్టిని ఎదుర్కొన్నవి రెండు సమస్యలు, మరణమూ అదృష్టమున్నూ. ఈ రెండూ అతనిభావనలోని సౌందర్య నిర్మాణాలను భగ్నములుగాచేసినవి. అంతా అంధకారముతో నింపబడినట్లు గోచరించింది. అంతా వృథాఅని తోచింది. గతిలేదన్న ఈ నిరాశక్రమంగా జ్ఞానకిరణాల ముందిక చెదిరిపోయింది. జీవితసౌందర్య దర్శనము ఆత్మకు అమోఘ శాంతినొసంగి, అపారత యొక్క దారులను కనబరిచింది. జీవితము అన్నిటి కంటె ఉత్కృష్టమని వ్యక్తమైంది. జీవితము నిరర్థకము కాదనిన్నీ పరిపూర్ణతి నొందిన సౌందర్య వంత మనిన్నీ, దినవ్యవహారాలలోని క్లేశాలను మరచే ప్రశాంతము సాధ్యమనిన్నీ, అతనికి నచ్చినది. జీవితము ఆధ్యాత్మికము; ఇదే గాని ఘనత, ఇదేదాని రహస్యమున్నూ. ఈరహస్యాలు కేవల జాగ్రచ్చైతన్యాంశములతోనే పరిచయముగలవానికి విశదపడవు.

ఈ పరిచయానికి సాధనము ఆత్మప్రత్యయము. ఈ సాధనాన్ని మేటర్ లింక్ అందరికి తెలిసేటట్లు ఇట్లు వర్ణించాడు:- "నేను ముసలివాడను. నా వాలు కుర్చీలో చేరబడి నిశ్చలముగా ధ్యానములో మునుగుతూ తేలుతూ చాలా ఓర్మితో లీనమైతిన్యమునుండి నాచుట్టూ విజృంభిస్తూ ఉండే శాశ్వత ధర్మాలను గ్రహిస్తూ పూర్తిగా తెలిసికొన జాలని అంతర తేజస్సును సమన్వయిస్తూ ఉంటే, రహస్యాలు ఆశయాలు నా హృదయానికి వ్యక్తమవుతూ ఉంటవి. విధి సర్వశక్తివంతమైనది అయినా, నా ఆత్మ వాస్తవమైన జీవన మర్మాలను గ్రహించగలిగి, శృంగార యువకుని కంటెను, యుద్ధవీరుని కంటెను, సంసారియైన గృహస్థుని కంటెను, ఎక్కువ సత్యమైన జీవయాత్రను నడుప శక్తిగలవాడను. ఇట్టిస్థితిలో ముందురానున్నది సూచనగా వ్యక్తమవుతుంది."

ఇది ఆధ్యాత్మిక తత్వవిచారణ అంటే అనవచ్చు. కాని ఇతని పద్ధతి పేరుపొందిన తత్వవేత్తల పద్ధతికాదు. సిద్ధాంతరాద్ధాంత చర్చలు, తర్కవితర్కవాద ప్రతివాదములు, పూర్వపక్ష ఖండనాలుకావు. కేవల జీవితామృత స్రోతస్సులో మునుగుతూ తేలుతూ కేవలము అంతర దృష్టిని గ్రహించడము అతనిపద్ధతి. దూరదర్శి అతడు. దాహముతో తపిస్తున్న ఆత్మపై తత్వదర్శనములతోను, సౌందర్యానుభవాలతోను, జీవనశోధలతోను, అమృతము పోసినట్లు ఉంటుంది అతనిపద్ధతి. కళారాధనతో ఆధ్యాత్మికారాధనను మేళవించి కళాసృష్టిచేసే శిల్పకుడు ఇతడు.

ఇతని కవనాలకు ఆత్మ వస్తువు కాబట్టి ఆత్మ విచారము గురించి ఇంత చెప్పవలసివచ్చింది. ఇతనికి కళ ప్రధానము. నాటకరూపాన్ని ఆ కళధరించింది. ఇతని నైపుణ్యము, కవిహృదయము, రచనాశక్తి ఈ ఆత్మవృత్తులను, ఈ ఆత్మతత్వాన్ని ప్రజ్వలముగా వర్ణించుటకు వినియోగమవుతున్నవి. తన అద్భుత భావనాశక్తిద్వారా అతిశ్రేష్ఠమైనవ్యంజనకు సూచనల ద్వారా ఆత్మభావావేశాలను నాటకములోని చేష్టలుగా సృజించి వర్ణించ గలిగిన సామర్థ్యము ఇతనికి లెస్సగా గలదు.

కాని మేటర్ లింక్‌కు నాటక శిల్పము లేదని కొందరు విమర్శకులు అభిప్రాయపడి యున్నారు. నాటకము అంటే, కథ చేష్ట, శీలము చలనము మొదలైన అంగముల నిర్మాణము. ఇవేవీ అంతగా ఇతని శిల్పములో లేవు. తాత్విక ప్రాయాలు ఆత్మవృత్తులు నాటకలక్షణానికి సరిపడవు. నాటకము వ్యావహారికమైనది; అంతేగాని కేవలమూ భావనే కాదు; ఆధ్యాత్మికమును నాటక రచనానికి దించడము నాటకరుచిని బద్దలు కొట్టడమే. ఈ విమర్శలో తథ్యము లేకపోలేదు. కాని అతని కవనము అంత అసందర్భము కాదు. కథ ఏమీ ఉండకపోదు. ప్రాత నాటకాలలోవలె కథ ప్రధానమైన అంగము కాదు. అలాగే శీలము లేదని చెప్పకూడదు. బాహ్య గుణాలను వ్యక్తపరిచే శీలవర్ణన లేదు అని చెప్పవచ్చును. చలనముగల చేష్ట లేదని మేటర్ లింక్ ఒప్పుకొన్నదే. ఇతని పాత్రల చేష్టలు కాయికములై బాహ్యేంద్రియాలను చలింప చేసేవికావు. ఈ విమర్శను ఒక్క సంగతి మరచినది. మేటర్ లింక్ ప్రాత సంప్రదాయాలను అనుసరించి నవనవక నూతన సృష్టిని కల్పించినవాడు. అతని కవనాలను ప్రాత నియమాలను పట్టి విమర్శిస్తే పొరపాటు విమర్శకులది గాని కవిది కాదు.

క్రొత్త విషయాన్ని క్రొత్తపద్ధతిని కల్పించుకొని మేటర్‌లింక్ క్రొత్త విధమైన నాటకాలను లోకానికి అర్పించాడు. వీటిని చదివి ఆనందించే వారు అనేకులు పండితులలోను సాధారణులలోను ఉన్నారు. మనదేశంలో మేటర్‌లింక్ పరిచయము గలవారు అందరూ (అనవచ్చు) ఆనాటకాలను చదివినవారే. ఈ నాటకాలను గొప్ప వైభవంతో పాశ్చాత్యదేశంలో ప్రదర్శించినారు. రసజ్ఞులు ఆనందించినట్లు స్పష్టము. కాబట్టి ప్రదర్శన యోగ్యత గురించి పూర్వపక్షుల విమర్శనను అంగీకరించ నవసరము లేదు. వాదముకొరకు ఈ నాటకాలను శ్రీ రవీంద్రుని నాటకాలతో పరిపోల్చవచ్చును. సరిగ్గా మేటర్‌లింక్ నాటకాల జాతికే చెందినవి కాకపోయినా, ఠాకూరిగారి నాటకాలుకూడ ప్రాత సంప్రదాయానికి చెందినవి కావు. కథ, చేష్ట, శీలము, ఈ అంశములలో అవి పూర్తిగా క్రొత్తరకము; అయినా వాటి ప్రదర్శన విజయము జగత్ విఖ్యాతముకదా. అలాగే మేటర్‌లింక్ కూడా ఈ అసాధ్యాన్ని అతి చిత్రముగా సాధించగలిగాడు. అది అతని అపూర్వ శిల్పమురొక్క ఫలితము.

ఈ అద్వితీయమైన కళావిధానాన్ని కొంచము వివరించవలెనుగదా. ఇతని అనన్యవస్తువును అనుసరించి ఇతని నాటకపాత్రలు, వారి సంభాషణ, వారి చేష్టలు భావాలు పూర్తిగా అపూర్వమైనవి. తీవ్రమైన భావోద్రేకము, పాత్రల వ్యక్తిత్వముగా, నాటకవిషయమైన ఆత్మవృత్తులను అనుసరించి ఉంటవి. ఈపాత్రలు వ్యక్తిత్వము గలవే అయినా, భావనాప్రపంచములోని భావాలకు ఉచితమైన సంజ్ఞలగా సమన్వయించాలి. కాబట్టే పాత్రల సంఖ్య చాలా తక్కువ. ఒకే సమయాన రంగముపై రెండుమూడు పాత్రలకంటె ఎక్కువ కనబడరు. వారిచేష్టలు వారి అగాథములైన ఆత్మలనుండి పైకివచ్చే వృత్తులు కావడము వలన, వారిచేష్టలు కాయికములుగాక మానసికములుగా పరిణమిస్తవి. ఈ మానసిక చేష్టలు ఆకర్షణీయములే. మానసికములు కాబట్టే ఇవి కేవలము పాత్రల సంభాషణల ద్వారా వ్యక్తమవుతవి.

సంభాషణలు ఒక్కొక్కప్పుడు చాలా దీర్ఘమైన ఉపన్యాసాలవలె కనుపిస్తవి. కాని వీటియందు ఉన్నపటిమవలన, అవి శ్రోతల హృదయాలను వశపరుచుకొని ఆరంభమునుండి తుదివరకు తీసికొని పోతవి. అవి ఉపన్యాస ధోరణిని నడవవు; ఆత్మలు నిశ్చలముగా సంప్రతించు కొన్నట్లు నడుస్తవి. చాలా సున్నితములైన అంగ విక్షేపాలద్వారాను, మధ్య మధ్య వచ్చే విరామాలద్వారాను, సూచకములైన సంజ్ఞలద్వారాను, ఆ సంభాషణలు వారి ఆత్మభావాలను తెలుపుడి చేయ ప్రయత్నించును. అవి ఉచ్చైస్వరంతో పలికేఘోషలుగాక, హృదయగాంభీర్యమునుండి వచ్చేభావాల సూచనలు.

ఈ సంభాషణల మధ్య మౌనం చాలాతరుచుగా ప్రవేశిస్తుంది. ఈ మౌనం అల్పకాలికమే అయినా, ఇతని పాత్రలలోనికి రంగములోనికి ప్రవేశిస్తుంది. సౌందర్యారాధకులు భావనలో అనభవించిన తీవ్రభావాన్ని మాటలలో సుస్పష్టముగా వర్ణించలేరు. సాధారణులు పడేఇక్కట్లు మేటర్‌లింక్‌ను బాధించలేదు. సాధారణులకు తగినపదములు దొరకకో, లేదా బహిరంగంగా చెప్పడానికి సిగ్గుపడో, వారు ఆలోపానికి లొంగిపోతారు. తీవ్రమైన భావనాబలము ఉండడముచేతనో, తత్వము విశదపరచడానికి బుద్ధిస్థైర్యముఉండడముచేతనో, అతడుఎట్టిఅవ్యక్తసౌందర్యగూఢార్థాన్నైనా చక్కగా వ్యాఖ్యానించగలిగినాడు. ఈ పనినంతా అతడు జయప్రదంగా చేయడానికి ఆ మౌనవిధానాన్ని ఉపయోగించాడు. అంతరంగిక రహస్యాలను చెప్పుకొంటున్న వ్యక్తులమధ్య ఉండే మౌనం అతని నాటకపాత్రల సంభాషణలో వస్తుంది. అందుచేతనే చేష్టలు వ్యాపారాలు ఉన్నట్టు కనబడదు. ఎండిన ఆకుల గలగలవప్పుడైనా సహించలేనంత నిశ్చలమైన సంభాషణ, ఉద్రేకించి గాఢముగా ప్రవహిస్తున్న భావసరణిని వర్ణించడానికి ఉపయుక్తమైనది. స్తబ్ధముగ ఊరుకొన్నస్థితి భావనా ప్రపంచములో మహాకంపవాన్ని పుట్టించగలదు. అనే తత్వాన్ని మహాకవులు వారి శిల్పంలో ఉపయోగించి ఉన్నారు. వారిలో అగ్రగణ్యుడు మేటర్‌లింక్ అని చెప్పవచ్చును. ఏందుచేతనంటే, ఇతడు ఈ తత్వాన్ని ఆత్మతత్వంగా దర్శించినవాడు. ఈ నిశ్చలత, స్తబ్ధత మౌనరూపాన్ని నాటకాలలో చాలాముఖ్యాంశముగా ఉపయుక్తమైనది.

మౌనం మౌనంగానే ఉండిపోదు. సంభాషణల మధ్య వ్యవధానాలుగా ప్రయుక్తమవుతుంది. భావాల

ఉద్రేకము ఆత్మలోపలినుండి పైకి రావలసినప్పుడు సాధారణ వ్యవహారానికై సృజింపబడిన పదములు ఈ శాశ్వతభావాలకు సరిపడవు అని మేటర్‌లింక్ మతము. ఈ భాషాలోపము మౌనంద్వారా తీరుతుందని అతని ఆశయము. అగాధమైన నిర్వ్యాజప్రేమను తెలియచేయ గోరువారికి మౌనము సార్థకమైన అమోఘసాధనము. నిజమైన భావాన్ని చెప్పలేకకాని మాటలు అసత్యాన్ని సూచించవచ్చును, అప్పుడు మౌనం ప్రశస్తమైన మార్గము. ఇది అనుభవసిద్ధము. నిష్కపటమైన స్నేహము సంభాషణాతీతము. "గంటలకొలది ఒక్కమాటైనా ఉచ్చరించకుండా ఒకరి సమక్షములో ఒకరు కూర్చొని గడిపిన సాయంకాలాలు మా స్నేహచరిత్రలో మరువ దగనివి" అని కార్లైలు టెన్నిసన్ మహాకవులు చెప్పియున్నారు. ఇట్టి అనుభవాన్ని వర్ణించేవారు ఇంకా ఉన్నారు. ఇట్టి అనుభవమునుండి మేటర్‌లింక్ గ్రహించినది జీవన వ్యవహారాలలో మౌనమునకు గల ఆధిక్యత. నాటకము జీవనవ్యవహారముల వర్ణన అయినప్పుడు, అతడు ఆ ప్రశస్తమార్గాన్ని ఉపయోగించడం ఉచితమే గదా. ఉచ్చరించిన మాటలకంటె ఉచ్చరింపబడని ఆత్మస్థితి ఎక్కువ ప్రభావముకలది అని అనుభవసిద్ధము. కీట్సు అనే మహాకవిగదా పాడాడు. "వినబడే సంగీత మాధుర్యముకంటె వినబడని సంగీతము ఎక్కువ మాధుర్యముగలది." అని మనదేశంలో ఈమధ్యగతించిన శ్రీ రమణమహర్షి ఈ తత్వాన్ని లోకానికి సుప్రసిద్ధంగా వెల్లడిచేసి ఉండెను. హృదయ గర్భకోవలలోనికి ప్రవేశించాలంటే, మౌనము ఒకటే సాధనము, అని వారి అనుభవము.

ఈ మౌనం అనేక పర్యాయాలు ఈ కవినాటకాలలో సంభాషణల మధ్యను వస్తూఉంటుంది. అప్పుడు రంగము వ్యాపారము అంతూమరి ఉండవు. అంతా నిశ్చలము. పాత్రల ఆత్మలు మాత్రమే వ్యవహరిస్తూ ఉంటవి. కాబట్టి ఒకరి నొకరు లెస్సగా తెలుసుకొన గలుగుతారు.

మౌన సాధనవంటిదే మరొకటి మేటర్‌లింక్ రచనా విధానములో ప్రాముఖ్యత వహించినది. దానికి సంజ్ఞావాచకత్వము అని పేరు పెట్టవచ్చును. ఇంగ్లీషులో *Symbolism* అని అంటారు. భాషలోని పదాలు అభౌతికార్థములను విశదపరచ శక్తిలేనివి కావడమువల్ల, ఈ సాధనము ఆవశ్యకమైనది. పదాలకు సాతివార్థము ద్యోతకము కావాలి; ఇది ధ్వన్యర్థము వ్యంజకార్థము వంటిదే. సంజ్ఞావాచకత్వము అంత సులభమైనది కాదు. ధ్వని వ్యంజకములు ఇంతకీ భౌతికాపేక్ష విషయమై వాడిరి. మేటర్‌లింక్ అర్థాలు భౌతికాతీతములు. అందుచేత సంజ్ఞలు ఆవశ్యకములు అయినవి. యోగి, తత్వజ్ఞుడు, శాస్త్రజ్ఞుడు, అందరి సూక్ష్మదృష్టుల సమ్మేళనము వ్యక్తపరచడానికి సంజ్ఞలు తప్పని సరి. భౌతికప్రపంచాన్ని ఆధ్యాత్మి కార్థముతో నింపి, ఆధ్యాత్మికార్థాన్ని భౌతికపదాలచేత విశదపరచడము సంజ్ఞలుగా జరుగుతుంది.

మేటర్‌లింక్ సంజ్ఞలు ఎక్కువగా పక్షుల నుండి వచ్చినవి. ఆధ్యాత్మికానందమునుండి శారీరక సౌఖ్యమువరకూ గల సోపానా లన్నిటినీ వర్ణించడానికి పక్షులను సంజ్ఞలుగా అతడు ఉపయోగించాడు. మంచిని తెలియజేసే పక్షులు, చెడును తెలియజేసే పక్షులు, అలాగే అన్నిధర్మాలకు పక్షులు అతడు ఎంచుకొన్నాడు. పక్షులు మీదుగా ఎగరడము, తిన్నగా పోవడము, ఉపయోగించి ఆ ధర్మాలను సాధించే యత్నాలను అతడు వర్ణించెను. పక్షులను ఉపయోగించినట్లే రంగులను కూడా అతడు వాడినాడు; రంగులు పక్షులకు దగ్గరివిగదా. చక్కని పక్షులు, నెమ్మదిగ ఉండేపక్షులు, నిర్మలమైన పక్షులు, సత్యము, కల్యాణము, సౌఖ్యము మొదలైన ధర్మాలకు సంజ్ఞలు. అలాగే దుర్మార్గమైనవి, వికృతిగా ఉండేవి, అసత్యము ఘోరము మొదలైన చెడ్డలకు సంజ్ఞలు. చిలుకలు, పైవలు ఒకరకమైతే కాకులు గుడ్లగూబలు ఒకరకముగదా.

ఈవిధంగానే ఈకవి చిత్రాలను ప్రయోజన పూర్వకంగానే ఉపయోగించినాడు. ప్రకృతి చిత్రాలను వాటి సౌందర్యముకొరకే వర్ణించే కవుల వంటి కవి ఇతడు కాదు. ప్రకృతి చిత్రాలను ఆధ్యాత్మిక సౌందర్య చిహ్నాలుగాను, ఆత్మధర్మాలుగాను, మానవ జీవిత తత్వాలుగాను, ఉపచరిస్తడు అతని కవనములో. బాహ్య ప్రకృతికిన్ని మానవ ప్రకృతికిన్ని అన్యోన్యముగా సన్నిహిత సంబంధము ఉన్నది అని

అతిశీభావన. దేశముయొక్క నామాలను వాడినా, ఆ నామాలు నామమాత్రములే; అవి కూడా సంజ్ఞలే. అవి చరిత్రాత్మకములు కావు; మానవ స్వభావానికి సంబంధించినవి. అంతేకాని దేశకాల పరిచ్ఛిన్నములు గావు; సార్వత్రికములు, సార్వకాలికములున్నూ.

ఆ కారణంచేత అతని నాటకాలన్నిటిలోను అవే చిత్రాలే కనబడుతూ ఉంటవి. సముద్ర తీరము, సముద్రమునుండి వచ్చిపోయే మేఘాలు, సముద్రతీరమందు రాళ్ళగుప్పలు, వాటిలో నివాసము చేసేపక్షులు, ఆ రాళ్లమీదనుండి పారేనీరు, అక్కడ విశాలమైన చిట్టడవి. దానిమధ్య ఒక కోట, దానికి ఒక బురుజు. ఆ బురుజునుండి ఎగిరే సముద్రపక్షులు. ఒక చిన్న సెలయేరు. దానిమీద చిన్నవంతెన. అది దాటితే పెద్ద ఉద్యానవనము. దానిమధ్య ఎగిరే నీటి ధార. ఇరుప్రక్కల పెద్దవృక్షములు. వాటిమధ్య నుండి నడకదారి. ఒక నగరము, సాధారణముగా నిర్జనమైనది. నక్షత్రాలతో దట్టముగ ప్రకాశిస్తున్న ఆకాశము. దూరాన్న ఉన్న దీపాలు. సూర్యచంద్ర కాంతిరేఖలు వాటివలన ప్రతిఫలించే రంగులు, విస్తరించిన నీటిపై మెరుస్తున్న కాంతి పుంజములు, సంధ్యకాల చీకటిలో వెలుగుతున్న తేజస్సు, ఇళ్లలో నుండి బయటకు పొడుచుకొనివచ్చే దీపరేఖలు. ఇట్లు ఎన్నో చిత్రాలు ప్రత్యేకించి వాడబడినా, అవన్నీ సంజ్ఞలుమాత్రమే అనే అనుభవము స్పష్టముగా మనస్సునకు తట్టుతుంది. ఈ వర్ణనలు సాధనలుగా ఉంటవి. ఏఆత్మవృత్తినో సంకేతించే ప్రయోజనము కలవి.

ఈ రచనా పద్ధతులు మేటర్‌లింక్ కల్పనా శ్రేష్ఠతను, అతని మానవహృదయ ప్రకటన కౌశలమును, భావసృష్టి నైపుణ్యమును వెల్లడిచేస్తున్నవి. ఇతడు ఒక మహాకవి. ప్రపంచానికి అంతటికీ భూత భవిష్యత్ భేదములేకుండా ప్రకాశించే ప్రఖ్యాతి కలిగినవాడు. ఇతని గురించి మనకవులు తెలిసికోవలెననిన్నీ, నాటకప్రదర్శన నిపుణులు ఇతని నాటకాలను ఆంధ్రరంగపై చూపెదరనిన్నీ, ఉత్కృష్ట రసగ్రాహకులు ఇతని నాటకాలరుచిని ఆంధ్రలోకానికి చెప్ప ప్రయత్నించెదరనిన్నీ, విశ్వసిస్తున్నాను.

పాట సుడులు

మొక్కపాటి కృష్ణమూర్తి

తీయని ఒక
ధ్యేయముతో
"కో" యను
కోయిల,
"కో" యని
చిఱు పరువుల
కరువలి తరఁగల.

వానలలో
కోనలలో
కదలి!
కదలి!

తీరని ఒక
కోరికతో
"ఓ" యన
"నో హూ
హూ" యని
మూఱు మ్రోగుఁ
పేరెలుఁగు

కొండలలో
ఎండలలో
పఱచి!
పఱచి!

మాయని పెను
చాయలలో
మెఱుఁగు
ఎదల
మఱఁగి,
క్రాఁగి
మునిమాపుల
కనుచూపుల

ఏటినడల
పాటవడుల
సుడులె!
సుడులె!

కథానిక:

ధర్మామీటరు

శ్రీ కొవ్విడి లక్ష్మన్న

అప్పుడే షాపునుంచి వచ్చేడు గోపాలం. బంగళా కాంపౌండులో కారు హారన్ విని ముందు పోర్టికోలోకి పరుగెత్తుకువచ్చేరు యిద్దరు పిల్లలూనూ. అమాయక ఆనందంతో తనని ఆహ్వానిస్తూన్న పెద్దపిల్ల బుగ్గలు నిమిరి, చంటివాడిని యెత్తుకుని ముద్దులాడి, వాళ్ళకి నాలుగు గజాల వెనకనే వున్న యిల్లాల్ని ప్రసన్న దృక్కులతో పలకరిస్తూనే, అలా పడమటి గదిలోకి వెళ్ళేడు. కిటికీకి చేరువగా వేసిన పెద్దమంచం మీద మెత్తని బాలీసు వానుకుని తండ్రి పడుకున్నాడు. నిశ్శబ్దంగా నిలుచుని నిభూగా కొంతసేపు పాలు చూసేడు గోపాలం, ఖాయిలాతో పడుకున్న తండ్రివైపు. దీర్ఘంగా ఊపిరితీస్తున్న గాలి సవ్వడి తప్ప అంతా ప్రశాంతంగా ఉంది గది. ఇప్పుడే పట్టినట్టులుంది మాగన్ను; ఎందుకూ లేపడం అనుకుంటూ తలవైపు గోడకి తగిలించివున్న టెంపరేచరు చార్టు చూశాడు. ప్రక్కనే మేజామీద ఓ మందు సీసా, అవున్సుగ్లాసూ అటీయిదీ 'నేం వున్నాం; మరేం ఫరవాలేదన్నట్టు కంటికి కనిపించేయి. తల పంకించి మేడమీదకి పోయే వరకు. అంతలో టెలీ ఫోను మోగింది. డాక్టరు పిలిచేడు. ఉదయం తను వొచ్చి చూసిన సంగతీ, తండ్రి జబ్బు వివరాలూ ఏవో మాట్లాడేడు. ఓ గంటలో మళ్లీవచ్చి చూస్తానన్నాడు.

"ఇంజక్షనుకి మందు కొన్నారు కదూ?" అన్నాడు డాక్టరు.

"ఓ యెస్.... థేంక్స్" అంటూ ఫోనుదించేడు గోపాలం.

బట్టలు మార్చుకుని భోజనానికి లేద్దాం అనుకుంటూ, పోనీ ఓసారి జ్వరం చూద్దాం అనుకున్నాడు; కాని, దాని రుంప తెగా! ఎంత వెతికినా ధర్మామీటరు ఎక్కడ ఉందో కనిపించలేదు. గూళ్లూ, అలమార్లూ అన్నీ వెతకడం అయింది. ఇల్లంతా గాలించి యిల్లాలు ఇందిరా అలిసిపోయింది. దీక్షమాత్రం మానలేదు, ఉభయులూ.

"ఇప్పుడు మెట్లు దిగుతూ చేత్తో పట్టుకున్నాను సుమండీ! అంతలో యెక్కడ పెట్టేసేనో యేడవ చేత్తోను" అంది ఇందిర జరిగినదంతా ఒక్కొక్క విషయమే నెమరుకి తెచ్చుకుంటూను.

"అవసరానికి అవుపించే అలవాటు యింకో వాడు ఉంటే యేడిశింది గనకనా? కాస్సేపుపోయిన తరవాత యే దొడ్డి చెంబుకోసమో వెతుకుతూఉంటే ఎదరగా ప్రత్యక్షం అవుతుంది అదేను" గోపాలం విసుక్కున్నాడు.

కాళ్లు కడుక్కోడానికి స్నానాలగదికిపోతూ తువ్వాలుకోసం బట్టల బీరువా తెరిచేసరికి, టపక్కున కింద పడింది మిలమిల లాడుతూ ధర్మామీటరు గొట్టాం. ఆ పాశంగా వొంగితీసి, మూత తెరిచి చూసేడు. మొన విరిగిఉంది. అర నిముషం పాటు ఆ పనికిరాని గాజుముక్క అతని చేతిలో ఉందో లేదో, ముఖం వెలవెలబారింది; ఏవో విషాదచ్ఛాయలు గోచరించేయి, తనలో తనకే జాలివేసి, ఆ దీనత్వంలోనే మందహాసం స్ఫురించింది!

ఆ మూలంలేని మొండెం చేత్తో పట్టుకు చూస్తూనే అప్రయత్నంగా యీజీ ఛెయిరులో కూలబడ్డాడు గోపాలం. ఆనాడు విరిగిపోలేదది. ఏనాడో యిరవై యేళ్ల క్రితం పాడయి పోయింది. కాని దాన్ని చూచేసరికి అప్పుడు జరుగుతున్నట్టు నాటి పరిస్థితులన్నీ ఒక్కటొక్కటే కళ్లకి కట్టేయి.

౨

తన పదో యేట. పుట్టిన దినం యింకా పది రోజులు ఉండగా కొత్తబట్టలు కుట్టించింది తల్లి. కాని తను ఆబట్టలు తొడుక్కుని ఆమెకి నమస్కరించలేకపోయాడు; సరిగదా, చక్కగా తలంటి పోసుకుని ముచ్చటగా ఉడుపులు ధరించవలసిన ఆ పుట్టిన రోజునే, ఏటిలో స్నానంచేసి, తడిగా పంచాతో పరలోకమార్గాన పోతూన్న తల్లికి ప్రణమిల్లవలసి వచ్చింది. ఆ తరవాతి పరామర్శలకి వచ్చిన పెద్దవాళ్లు అనుకుంటూన్న మాటలు, దిగాలు పడి ఓమూలకూచున్న తన చెవినీ పడ్డాయి. ఆ పల్లెటూరిలో సమర్థతగల డాక్టరు లేడు. పొరుగునున్న పట్నానికి తీసుకువెళ్లి వైద్యంచేయిద్దాం అంటే తండ్రి దగ్గిర డబ్బు లేకపోయింది. అప్పూ సప్పూ చేసి సరంజాం అయ్యేవేళకి తల్లికి నూకెల్లా నిండిపోయేయి. సరి అయిన మందూ దక్కతాలేక తల్లి తనని విడిచి పోయింది.

తరవాతి కొద్దికాలానికే పట్నం చేరుకున్నాడు తను, పల్లెటూరి వీధిబడి వొదిలి, కలిగినవాళ్లు ఎవరో, పాపం, కనికరించి పీధికొళ్లో ఉంచమన్నారు. ధర్మదాత హెడ్మాస్టరు సత్రంలో పక్కవేయించేడు, స్కూలు జీతం తాను భరించి. ఈ యేర్పాట్లు నాలుగూ చూసుకుని మర్నాడు ఉదయాన్నే తండ్రి బస్సులో ప్రయాణం అయేడు; యింక బస్సుకదులు తుందనగా, "ఒకేయ్, బాబూ," అంటూ పిలిచి బొడ్డు కొంగునుంచి తీసి ఒక్కరూపాయి చేతులో పెట్టేడు తండ్రి. "ఇది పెట్టి—" వాక్యం ముగియకుండానే బస్సు సాగిపోయింది తండ్రి కళ్లల్లో నీళ్లు గిరుక్కుమని సుళ్లుతిరిగేయి. అరచేతిలో రూపాయి తళతళ లాడింది. అనుకోకుండా తన కంటినుంచీ రెండు నీటిబొట్లు చెక్కులమీదికి జారేయి. మరిరెండు రోజులు పోయేసరికి, జెంగే పెట్టుకున్నాడో, ఏమో? కొంచెం రవ్వతగిలింది. ఇంటివాళ్ల అబ్బాయి మ్యూనిసిపల్ ఆసుపత్రికి తీసుకు వెళ్లేడు. గోపాలానికి గుండెకొట్టుకుంది. డాక్టరు ఏమంటాడో? ఏఁవి యిమ్మంటాడో?

ఒస్సి! యేఁవిజనం!! డాక్టరుగారికి గాలి అయిన తగలకుండా ఉన్నారు. ఒకాయన పిల్లవాణ్ణి ఎత్తుకుని ఆయన దగ్గిరకి వెళ్లేడు. వాడి కాలికట్టు యింక విప్పలేదు, గోలపెట్టి ఏడిచేడు. మరికొంత మంది తలకి గుడ్డచుట్టుకున్న వాళ్లూ, కళ్ల కలకలవాళ్లూ చెవిపోట్లవాళ్లూ, రకరకాల జబ్బులతో వరండాలో బెంచీలమీద కూచున్నారు. ఒకాడు తల రెండుచేతు ల్తోనూ పట్టుకుని "అమ్మయ్యమ్మయ్య" అంటు న్నాడు బాధ భరించలేక మరొకడు పొట్ట చేత్తో పట్టుకుని, బుర్ర కడుపులోకి జొచ్చుకుపోయేలాగ చుట్టుకుపోతూ, "ఏం దారి నాయనా" అని ఏడుస్తున్నాడు. ఓ యిల్లాలు గోరుచుట్టు చెయ్యి ఎత్తగా రొత్తి రెండోచేత్తో నొక్కిపట్టుకుని, పెదిమలు కరుచుకుంటూనే బాధ అపనయించుకుంటోంది. ఇంకో ఆమె చలిగాలికి వొణికిపోయినట్టు దవడలు గజగజ లాడిస్తూ, గుడ్డ వొంటినిండా కప్పుకుని మూలుగుతోంది, మలేరియాతో. ఇంకొంతమంది జట్కాలు కూడా తీసుకువచ్చి సిద్ధంఅయేరు, డాక్టరు గారిని యిళ్లకి తీసుకువెళ్లడానికి. ఆయన దర్శనం కోసం పడిగాపులుపడి కూచున్నారు, మరో కొంత మంది, మందుసీసాలు పట్టుకుని. పాపం, తల్లిజబ్బులో తన తండ్రి కూడా యిలాగే పడిగాపులుపడేవాడు కాబోలు! కాకపోయినా బుద్ధిలేని భగవంతుడు, తనని అంత చిన్నవాడుగా ఎందుకుచేసేడు? కాస్త పెద్దవాడుగా యివయితే తండ్రికి చేదోడుగా ఉండునా? అసలీ వొచ్చినవాళ్లలో ఎంతమంది పేద వాళ్లో తనలాగ? మందులకోసం యెంతమంది డబ్బు అప్పు తెచ్చుకున్నారో! తన తల్లిలాగే వీళ్లూ చచ్చి పోతారా యేమిటి చెప్మా, మందులు కొనుక్కోడానికి డబ్బు లేకా? డబ్బు! డబ్బు!! అవును డబ్బు! తన జ్వరం నిమ్మళించడానికి మందు కావాలంటే కొనుక్కోడానికి డబ్బు కావాలికదూ మరి? అసలు డాక్టరికి చూపించేసరికే యేఁవంటాడో? యేఁవి మ్మంటాడో?

కాని డాక్టరు ఏఁదీ అన్లేదు; యేమీ యిమ్మనా లేదు. నాలిక చూసేడు; నాడి పరీక్షించేడు. జ్వరం కొలిచేడు. మూడురోజులకి మందిచ్చి, నాలుగో నాడు మళ్లీ రమ్మన్నాడు. అంతే. ఆ రమ్మనమన్న నాటికి జ్వరం పోనేపోయింది. అయినా వెళ్ళక పోతే డాక్టరు ఏం కోపపడతాడో అని వెళ్లేడు. తన భయాలన్నీ వొట్టివే. ఆయన నవ్వుతూ పలకరించేడు.

ఇంక వొంట్లో జబ్బుఏమీ లేదని, అన్నంతిని హాయిగా వుండమన్నాడు.

ఫలానా యింత సొమ్ము యివ్వాలి అని డాక్టరు అడగలేదు; ఎంత యివ్వాలో తనకి తెలియదు. అసలు తనదగ్గిర ఏమీ లేనూలేదు. ఆమాత్రం ఆస్కారమే ఉంటే తల్లే బ్రతికిఉండేదిగా. అదుగో ఆ తల్లి మాటా, తను కటికదరిద్రుడన్న సంగతీ తట్టేసరికి కళ్లు నీళ్లతో నిండిపోయేయి గోపాలానికి. అప్రయత్నంగా చెయ్యి జేబులోకిపోయింది. అనుకోకుండా అనేసేడు: "డబ్బులేక మా అమ్మ జబ్బుతో చచ్చిపోయింది. పేదవాణ్ణి. నన్ను యిక్కడ దిగబెట్టి వెళిపోతూ మానాన్న యిచ్చిన ఈ ఒక్కరూపాయీ ఉంది. తీసుకోండి" అంటూ, అప్పట్లో తనదీ అనుకున్న ఆస్తి ఆ ఒక్క రూపాయీ వొణుకుతూన్న చేతులలో బల్లమీద ఉంచేడు అతను. డాక్టరుకి గుండె నీరయిపోయింది. కన్న కొడుకులాగ పొదివిపట్టుకుని అన్నాడు: "మీ నాన్న యిచ్చిన రూపాయి నీదగ్గిరే ఉంచుకో. మరో రెండు నేను యిస్తున్నాను. యిండ. నీకే యిబ్బంది వచ్చినా నాతో చెప్పు;" అంటూ బుజ్జగించి పంపేడు.

తన చెవులు తనే నమ్మలేక పోయేడు గోపాలం. డాక్టరంటే దేముడా? అవును. భగవంతుడే ఆ వేషంతో వచ్చిఉండాలి. లేకపోతే యెవ్వరని యేంగానీ అయినా పుచ్చుకోకుండా వైద్యంచేస్తాడా? పైగా, డబ్బుకూడా యిచ్చేడు. ఎంత మంచి మనసూ? టక్కున రెండురోజుల్లో నిమ్మళించింది! అసలు అతనిగది నిండా మందులే. ఎన్ని రకాలమందులూ! ఎన్ని రంగులూ!! కొన్ని సీసాల్లో ఏవో గుండలు కూడా వున్నాయి. అసలు డాక్టరు అవడానికి ఎంత అదృష్టం ఉండాలో!

అంతవరకూ సాయంత్రం ఏమీ తోచుపోక, చీకటి పడి సత్రపువేళ అయేదాకా దిగాలుపడి, దిక్కుమొగం వేసుకుని, తన కొట్టు కిటికీలోనుంచి తదేక ధ్యానంతో పరధ్యానంగా శూన్యంలోకి చూస్తూ కూచునే గోపాలానికి, నాటినుంచీ ఒక వ్యావృత్తి యేర్పడింది. తనంత తనే ఒక కొత్త ఆట కనిపెట్టేడు. నాలుగు రంగుల పెంకిరాళ్లు రోడ్డుమీదవి యేరి తెచ్చుకున్నాడు. ఒకదానిమీద ఒకటి పెట్టి అరగదీసి, ఆ వచ్చిన రంగు రంగుల గుండలు ఒక్కొక్క సీసాలోనూ పోసేవాడు. వాటికిచిన్న చిన్న చీటీలు అంటించి పేర్లు రాసేవాడు: "తల నొప్పికి మందు; కడుపునొప్పికి మందు; దెబ్బతగిలితే మందు; తేలుకాటుకిమందు; వికారానికి మందు"! ఈ మందులు చూసుకుని తను డాక్టరు అయిపోయినట్టూ, రోగాలు కుదిర్చేస్తూన్నట్టూ పట్టపగలే కలలు కనేవాడు. ఆ మందులు చేసుకున్న తొలి నాడు రాత్రి నిజంగా తనతల్లే కలలో కనిపించి బాధ పడుతూఉండేసరికి, "ఇదుగో ఈ యెర్రమందు వేసుకో, అమ్మా, పోతుందీ...ఒక్క గుక్కెడు తాగమా...ఆఁ అను...ఆః....ఇంక పోతుందిలే ఒక్క దెబ్బదిని...మా డాక్టరుగారు నాకు యీ మందే యిచ్చేరు." అని ఊపలవరించేడు కూడాను!

రోజూ సాయంకాలం దేవుడి గుడికి వెళ్లినట్టుగా అతి శ్రద్ధతో ఏదో చెప్పలేని ఉత్సాహంతో ఆస్పత్రికి వెళ్లి, తలుపులు వేసేసి ఉన్నా, డాక్టరుగారి గదిచుట్టూ ఓసారి తిరిగేవాడు; కంపౌండింగు రూము వెనకాల కాస్సేపు తార్లాడేవాడు. అంద మ్మట అలా తిరుగుతూన్నప్పుడు ఒక్కొక్కసారి రోగులకి నాడి పరీక్ష చేస్తూన్నట్టూ, వాళ్లని ఏవో ప్రశ్నలు అడుగుతూన్నట్టు, వాళ్లూ యెంతో దీనంగా యేదో తనతో మొర పెట్టుకుంటూన్నట్టూ అనిపించేది. అసలు డాక్టరు అనే వాడు ఒకడు ఉండబట్టి గాని, లేకపోతే ప్రపంచంలో ఎంత బాధ ప్రబలిపోయేదో? తనే డాక్టరయితేనా? అడగని వాడిదే పాపం అన్నట్టు యిట్టే చేత్తో తీసి పారెయ్యడూ యెంత లేసి జబ్బులయినానూ!

తలుపులు తాళాలు వేసేసుకుని ఆసుపత్రివాళ్లు యిళ్ళకిపోయినా, ఆ డాక్టరుగారి గది ముందు తను అలానిలుచుండి పోయేవాడు. గంటలకొద్దీని. అంతలో ఏదో పని ఉండి ఓనాడు కంపౌండరు రావట్టూ, యిహమందులుకూడా తనే కలుపుకోవలసినట్టూ అనిపించి, ద్విగుణీకృత ఉత్సాహంతో చరచరా డాక్టరు గది దగ్గర్నుంచి కంపౌడింగు గది వద్దకి పోయేవాడు. వెళ్ళి చేసిన పనల్లా, మూసేసి వున్న అద్దాలతలుపులమీద తలపెట్టి, కిటికీ ఊచల మధ్యగా ఆ మందులసీసాలు ఉన్న టేబిలు చూడ్డమే; అలా చూస్తూ వొళ్లు మరిచి పోయేవాడు గోపాలం.

చూస్తూ ఉండగానే స్కూల్లో మరి రెండేళ్లు గడిచేయి. పెద్దక్లాసుల్లోకి వెళ్లేడు. అమాయకపు

గోపాలానికి శాస్త్రజ్ఞానం కూడా అబ్బుతోంది. స్కూల్లో యెన్నో విషయాలు చెబుతున్నారు— భౌతికశాస్త్రం అనీ, రసాయనశాస్త్రం అనీ, దేహశాస్త్రం అనీ అదనీ యిదనీని. లేబరేటరీలో ప్రయోగాలు అతణ్ణి ఎంతో ప్రోత్సాహపరుస్తూ ఉండేవి. వారానికి ఒక్కటే క్లాసయినా, ఆ ప్రాక్టికలు క్లాసు కోసం తపస్సు చేసేవాడు గోపాలం. లేబరేటరీ ఎంత ముచ్చటగా ఉంటుందీ? బున్సెనుబర్నర్లు, సున్నితమైన త్రాసులూ, జాడీలూ, బీకర్లూ, రిటార్టులూ, కిప్స్ ఏపరేటస్!—ఓహో. అది సామాను గాదు! డాక్టర్లు బహుశా యీ లేబరేటరీలు చూసే కాబోలు, ఆ కంపౌండింగు రూములు కూడా అలా అమర్చుకుంటారు ముచ్చటగాను!!

ఏ ఆస్కారం లేకుండా ఊహాసౌధాలు కట్టుకుని విహరించే గోపాలానికి, తనకి యిల్లు యిచ్చిన వాళ్ల అబ్బాయికి ఓసారి సుస్తీచెయ్యడంతోనే మరీ దోహదం అబ్బింది. ఆ మూడువారాల్లోనూ వార్డుబోయి, నర్సూ, కంపౌండరూ, డాక్టరూ అనుకునే నాలుగు మెట్లూ దాటేసేడు అంటే నమ్మండి! ప్రతీ నాలుగుగంటలకీ మందుయివ్వడంలో నయితేనేం, టైముప్రకారం "డయటు" యివ్వడంలో నయితేనేం నిమిషం అటూయిటూ అయ్యేదికాదు. రెండుపూటలా జ్వరంపోయింట్లతో సహా గ్రాఫుగీసి పెట్టేవాడు. ఉడుకులాం గుడ్డలు మార్చడానికీ, ఆడిన చెయ్యి ఆగకుండా విసురుతూ కూచోడానికీ తదితర ఉపచారాలకీ తల్లిదండ్రులని మించి చరించేడు. ఇతని ఆసక్తి ఉత్సాహం చూసి డాక్టరే ముక్కున వేలేసుకుంటే! అతనికి అవ్యాజానురాగం జనించింది. ఉదయ సాయాహ్నాలు పేషెంటుని చూడ్డానికి వచ్చినప్పుడు అర్జంటు బేగ్ పుచ్చుకుని కారుదాకా వచ్చిన గోపాలంతో యెన్నోవివరాలు చెప్పేవాడు—జ్వరం ఎందుకు వొచ్చిందో, నిద్దరపట్టకపోవడానికి కారణం యేమిటో, లివరు కండిషను యెలాగ ఉందో, యింకేదో, మరేవోను! పేషెంటుకి గ్లూకోజునీళ్లూ, పళ్ళరసమూ అదీ పట్టేటప్పుడు గోపాలం హృదయ కుహరంలోంచి పెల్లుబ్బి వచ్చేది ప్రేమవాహిని. అదృష్టహీనుడు కాకపోతే అందులో అవగింజంత చాకిరీచేసుకుని పుంజుకూడదూ కన్న తల్లికీ?

3

ఆరిపోయే ముందు దీపం మరీయిదిగా మండుతుందిట ఒక్కమాటు! గోపాలం స్కూలుకి ఫస్టుగా ప్యాసయ్యేడు స్కూలు ఫైనలు. తండ్రివద్ద పల్లెటూరిలో ఉండగా వచ్చింది శుభవార్త. ఆ కబురు విన్నవాడు తండ్రి పరమానందభరితుడైపోయాడు; గోపాలం అయితే వొళ్లే మరిచిపోయేడు. ఇహనేముందీ? నెమ్మదిగా ప్రిన్సిపాలు కాళ్లూ కడుపులూ పట్టుకుని, తన మార్కులు చూపించి ప్రాధేయపడితే ఇంటరు మీడియేటులో స్కాలరుషిప్పు రాకపోదు. సత్రపు భోజనం,—వాళ్లయింట బస, యెలాగా వున్నవే కదా. రెండేళ్లపాటు కష్టపడి చదివితే తరవాత తనూ డాక్టరీకి పోవచ్చు. అంత వరకూ అండగా నిలిచిన భగవంతుడు అప్పుడు మాత్రం తోడుపడడూ? తను చదువుకుంటానంటే తండ్రిమాత్రం వద్దంటాడా? ఎందుకంటాడూ, తను ఎక్కడయినా తప్పిపోయేడు గనకనా? కాగా, స్కూలుకి ఫస్టుగా వచ్చేడాయిరి! ఆవాళంత హాయిగా, సుఖంగా అతను యింకెన్నడూ నిద్రపోలేదు! మరో నెల్లాళ్లదాకా చదువు ప్రసక్తి రాకపోవడం వల్ల తను అనుకున్నట్టే తండ్రీ అభిప్రాయపడ్డాడని అనుకున్నాడు, గోపాలం.

కాని తండ్రి మనఃస్థితి వేరయింది. కొడుకు పరీక్ష పేసయ్యేడని ఆ ఉత్కటానందం సంబాళించుకోడానికే కొన్నాళ్లు తీసుకుంది ఆ వృద్ధ హృదయం. అంతలో మళ్లీ బడి తెరిచే రోజులు దగ్గరకి రాగా, అతని గుండెల్లో రాయిపడింది. మళ్లీ యెప్పటి ఆశే. ఎక్కే గుమ్మమూ దిగే గుమ్మమూను! కాగాపోగా, యెన్ని అగచాట్లు పడాలో! ఆరేళ్లక్రితం తను పడ్డపాట్లు యింకా మరిచిపోలేదతను. ఇంకా గుమ్మం యెక్కకుండానే—పోకాలు దిగని తన పంచా, రెండు మాసికలు వేసినా యింకా చిరుగు మిగిలిపోయిన లాల్చీ కంటపడేసరికి—"ఛీః. జన్మం దయాక్స...ఇక్కడేవీ సదుపాయం జరగదు...మరీ దాడిపెట్టినట్టు వస్తారు" అని విసుక్కున్నాడు ఓ పంతులుగారు. "జొత్తిగా ముక్కూ మొహం యెరగని మనిషిని యింట్లో యేమని పెట్టుకోమన్నారు, బాబూ. ఇలాగే ఎవరికో కాస్త చోటు యిచ్చేసరికి మావాళ్లయింట్లో రాత్రికి రాత్రీ రెండు వెండికంచాలు

మాయం అయిపోయేయి" అన్నారు యింకో ధీమంతిలో పెద్దమనుషులు.

"నిజమే. మీ స్థితి తలుచుకుంటే జాలేస్తోంది. కాని ఏం చెయ్యమనా? ఈ కరువురోజుల్లో మాదీనూకే చాలకుండా వుంది...ఎంత చెట్టుకి అంత గాలీ" అంటూ లోని భండారం బయటపెట్టేరు ఓ జరీధోవతి ఘరానా ఆసామీ.

"సరే. పిల్లవాడిని వెంటపెట్టుకువస్తే, ఏదో ప్రయివేటు ట్యూషను కాలోలు వనుకున్నాను. ఆవాలుగు రాళ్లా లేక పోవడం సరేకదా, పైపెచ్చు అద్దెకూడా పోగొట్టుకుని యిల్లు ఉచితంగాయివ్వనా? కుదరదు బాబూ,...యిం కెక్కడయినా వ్యాపగించండి" అని సలహా యిచ్చేరు యింకో లక్ష్మీ ఉపాసకులు, స్కూలు మేష్టరు.

చివరికి వాళ్లు ఆ వీధిగది యిచ్చేరనుకోండి. కాని మాటురోజులు నూటేపోటి మాటలతో ఒళ్లు చితికిపోయి, తిరగలేక కాళ్లు అరిగి పోయేయికావూ? అవన్నీ అతను మరిచిపోలేదు. ఎలామరిచి పోతాడు? పేదవాళ్ళకి యీ ప్రపంచంలో చోటు అంటూవుంటే గదూ?

అలాగని తారా జువ్వలాగ ముందుకి నెట్టుకు వెళ్లే కుర్రవాడి భావిని అరికట్టడమూ తనకి సాధ్యం కాలేదు. వాడి చదువు అంతటితో మాని పించి ఏమిటి చెయ్యడం? తనలాగే బోర్డు స్కూలు మేష్టరీ అంటే, రోజులు మారిపోయేయి; ఆ ఉద్యోగానికి యిప్పుడు బి. ఇ. డీలు వస్తున్నారు. ఇంక గుమాస్తా గిరీకా? దానికీ బి. ఏ లేపోతే. పోనీ, వ్యవసాయం చేసుకుంటూఉంటే, ఉన్న గోప్పాద మంత భూమీ పెళ్లాం జబ్బులో కరారావుడి చుట్టుకు పోయింది! ఇంక ఏ ఆలోచన పాలుపోక ఓనాడు ఉదయాన్నే బయలుదేరి, ఆ వీధిగొట్టు యిచ్చినవాళ్ల దగ్గరకే వెళ్లేరు, కుర్రవాణ్ణి వెంటపెట్టుకుని.

గోపాలం గుమ్మంలో అడుగుపెట్టేసరికి, ఎవరో దగ్గిర చుట్టాలు వచ్చినట్టు కళకళ లాడింది ఆ యిల్లు. ఇంటివాళ్ల కుర్రాడు, చాలా కాలానికి పొన్నూరినుంచి వచ్చిన తమ్ముడికి మల్లే కౌగలించుకున్నాడు గోపాలాన్ని. వంటింట్లో చెయ్యి తీరిక లేకుండా ఉన్నవాళ్ల అమ్మ, ఇతను వచ్చిన సందడి విని, ఆపాళంగా యెక్కడపని అక్కడ వదిలేసి, నవ్వుతూవొచ్చి నోటినిండా పలకరించింది "ఇదుగో గోపాలం వచ్చేడా యేమిటి? రెండు నెలలనుంచీ నువ్వు లేకపోవడం, యిల్లు యెంత చిన్నబోయిందను కున్నావ్" అంటూను. ఇంటాయన కూడా హృదయ పూర్వకంగా స్వాగతం యిచ్చేరు. ఆ ఆదరాభిమానాలతో గోపాలం తండ్రికి కడుపునిండిపోయింది. భోజనాలయి కాస్సేపు విశ్రమించేక, ముసలివాళ్లిద్దరూ కుర్రవాడి ముందుగతి ఆలోచించడం మొదలెట్టారు.

"అసలు గోపాలం ఉద్దేశం ఏమిటో?" అంటూ గణపతిస్తవం చేసేరు యింటాయన. అంతికన్నా అదను దొరకదు అనుకున్నాడు గోపాలం. రెండు నిమిషాల్లో టక్కున తన ప్లాను చెప్పేడు. అది వినేసరికి యింటాయనకి జాలి వేసింది; గోపాలం తండ్రికి మతి పోయింది. ఏమి అనడానికి తోచక దిగాలుపడి వుండి పోయేరు ఓ రెండునిమిషాలు.

"అవునోయ్, నువ్వు అన్నమాట బాగానే వుందనుకో," ఇంటాయనే ప్రారంభించేరు, "మా కొట్లో నువ్వు ఉండడానికి యెంతమాత్రం అభ్యంతరం లేదు; యెవరినో దేవుళ్లాడి సత్రవులో పద్దూ వేయించుకోవచ్చుననుకో."

"ఇంక పుస్తకాల మాటేమి టంట?" గోపాలం పట్టలేని వుత్సాహంతో అందుకున్నాడు, "లైబ్రరీలో తెచ్చి చదువుకుంటానండీ."

"అబ్బా. అవన్నీ బాగానే వున్నాయోయ్," యింటాయన ప్రస్తావన సాగిస్తానే ఉన్నారు, "ఇంటరు నిరభ్యంతరంగా చదువుకోవచ్చును; నిశ్చయంగా ప్యాసూ అవుతావు. కాని...నువ్వు అన్న మెడికలు చదవాలంటే విశాఖపట్నం వెళ్లాలా? అద్దె లేకుండా అయిదేళ్లు పొరుగూరిలో ఉచితంగా భోజనం అదీ అంటే—! పోనీ చదువుతావే అనుకో యెలాగో ఒకలాగ. వెంటనే గవర్నమెంటులో ఉద్యోగం వస్తుందన్న గ్యారంటీ ఏమిటి? ఇంక, ప్రయివేటుగా దుకాణం పెట్టాలంటే వాలు గైదు వంచులయినా మదుపుఉండాలా? ఈ గడ్డురోజుల్లో అంత సొమ్ము—" మాట సగంలో నీళ్లు జంతికల్లాగ నమిలేశాడు యింటాయన. రెండేళ్ల తరవాత జరగ

పోయే పరిస్థితుల్లో ఏ ఉపాయంచేత ఒడ్డున పడ గలడో ఊహించలేక ఊరుకున్నాడు గోపాలం.

"ఇంకేదయినా సబ్జక్టు తీసుకుని చదువుతావను. ఏ ఆటంకం లేకుండా బి. ఏ. వరకూ నీ చదువు కొనసాగేటట్టు చూసే పూచీనాది." పాపం, యింటాయనే భరవసా యిచ్చేడు. "ఆ తరవాత అయినా ఉపాధిసమస్య ఉండనే ఉంది కదండీ?" అన్నాడు అంతవరకూ ఏం మాటాడలేకుండా కూచున్న గోపాలం తండ్రి.

"లేకపోతే ఇంటరుతో మానేస్తావా?" యింటాయన మళ్లీ కదలకించేడు గోపాలాన్ని.

"ధస్. అది పోత్తిగా త్రిశంకు స్వర్గం" నిమషంలో తెమిల్చేసేడు గోపాలం. ఎంతసేపు తర్జన భర్జన చేసినా వ్యవహారం తెమల్లేదు. భోజనాలదగ్గర కూడా యివేమాటలు.

"ఆడదాన్ని, అని నామాట కొట్టి పారెయ్యకండి గానీ, మనగోపాలాన్ని మాతమ్ముడి దగ్గిరకి పంపిస్తేనో" అంది ఆ యిల్లాలు పులుసులో ముక్కలు వొడ్డిస్తూ. ఈ మాట చెవినిపడేసరికి, నములుతూన్న ములంకాణ చేత్తో పుచ్చుకుని చెవులు రిక్కించి మరీ వింటున్నాడు గోపాలంతండ్రి; గోపాలం రెండు కళ్లూ ఆమెకే వప్పచెప్పేడు.

ఏమిటో అది? అన్నట్టుగా తలయెత్తిచూసేడు యింటాయన.

"ఏమీ లేదు...మాతమ్ముడి షాపులో—

అంతే అరుణకిరణాలకి మంచు తెరలు విడిపోయినట్టు చిక్కువిడిపోయి సమస్య పరిష్కారం అయిపోయింది. గోపాలం, వాళ్లతండ్రీ బలవంతాన నాలుగు రోజులు ఉండిపోయారు ఆ వూళ్లోనే - ఆలోగా గోపాలానికి షాపులో ఉద్యోగం ఖాయ పడిపోయింది. ఇంటాయన తండ్రీకొడుకులకి విందు చేసేడు, సాయంత్రం ప్రయాణం. ఇంక సుమ్మం దిగుతాడనగా, యింటి వాళ్ల అబ్బాయి గోపాలాన్ని అవతలకి పిలిచి, మిలమిల్లాడుతూన్న ధర్మామీటరు గొట్టం చేతిలో పెట్టేడు, "ఇదుగో, గోపాలం, ఆ వేళ నాజబ్బులో ధర్మామీటరు కొరికేసిన జ్ఞాపకం ఉందీ! ఇన్నాళ్లూ యిద్దరం దీన్ని చూసి నవ్వుకునే వాళ్లం. ఇది నీ బట్టల మడతల్లో వుంచుకో. ఏ జాబ్బీనో తీసుకున్నప్పుడు టక్కున కిందపడేసరికి నేను జ్ఞాపకం వస్తూఉంటాను" అన్నాడు నవ్వుతూను.

౪

ఆనాడు సుమాస్తాగా ప్రవేశించిన గోపాలం, అకౌంటెంటయి, అసిస్టెంటు మేనేజరయి, క్రమేణా ఆ షాపులో నాటాదారు అయేడు. పెళ్లి చేసుకున్నాడు. అర్ధన కేఃపిలోటు లేదు. చిన్న కారూ చక్కటి బంగళా, కొండంత పలుకుబడీని.

నిజమే. డాక్టరు చదివితే మాత్రం అర్ధన అంత కన్నా బాగుండేదా?

అసలు ఆమాత్రం అయినా ఉండేనా?

అదుగో, అక్కడే తన నిత్యవృత్తికీ, మనోరథానికీ రాజీ కుదరలేదు. "డబ్బులేక పోబట్టేగదా మనసుకి వచ్చిన చదువు చదువుకోలేక పోయేవు? డబ్బు ప్రధానం" అంది వృత్తి చైతన్యం.

"ఏమిటో. డబ్బుడబ్బని యేడుస్తావు. పాడవ డబ్బు. ముప్పిరుండా ఆర్జనా నువ్వూనూ! పోగంది గడెంచడం లేదూ?" అంది భంగపడిన మనోరథం, ఏ మూలనుంచో.

"అదేంవన్న మాటలే. పోగందానికీ నీకూ వ్యత్యాసం లేదూ?, నీ వృత్తిలో ఎంత స్వతంత్రం, ఎంత దర్జా!!" వృత్తి చైతన్యం ఆర్భాటించింది.

"చాలూరుకో. నీ దర్జానువ్వూను. ఎవరయినా వింటే నవ్విపోగలరు! పొట్టకోసం ఉద్యోగస్తులని ఆశ్రయించటప్పుడు యీ దర్జా యేమయిపోతుందో?" దెబ్బతిన్న పాతకోరిక మూలనుంచే యెత్తిపొడిచింది.

"ఎందుకొచ్చిన ఏడిపిపాటులే. వైద్యుడయితే ఏం మహా ఊడపొడిచేసేదా? నీలాంటివాళ్లు యిచ్చే వార్షికాల వల్ల కేగా, వాళ్లూ పెద్దవాళ్లు అవుతా?" వృత్తి చైతన్యం తన అహంకారాన్ని విడవలేదు.

"డాక్టరుకి యెంత పలుకుబడో తెలుసా?" యీ తేరని మనోరథం యేడిపించుకు తింది.

"ఆ మాటకి వస్తే డబ్బున్నవాడికి ఉండే పలుకుబడి యెవ్వరికీ ఉండదు. డాక్టర్లు పలకడం యిచ్చే డబ్బునుబట్టే ఉంటుంది. కోరిన ఫీజు సమర్పిస్తే యే డాక్టరు రెక్కలు కట్టుకు వాలడూ? అలా యివ్వడానికి తగిన సమర్థత సంపాదించేవు. సంతోషపడు,"

వృత్తిధర్మం, ప్రైవేటు డిపార్టుమెంటులాగ, అధికారం చెలాయించబోయింది.

"ఓహోహో! ద్రాక్షపళ్లు పులుపు అందిట జనకటికి ఓ నక్క! అడిగినంత డబ్బూ యిచ్చి ఆరుగురు వైద్యులనయినా మార్చేవు. నీ తండ్రికి నయం అయిందీ? వాళ్ల చేతుల్లో కీలుబొమ్మవయి ఏ ఆట ఆడిస్తే ఆ ఆట ఆడుతున్నావు—రసమో, కషాయమో, మంత్రమో, యింజక్షనో, ఆపరేషనో మరేదో—వాళ్లు నంది అంటే నందీ పంది అంటే పందీనీ," మనోరథం గుండెల్లో చెయ్యి పెట్టి కెలికేసింది!

"ఇంక కట్టిపెట్టు ఆ ధోరణి. అందరికీ అన్ని విషయాల్లోనూ ప్రావీణ్యం ఉండదు. అలాగే అయే మాటుంటే యిన్ని వృత్తు లంటూ ఎందుకూ?" వృత్తిచైతన్యం హుంకరించింది.

అప్పటికీ మనోరథం ఓడిపోయేనని ఒప్పుకోలేదు,

"నిజమే. అందరికీ అన్ని విద్యలూ పట్టుపడతాయని యెవ్వరూ అనరు. కాని ఒకానొక విషయంలో చక్కని ఉత్సాహం కలిగి, గట్టి నిష్ఠా యేర్పడుతున్నాది అనుకున్నప్పుడు, ఆ అవకాశం వదులుకోవలసివచ్చింది కదా అని మాత్రం విచారం! నువ్వు అనుకున్నట్టూ పథకం సాగివుంటే, తల్లి పోయినందుకు, నీ తండ్రికి యీ చివరి రోజుల్లో ఎంత శాంతీ సంతృప్తీ ఉండేవో కదా అనిపిస్తుంది. తెలుగు వైద్యులు, యింగ్లీషు డాక్టర్లూ, హోమోపతీవాళ్లూ—ఔరా! ఎంతమందిని మార్చేవూ! నీ చేతిలోనే ఆ విద్య ఉంటే, తండ్రి గుండెల్లో ఆవేదన యేదో సూటిగా తెలుసుకుని చికిత్స చేసేవాడివి కదూ?" "స్పైనల్ టి. బీ." అని తెలుసుకోడానికి మూడు నెలలు పట్టిందా? ఈ లెఖ్ఖని మూడేళ్లయినా పడుతుందా కుదరడానికి? ఈలోగా—డబ్బు కేమి—అడ్డమయిన సలహాలతోనూ ఆయనకి ఎంత యిబ్బందీ?

"నువ్వు అర్థపరుడవయ్యావు, నిజమే. రెండు చేతులతోనూ గడిస్తున్నావు, ఒప్పుకున్నాం. కావాలంటే కొండమీది కోతినయినా కొనితేగలవు, సందేహం లేదు. కాని, ఏమయినట్టూ? ఆయన అశాంతి ఏమయినా తగ్గిందా? సౌఖ్యం చేకూరిందా? పోనీ, నీమట్టుకు నీకు తృప్తి అనిపిస్తోందీ?

"ఉదయం సుమ్మం దిగింది మొదలు తిరిగీ గూటికి చేరుకునే వరకూ, తండ్రి ఎలాగ వున్నాడో అని గుప్పిట్లోనే గా ప్రాణాలూ! నీ అంతటి నువ్వే నాన్నగారిని పరీక్షచేసి, స్వయంగా మందిచ్చేవనుకో. రోగం తప్పించలేమని తెలిసినా, చెయ్యవలసిన పని చేశాం అని నీ గుండెకి ఎంత నిబ్బరం? ఏం, మాట్లాడవేం?" గోపాలం గుండెల్లో ఒకటే గగ్గోలు!

అంతలో కిందినుంచి పిలుపు: "రెండో షెల్ఫులో ఉందండీ, ధర్మామీటరూ. దీని మొహం యీడ్వా, యింతసేపూ బుర్ర చించుకున్నా జ్ఞాపకం వొచ్చింది కాదు"

"వచ్చే. వచ్చే" అంటూ ఉన్నవాడు ఉన్నపాళంగా క్రిందికి వెళ్ళేడు గోపాలం, గభుక్కున కలలోంచి మెలకువ వచ్చినట్టు.

"అదేమిటి? విరిగిపోయిందా ధర్మామీటరు?" గృహిణి ఆత్రతగా అడిగేదాకా, గోపాలానికి ఆ మొనలేని ముక్క చేతులో పట్టుకున్నా నన్న స్పృహే లేదు.

"అబ్బే. యిది కాదు. పట్టుకు వస్తా. ఎక్కడుందన్నావ్?" అంటూ గిరుక్కున తిరిగి, కంగారు కప్పిపుచ్చుకుంటూ మెట్లమీద అదృశ్యం అయిపోయే వరకు, చెట్టుమీద తొండలాగ.

ఇందిర తెల్లబోయి చూస్తూ కొయ్యలాగ నుంచుండిపోయింది!

సౌభద్రుని ప్రణయయాత్ర

శ్రీ పొట్లపల్లి సీతారామారావు

"ఓ యాత్రికులార! రండు విచ్చేయుడిచట
నా ప్రణయ దేవతా చరణముల జాడ
లరసికొనుచు వనమెల్ల తిరిగితిరిగి
సేకరించిన యీ జీవలోక మధుపూ
రించుకొని కొంచెము విశ్రమించిపొండు."

కావ్యములు రసాత్మకములు. రసస్ఫోరకములైన శబ్దములు, భావస్ఫుటత్వము, రచనా శిల్పము రసమునకు ప్రాణములు. రససిద్ధినొందిన కవు లాధునికులలో తక్కువ. పద్యమును చమత్కారముగా వ్రాయవచ్చును. గాని కవి రససిద్ధినందలేడు. కవికి రెండు శక్తులు ముఖ్యముగా పాటింపదగినవి. ౧.కవితాశక్తి ౨.రచనా శక్తి. ఆధునికులలో కవితాశక్తికలవా రున్నారేగాని రచనాశక్తికలవారు తక్కువ. రచనాశక్తియనుట తోడనే యది యనంతము. దానిస్వరూప మెట్లొక విధముగా నుండిరొకవిధముగా నుండదని చెప్పుటకు వీలు పడదు. కవిప్రతిభాగతమైన సర్వమీభాపటుత్వ మందు వివిచ్యమానమగును. అందుకే ఋషివంటివారు కవులనుట. "నానృషిః కురుతే కావ్యమ్" ఎక్కడో కొన్ని పద్యములు రమ్యముగా నుండవచ్చును. అవి ఎవరికైనను రమ్యముగా నుండును. అట్లుగాక రచనా శక్తియే రమ్యముగా నుండవలెను. అది కవిత్వమును గూర్చిన నిష్పాక్షికమైన పరామర్శ.

ఆధునిక కవులలో నాత్మవినిర్గతములైన ప్రేయసీపరమైన కావ్యము లనేకములు వెలసినవి. అవన్నియు ఆంగ్లభాషాసంప్రదాయముల నంటిపెట్టుకొనియే వెలసినవి. వానిలో నెక్కువభాగము—సుప్రసిద్ధసంకేతములుగాని శబ్దములు వాడుట—ప్రతీక లేమి బోధపడకపోవుట—అచ్ఛమైన భావములే కుండుట—అన్వయములు కుదురకుండుట యను దోషములకు పాలగునవై యున్నవి. ఈపద్యమున కిది యర్థమని నిష్కర్షగా తెలియదు. సంప్రదాయసిద్ధమైనపలుకుబడు లుండవు. ఆ పద్యము లర్థమగుటకు ఆంగ్లభాషలో మంచి ప్రవీణతయుండవలెను. ఆదోషములేమియు లేక రసవైభవమునందు పరాకాష్ఠస్థితిని బొందినరచనా శక్తిగల కవి శ్రీ నాయని సుబ్బారావుగారు. వీరి సౌభద్రుని ప్రణయయాత్ర విరహమున కవధిభూతముగ నున్నది.

రసములన్నిటిలో శృంగారరసముతో నిభాయించుకొనుట కష్టము. అందే స్వల్పమైన వెలితిగలిగినను చప్పన స్ఫురించును. కాళిదాసే దానితో సతమతమైనాడు. సంప్రదాయసిద్ధమైన శృంగారమును తొణికిపోకుండ నిల్పి కావ్యమున జాలు గట్టించిన యీకవి ప్రతిభావంతుడు. వ్యుత్పత్తిలేని లోపమును ప్రతిభ గప్పివేయును. కాని కవిలో ప్రతిభలేనిచో దానిని గప్పుట సాధ్యపడనివిషయము. ఈకవిలో వ్యుత్పత్తిలేని లోపమే కొంచెమైయున్నను దానిని ప్రతిభ కప్పివేసినది.

ఈ కావ్యమునందొక చమత్కారమున్నది. కావ్యనామమును బట్టి పురాణకథగానే కనుపించును. కాని యిందలి కథ నేటి లౌకిక జగత్తులోనిదే. అందుచే పురాణకథకు గావలసినంత యుదాత్తత యిందు లేదనుదోషము దీనికి పట్టదు. ఇందలి నాయికానాయకులు శశిరేఖాభిమన్యులు. శశిరేఖకు లోక వ్యవహారమున వత్సలయను నామధేయమున్నది. వీధి నాటకములలో గూడ వత్సలయని శశిరేఖను సంబోధించుట గలదు. దానిని తీసుకొని గ్రంథనామము నీకవి యిట్లు చమత్కరించి చెప్పినాడు. శశిరేఖాభిమన్యులకథకు నిందలి కథకు పోలిక యున్నది. కావుననే కావ్యనామ మట్లుంచినాడు.

కావ్యమంతయు పరమసుకుమారముగా నుండి యిందలి యుత్తమ నాయికానాయక ప్రవృత్తులకు

వ్యంగ్యభూతముగ నున్నది. ఏభావమునైనను సుకుమారముగా హృదయములోనికి చెప్పుటయే యీకవిలోని యొక విశిష్టత.

"పగను వాలిన కెంప్పుల తగులు బాపి
చిన్నిచూపులు నాయందు జేర్పరాదె"
"చిత్తపేటిక దాచి శేకొత్తకుంక
రాగరసమునఁ దడపెద ప్రతిదినమ్ము"

సుకుమారకవియను పల్కునకు వాచ్యమైన కవి యీయన యొక్కడే. సుకుమార కవిత్వమునకు తోడు నుపమా రూపకము లీకవికి యబ్బినవి. అవన్నియు సంప్రదాయము నిండిన సంస్కారముచే తొణికిసలాడు చుండును.

"మంచు విరియించు మన కటాక్షాంచలముల
ఇవముకొని శైత్యమెక్కి కుంచించుకొనిరొ
ఆదిరసమూర్తి శివుని దేహార్ధమట్లు
తెలితళుకులొత్తు నీశరద్దిన రాత్రి"

శివుని దేహార్ధము శరద్దినరాత్రివలె నున్నదట— ఆశివుడో ఆదిరసమూర్తి—శివుని నటరాజనుట కలదు. కాని యీ కవిదృష్టికి శివు డాదిరసమూర్తియైనాడు. ఇట్టి కనుపించని భావములెన్నో యీ కవిలో నిమిడిపోయియున్నవి.

ఈ కవి యెంత చిన్న విషయమునైనను మనోరముగా చెప్పగలడు. ఈ క్రిందిచిత్ర మీ యనకు సాక్ష్యము.

"నీ ప్రసన్న సౌగ్ధ్యములు జీర్ణించుకొన్న
చేతనప్పుడొంతెర పిసాళించె బోలు
కాకయిది యేమిటే యీ వికచ వసంత
నవ్యమృదుమల్లికా ప్రసూనముల పొలుపు."

మృదుమల్లికలు పుష్పించినవి. అవి ప్రియురాలి నవ్వులేనట. ఆలంకారికుల లక్షణములకు లక్ష్యప్రాయములైన పద్యము లిందు పెక్కుగలవు. సంస్కృతకవి అమరుకుని యీ కవి మించిపోవుచున్నాడు. ఈ కవి వశ్య వాక్కువలె కనుపించును.

"ప్రకృతికాంతాధరమ్మను వడియ గట్టి
పోత బోసినట్లొప్పునొప్పుల గులాబి"

ఇందలి యుత్ప్రేక్షలో కోత్తరముగనున్నది. ఇట్టి వీ కవిలో నెన్నేనియు నెత్తిచూపవచ్చును. ఏవస్తువునైన మధురముగా నవగల్గిన ప్రతిభ యీ కవి కున్నది.

"ప్రణయబంధము నలుకువిచ్ఛ్యపడుట" "వెలివలపు బావిలో తెన్ని నిలువులొక్క" ఇవన్నియు సిద్ధహస్తుని చేతిలో మెదిగినట్లున్నవి. ప్రతిపదమేదో పల్లుబడిచే భాసించియే తీరును. ప్రతిపల్కుబడిని మరల సంప్రదాయపు ఛాయనుండి వేసగనీయదు—ఈ కవి యశస్సుకు నమస్కారము లర్పించవలెననిపించును. భవభూతి సమాసములకూర్పువలె నీతని కవిత్వములోని ప్రతిపదము హృదయమును స్పృశించుచుపోవును.

ఈ కవి కవిత్వమంతయు రసధ్వనిమయమైనది. అందుచే నాకవిత్వములో తుపాకులను జూపనీయ వంతగా హృదయమును స్పృశించును. ఏపద్యమున కాపద్యము కూర్పులో నొక విచ్ఛిత్తి నాపాదించుకొనియే యుండును. విప్రలంభశృంగారముతో నారంభింపబడి సంభోగశృంగారముతో నీ కావ్యమంతమైనది. ఖండకావ్యములన్నియు కథాగతి నంటిపెట్టికొనియే నడచినవేగాని ఛిన్నభిన్నములుగా లేవు. విప్రలంభ శృంగార మీ కావ్యమున మిన్నుముట్టినది. ఈ కావ్యము చదువుచున్నంతసేపు భవభూతి "అపి గ్రావా రోదిత్యపి దళతి వజ్రస్య హృదయమ్" జ్ఞప్తికి వచ్చుచుండును.

రసముద్దీప్త మగుటకు నుద్దీపన విభావములే ప్రధానకారణములు. వాని నాధారముగ జేసికొనియే హృదయము రసించును. శృంగారరసమునకు సాధారణముగా చంద్ర మలయానిలాదులు ద్దీపన విభావములుగా నుండును. కృష్ణశాస్త్రి (దేవులపల్లి) ప్రకృతినే యుద్దీపన విభావముగానుంచుకొని కవిత్వము సాగించును. ఈకవి యట్లుగాదు. తెలుగుదేశపు టాచారములు, ఆటలు దీసుకొని కవిత్వమును సాగించును. పురాణగాథలన్నిటికి తెలుగు ముద్రకొట్టును. అందుచే ప్రతి పురాణగాథయు తెలుగుదేశమున జరిగినట్లే యనుపించును.

"జీవనము బిచ్చమున నివసించునిల్లు
పల్లెకాడింక వేషలావణ్యరేఖ
లరయ రావిట్టి శివున కర్ధాంగిరైన
చెలివలపు బావి లోతెన్ని విలువులొక్క."

ఇందు అదేమిదేమని దేవునే తెలుగువానిగా మూర్తి గట్టించినట్లు బల్కినాడు. అసలిందు "వలపు బావి లోతెన్ని విలువులొక్క" అనుటయే కష్టతరమైనది. "బాగిలిమూత" యను కావ్యములోని కవి

దాగిలిమూతమీదుగా నడపిన శృంగార మనన్య సాధ్యము. తల్లి కనులుమూసి "పిల్లివచ్చె ఎలుక భద్ర మన్న" దట. ఇతడా కన్యను వెదకినాడు. "చిక్కెదే నీవు నాదృఢా శ్లేషమందు, కలిసిపోదము తల్లి యిక్కడకు ముదమున" దీనితో నీఖండము అంతమైనది. ఇట్లే స్వప్న ప్రణయమ్మను ఖండకావ్యమును చమత్కరించి వ్రాసినాడు.

కొందరి కవుల యనుభూతియే శాస్త్ర వేత్తల యొక్కవలె సూక్తులగును. ఈకవి కొన్ని మాటలు శాస్త్రవైషయిక పరమార్థములవలె సూక్తులుగా పల్కుంచును. "పేనయల్లునిపై కూర్మిపూనదగునె," "ప్రేమ కంటెను వాంఛనీయమెద్ది" "తోడబుట్టు వందలి ప్రేమ మీదురాదొ !"

ఈకవి శైలికిపై మెఱుఁగులు లేవు. శబ్దముకొరకు గాక భావముకొరకు మాత్రమే కవిత్వము వ్రాయును. తునుకలు తునకలుగా విడిలిపోయిన భావము నున్న దున్నట్లుగానే యేర్చి కూర్చును గాని దాని శైలికొరకు ప్రయత్నించడు. ఈ కవి భావ విన్యాసవైఖరియే యితని విశిష్టమైన శైలి. భావము లతుకులలో గొంత వెలితికనుపించినప్పుడు దానిని శబ్ద శక్తిచేత పైకిపొక్క నీయకుండ కప్పిపెట్టవచ్చును. ఈ కవియట్లు కప్పివేయడు. భావమునే, చురుక్కు మనిపించి వెలితిరానంతగా పొర్లించి పొంగించిగాని వదలివెళ్ళడు. ఇది యీ కవిలోని విశిష్టత. కొందరు శైలియనుట తోడనే పైమెరుగుల పొందికలైన కొన్ని శబ్దముల విన్యాసమని మాత్రమే భ్రమింతురు. వారి దృష్టికీకవి శైలిగల కవిగాడు. నా దృష్టికీకవి యొక విలక్షణమైన శైలికి అధినేత, మార్గదర్శి.

ప్రేమతాదాత్మ్యమే బ్రహ్మసాయుజ్యమని చెప్పటయే యీ కావ్యముయొక్క పరమప్రయోజనము. అతీంద్రియమైన నిశ్చలప్రేమయందు సమాధిస్థితినంది ప్రేయసీప్రియు లానందము ననుభవింతురు. ఆస్థితిలో వారు ముక్తయోగులు. ఈ పరమార్థముతోనే కావ్యము పర్యవసించినది. సంభోగశృంగార మీకావ్యమున బ్రహ్మసాయుజ్యము వంటిది. ఈ కవి రసానందమూర్తి. నిర్లిప్తుడు. లౌకికములైన ధర్మములు పట్టని రసప్రపంచాధిపత్యము వహించిన బ్రహ్మపదార్థము. ఇంక నేమనవలెనో తెలియకున్నది...

కావ్యము చదువుచున్నంతసేపు సాత్త్వికమై ప్రణయ తత్త్వము గోచరించునేకాని కామప్రేరితమైన యొక్క యూహగలుగదు. ఈ కవియనుభూతి పరమార్థమే యీ గ్రంథమునందు దనుపించును. ఈ కవి విప్రలంభశృంగారమును లోకోత్తరముగా సాధించినాడు. అన్నివిధముల భవభూతిని దలపించుచున్నాడు. సంభోగశృంగారములో గలుగుజుగుప్సనంతయు పరిహరించి యొకవిధముగా సంభోగశృంగార కావ్యములను సంస్కరించినాడని చెప్పుట సాహసము గాదనుకొందును.

ఈ కవి యను భావములను చెప్పుపద్ధతి విశిష్టమైనది. తనకు జరిగినయనుభవములనే గుదిగ్రుచ్చి చెప్పుకుపోవును. అది కవిత్వమున కేమాత్రమును వెలితి రానీయదు. మనకుజరిగిన యనుభవములను వరుసగ బద్యమున జెప్పుచో నా పద్యమునకు గావలసినంత యుదాత్తత యలవడదు. పద్యము కుంచుకొని పోయి ఈడబోయినట్లగుపించును. కాని ఈ కవి యీ యనుభవముననే చెప్పినను పద్యమునకేమియు లోపముకలుగదు. మనకు జరిగిన యనుభవమును కొంతయూహచే కల్పించి చెప్పినగాని మన పద్యములో హుందారాదు. ఈకవి యిట్టి వేమియు చేయడు. పద్యములో వెలితిరాదు. ఆశక్తి యీకవిలో నెక్కడనున్నదో తెలియదు. ఆకవి పల్కుబడి కదికుదిరి భావాభివ్యక్తిచే నొక యౌదార్య స్ఫూర్తి గలుచున్నదేమొ. మిగిలిన కవులెంతవరకు నూహచే చమత్కరించిన వారేగాని యీకవివలె యనుభావములు జెప్పి కృతకృత్యులు కాలేదు. "క్షణము" అనుఖండ కావ్యమంతయు దీనికి గీటురాయివలె నున్నది.

ఈకవి వాడిన యలంకారములన్నియు నర్థము దీపింపజేయుచుండును. అలంకారములను పైమెరుగులకీ కవి వాడడు. అనేకము లలంకారములు ధ్వనిమయములుగా నుండును. రసధ్వని దీనికి ప్రాణము. కావ్యములలో నుత్తమ కావ్యము ధ్వనిప్రధానమైనది. ఈలక్షణ మీకావ్యమునకు బట్టుచున్నది. వ్యంగ్య వైభవమునంతయు నప్రయత్నముగ నీ కవి వాక్కు మలచుకొనుచు బోవును. అందుకే కవిత్వము పూర్వజన్మ సంస్కారలభ్యము. పల్కుబడుల సొగ

సులీకవి పాటించినాడు. అందుచే, దెనుగుపాట నితని కవిత్వమున కర్థము గాకుండుట యనునది పట్టదు.

"కాకుల కన్నుల దుమ్ముచల్లి" "వెన్నముద్ద విధాన పెంచిరట"

"కోకిలయు కాకియే యనుకొంటి" మొదలైన వీకవిలోని జాతీయములు. జాతీయములతో పాటు సంప్రదాయము పైగల మక్కువ యీ కవియందపారము. "ప్రియుడు చావనీ చావదు ప్రేమయుంచు విశ్వమున జాటిపోయె సావిత్రియొకతె" ప్రతిపురాణ గాథను ప్రకృతమునకు మలచి చెప్పవని చెప్పితిని గదా. ఈ కావ్యమందలి నాయికకు నాదర్శము దమయంతీ సావిత్రులట.

"పసగలెత్తిన తావి సుమ్మదులు" "నీ యదృష్ట రేకవంగిన ఈ శీతబుతువునందు." ఇవి కవిప్రతిభాశక్తిని ద్యోతకము చేయుచున్నవి. ఇట్టివి కొన్ని టంకపు పొడివలెనతుకుకొని పద్యమునకు బిసువు దెచ్చును.

"పరిమళోచ్ఛ్వాస నిశ్వాస పవనమునకు
గడలితరగ విధాన నిల్కడగ లేచి
పడుచు, సొగయించు నీయురోవర్తనమ్ము
ప్రణయజలధి పీవను చెప్పకయె చెప్పె."

పైకి మెత్తగా గనుపించును కాని యెంతగడుసుగానున్నదీ పద్యము. ఆమెను సముద్రముతో బోల్చి విప్రలంభము నంతయు ధ్వనింపజేయుచున్నాడు. ఇట్లెంతరో భావకవులు నేసిరి. ఇట్లే సంప్రదాయ సిద్ధముగా బాణీతప్పకుండ యీకవిశృంగార రసమును పోషించినాడు.

"కరములు మెలుంగు బంగారుగాజు లోరసి
ఘల్లుమనినంత నా గుండె జల్లుమనును,"

ఇట్టివి యితరకవులును చేసినారు. కాని అవి ఖండగీతికలోని ఏ వ్యభిచారిభావమునో పోషించినవే కాని కావ్యమునంతయు నంటిపెట్టుకొని నడచు శృంగారమును పోషింపజాలవు. ఈ కవి రచనాశక్తి గలవాడగుటచే శృంగార రసమునకు దోహదముగ నిట్టి మధురరచనలు జేసినాడు. ఇది యీ కవిలోని ప్రత్యేకత.

'భరకు డిగవ పెనీకువై దిరుగులాడు
తూనిగ మనమ్ము చల్లగా వానచినుక!"

ఈ పోలిక స్వంతత్రమైనది. నాయికానాయకుల పరస్పరానుబంధమునకు వ్యంజకముగానున్నది. వర్షము వచ్చునని తూనిగలు దిరుగును, లోకసిద్ధమైన దీనిని తీసుకొని కవిచమత్కరించుట ఆశ్చర్యకరముగనున్నది. కొన్ని పద్యములు హృదయమును స్పృశించుచు తద్గతశిల్పమును విడమలచి చెప్పనీయవు. రసధ్వని ప్రధానమైన కావ్యములలో నున్న చిక్కయిది.

"మనము చకోరదంపతుల
 మై తెలివెన్నెల తీపిగుంపులో
జనిదని తారకాకుసుమ
 సౌరభవాహినిదోగి, కోసితె
చ్చినవిరులన్ పరమ్ములు ర
 చించి పరస్పర రాగముద్రగా
బ్రణయిని! రెండుమేనులకు
 బందమువై చెద మేగుదెంచెదే."

ఇంజేమి చెప్పగలము. భావమెంతో సుకుమారముగా తెగిపోకుండా సొగసులు తిరిగిపోయినది. జిలుగు జిలుగు పట్టుదారము తెగిపోకుండ నెంతవరకైన కండెలు చుట్టగల నేర్పరి యీ కవి.

"చుక్కలుండెడిలోకాన జూచినాడ
నరసితిని మిన్నుమన్నేకమైనచోట
కాంచితిని పయోనిధి తరంగముల వెనుక
డెందమునగాని నిన్ను నే నెందుగాన."

ఈ పద్యమున నీ కవి పోతన్నగారివలె భక్తిపరవశమూర్తియై కనుపించుచున్నాడు. ముక్తి మూడు విధములు. సామీప్యము, సాలోక్యము సాయుజ్యము. యోగివలె యీ కవి సాయుజ్యమునే కోరుచున్నాడు.

"నీవు జీవనధాత్రివి నేను జీవి
నీవు లేకున్న నా లేమిదే ధ్రువమ్ము."

ప్రేయసీ సంయోగము బ్రహ్మసాయుజ్యము వంటిదని యీకవి తేల్చివైచినాడు.

"దివ్యానురాగ సందీపితాలింగన
మ్మున దనూలతలైక్యమును భజింప
విమల భక్తిరసాతి వేలసంపత్సూచ
కములైన పులకాంకురములు నిగుడ
మార్పిపాద జలేజముకరంద మజ్జన
మ్మున శిరస్సులకు పావనత గలుగ

చరణాగ్ర భూమి సాష్టాంగప్రణామక్రి
యాశేష పారవశ్యమున నలరి
వాల్గచేతులు మోడ్చు పుణ్యదినమందు
కరుణమొలయు చల్లని కడ కంటిచూపు
లందు వాత్సల్యమ్మొలుకు పల్లవవ్యాజమైన
అమ్మ సదనుగ్రహము గోరవా లతాంగి!"

ప్రేయసి తనకు లక్షించిన జనకతల్లికి వాల్గచేతులతో నమస్కరించునట. వాల్గచేతులనుటచే నారాయణుండు ధ్వనించుచున్నాడు. తనకు జీవాత్మస్థితిపోయి పరమాత్మస్థితి వచ్చుట నిందు రూపితము.

కొన్ని శబ్దములు దీసికొని వానిచే ననంతములయిన భావములు గల్పనచేయు శక్తి యీ కవికున్నది. ఈ కల్పన రెండువిధములు. ప్రకృత కథకు నుపపోషకముగా కల్పించుట, ఉక్తి వైచిత్ర్యాదులకొఱకేదో తారాపథాంచలమునందుకొను మహాతో కూడిన కల్పన. ఇందు మొదటిది శిల్పసమ్రాట్టులే చేయుదురు. రెండవది సామాన్యులుకూడ చేయవచ్చును. ధ్వనివ్యక్తిని కావ్యమంత వర్ణన శోభను దీసికొని ప్రకృతకథకు నుద్దీపనముగా ధ్వనింపజేసినాడు.

"తనుకు లీనినది సంధ్యారాగపవన క్ర
మ్మినకాల మేఘబృందములకలందు
సెలజాణరైన క్రొమ్మెఱుగు నాట్యమునెంట
జడిగొల్పినాడు మేఘుడు రసమ్ము
గిరికుమారుని ప్రేమగీతాల పొంగులా
కలుకట్టినది పాలకడలిదరకు
పులకరించినది గట్టులు పొర్లు సెలయేటి
కౌగిలింతలకు కంకరపాలమ్ము
అనుపమప్రేమ చిత్రమ్ములన్నియొకట
నిలుచుకొని యీ నారొండ నొక్క విక్రుతిపూని
ఇట్లు నాహృదయమ్ము దహించునేలొ
శారదమనోజ్ఞనవకోపమ్ము పెంపు."

ఏపద్యము చెప్పినను నేదో యొకరసపోషక భావమీ కవికి సహజముగా దూకిపడును. గిరికుమారుడు కవి. అతని ప్రేమగీతములు పాలకడలిదరకు పోయినవట. కొండలలో పుట్టి సెలయేళ్లు సముద్రములో కలియుటను దీసికొని కవి యిట్లలంకారముగా చెప్పుచున్నాడు. ఈశక్తి నాస్యతో దర్శనీయమని చెప్పవచ్చును. కంకరపాలము సెలయేటి కౌగిలింతలకు పులకించినదట. కంకరరాళ్లు పొడిచినట్లుగానుండి పొలమునందు రోమాంచమును వహించిన నాయకభావమును స్ఫురింపజేయుచున్నది. ఇదంతయు కవిరచనా శక్తి నిరూపించుచున్నది. రసమునకు జలము, రసము, అనురాగము—ఇవన్నియు నర్థములే. మేఘశబ్దమునుండి చమత్కారముగా రసము జడిగొల్పుట నుత్ప్రేక్షించుట విచిత్రముగనున్నది. దీనిచేత మేఘునియందు నాయకత్వము స్ఫురించుచున్నది. ఈ స్ఫూర్తి అనేక విధములుగా నుండును. శబ్దమునుబట్టి, శబ్దవిన్యాసవైఖరినిబట్టి, ప్రకరణమును బట్టి, సమాస, లింగ, విభక్తి, వచన, నిపాతాదులను బట్టి స్ఫూర్తిగల్గునని యాలంకారికులు చెప్పిరి. ఇది స్థూలముగా జెప్పిన విషయమే. స్ఫూర్తి కవిలోని ప్రతిభనుబట్టి యనంతముగా గల్గుచుండును. ఆస్ఫూర్తి యేకవితకు ప్రాణము. కవిత్వ మర్థమగుటయున్న దా స్ఫూర్తి యర్థమగుట ఆ స్ఫూర్తి యర్థమగుటకు గావలసినంత పరిణతి పాఠకునిలో నుండవలెను. కేవల శబ్దార్థములు కవిత్వముగాదు. అది కవిత్వమనుకొని కొందరు కవిత్వ మందరికి నర్థముగావలె నందురు. కవులలోని శిల్పరచనా చమత్కారములు పాఠకునిలోని సంస్కారముకొలది బోధపడును. అందుకే ధ్వన్యాలోకమున నానందవర్ధను డిట్లు చెప్పినాడు.

"సోఽర్థవ్యక్తి సామర్థ్యయోగీ శబ్దశ్చకశ్చన
యత్నతః ప్రత్యభిజ్ఞేయౌ తౌ శబ్దార్థౌ మహాకవేః."

అర్థవ్యక్తి సామర్థ్య యోగియైన శబ్దమెక్కడో యొకచోట మహాకవి వాడునట. ఆ శబ్దములు యత్నించి తెలిసికొనవలసినదేగాని వేఱుగతి లేదట. మేఘశబ్దము పుంలింగమని తెలిసి రసశబ్దమునకు గల యర్థము తెలిసి వాని పరస్పర సంయోజనచే గల్గినస్ఫూర్తినందుకొననిచే పాఠకుడు నిజమైన రసానంద మనుభవింపజాలడు. కేవల శబ్దార్థములు తెలిసినంతమాత్రమున జాలదు.

మహాపండితుడుగాని చేయలేని కొన్ని యూహలీకవికి సహజముగా దొరలును.

"అది సుధారసమొలుక మాటాడునపుడు
జాని వాక్యమాలమున నుద్గతిమనోజ్ఞ
భణితులందొక్క ప్రణయభావనమునగుడు
త్రోవలో దాని రసతి నంటుకొనిపోదు."

"క్షణవరాగమ్ములోని సంకుచితనూత్న
భావనిర్దిష్ట మవ్యక్తపదనువశను."

ప్రేమభావ తాదాత్మ్యమును వ్యంజకము జేయుచు నొళ్ళుదెలియని పారవశ్యమున జేసిన రచన లీకవిలో జెక్కులున్నవి.

"అగవాక్షమ్ము తా నెంత యమృతరాశి
యెవ్వరును లేని సమయాన జేగి దాని
స్పర్శసుఖమున బులకలు జూడుకొనగ
ప్రణయమున మున్గనను పరవసషనైతి."
"నీ విలాసమ్ము ప్రతిఫలించినజలమ్ము
త్రావి యున్మత్తుజను ప్రేమభావమందు,"

ఇంత తాదాత్మ్య మందిన కవియేమి పల్కాడు!
"అదట నా ప్రేమయను మజ్జియాకు పఱచి
నేను పవళించెదను సుధానిర్భృతమూర్తి."

ప్రళయమైనపిదప విష్ణువు పాలసముద్రములో బండుకొనుట పురాణప్రసిద్ధము. దాని నీకవి యిట్లు తన కుత్ప్రేక్షించుకొనినాడు. ఇట్లనేకము లాధ్యాత్మిక భావము లీకవికి సహజముగా దొరలివచ్చును.

"ఫలశ్రుతి" నాయికా నాయకుల సంయోగము జీవాత్మ పరమాత్మల సంయోగమునంటిదని చెప్పచు రాయబడినది. ఆ సంతోషపారవశ్యములో నాయకున కొడలు దెలియదు. తాను "ముక్తిపీమంతినీ త్రపా ముగ్ధవరద హస్తవలయితుండౌ పరమాత్ముబోలి" నాడు.

"పదునాల్గు భువనములు బొజ్జలో నిముడ్చు కొన్న బాలకృష్ణుని రీతి నేబవ్వళింతు." "ఇద్దఱమును నొక్కరొకరి ప్రతిబింబములను మాచుకొను ముక్త యోగులము." "మనసులను దాటి యూహాకందని విధాన ఐక్యమైపోయి యేకమన్నప్పు డచట మన మెఱుంగని ఎవ్వరో మనల నెఱుగు." ఇవన్నియు కవి ప్రతిభాశక్తి సంప్రదాయముపైపున కెంత మొగ్గ చూపుచున్నదో తెలియచేయుట కుదాహరించితిని.

ఎంత శృంగారరసమును జెప్పినను లౌకికమైన భావ మణుమాత్రమైన తగులనీయనంత నిగ్రహశక్తి యీకవి కున్నది.

"ఊర్పు సలుపని నాముక్కు లూదియూది
నీదు నిశ్వాసపవనంబు నించినావు
అంతరమ్మున నవ్వు డవంతకోటి
జీవనాయుతరంగముల్ చెంగలించె."

ఇందెంత శృంగార భావమున్నదో అంతకంటె మించిన వేదాంతభావ మున్నది. అందుచేత కలిగిన రసభావమంతయు నాధ్యాత్మికముగా పరిణతి జెందుచున్నది. అందుచే లౌకికమైన భావములు దీనికి పట్టవు. ఒకవేళ పట్టినను దానిని తొంగిమాడనీయనంతటి వేదాంతభావము పద్యమునందు పర్యవసించుచున్నది. సంభోగశృంగారమును భక్తితో గలిపి దానిలో సహజముగ కలుగు జుగుప్స నీ కవి తొలగించినాడు. అది యీకవిలో నొక ప్రత్యేకత.

గీతపద్య మీకవిచేతిలో మెదిగి మెదిగి ముద్దగట్టి గుండుగుండుగా నైనది. ఎట్లైనను గీతపద్యము ద్రిప్పగలశక్తి యీకవి కున్నది. గీతపద్యమును వ్రాయుచు పాదమూల్యమునం దాపుట యాధునికులైన కవులు పెక్కురు జేసెడి సీత. దానికి వారు భావ మెక్కడ ఆగిపోవునో అక్కడనే ఆపివేయుట రమ్యముగా యట్లు చేసితిమని జెప్పుదురు. అది రాను రాను ఎక్కడో మధ్య పద్యము నాపి యక్కడే తను భావమైపోయినదని చెప్పకొనునంతటి దుస్థితికి వచ్చినది. ఈకవి పద్యము నాపినచో మిగిలినరస విషయమునంతయుందు ధ్వనించుచుండును.

"ఈమహాప్రేమమంత్ర శేర్భత్వమధుర
పార్థివచనమ్ము లెదటివే అను పదమ్ము
ఆ శ్రుతులయందు నాయంతరాత్మ కరగు
ఓ ప్రణయలోకవాసిని."

ఈ సంబోధనచేత నంతమగుటచే నాయకుని లోనియానందము శబ్దమున కందనంతటిదేదో ముడివలె పట్టుకొన్నట్లుగా మనకుదప్పన స్ఫురించుచున్నది. ఇట్లాధునికకవులలో నొకటిద్దరు మాత్రము చేసిరి.

కొన్ని గీతపద్యముల కీకవి మకుటమువలె నొక చరణమును ముందువ్రాసి మిగిలిన పద్యములభావమును దానిమీదుగా పర్యవసింపచేయును. ఆ మొదటి చరణము భావమును నాధారముగా బెట్టుకొని చిత్రవిచిత్రములైన కల్పనలు చేయును.

"నీ ప్రణయలీల లతి విచిత్రములు దేవి!
ఎందుకో నాకు తెలియరాకొజ్జనెంప
కాయుదువు నీ కటాక్ష వీక్షణములందు

చెమ్మయంతయు నిగిరిపో సొమ్మసిలిన
పొలముపోలిక నైరెలు వోదు నేను
కండనిప్పుల పడమటి కొండగాలి
చిరుత నిట్టూర్పులో విదల్చెదవు పైన
నేల పదమదపై రేణుధూళిలోని
ఒకయణువురీతి సుడ్తిగొనుచుందు నేను
తొలియదువు వాన నీలాంబుధరము లోరయు
నీరు బొమములందు నే విమసమందొ
చినుకు చినుకున వాని మెత్తన భజించి
పుడమిమూదిరిగా గనుర్వొడుదు నేను
మంచు విరియించెదవు సుధామధురహాస
చంద్రికౌ స్వచ్ఛ శీతలచ్ఛాయలందు
పాలవెన్నెల తరిపైరు పగిది నేను
ముగ్ధపరవశభావముల్ మురుస్సరింతు."

ఏమికవి ! పద్యముపాటగా మలగిపోవుచున్నది. ఇట్లే.

"నా వియోగము చిత్రమైనది సఖుండ" అను గీతమును వ్రాయ బడినది.

"పరమ పదనాథుకొరకు పార్వతియువోలె
నాకొఱకు యోగముద్ర నున్నావునీవు"

ఈ భావము తేలికగానే కనుపించును. వ్రాసిన పిదప నన్నియు నంతేయనుపించును. కాని యీ భావము స్ఫురించుట కెంత సంస్కారము కావలెను. అందుకే ఆధునికవులలో ప్రేయసీపరముగా వెలసిన కావ్యములలో నిది తారాపథము నందుచున్నది. ఇంతగా సంప్రదాయసిద్ధమైన పలుకుబడిచే భాసించిన కావ్యమాధునికములైన యీ జాతి కావ్యములలో లేదు. ఆజాతి కావ్యములన్నిటిలో దీనికే యగ్రతాంబూలము. కాని యీ కాలములో కొందరి కవులకు గల పేరు ప్రతిష్ఠలీ కవికి లేవు. ఇది ఆశ్చర్యము.

ఈ కావ్యములోని ప్రేమ అతీంద్రియమైనదని యూహించుట కింకొక యుదాహరణము.

"ఓయి మన్మథ ! యీవసంతోదయాన
పరము చేయూతగా నీప్రశంస లేల
ఆసమాగము నాయంతరాంతరమున
నాప్రణయరాశి శివమూర్తి నాట్యమాడు."

పెద్దకవులందరు తమ కావ్యములలో కొంచెమో గొప్పయో తమ ప్రతిష్ఠను చెప్పికొనినవారే. కొందరు బాహిరముగా గాకపోయినను ధ్వనించినట్లయినను చెప్పియున్నారు. భవభూతి "యథా స్త్రీణాం తథా వాచాం సాధుత్వే దుర్జనో జనః" అని సూత్రధారునితో నుత్తర రామచరిత్ర నాటకమునందను పించినాడు. లోకములో నెంత పతివ్రతను జూచినను "మహాపతివ్రతగా పాడిచేసిందిలెద్దూ" అనుట కద్దు. అట్లే యెంత మహాకవినైనను దోషదూషితుని జేయుట కలదు. అట్లన్నచో వారికేమి లోపము. ఆ లోపము జనులలో నున్నది. జనులు దుర్జనులు. ఈకవి యించుమించు భవభూతివలె పల్కుచున్నాడు.

"ఈ వినూతనభావముల్ తావిలేని
పువ్వులవి అంగలోకము నవ్వనిమ్ము
నీదృగంతప్రణయరేఖ పాదులైన
మధువు లూరించునో నాదు హృదయమందు."

చిట్టిబాబు

శ్రీ ఆకుండి నారాయణమూర్తి

తొలుకుతున్న కాళ్లతో అమ్మ మంచం దగ్గరకు వచ్చి, మెల్లగా మంచంమీద కొసకి అమ్మ తలదగ్గర కూర్చొని "అమ్మా!" అని అమాయకంగా పిల్చేడు చిట్టిబాబు. మొదటి పిలుపు కామెకు తెలివి రాలేదు. రెండోమారు పిలిచేసరికి మెల్లగా కళ్లు విప్పి, చిట్టిబాబు వేపు చూచి కళ్లంట నీరు కార్చిందా మాతృశ్రీ!...కొడుకుని హృదయానికి హత్తుకుని— "ఇవాళ...అన్నం...తి...న్నావా, నాయనా?" అడిగిందా ఎంతో ఆయాసంతో.

—"ఊహూఁ...ఒత్తి కందిపొడా అన్నం తినేయమంది వదిన. నాకక్కర్లేదని చెప్పేసేను." అన్నాడు చిట్టిబాబు కోపంగా మూతిపెట్టి.

"అలా వదినను అల్లరి పెట్టొచ్చా?......తప్పు కదూ! ఏం పెడితే అది తినేయాలి. నా జబ్బు... పోయేక..." ఆయాసం ఎక్కువవడంచేత మధ్యలోనే ఆపేసిందా వాక్యాన్ని.

అంతట్లో కామాక్షి అక్కడకు వచ్చి— "ఔనురా చిట్టిబాబూ అన్నం తినడానికి కలిగి ఇక్కడకొచ్చి అమ్మను లేపేశావుట్రా?" అంది.

కోడలు వేపు చూచింది అన్నపూర్ణ. -"పోనే, కామాక్షీ!...వాడికి కందిపొడా అన్నం అక్కర్లేదుటే!...పోనీ అటకమీద కెక్కి రెండు అప్పడాలు తీసి కాల్చమ్మా!" అంది.

"అమ్మా!...వదినేం, అప్పడాలు కాలుస్తావని మొదట అంటే, అక్కయ్యేం 'ఇప్పుడెందుకూ, వెధవకి మరేం పనిలేదు...ఆకలేస్తే వాడే తింటాడులే!'...అని అంది!" అని చిట్టిబాబు తప్పంతా అక్కయ్యదే అన్నట్లు ఋజువుచేస్తూ అమ్మతో చెప్పేడు.

తమ్ముడు తనమీద అమ్మతో చేస్తున్న రిపోర్టు వంతటినీ గదిలోంచి వింటున్న రమణమ్మ బయటకు వచ్చి,—"ఒసే అమ్మా!...ఈ తమ్ముడి పెంకితనం రోజురోజుకీ మరీ హెచ్చయిపోతున్నదే!— నా కొడుకూ వదిన కొడుకూ వాడికన్నా చిన్నవాళ్లయినప్పటికీ, ఏ పెంకితనం చెయ్యకుండా అన్నం తినేస్తూవుంటే వీడొక్కడికే నా వచ్చింది లోపం?! ప్రతీరోజూ అన్నాలదగ్గర తగవే! ఏమయినా అంటే అలుగుతాడు. నీదగ్గరికొచ్చి కూర్చుంటాడు. నీకీ జబ్బు వచ్చిన పదిహేను రోజులనుంచీ ఇంతేనే అమ్మా. ముద్దు లావయిపోబట్టి—వెధవ పెంకితనం వాడూనూ!...మా పంతులుగారు చక్కా బుద్ధిగా అన్నం తినేస్తూ ఆడుకుంటూ ఉంటాడు." అంటూ తన కొడుకు నెత్తుకొని ముద్దులాడుతూ, తమ్ముడి పెంకితనాన్ని అమ్మముందు వ్యక్తపరిచింది రమణమ్మ.

"ఏదో చిన్న పిల్లడు. తెలీక పెంకితనం చేస్తున్నాడు. నా జబ్బు తగ్గేవరకూ వాడినేమీ అనకండమ్మా... నేనిలా మంచం పట్టేనని అసలే బెంగతో ఉన్నాడు. చూసేవా, ఎలా ఎండిపోయేడో!" అని కొడుకు తలను నిమురుతూ కన్నీళ్లు కార్చింది అన్నపూర్ణ.

అత్తగారి కళ్లంటకారే కన్నీరుగని చూచింది కామాక్షి. ఆమె హృదయం జాలితో దడదడ కొట్టుకుంది. చిట్టిబాబుని మంచంమీంచి దింపి, "రా నాయనా, మంచి సోద్యం ఇస్తాను." అనంటూ వంటింటి వేపు తీసుకుపోయింది కామాక్షి.

"అంతలా ముద్దు చేస్తే, మొద్దు వెధవలా తయారవుతాడు." అని గొణుక్కుంది రమణమ్మ—

—"పోదు రమణా!...అసలే వాడు నాగురించి బెంగ పెట్టుకొని ఉన్నాడు. ఇక వాడిమీద కూకలేస్తే మరీ బెంగ పెట్టుకుంటాడు. ఇవాళ్టికి పదిహేను రోజులయింది. ఇంకొక్క ఆరు రోజుల లోనే గదా డాక్టరన్న ఇరవై ఒక్క రోజులూ..."

అని మాత్రం అనగలిగింది అన్నపూర్ణ. ఊపిరందక పోవడంచేత ఆ, ఆఖరి మాటల్ని మనస్సులోనే గొణిగేసుకుంది. వాటంతటవే కళ్లు బరువెక్కాయి. రవణమ్మ ఏదో పణిగిందిగానీ ఆమాట లేవీ స్పష్టంగా వినిపించ లేదన్నపూర్ణకు.

అన్నపూర్ణకువచ్చు దానంతటదే చిట్టిబాబు భవిష్యత్తు గురించాలోచనలో పడింది—చిట్టిబాబుకు ముందు పుట్టిన ఆ ఇద్దరు పిల్లలూ ఏడేళ్ల వరకూ బ్రతికి ఆ తరువాత తనను దుఃఖ సముద్రంలో ముంచి మరో లోకానికి వెళ్ళి పోయేరు. ఇక ఈమారు సుమారుగా ఆవయస్సులోనే ఉన్న చిట్టిబాబును విడిచి తనే మరో లోకానికి వెళిపోవలిసి వస్తుందా? ఆవిషయం తల్చుకోనేసరికి ఆమె హృదయం దడదడ కొట్టుకుంది. నిజంగా తను చచ్చిపోతే చిట్టిబాబు గతేమిటి?...వాడిని సరిగ్గా చూచే వాళ్లెవరు?... పాపం, తండ్రిని ఎరగనే ఎరగడు. వాడు పుట్టిన నెల రోజుల్లోనే కదా ఆయన పోయినది!!...ఇక కూతురు రవణమ్మ చిట్టి బాబును చూస్తుందా? ఊహుఁ... లాభం లేదు!...పోనీ కోడలు తనకొడుకుతో సమానంగా చిట్టిబాబును చూస్తుందా?... పోనీ, కాస్త జ్ఞానం వచ్చిన వాడయినా తనకంతగా విచారం లేకపోయేది. బొత్తిగా జ్ఞానం లేనివాడు......ఇక ఇప్పుడే తనకీ సన్నిపాత జ్వరం రావాలా?—ఈ మందులూ, ఈ డాక్టర్లూ, ఈ బంధువులూ రావటం, వల్ల ఏమిటో అర్థంకాక ఇప్పటికే బెంగ పెట్టుకొని సగం చిక్కిపోయేడు. నిజంగా తనీ లోకంలో లేని నాడు వాడేమయి పోతాడో!...“అమ్మ ఏదీ? ఎక్కడుందని?” వాళ్లను రోజూ అడుగుతూ ఏడ్చి ఏడ్చి కృంగి కృశించి పోతాడు గాబోలు!... అప్పుడు, అక్కయ్య తనను కొట్టిందనీ, వదిన తనడిగినది ఇవ్వలేదనీ మరెవ్వరితో ఫిర్యాదు చేస్తాడు?!—ఆవిషయాలన్నీ తల్చుకునేసరికి ఆ అమాయిక హృదయం జలదరించింది. ఆందోళనతో కళ్లిప్పి దేముళ్ల ఫొటోల వేపు చూచింది. అందరు దేముళ్లకూ దండాలు పెట్టింది. తన జబ్బు నయమవాలని!—కానీ తన జబ్బు నయమవుతుందనే నిబ్బరం బాగా లేదామెకు. ఏదో బెంగ ఆమె హృదయానికి కవచమయింది!—చిట్టిబాబు భవిష్యత్తుగురించి అలా ఆలోచిస్తూ ఉండగానే ఏదో మైకం కమ్మినట్లయిందామెకు.

ఆవాళసలు అన్నపూర్ణకు ఒంటిమీద తెలివే లేదు. అదివరకు పిలచినట్లయితే పలికేది. ఆవాళ మరసలు పిలిచినా పలకలేదు. ఏదో చిన్న మూలుగు మాత్రం మూలిగేది. ఉండుండి అస్పష్టంగా పలవరించేది.

ఆనాటి పరిస్థితి డాక్టరుకు కూడా కొంచెం అనుమానంగా తోచింది. అన్నపూర్ణ పెద్ద కొడుకయిన శేఖరాన్ని పిలచి, “పరిస్థితి కొంచెం ఆందోళనకరంగా ఉం”దని చెప్పేడు డాక్టరు. శేఖరం డాక్టర్ని బ్రతిమాలేడు ఎలాగయినా కాపాడమని!... “సాధ్యమయినంతవరకూ ప్రయత్నిస్తా” నన్నాడు డాక్టరు.

ఆరాత్రి ప్రతీ మూడేసి గంటలకు ఒక్కొక్క ఇంజెక్షను చొప్పున ఇచ్చేడు. అలా నాలుగింజక్షనులు ఇచ్చిన తరువాత, ఓ మారు ఎనీమా చేసి, “ఇక ఆరు గంటల్లో తెలివి వస్తే మరి ఫరవాలే” దన్నాడు డాక్టరు.

అందరూ గుండెలు బిగబట్టుకుని అన్నపూర్ణ చుట్టూ కూర్చున్నారు, ఎప్పుడు తెలివి వస్తుందా అని నిరీక్షిస్తూ!—అమ్మదగ్గరకు వెళిపోతాననీ, అమ్మను నిద్రలోంచి లేపేస్తాననీ, ఒకే ఒకలా ఏడుపు మొదలెట్టేడు చిట్టిబాబు. వాడిని ఆ విషయంలోంచి మరలించి, సమాధానపరచడానికి నానా బాధా కామాక్షి పడవలిసొచ్చింది!...ఒకంతటికి గానీ ఏడుపు మానలేదు. వాడి పరిస్థితి చూస్తూ ఉంటే ఇంటందరికీ మతి పోయినట్లయింది.

తల్లిస్థితి చూచినప్పటికన్నా, తమ్ముడి ఏడుపు చూచేసరికి ప్రాణాలు పోయినట్లనిపించింది శేఖరానికి!—ఎత్తుకున్నాడు. లాలించేడు, బుజ్జగించేడు. లాభం లేకపోయింది!...వాడి ఏడుపు వినలేక పొరుగువాళ్లింటికి తీసుకెళ్లి అక్కడ వాళ్ల కప్పజెప్పింది రవణమ్మ. కొంచెంసే పయేటప్పటికి, మళ్లీ అమ్మ మంచందగ్గర కొచ్చేసి, “అమ్మా లే వే.” అంటూ ఏడుపు ప్రారంభించేడు—ఇక వాడిని మరెవ్వరూ ఊరుకో పెట్టలేక పోయేరు.

డాక్టరు చెప్పినగడువు ఇక పూర్తవుతుందనగానే కళ్లువిప్పిం దన్నపూర్ణ! చుట్టూ కలయ చూచింది...“అమ్మా” అంటూ శేఖరం తల్లిమంచ

దగ్గరకు పరుగెత్తి అమ్మ కళ్లల్లోకి దీనంగా చూస్తూ కూర్చున్నాడు.

అంతవరకూ తన కళ్లంట కారిన కన్నీరు తుడుచుకొని, "అమ్మా తమ్ముడింతసేపయి ఎంతలా ఏడ్చేడనుకున్నావు!" అంది రమణమ్మ తల్లి తల నిమురుతూ.

దేముడు ఫోటో లన్నిటికీ దండాలు పెట్టి, దేముడి పెట్టెదగ్గర దీపం వెలిగించి, అత్తగారి మంచం దగ్గరకు పరుగెత్తుకొని వచ్చింది కామాక్షి.

డాక్టరన్న గడువులో తెలివి వచ్చేసిందని, ఇరుగుపొరుగు వాళ్లకీ, ఇంకా ఆవీధిలో ఉన్న మరి కొందరికీ ఎలా తెలిసిందో కానీ అతిత్వరలో వచ్చి, అన్నపూర్ణ మంచం చుట్టూ మూగేసేరు.

—చిట్టిబాబును తనివితీరా ముద్దులాడి,—"వదినేదిరా...నా...య...నా!" అని అడిగిందన్నపూర్ణ హీనస్వరంతో.

"అదుగో నీ వెనకాల నిలబడిందమ్మా." అన్నాడు చిట్టిబాబు సగంమాటల్ని మింగేస్తూ.

"చూడమ్మా కామాక్షీ!...అమ్మలేని లోటు వీడికి....తీ....ర్చే....పూచీ ఇటుపైని....నీ....దే నమ్మా!..." అన్నదన్నపూర్ణ బొటబొటా కళ్లంట నీళ్లు కారుస్తూ.

అమ్మ అన్న ఆ మాటలు రమణమ్మకు కొంచెం కష్టంగాతోచేయి!...ఏం? అమ్మే ఒకప్పుడు లేని నాడు తమ్ముణ్ణి ఆమాత్రం తను పెంచలేదూ? వాడికి తల్లి లేని లోటు తను తీర్చలేదూ?...అందుకు వదినే ఉండాలా? అఖరికి రక్తసంబంధం కూడా లేని వదినా వాడిని ప్రేమతో పెంచగలిగేది...ఈ రకమయిన బాధ రమణమ్మకు కలిగింది. కానీ పైకి మాత్రం వ్యక్తపరచలేదు అసలు అమ్మ పరాకులో అలా అనేసుంటుంది కానీ, ఆలోచించి అనుండదనే సమాధానానికివచ్చి, కొంతవరకూ సంతుష్టి చెందింది. ఇంతకీ అమ్మ చనిపోయినప్పుడు గదా ఈ పరిస్థితి అంతా అని అనుకుంది. డాక్టరన్న గడువు లోపలనే అమ్మకు తెలివి వచ్చేసింది కనక మరి ఫరవాలేదనే ధైర్యం వచ్చేసింది రమణమ్మకు!—

—కామాక్షికి మాత్రం ఇంకా పూర్తిగా ధైర్యం రాలేదు. తన బ్రతుకుమీద తనకు ఆశ సన్నగిల్లబట్టే అన్నపూర్ణ ఆఖరున అలా చెప్పిందనుకుంది కామాక్షి. పైగా తన భర్తతో కూడా, "నాయినా... తమ్ముణ్ణి మళ్ళీ నీ అంతటి వాడిని చెయ్య...ఆపోయిన...ఇద్దరిలాగా కాక..." అని కొడుకుతల నిమురుతూ వెక్కి వెక్కి ఏడ్చింది. అత్తగారు పూర్తిగా అధైర్యం చెందబట్టే అలా చెపుతున్నారని అనుకుంది కామాక్షి. ఏరకంగా ధైర్యం చెప్పాలో ఆ రకంగానూ కామాక్షీ, రమణమ్మ, శేఖరం, ఊళ్లోవాళ్ళూ ధైర్యం చెప్పేరు. కానీ ఆమె హృదయాన్ని అంటిపెట్టుకున్న అధైర్యం ఇంకా అలా వ్రేలాడుతూనే ఉంది.

అఖరిని మళ్ళీ చిట్టిబాబుని గట్టిగా గుండెలకు హత్తుకుంది. "వదిన చెప్పి...నట్లా..విను...అ..ల్ల..రి చే..." మరి మాట్లాడలేకపోయింది. అంతా చీకటయిపోతున్నట్లనిపించింది. ఈ ప్రపంచంతో బంధాలు క్రమంగా సడలిపోతున్నట్లనిపించింది. కళ్లు మూతలు పడ్డాయి!...డాక్టరొచ్చేడు!—"ఇక విచారించి లాభం లేదని!" ఈ మారు పెదిమ విరిచేడు.

—డాక్టరన్న గడువులో తెలివి వచ్చేసిం దని అందరూ సంతోషంతో మరి ఫరవాలేదనుకున్నారే గానీ, అది చావుతెలివన్న సంగతి అప్పట్లో ఎవ్వరూ గుర్తించలేదు. —ఇంటిల్లిపాదీ ఒక్కమారు ఘొల్లుమన్నారు. ఎందుకలా అంతా ఘొల్లుమన్నారో అర్థంకాక, చిట్టిబాబు కూడా 'కెవ్వు' మని కేకేసి ఏడవడం మొదలెట్టేడు.

తల్లి కావుకొని కూర్చున్న చిట్టిబాబును క్రిందికి దింపి, శవాన్ని నేలమీదికి దింపేస్తూఉంటే, పరుపేనా వెయ్యకుండా దింపేస్తున్నారేమిటని గోలగోలని ఏడ్చేడు. బాబు పరిస్థితి చూచేసరికి కామాక్షి హృదయం చెక్కలయింది. బాబు నెత్తుకొని ఊరుకోబెట్టబోయింది. కాని లాభం లేకపోయింది.

ఊళ్ళోవాళ్లంతా ఇంటి చుట్టూ మూగేసేరు. ఇల్లంతా ఏడుపులూ, మొత్తలూ! ఒక్కొక్కరూ రావడం చిట్టిబాబు నోమారు ఎత్తుకోడం—"ఎంత పని జరిగింది నాయనా!...ఇంత చిన్నప్పుడే తల్లి లేని పిల్లడిని చేసేసింది నాయినా!" అంటూ ఓమారు ముక్కు ఎగపీల్చడమూ!...ఆ మాట లేమీ అర్థంకాక బాబు మరింత గట్టిగా ఏడవడమూ!......

మరికొందరు ఏడుస్తున్న వాళ్లని ఊరుకోబెడుతూ, "ఆ పిల్లడిని చూడయినా ఊరుకోండి. పిల్లకు దడదిల్లిపోతున్నాడు. మీ ఏడుపులు చూచి భయపడి బెంగపెట్టుకుంటాడు...ఎంత ఏడిస్తేమాత్రం ఇప్పుడేం లాభం?" అంటూ ఊరుకోబెట్టడం మొదలెట్టేరు.

ఆ తరువాతి తల్లి శవాన్ని వాకట్లో ఆ ఎండలో ఉంచి, ఏవేవో మంత్రాలు చదువుతూ మీద నీళ్ళు జల్లుతూ ఉంటే, వదిన చంకలో గిజగిజ గింజుకుంటూ ఏడుస్తూ "అమ్మకు ఎండే,...ఎండే!" అని ఏడవడం తప్ప మరేమీ చెయ్యలేకపోయేడు చిట్టిబాబు. అక్కడ ఉన్న వాళ్లందరూ ఆ పిల్లడి అమాయకత్వాన్నీ, ఏడుపునీ చూచి, ఏమీ అనలేక ప్రతీ ఒక్కరూ కంటతడి పెట్టుకున్నారు. అలా ఏడ్చి ఏడ్చి, నో గొంతు పెట్టుకొని తెలివితప్పిపోతాడేమో అని ప్రతీ ఒక్కరికీ భయం వేసింది. ఆ పిల్లడిని ఆ శోధింలో ఎవరింటికయినా తీసుకెళ్లిపొమ్మని కొందరు సలహా ఇచ్చేరు. కానీ గుమ్మం దాటించేసరికే మరింత గోల చేస్తున్నాడు. తనక్కడ లేకపోతే అమ్మను ఏం చేసేస్తారో అనే భయం ఆ లేతమనసును పట్టుకుంది.

వెదురు బద్దలమీద తల్లి శవాన్నుంచి శ్మశానానికి కదులుతున్నప్పుడు చిట్టిబాబు పరిస్థితి దగ్గరుండి చూడవలసిందే గానీ, రాసి లాభం లేదు!

ఆనాడు చిట్టిబాబు చేసిన హంగామా కామాక్షి తన జీవితంలో మరువలేని దృశ్యమయింది. ఆమె హృదయంలో జాలికోశం ఉన్న స్థలంలో చిట్టిబాబా వాడు ప్రవేశించేడు. బాబుకు తల్లి లేని లోటు తీర్చాలనీ, ఇక బాబు తల్లిని మరచిపోయి తనకే తల్లి అనుకొనేటట్లు చేయాలనీ కామాక్షి సంకల్పించుకుంది ఆరోజున!......

వాళ్లు అన్నపూర్ణ శవాన్ని భుజాలమీద కెత్తుకుని తీసుకెళ్ళిపోతూ ఉంటే "అమ్మను ఎక్కడికి తీసికెళ్ళిపోతున్నారు? నేనూ అమ్మతో పోతాను" అంటూ వదిననుగిల్లి కొట్టి, గిజగిజగింజుకొని, ఆమె చంకలోంచి దిగిపారిపోడానికి చాలా ప్రయత్నం చేసేడు. "ఏటూ లేదు నాయినా!...... పెద్దఆసుపత్రికి తీసుకెళుతున్నారు. ఇక్కడ మందులు పనికొచ్చేయి కావు, అందుకు! జబ్బుపోయిన వెంటనే అమ్మ వచ్చేస్తుందిలే!" అని చెప్పి చిట్టిబాబుని ఒప్పించబోయింది కామాక్షి. కాని వింటేనా?...వదిన అలా తనను గట్టిగా పట్టకున్నందుకు వదినమీద ఎంతయినా కోపం వచ్చింది. గిల్లేడు. కొట్టేడు. గిజగిజా గింజుకొని గట్టిగా ఏడ్చేడు!—అయితేమాత్రం? అమ్మదగ్గరకు పోడానికి అవకాశం ఇవ్వలేదు వదిన!

అవాళ తనను గట్టిగా పట్టుకొని అమ్మదగ్గర కెళ్లనియ్యకపోయిన దగ్గరనుంచీ వదినంటే బాగా కోపంవచ్చేసింది చిట్టిబాబుకు. వదినంటేనే అసహ్యం పట్టుకుంది. వదిన దగ్గర కెళ్లడానికే భయపడేవాడు. సాధారణంగా అక్కయ్యదగ్గరే ఉంటూ ఉండేవాడు. ఏం కావలిసొచ్చినా అక్కయ్యనే అడుగుతూ ఉండేవాడు.

పన్నెండురోజులూ గడిచేయి!...పరామర్శకని వచ్చిన బంధువులూ స్నేహితులూ అందరూ ఎవరింటికి వారు వెళిపోయేరు.

—"ఇక ఇక్కడ మనం ఉండి ఏం చెయ్యాలి? ...మనం వెళిపోదాము. నాకు శలవు కూడా మరిలేదు." అని రమణమ్మ భర్త అన్నాడు.

"సరే, మా తమ్ముణ్ణి కూడా తీసుకెళతానని మా అన్నయ్యనడుగుతాను" అని శేఖరాన్ని ఆ విషయము అడిగింది. అందుకు శేఖరం ఒప్పుకోలేదు. "అక్కడ ఇంకా తినుంటాడనే నమ్మకంలేదనీ, ట్రాన్స్ఫరు త్వరలోనే అవొచ్చుననీ బావ అంటున్నాడు. అంచేత ఎక్కడో ఓ దగ్గర స్థిరపడిన తరువాత తీసుకెళ్లొచ్చు" అని చెప్పి రమణమ్మని ఒప్పించేడు శేఖరం.

అప్పటిమట్టుకు సరేనని ఒప్పుకుంది. కానీ మనస్సులో ఓవిషయం బాగా బాధిస్తున్నాది. తల్లి ఆఖరిదశలో, "చిట్టిబాబుని జాగర్తగా చూస్తూ, ఇటుపైని అమ్మలేని లోటువాడికి తీర్చవలిసే బాధ్యతనీదే!"నని వదినతో అంది. అక్కడికి వదినేనా మహాతనకంటే ఎక్కువ ప్రేమతో చిట్టిబాబుని చూడగలిగేది? తోబుట్టువయిన తనకంటే ఎక్కువ ప్రేమ తన తమ్ముడిమీద, వదిన కెందుకుంటుంది?...అమ్మ ఏదో పరాకులో అన్నమాటలే కానీ, ఆలోచించి అన్నమాటలు కావనే నిశ్చయానికి బాగా వచ్చింది—ఇక వదిన దగ్గర ఎలాగూ చిట్టిబాబుండలేడు!...ఓ పదిరోజులలోనే బెంగ పెట్టుకొని తన దగ్గర కొచ్చేస్తాడంటాడు. ఆ మాత్రం

జానికోసం తను అన్నయ్యతో దెబ్బలాడి, తమ్ముడిని అప్పుడే తప్పనిసరిగా తీసుకొని వెళ్లగలిగేటంతటి శ్రమ ఎందుకు?—ఏదో అప్పటి మట్టుకు 'ఊ' అని అంటే కానీ, నిజానికి తనకొడుకుతో సమానంగా చిట్టిబాబు నెందుకు చూస్తుందొదిన? అసలువాడు వదినదగ్గ రెలాగూ ఉండడు. వదినవాడి నెలాగూ ఉంచు కోదు!...ఏదో ఓ పదిరోజుల ముచ్చట. ఆ తరువాత వాడు బెంగపెట్టుకుంటే ఎలాగూ పంపించేస్తారు. ఇక అన్నయ్యకు వాడిమీద వాత్సల్యం ఉండడం సహజం!...కానీ ఎంత వాత్సల్యం ఉన్నప్పటికీ ఆడదానిలా వాడిని లాలిస్తూ బుజ్జగిస్తూ ప్రొద్దస్తమానం కాలక్షేపం చెయ్యలేడుకదా!....మహా చెయ్యగలిస్తే వాడిని జాగర్తగా చూడమని వదినకు ఆర్డరు వేస్తాడు. ఏదోవాడిని మహా ప్రేమతో చూస్తున్నట్లు అన్నయ్య దగ్గర ఓమారు నటిస్తుందొదిన!...అంతే! ...అభిమానం వాత్సల్యం అనేవి హృదయంలో ఉండాలిగానీ, కోరి నటించటంకోసం తెచ్చిపెట్టు కుంటే వస్తాయా?!...ఏమయినాసరే అమ్మలేని లోటు వదిన మాత్రం తీర్చలేదనే నిశ్చయానికి వచ్చింది రమణమ్మ. ఇక ఆ పని కాస్తా తనవల్లే నెర వేరుతుందనే గర్వం రమణమ్మ మనస్సులో బాగా ఉంది.

చిట్టిబాబును సరిగ్గా వదిన చూడలేకపోయిందని లోకం గ్రహించిన తరువాతే, తను తమ్ముణ్ణి తీసుకెళ్ల వచ్చుననే నిశ్చయానికి వచ్చి ప్రయాణానికి సిద్ధ మయింది.

రమణమ్మ స్టేషను కెళ్లడానికి బండీ ఎక్కు తున్నప్పుడు, "నేనూ అక్కయ్యతో వెళిపోతా"నను కుంటూ చాలా గోలచేసి ఏడ్చేడు చిట్టిబాబు. తమ్ముడు అలా తనగురించి ఏడవడం, ఓరకంగా సంతోషమే అనిపించింది రమణమ్మకు!...ఇరుగు పొరుగువాళ్లు చూచి, "ఓహో! అక్కయ్య అంటే చిట్టిబాబు కెంత అభిమానమో!" అని వాళ్లలో వాళ్ల నుకుంటారని, రమణమ్మకు మనస్సులో గర్వం. ఇరుగుపొరుగువాళ్లలానే అనుకున్నారు!!.....

* * *

సహజంగా ఆ కుటుంబంలో ఉన్న సంఖ్యలో ఓటి తగ్గడంచేత, పరామర్శకని వచ్చినవాళ్లంతా వెళ్లి పోవడంచేత, ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఆ నిశ్శబ్ద వాతావరణం చిట్టిబాబుకేమీ రుచించ లేదు సరి గదా, ఏదో భయాన్ని కూడా కలుగజేసింది. అసలే అమ్మ ఏమయిందో, ఎక్కడుందో తెలీకపోవడం చేత ఆ అమాయక హృదయం బెంగతో నిండి ఉంది. ఇక అక్కయ్యకూడా తనను వదినదగ్గర విడిచిపెట్టి వెళ్లిపోయింది. దాని కంతటికీ కారణం వదినే యేమో అని ఆలేతగుండె అభిప్రాయం!...అంచేత వదిన వేపు చూడ్డానికే దడుసుకొనేవాడు. వదిన తనను రమ్మనమని ముద్దుగా పిలిచినా వెళ్ళడానికి జంకేవాడు. వదిన అన్నం పెడితే తినేవాడుకాదు. అన్నయ్యవచ్చి అన్నం కలిపి పెడితే ఓపిడికెడు మెతుకులు తినేవాడు. అంతే!...ఎప్పుడూ దిగులుతో మతి పోయినవాడిలా ఆమూలా ఈమూలా ఒదిగే వాడు.

వాడినేమీ అనకుండా, లాలిస్తూ, బుజ్జగిస్తూ వాడు కోరినవన్నీ ఇస్తూ మంచి మంచికథలు చెపుతూ తనంటేవాడికి భయంలేకుండా ఉండేటట్లు చేసు కుంది కామాక్షి!...క్రమంగా ఓ పదిహేను రోజు లయేసరికి వదిన దగ్గరకొస్తూ చనువు కుదిరింది చిట్టి బాబుకి—ఒక్కొక్కప్పుడు వాడు అమ్మనుగురించడిగే సరికి, వాడిని ఆవిషయంలోంచి మరిపిస్తూ వాడి మనస్సును మరోవిషయంలోకి నేర్పుతో త్రిప్పే సేది.

ఎంతో ముద్దుగా చూడ్డంచేత, అతి చను వేర్పడింది వదినదగ్గర. ఫలితంగా విపరీతమయిన పెంకితనం చేసేవాడు—ఓనాటి మధ్యాహ్నం కామాక్షి నట్టింటిలో పడుకొని తన కొడుకు రామూ నికి పాలిస్తూ ఉంటే, చిట్టిబాబు వెనకనుంచి వెళ్ళి వదిన చీరె కటికపుల్లతో అంటించేసి, "వదినా...నీ చీరకు బలేమంట...టా...టా..." అని గంతడం మొదలెట్టేడు. ఇంకా పూర్తిగా అంటుకోక పోవడంచేత ఎలాగో తనంతట తానే ఆర్పేసుకో గలిగింది కామాక్షి!...ఆక్షణంలో చిట్టిబాబుని రెండుదెబ్బలు చీపురుతో వెయ్యాల నిపించింది. కానీ తల్లిలేని పిల్లవన్న సంగతి జ్ఞాపకంవచ్చింది. గట్టిగా వాడిని మందలిస్తే ఏంబెంగ పెట్టుకుంటాడో అని ఏమీ అనలేదు. "తప్పుకదూ?...అలా నిప్పుతో ఆడకూడదు నాయినా?" అని మాత్రం అంది. ఆ

మాత్రంమాట అన్నందుకే ఇట్టే మూతి పెట్టేసి, బెంచీ వార కెళిపోయి. అలిగి కూర్చున్నాడు.

ఆ సాయంత్రం శేఖరం ఇంటికి వచ్చి, పరుపు మీద ఉన్న కాలిన చీరను చూసేడు. ఎలా అది కాలిందో ఆ సంగతంతా భార్యనడిగి తెలుసుకున్నాడు—ఏరా, చిట్టిగా! రాస్కెల్ నిప్పుతోరా నీ ఆటలు" అంటూ ఛళ్, ఛళ్ మని రెండు లెంప కాయలు కొట్టేడు, కొట్టొద్దని కామాక్షి అడ్డుకుంటున్నప్పటికీ!...

...ఏడ్చిఏడ్చి పడుకున్న తమ్ముడు నిద్దట్లో కూడా అలా వెక్కుతూనే ఉండడం చూసేడు శేఖరం!—నిద్దట్లో కూడా వెక్కెలా ఏడ్పించినందుకు తనను తానే నిందించుకున్నాడు శేఖరం. ఒక వేళ అమ్మే బ్రతికుంటే వాడినంతలా కొట్టనిస్తుందా?...అలా వాడిని కొట్టడానికి తనకు మాత్రం స్వతంత్రం ఉంటుందా?...ఇక ముందెప్పుడూ అలాకొట్టకూడదని నిశ్చయించుకున్నాడు.

తనలా భర్తతో నిజం చెప్పడమే పొరపాటను కుంది కామాక్షి. ఏదో తన అశ్రద్ధచేతే చీర కాలిపోయిందనేస్తే పూచీ లేకపోయేదిగా!—ఏడుపు ముఖంతో మధ్య మధ్య వెక్కుతూ పడుకున్న బాబుని చూసేసరికి ఆమెకళ్లు నీళ్లతోనిండి పోయేయి. తెలీక చేసినపని గానీ, తెలిసి చేసేడా ఆపని చిట్టిబాబు? ఆ మాత్రందానికోసం అంత గట్టిగా కొట్టడానికి తన భర్తకుమాత్రం ఎలా ఒచ్చాయో చేతులు?...అని ఏమేమో సమాధానాలు లేని ప్రశ్నలు వేసుకుంటూ ఆరాత్రి గడిపింది కామాక్షి!...

ఆ మర్నాటినుంచీ మళ్లీ మామూళ్లు పెంకితనంలోకి దిగేడు చిట్టిబాబు. తల్లి బ్రతికుండే టప్పుడు ఏదయినా పెంకితనం చేస్తే కసిరి మందలిస్తూ ఉండేది. ఇప్పుడు తల్లిలేని పిల్లడవడంచేత కసిరి మందలిస్తే ఏంబెంగ పెట్టుకుంటాడో అని, ఎంత పెంకితనం చేసినా ఏమీ అనకపోడంచేత, చిట్టిబాబు చేసే పెంకితనం మరీ విపరీతమయింది.

తమ్ముడుచేసే పెంకితనం మరీ విపరీత మయినప్పుడు శేఖరం మాత్రం అప్పుడప్పుడు కేకలు వేసేవాడు. కానీ వదిన తాలూకుదన్ను తనకు బాగా ఉండడంచేత అన్నయ్య వేసే కేకలను లెక్క పెట్టేవాడు కాదు!...ఫలితంగా చిట్టిబాబు చేసే పెంకితనానికి హద్దులు లేకపోయేయి!...

...ప్రతీ వస్తువూ నూతులో పడేయడం—గాజుసామానులూ అవీ బ్రద్దలుకొట్టడం—అన్నయ్య కొడుకు రామాన్ని కొట్టి ఏడిపించడం—ఈరకంగా అల్లరిపనులు చేసేవాడు.

ఒకమారు మహా విపరీతమయిన పెంకితనం చేసేడు. అన్నయ్య ప్రతిరోజూ ఉదయాన్నే చలి కాగడంకోసం, పశువులు తినగా వదిలేసిన గడ్డి కూడదీసి మంటవేస్తూ ఉండడాన్ని జాగ్రత్తగా పరిశీలించేడు. తనకీ మంట వెయ్యాలని బుద్ధిపుట్టింది. గడ్డి కూడదీసి ప్రత్యేకించి మంటవేస్తే పెద్దమంట వదని, సరాసరి గడ్డికుప్పున్న సాలలోకే వెళిపోయి కుప్పను అంటించేడు. చిన్నమంట మండుతున్నప్పుడు ఏమంత సంతోషాన్ని పొందలేదు బాబు! అది భగభగామండి సాలకూడా పూర్తిగా అంటుకొనేసరికి, భయం, ఆశ్చర్యం, సంతోషం అన్నీ కలిగేయి చిట్టిబాబుకు. ఊళ్ళోవాళ్లంతా ఆతృతతో పరిగెట్టి అక్కడికి వచ్చేసరికి,—"అన్నయ్య ఎప్పుడైనా వేసేడా ఇంత పెద్దమంట!...చేనుటా...టా..టా..." అని గెంతుతున్నాడు.

ఆవాసంతా కాలిపోతేనేగానీ ఆర్పలేకపోయేరు.

అంతమందికి నష్టంకలిగించిన చిట్టిబాబుమీద ఆ ఊరువాళ్లందరికీ అసహ్యం, కోపం రెండూ వచ్చేయి. "ఎంత చిన్నపిల్లడయితే మాత్రం ఇలాంటి పనులు టండీ!...ఊళ్ళో ఎందరు చిన్నపిల్లలు లేరు!..." అని కొందరూ—"ఎంత కరణంగారయినా, తమ్ముణ్ణి సరిఅయిన అదుపాజ్ఞలలో ఉంచొద్దుటండీ!" అని కొందరూ—"తల్లి బ్రతికుండేటప్పుడు ఇలాంటి పను లెరగడండీ!...వాడినీ రకంగా తయారుచేస్తున్నదా కామాక్షేనుటుమండీ!" అని కొందరూ—"వాడి కేదో మందు పెట్టి వాడి మతి విరిచేసిందండీ! లేకపోతే ఇలాంటి పనులు చేస్తాడా? ఆ రవణమ్మ పీడ విక్కడ వదిలేసం తెలివితక్కువ పనే చేసిందని" కొందరూ, ఈరకంగా వాళ్ళిష్టం వచ్చిన ట్లనడం మొదలెట్టేరా ఊళ్లోవాళ్లు.

లోకులనే మాటల్ని భరించలేక శేఖరం తమ్ముణ్ణి తట్లు తేలేలా రివకతో కొట్టేడు. అలా కొడుతున్నప్పుడు అడ్డుకోబోయి తనూ కొన్ని దెబ్బలు తింది కామాక్షి. ఇంకా కొట్టబోయేడు కానీ అంతవరకూ మొఱ్ఱోమని గట్టిగా ఏడ్చిన చిట్టిబాబు ఒక్కమారుగా ఊరుకోడంచేత తెలివితప్పిపోయేడని గ్రహించి శాంతించేడు. కామాక్షి కళ్లు నీళ్ళతో నిండిపోతూనాయి. ఆవేళలో సహనశక్తి పట్టుతప్పింది. శేఖరం తనభర్త అన్న సంగతి అప్పుడు మరచిపోయింది. గొంతు కంఠటినీ విప్పి, "మనిషివా, పశువ్వా?" అని నీళ్ళతోనిండిన ఎఱ్ఱటికళ్లను పెద్దవి

చేసి అడిగింది. మళ్లీ అంది—"లోకాన్ని మెప్పించ డానికికదూ వాడిని కొట్టేరు?... ఈ పాడు వెధవల మెప్పు పొందడానికేనా వాడి నంతలా కొట్టేరు?... ఈ వెధవల ఇళ్లు కాలితే వచ్చిన నష్టమేమిటి?... బ్లాకుమార్కెట్టులో వచ్చిన డబ్బుతో కట్టిన ఇళ్లేగా?... ఇళ్లు కాలినంతమాత్రంలో వాళ్లు శుద్ధి కారు. దానితో పాటు వాళ్లూ కాలినపుడు శుద్ధవుతారు. వెధవలు! లోకజ్ఞానంలేని వెధవలూ!!...ఏమీ తెలీని చిన్న పిల్లవాడో చేసేడని ఇంత రాద్ధాంతమా?..." అని ఏమేమో నానామాటలూ అంది కామాక్షి ఆ ఉక్రోషంలో!...

అంతవరకూ చిట్టిబాబుని కొడుతూ ఉంటే చూస్తూ ఊరుకొని, తీరా వాడు తెలివి తప్పిపోయేక, — "చిన్నపిల్లడు కదా, వాడికేం తెలుస్తుందని అంతలా కొట్టడం?!...బుద్ధి లేకపోతేసరి!" అని అప్పుడు శేఖరాన్ని చీవాట్లేసేరు లోకులు!!...

కానీ మరో విచిత్ర మేమిటీ అంటే, "చిట్టిబాబుని ఆ రకంగా వెర్రివాడిలా తయారుచేస్తున్నది కామాక్షే అనీ, నిజానికి కామెకు చిట్టిబాబుమీద అభిమానం లేనే లేదనీ, వాడిని ఈరకంగా చిన్నప్పటి నుంచీ బుద్ధిలేనివాడిగా తయారుచేసి, పెద్దయేసరికి పిచ్చివాడి ఆకృతివాడికి తెప్పించడమే ఆమె లక్ష్యమనీ, చిట్టిబాబుమీద ఎంతో ప్రేమ ఉన్నట్లు నటించుతూ, వాడి పేరుతో కొన్న ఓవల్టిన్ డబ్బాలూ అవీ తన కొడుకు సుఖించి వినియోగించుకుంటున్నాడనీ, ఇప్పుడయినా రమణమ్మ వచ్చి వాడిని తీసుకెళ్లిపోతే కొంత బాగుపడతాడనీ—" ఈ రకంగా లోకులు రకరకాలుగా కామాక్షిని విమర్శించడం మొదలు పెట్టేరు.

కామాక్షి హృదయంలో తుఫాను చెలరేగింది!—తను ఎంత ప్రేమతో చిట్టిబాబుని చూచుకున్నప్పటికీ లోకు లెందుకిలా అనుకుంటున్నారో అర్థమయిందికాదామెకు!...తప్పున్నా లేకపోయినా విమర్శించడమే లోకం తాలూకు లక్షణమని ఆమె తెలుసుకుంది—తను చిట్టిబాబు విషయంలో ఏం లోపం చేసింది? అని తనలో తాను ప్రశ్నించుకుంది. తనంతవరకూ ఏ లోపం చేయనట్లు అంతరాత్మ ప్రబోధిస్తున్నాది. ఇకముం దెప్పుడూ తన చేతులతో తను బాబుకి హాని చెయ్యలేదు కూడా!...బాబంటే తనకు హృదయపూర్వకమయిన వాత్సల్యం ఎలా కలిగిందో తనకే తెలీదు!—కానీ లోకులుమాత్రం తనను అపార్థం చేసుకున్నారని కామాక్షికి విచారం...

పైగా తన ఆడపడుచు రమణమ్మ నెలకు కనీసం రెండు ఉత్తరాలకు తగ్గకుండా వెళ్లిన దగ్గరనుంచీ రాస్తున్నాది, తమ్ముణ్ణి పంపించేయమని. ఆమధ్య, ఎదురింట్లో ఉన్న వరహమ్మ తన ఆడబొట్టిఉన్న ఊరెళ్లి వచ్చినప్పుడు అందిటా, "మా వదినేం చూస్తుందండీ వాడిని; దాని దగ్గరుంచితే మేం వాడిని చేతులారా చంపుకున్నవాళ్ల మవుతాము" అని. ఆ మాటలు కామాక్షి హృదయాన్ని కొంతవరకూ గాయపరచేయి. అయినా కాస్త దిట్టమయిన గుండె కాబట్టి చలించలేదు. తనమీద వరహమ్మ ఏదో చెప్పుండబట్టి అలా అనుంటుందని సమాధానపడింది. ఇంతకీ ఈ లోకులనే మాటల్ని అంతగా మనస్సుకు పట్టించుకోదలచుకోలేదు కామాక్షి.

చిట్టిబాబలా ఇంటి దగ్గరుంటే, ఏమీ ఊసుపోక అల్లరిపనులు చేస్తున్నాడని ఆ ఊరిబడిలో ప్రవేశపెట్టేడు శేఖరం. కానీ ఆ చదువు అట్టే రోజులు సాగలేదు. బడికి పంపించుతున్న దగ్గరనుంచీ చిట్టిబాబు బెంచేతో వల్లగా మాడిపోవడం మొదలెట్టేడు. అదీకాక అక్కడ మేష్టరు చీటికీ మాటికీ, "ఏమీరాని మొద్దువెధవా!" అంటూ కొడుతూ ఉండేవాడట—

—నిజానికి చిట్టిబాబు కూడా ఒట్టి మందమతి వాడిలా ఉండేవాడు. ఏదో చెప్పినా ఏదో పరాకుగా వినేవాడు. అక్షరాలు దిద్దుతూ దిద్దుతూ చెరిపేసేవాడు. అప్పుడే చిన్న విషయాన్ని ఆ వెంటనే మరచిపోయేవాడు. పైగా అల్లరిచేసేవాడు. అంచేత పంతులు రెండు చరుపులు చరిచేవాడు.

అలా కొట్టి చదువుచెప్పడంవల్ల ప్రయోజనం లేదని కామాక్షి ఉద్దేశ్యం. అందువల్ల మరింత పిల్లలు పాడయిపోతారని ఆమె తలంపు—ఓమారు ఒళ్లు కందిపోయేలా చిట్టిబాబును మేష్టరు కొట్టడంచేత, ఆ మేష్టరికి చదువుచెప్పడం రాదని, నాలుగుతిట్టి, బాబును బడికి పంపించడం మానేసి తానే స్వయంగా చదువు చెప్పడానికి పూనుకుంది.

ఈ చదువు కూడా ఎన్నాళ్లో సాగలేదు! అనుకోకుండా ఆడబొట్టి రమణమ్మ వచ్చేసింది, చిట్టిబాబుని తనతో తీసుకెళ్లిపోడానికి.

రమణమ్మ రావడంతోనే కామాక్షి హృదయంలో చెలరేగిందో పెనుగాలి. అసలు రమణమ్మ వస్తూనే, "ఇదేమిటమ్మా పిల్లడిలా పూచికపుల్లలా అయిపోయేడు!" అని తమ్ముణ్ణి ఎత్తుకొని, కామాక్షి సరిగ్గా చూడకపోవడంవల్లే అలా ఎండిపోయేడనే ధ్వని ఆ స్వరంలో ఉండేలా అంది.

ఆ మధ్యాహ్నం ఊళ్ళో వాళ్లంతా ప్రోగయి, చిట్టిబాబుని కామాక్షి పాడుచేస్తున్నాదనీ, వాడినో పిచ్చివాడిలా తయారుచేస్తున్నాదనీ, ఈ రకంగా గమ్మత్తయిన కథ అల్లి రమణమ్మ ముందు వర్ణించేరు.

తమ్ముడలా పాడయిపోయేడని కామాక్షి అట్టే విచారించలేదు గానీ, కామాక్షి చిట్టిబాబుని సరిగ్గా చూడలేకపోయిందని లోకులు గ్రహించినందుకు ఓ రకంగా సంతోషించింది. ఇక తన అధీనంలో తమ్ముణ్ణి పెంచి వాడిని ఆదర్శవంతునిగా తయారుచేసి లోకం మెప్పు పొంది వదినకన్నా తనే ఘటికురాలనిపించుకుందామని రవణమ్మ ఉబలాటం.

'తమ్ముణ్ణి తీసుకెళతా'నని అన్నయ్య నసిగింది.

"ఇప్పుడే మా తొందర!" అన్నాడు శేఖరం.

"బాగానే ఉంది. ఇలా ఈ పల్లెటూళ్ళో చదువూ సంధ్యా లేకుండా ఎన్నాళ్ళని ఉంచేస్తావు? ఇప్పటికే మొద్దు వెధవలా తయారయేడు." అంది రవణమ్మ కొంచెం స్వరం హెచ్చుచేస్తూ.

"సరే, వదిన నడిగి తీసుకెళ్లు!" అన్నాడు శేఖరం.

"ఇంట్లో ఆడారిపెత్తనం ఏమిటి? బాగానే ఉంది. తమ్ముణ్ణి పంపించడానికి వది నెవత్తి మధ్యని!......" అంది రవణమ్మ ముఖం చిట్లించుకుంటూ.

వంటింటిలోంచి ఈ సంభాషణను మొదటి నుంచీ వింటున్న కామాక్షి బయటకు వచ్చి, "అప్పుడే వాడికేం ఈడు మించిపోయిందని చెప్పరూ, పట్నంలో చదివించడానికి. ఆమాత్రం నాలుగో క్లాసువరకూ చదు విక్కడా ఉందిగా. ఆ నాలుగు తరగతులూ అయిపోయేక కావలిస్తే పట్నంస్కూలులో ప్రవేశపెట్టొచ్చు." అంది కామాక్షి ఎంతో శాంతంతో.

"ఔను!...ఇంకా మరి కొన్నేళ్లపాటిక్కడ ఉంటే,—చక్కా మా తమ్ముడి పేరుతో నీ కొడుక్కు కావలసినవన్నీ ఓవల్టిన్ డబ్బాలూ, సిల్కు లాల్చీలున్నూ......ఇంకా, ఇంకా అన్నీని!" అని ఎత్తిపొడిచింది రవణమ్మ.

కామాక్షి మనస్సు చివుక్కుమంది. "తొందరపడి అలా అనకమ్మా. ఇప్పుడీ రాద్ధాంతం ఎందుకూ? అంతగా తీసుకెళ్ళాలని ఉంటే తీసుకెళ్లు......వాడెప్పుడు బెంగ పెట్టుకుంటే అప్పుడు పంపించేయి." అంది మనస్సులోంచి ఉబుకుతున్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

అంతట్లో చిట్టిబాబు అక్కడికి వచ్చేడు. "అక్కయ్యా మరి నే నక్కడకు వస్తే, నాకు రోజూ కాఫీ ఇస్తావా?" అని అడిగేడు అక్క చెయ్యి పట్టుకొని వ్రేళ్ళాడుతూ.

"ఎంత వాచిపోయేవో నాయనా!.....రెండు పూటలా బావతోపాటు నీకూ ఇస్తానులే!" అంది.

"కాఫీ అలవాటు వాడికి చెయ్యకమ్మా. అదేం మహా బలమయిన పదార్థమని! అది అలవాటయితే నీరసించిపోతాడనే, రోజూ నేను చల్దన్నం పెడుతున్నాను" అంది కామాక్షి.

"అందుకే ఇలా మందమతివాడిలా తయారవుతున్నాడు. వెధవ పల్లెటూరలవాట్లూ నీవూనూ!..." అంటూ బాలు నెత్తుకుంది రవణమ్మ.

చిట్టిబాబు ఎంతో సంతోషంతో ప్రయాణమయేడు. బండీ ఎక్కుతున్నప్పుడు వదినతో అన్నాడు. "వదినా నేనీ నెలాఖర్లో మరి రాను. రావాలంటే నువ్వే అక్కడికిరా!...మా అక్కయ్య కూడా వెళ్లొద్దని చెప్పేసింది. అన్నట్లు రామూన్ని కూడా చదువుకుందికి పంపించీ కూడదూ?" అని నవ్వుతూ అడిగేడు. చిట్టిబాబు వేపు దీనంగా చూచింది కామాక్షి. ఏదో అనబోయింది. కానీ నోరు తెరవబడలేదు. ఆమెకో తెలీని భయం పట్టుకుంది— "బాబూ వెళ్ళక"ని కేకేద్దామనుకుంది కానీ... కానీ...బండీ మలుపుతిరిగి వెళ్ళిపోయింది! బరువయిన హృదయంతో తన కొడుకు రామూన్ని చంక నెత్తుకొని ఇంటిలోకి వెళ్ళిపోయింది కామాక్షి.

* * *

అంతా క్రొత్తవాతావరణం, క్రొత్తపరిసరం!- అంతా వింతగా ఉంది చిట్టిబాబుకి. తను వదిన దగ్గర అల్లరిచేసినట్లే అక్కడా చేద్దామనుకొని ప్రారంభించబోయేడు. కానీ లాభం లేకపోయింది. అతి ముద్దుగా చూస్తూ, పిల్లలకు స్వేచ్ఛ ఇస్తే పాడయిపోతారని రవణమ్మ ఉద్దేశం. అంచేత తనకొడుకు పంతుల్ని చిన్నప్పటినుంచీ ఆరకం ఖాయిదాలోనే ఇంతవరకూ ఉంచింది. ఇక తమ్ముణ్ణికూడా ఆరకం ఖాయిదాలో ఉంచితేనే బాగుపడతాడని ఆమె ఉద్దేశ్యం!—

పరిసరంతో బాటు కట్టు బొట్టూ మారేయి. వచ్చిన రెండెవరోజునాడు, తన మామూలు అలవాటుప్రకారం, ఓ గాజు బొమ్మతో ఆడి, దాన్ని చితక్కొట్టేడు. తననుకూడా అక్కయ్య చితక్కొట్టింది, "మరెప్పుడూ అలా గాజుబొమ్మలతో ఆడక"అని. అప్పుడు అలాతనను అక్కయ్య కొట్టిందని ఎవరితో చెప్పుకుంటాడు?!...అమ్మా, వదినా ఇద్దరూ ఆ అమాయక హృదయంలో మెరసేరు. ఆ మాత్రం దానికోసం వాళ్ళు తనను ఎప్పుడయినా అంతలా కొట్టేరా?...ఉహూఁ!...గోడ వారకు పోయి చాల సేపు ఏడవడం తప్ప మరేమీ చెయ్య

లేక పోయేడు. పైగా అలా ఏడుస్తున్నందుకు కూడా తిట్టిం దక్కయ్య.

మరో నాలుగురోజుల్లోనే, ఓ మంచిరోజున, బడిలో ప్రవేశపెట్టించింది తమ్ముణ్ణి. ఆ బడి తన పల్లెటూరు బడిలాగే ఉంటుందనీ, తను కరణంగారి తమ్ముడని ఇక్కడకూడా తనంటే అందరికీ భయం ఉంటుందనీ,...ఇంకా ఏమేమో అనుకున్నాడు. కానీ తననుకున్నట్టు లేదా బడి. అక్కడి పిల్లలందరూ, తనకు మించే పెంకితనాన్ని చేస్తున్నారు. తను కరణం గారి తమ్ముడని అయినా భయంలేక— "పల్లెటూరు బైతు, పల్లెటూరి బైతు." అని అంటూ తనని ఏడిపించడం మొదలెట్టేరు. వాళ్ళతోపాటు తన మేనల్లుడు పంతులుగాడు కూడా 'పల్లెటూరి బైతుమామా! ఓ పట్టీనామా!" అని వాళ్ళతో కలిసి అంటూ తన నేడిపించడానికి పూనుకున్నాడు. తను వాళ్ళ నేమి అనగలడు?...వాళ్ళు చాలా మంది ఉన్నారే! వాళ్ళు తన కన్నా చురుగ్గా ఉండి మంచి తెలివయినవాళ్ళలా ఉన్నారాయె!—ఎలా వాళ్ళను తను తిరిగి అనగలడు?-ఆఖరికి ఏడవడంతప్ప మరేమీ చెయ్యలేకపోయేడు. అంతల్లో మేష్ట రొచ్చేడు. అందరూ నిలబడ్డారు. చిట్టిబాబు మాత్రం అలా బిక్కచచ్చిపోయి ఇంకా కూర్చునే ఉన్నాడు. గబగబా చిట్టిబాబుదగ్గరకు మేష్టరొచ్చి, "ఓరి వెధవా, మేష్టరొస్తే లేచి నిలబడాలని తెలీదట్రా?!" అంటూ గబగబా నాలుగు మొట్టికాయలు మొట్టేడు—"వాడో పల్లెటూరి బైతండీ!" అన్నాడో కుర్రాడు వెనకనుంచి—"ఓ! పల్లెటూరి బైతా...అందుకే గౌరవమర్యాదలు తెలీవు వెధవకి!" అన్నాడు మేష్టరు.

తను తనూరిబడిలో ఎప్పుడు, అలా లేచి నిల్చున్నాడు మేష్ట రొచ్చినప్పుడు? తనూళ్ళో మేష్టరు ఈ మాత్రం చిన్నవిషయానికి కూడా కొట్టేవాడా? ఊహూఁ!...

"మరి నేనా బడికి వెళ్ళ"నని ఏడుస్తూ అక్కయ్యతో చెప్పేడు చిట్టిబాబు.

"ఏం?" అని అడిగింది అక్కయ్య.

జరిగిన సంగతంతా ఏడుస్తూ చెప్పేడు చిట్టిబాబు. అంతా విని—"ఓరి వెధవా నీ పెంకితనం అంతా మనూళ్ళోనేనా?....ఇక్కడ చెల్లనయింది కాబోలు! చక్కా ఆ పంతుల్ని చూడు, నీకన్నా చిన్నవాడయినా నీతో సమానంగా చదువుకుంటున్నాడు. వాడిని ఒక్కడయినా ఏమయినా అనగలుస్తున్నాడా? అంటే పారేస్తాడు. చక్కా వాడిలా నువ్వూ ఉండాలి...బొత్తిగా మేష్టరొస్తే నిలబడవట్రా!! పోనీ వాళ్ళందరూ లేచి నిల్చున్నప్పుడు, వాళ్ళను చూచయినా లేచి నిలుచున్నావు కావేం?.. ఆమాత్రం విషయాలుకూడా నుందుగా చెప్పాలట్రా?!" అంది రమణమ్మ.

అక్కయ్య అలా అటుందని అనుకోలేదు చిట్టిబాబు. వదినే ఉంటే అలా ఊరుకుంటుందీ. తనను అంతలా కొట్టినందుకు మేష్టర్ని నాలుగు చీవాట్లేయ్యదూ?!...ఇకముందు ఆ ఊళ్ళో తనెలా ఉండగలడో అర్థమయింది కాదు చిట్టిబాబుకి!...ఆరోజు మట్టికి బాగా ఏడ్చేడు.

రోజులు గడుస్తున్నాయి—ఏదో బెంగపట్టుకుందా అమాయక హృదయానికి. ఆఖరికి తన బావ గారు కూడా తనను ఏడిపించడమే!...ఏవో లెక్కలు చెయ్యమని, పంతులికీ చిట్టిబాబుకీ ఇవ్వడం!... సహజంగా చిట్టిబాబు చెయ్యలేకపోడం. "ఓరి బద్ధూఖాన్" అని ఏడిపించటం—ఈరకంగా, వివిధ పద్ధతులలో తమాషాకోసం ఏడిపించేవాడు వెంకట్రావు.

సహజంగా చిట్టిబాబు లెక్కల్లో వెనుకపడి ఉన్నాడని, ప్రయోగాత్మకంగా గణితసంబంధజ్ఞానం గరుపితే బాగా పట్టుబడుతుందనీ, పంతులతో సహా బజారుకు పంపించి కూరలూ మొదలయినవి బేరమాడి కొని ఇంటికి తీసుకురావడంలాంటి ఇటువంటిపనులు చెప్పేది. అంత చిన్నవయస్సులోనే బజారుపని చక్కగా చేయగలుగుతున్న పంతుల్ని పొగుడుతూ, తనకు చేతగాదని తిట్టడము నేది ఎంతో బాధగా తోచింది చిట్టిబాబుకి. తనూళ్ళో తనను వదిన దుకాణానికెళ్ళమనీ ఏదయినా కొనమనీ ఎప్పుడు పంపించింది గనక!...

నిజానికి చిట్టిబాబుని బాధించాలనే ఉద్దేశ్యం రమణమ్మకే కోశానా లేదు. అలా తిట్టినట్లయితే, సిగ్గుపడి జాగర్తగా అన్నీ తెలుసుకుంటాడని!... చిన్నప్పటినుంచీ బజారుకు పంపించి, కావలసినవి కొని తీసుకురమ్మన్నట్లయితే, ఆ సంబంధించిన లెక్కలు బాగా తెలుస్తాయనీ, తనపని తాను చేసుకోడంవల్ల తప్పులేదనే జ్ఞానం కలుగుతుందనీ, ఆ రకమయిన పనులు చేయించేది—మొక్కప్పుడే వంచాలన్న థియరీ రమణమ్మది. అంచేత చిన్నప్పుడు వాళ్ళకు తగినశిక్షణిస్తే పెద్దయేక సంఘంలో గౌరవంగా బ్రతికగలరని ఆమె అభిప్రాయం. అందుకే వాడిని తగిన క్రమశిక్షణలో ఉంచడానికి పూనుకుంది. బడిలో మేష్టరుతో కూడా చెప్పమని భర్తతో చెప్పింది—'బాగా చదువుచెప్పాలనీ, అవసరమయితే రెండుదెబ్బలు కొట్టికూడా వాడిని సరి అయిన క్రమశిక్షణలో ఉంచాలనీ, ఎలాఅయినా ఓ

సంవత్సరంలో, ఓ పట్నవాసపు కుఱ్ఱాడికంటే మంచి తెలివయినవాడిగా తయారుచెయ్యాలనీ" చెప్పమంది.

ఆ చెప్పిన మాటలను ఆసరాగా తీసుకొని, మేష్టరు చిట్టిబాబును చితక్కొట్టేవాడు, దయా దాక్షిణ్యాలు లేకుండా!—కొట్టి చదువుచెపితే పిల్లలు బాగుపడతారని తెలివితక్కువతనంగా పిల్లల గార్డియన్సు చెప్పటంవల్లనూ. అయితే మాత్రం?...తను ట్రయినింగ్ కాలంలో నేర్చుకున్న విషయాలన్నీ ఏమయినట్టు? వంశానుసరణి, పరిసరం, సహవాసాలు, సహజప్రజ్ఞ వీటిని తెలుసుకొని, తగిన పద్ధతులను నిర్ణయించుకొని బోధించాలనే జ్ఞానం ఆ మాష్టరి కుండక్కర్లే?...

ఆ విపరీత పద్ధతులూ, పరిసరం అవన్నీ చిట్టిబాబును మరింత మందమతివాడిలా తయారుచేసినయ్!...తన పల్లెటూరు, తన అన్నయ్య, వదినే మంచివాళ్ళని అనిపించింది. మళ్ళీ అక్కడికి పోవాలని బుద్ధి పుట్టింది కానీ ఎలా?....

ఎప్పుడూ ఏదో పరాకుగా ఉండేవాడు. ఏదయినా రాయమంటే, "అలాగే." అని అలా పలకపుల్లను పట్టుకొని నిర్ఘాంతపోయినట్లు కూర్చునేవాడు. అలా ఊరికినే కూర్చున్నందుకు మేష్టరు కొట్టేవాడు. పుస్తకాలూ, అవీ ఎక్కడో పారేసుకొచ్చేవాడు. వాడి వైఖరి గమనించి కొందరు కుఱ్ఱాళ్లు, వాడి దగ్గరి వస్తువులు దొంగిలించేసేవారు—

ఇంటికొచ్చినతరువాత, "ఎక్కడ పారేసుకున్నావు జగ[illegible]!" అంటూ అక్కయ్య తిట్టి కొట్టేది "వాటన్నీ అందరకూ ఇచ్చేస్తూఉంటాడమ్మా" అని పంతులు కొంత కల్పించి చెప్పేవాడు. ఏడవడంతప్ప మరేమీ చెయ్యలేకపోయేడు చిట్టిబాబు.

ఓనాడు, బడిపంతులు—"మరి లాభం లేదండీ!...వట్టి మందమతి. ఎంత చెప్పినా రాదు వాడికి. ప్రత్యేకించి ప్రయివేటుపెట్టి చదువు చెప్పిస్తే కొంతమట్టుగ బాగుపడతాడు." అని వెంకట్రావుతో రోడ్డుమీద కలుసుకొని చెప్పేడు.

"వాడి మదర్ పోయినదగ్గరనుంచీ వాడి నక్కడే ఉండనివ్వవలసింది. కొన్నాళ్లు వాళ్ళ వదిన చేత ట్రయినింగ్ అయింది. ఈరకంగా వాడిని తయారుచేసింది. సహజంగా వాడు తెలివయినవాడే!" అని వెంకట్రావు ఉవాచ.

రవణమ్మకు కూడా అదే అనుమానం!—వదినే వాడికేదో మందు పెట్టి మతి పాడుచేసుంటుందని ఆమె అభిప్రాయం!...వాడిని మళ్ళీ ఎలా బాగుచేయ్యాలో అర్థమయింది కాదు రవణమ్మకు—ఇక రోజురోజుకీ ఎండిపోతున్నాడు కూడా!...ఏం చెయ్యడం? సహజంగా తన తమ్ముడు ఎంతో ఆరోగ్యంగా మంచి తెలివితేటలతో ఉండేవాడు. అమ్మ పోయినతరువాతే అలా తయారయేడు. అమ్మ పోయిన వెంటనే తను తీసుకెళిపోవలసింది. అలా తీసుకెళిపొచ్చినట్లయితే ఈపాటికెంతో బాగుండేవాడనుకుంది. వదినను ఎన్ని తిట్లాలో అన్నీ తిట్టింది తన తమ్ముణ్ణి అలా చేసినందుకు. పోనీ, అన్నయ్యకేనా బుద్ధుండక్కర్లే, ఇలా తమ్ముణ్ణి తయారుచేస్తున్నప్పుడు చూస్తూ ఊరుకోడానికి?...అని రవణమ్మ అనుకుంది. ఏమయినాసరే తన తమ్ముణ్ణి తను మళ్ళీ బాగు చేసుకోవటం తనవిధని అనుకుంది.

ఇకనుంచీ తమ్ముడికి ప్రయివేటు చెప్పిస్తూ ఉండాలని అనుకుంది. ఇలా తమ్ముడికి ప్రయివేటు చెప్పించ నిశ్చయించుకున్నట్లు, వాడు ఎండిపోతూ ఉండటంచేత ఓవల్టిన్ డబ్బాలుకొని పెట్టేటందుకూ డబ్బు ప్రతీనెలా పంపించమని అన్నయ్యకు ఉత్తరం రాసింది రవణమ్మ.

రవణమ్మ రాసిన ఉత్తరం అందిన తక్షణం ఓ ముప్పైరూపాయలు పంపించేరు. ప్రతీనెలా పదిహేను రూపాయల చొప్పున పంపిస్తూ ఉంటావని రాసేరు. పైగా, వదిన చిట్టిబాబుని చూడాలనుందని ప్రతీరోజూ అంటున్నాదనీ, అప్పుడప్పుడు నిద్దట్లో "చిట్టిబాబు" అని పలవరిస్తూ ఉంటుందనీ, తరుచు చిట్టిబాబు క్షేమసమాచారం గురించి ఉత్తరాలు వస్తుంటేనేగానీ వదినకు నిద్దరపట్టదనీ—ఉత్తరం రాసేరు శేఖరం.

డబ్బు పంపించినందుకు సంతోషించింది కానీ, ఉత్తరంలో వదినగురించి వ్రాసిన వర్ణనకు ఒళ్లు మండింది రవణమ్మకు. తెచ్చిపూసిన [illegible] అదని అనుకుంది. వదిన నటన అర్థంకాక అన్నయ్య మోసపోతున్నాడని అన్నయ్యమీద జాలికలిగింది. అసలు చిట్టిబాబుని మెల్లగా ఈ లోకంలో లేకుండాచేస్తే అంత ఆస్తీ తను ఒక్క కుటుంబానికే చెందుతుందని వదిని ఉద్దేశ్యమని రవణమ్మ భయం!...ఏమయినాసరే తమ్ముడు పెద్దవాడయ్యే అంతవరకూ అక్కడకు పంపకూడదని నిశ్చయించుకుంది.

* * * *

చిట్టిబాబు కోసమని ప్రయివేటుమాష్టర్ని ఒకర్ని నియమించింది రవణమ్మ. ఆ మేష్టరు ఎన్నో ప్రశ్నలడగ్గా అడగ్గా ఒక్క సమాధానం చెప్పేవాడు. ఆ జవాబయినా చాలా హీనస్వరంతో చెప్పేవాడు. గట్టిగా చెప్పమని ఇంట్లోంచి రవణమ్మ కేకలేసేది. ఆ కేకలతో అసలు చెప్పదలచుకున్న జవాబు

కూడా చెప్పేవాడు కాదు!...అక్కడితో ఆనాటి ప్రేయి వేటయిపోయేది.

సాయంవేళ అందరు పిల్లలూ మంచి చలాకీగా ఆడుకుంటూ ఉంటే, తనుమాత్రం చూస్తూ నిలబడే వాడు. "చక్కా పరుగెట్టి నువ్వూ ఆడుకోరా" అని అక్కయ్య అంటే అక్కడుండకుండా ఎటో వెళ్లి పోయేవాడు.

ఓనాటి సాయంత్రం బావ ఆఫీసునుంచి వస్తూ ఉంటే, మధ్యదారిలో ఆపి,—"నేను అన్నయ్యకి దగ్గర కెళిపోతాను" అని అన్నాడు ఏడుస్తూ.

"ఏం ?" అని అడిగేడు వెంకట్రావు.

"అక్కయ్యకన్నా వదినే మంచిది. అంచేత వదిన దగ్గరకే వెళిపోతాను" అన్నాడు మరింత బిగ్గరగా ఏడుస్తూ.

"పల్లెటూరుపోయి ఏంచేస్తావురా ? అవులను కాస్తా వేమిటి ?" అని మొదట కొంచెం కఠినంగా అన్నాడు కానీ, మళ్లీ మనస్సు కరిగింది గాబోలు, "సరే, నువ్వెందు కక్కడికి వెళ్లడం, వాళ్లనే ఇక్కడకు రమ్మనమని ఉత్తరం రాస్తానులే!" అన్నాడు.

ఆ రాత్రి తమ్ముణ్ణి రమణమ్మ అడిగింది. "ఏంరా! నాకన్నా వదినే నీకు మంచిదా ? వెధవా!...వెధ్ధువెధవా!..." అంటూ ఛళ్ ఛళ్ మని శరీరం కందిపోయేలా కొట్టింది.

అలా ఏడుస్తూనే అన్నం తినకుండానే పడుకున్నాడు చిట్టిబాబు. నిద్దట్లో కూడా వెక్కుతున్న తమ్ముణ్ణి చూసేసరికి ఆమె హృదయం కంపించి పోయింది. అలా వాడిని కొట్టినందుకు తనను తానే నిందించుకుంది. అలా వాడి మతివిరిచేసినది వదినే అని అనుకుంది. అందులో వాడి తప్పేమీ లేదనే నిర్ధారణకు వచ్చింది. ఇకముం దెప్పుడూ అలా వాడిని కొట్టకూడదనుకుంది.

అనుకున్నట్లే మరి కొడదామనుకున్నా, కొట్ట నివ్వనివ్వని స్థితిలోకి వచ్చేడు చిట్టిబాబు. మర్నాటి ఉదయానికి చిట్టిబాబుకు వంటిమీద తెలివి లేదు. డాక్టర్ని తీసుగొచ్చేడు వెంకట్రావు. అప్పటికి నూట ఐదు డిగ్రీల జ్వరం ఉంది. ఓ ఇంజక్షను ఇచ్చేసి మరేం ఫరవాలేదన్నాడు డాక్టరు.

మధ్యాహ్నం కొంచెం తెలివివచ్చినట్లయింది. ఏవో కొన్ని పరాకుమాట లన్నాడు చిట్టిబాబు— "ఉత్తరం రాసేరూ! నే నిక్కడుండను. కొట్టకు... కొట్టకు...అమ్మోయ్"అని ఈ రకంగా పరాకుమాటలు చాలా అన్నాడు.

ఆ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంచేత,— "ఉత్తరం వాళ్లకి రాస్తేనో" అన్నాడు వెంకట్రావు భార్యతో.

"ఎందుకూ ? తగ్గిపోతుంది. నా దారోగ్యంగా ఉన్నాకే రావొచ్చు" అంది రమణమ్మ పైకిమాత్రం. లోపల్లోపల భయం బాగానే ఉంది. తనేమో వాడిని మహా వదినకంటే, ఎక్కువగా బాగుచేద్దామనీ, ఆరోగ్యవంతునిగా చేద్దామనీ తీసుకొచ్చింది!... ఆఖరికి పరిస్థితి ఇలా తారుమారయిందేమా అని ఆమె హృదయం పీచుపీచుమంది. "తమ్ముడి జ్వరం తగ్గిపోయి హాయిగా ఉండా"లని అందరు దేముళ్లకూ దండాలు పెట్టింది.

కానీ, నాలుగోరోజు వచ్చేసరికి చిట్టిబాబు పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ఉత్తరం కాదు, ఈమారు వైరే చేయవలసొచ్చింది.

* * * *

కామాక్షీ, శేఖరం తొందర తొందరగా గది లోకి ప్రవేశించేరు. చిట్టిబాబు తనలో తాను గొణుక్కుంటున్నాడు. "ఉత్తరం రాసేరా ?" అని. "వచ్చేం నా...యి...నా!" అంది వదిన. చిట్టిబాబు ముఖంమీద ముఖం పెట్టి కన్నీరు కార్చింది.

ఆ మర్నాడు డాక్టరు పెన్సిలిన్ ఇంజెక్షను ఇవ్వడంచేత కొంచెం తెలివి వచ్చింది. వదిననూ, అన్నయ్యనూ గుర్తుపట్టేడు. "వదినా...అక్కయ్య కొ...ట్టిం...ది"అని వదిన కొంగులోకిమారి వెక్కి వెక్కి ఏడ్చేడు. కొంచెంసేపయ్యాక "నన్నూ పెద్ద ఆసు...ప...త్రి...కి..." అని మాత్రం అనగిలిగేడు వదినతో!....

"ఉహుం...నిన్నెక్కడికీ వెళ్లనియ్యను. నా దగ్గరే ఉంచుకుంటాను. నా చేతుల్లోంచి మరి నిన్నెవళ్లూ తీసుకెళ్లలేరు" అంటూ చిట్టిబాబుని హృదయానికి హత్తుకొని కన్నీరు కార్చింది కామాక్షి.

ప్రక్కనుండి ఇదంతా చూస్తున్న రమణమ్మ నిర్ఘాంతపోయింది. బొటబొటా కన్నీరు కార్చింది. అన్నాళ్లయి తమ్ముడిమీద తనకు అభిమానమే ఉంది కానీ వాత్సల్యం లేకపోయిందని గుర్తించింది. అందుచేత తమ్ముడిపట్ల తను మాతృశ్రీగా ప్రవర్తించలేక పోయిందని తెలుసుకుంది.

—

సిరియాళచరిత్ర

శ్రీ శిష్టా రామకృష్ణశాస్త్రి

శివభక్తుల కథలలో సిరియాళచరిత్ర ప్రశస్తమైనది. సిరియాళుడు తనపుత్రుని శివుని కర్పించెను.

కాంచీపురమున సిరియాళుఁడను వైశ్యుడు నిత్యజంగమారాధనతత్పరుండై యిష్టాన్నపానాదీప్సితంబుల శివభక్తుల సంతృప్తిపరుచుచుండ, పరమేశ్వరుడు జంగమరూపధారియై యతని భక్తి లోతరయ నెంచెను. ఒకనాడు సిరియాళుడు జంగమారాధన నిమిత్తము గ్రామమంతయు వెదకి చివరకొక వృద్ధ జంగము గాంచి యతని పాదాబ్జంబుల కెఱగి వాని దనయింటి కాహ్వానింప, తనకు నరమాంసముతో భోజనమిడిన గాని తిన నియమము పాగదని యా కృత్రిమ జంగముడు దెలుపగా సిరియాళుడు ప్రీతిపూర్వకముగ నందుల కంగీకరించి యతిని తనయింటికి దెచ్చెను. సిరియాళుని భార్యయగు సంగళవ్వయు భర్తవలె పరమ శివభక్తురాలగుటచే కృతికతిథియోగమని నియమమునకు సమ్మతించెను. శివప్రభావముచే నానాడా గ్రామమున నరమాంసము దొరకమిచే సత్యవాక్పరిపాలనార్థము భార్యాభర్తలిరువురు తమ కుమారుడైన సిరాలుని సంహరించి వివిధభక్ష్యములు గావించి, యా వృద్ధజంగము పాదయుగళాభిషేక మొనరించి, తజ్జలము ప్రాశించి, యతని నర్చించి పుత్రమాంసాహారములు వడ్డించిరి. అంత వృద్ధతపస్వి గృహిణీ గృహస్థులను సపుత్రికముగా దనపంక్తిని భుజించుట తన నియమమని తెల్పగా, వారిద్దరుతనపంక్తిలో భుజించుటకు సిద్ధపడి పుత్రుఁ డాడుకొనుటకు పోయెననియు, వచ్చినతర్వాత తమప్రసాదము స్వీకరించుననగా నావృద్ధజంగము డందులకు సమ్మతింపక పుత్రుని పిల్చినగదా వచ్చునని చెప్పె, సంగళవ్వను వెలుగెత్తి నాల్గుదిక్కుల పరికించి పిలువుమని నియోగించెను. కాదనలేక యామె యట్లు పిలువగా తన పుత్రుడైన సిరాలుడు శాకపాకములనుండి నిద్ర మేల్కాంచినట్లు పూర్వతనువుతో సజీవుడై వచ్చెను. అంతవృద్ధజంగముడును శివుడై ప్రత్యక్షముకాగ సిరియాళుడు భార్యాపుత్రునితో పరమేశ్వరుని స్తుతింప, నతనికోర్కెమీద శివుడాయూరి యెడువాడల వైశ్యులను కైలాసమునకు సశరీరములతో గొనిపోయెను. కర్మజ్ఞాన భక్తి యోగములలో భక్తిని ప్రతిపాదించు నర్థవాదములలో నిదియొకటి. భక్తిపరవశులై సర్వత్యాగము చేయుట భక్తుల కభిమతము. భగవంతునికే కాక భగవద్భక్తులకు గూడ భక్తిపరులుగా నుండుట శైవవైష్ణవ మతముల రెంటియందును సమానధర్మమే. వీరశైవులు పరమేశ్వరుని స్థిరలింగమని, జంగములను చరలింగమని, లింగధారణము కరలింగమనియు నీమూటికి భేదములేదని భావింతురు. ఇందుచే జంగములను పరమేశ్వర భావమున నారాధింతురు శైవులు. ఎట్టి భక్తుడైనను తన పుత్రుని నర్పించుటయందు గొప్ప త్యాగము ప్రకటితమగును. ఈ భక్తిత్యాగములకు తోడెంతో ధైర్యసాహసము లవసరమే కాని యిది సాధ్యముకాదు. ఇందుచే నతని నిష్కల్మషము నిష్కామమునైన భక్తి ప్రదర్శింపబడుచున్నది. వైశ్యులందు భక్తిత్యాగములు గాననగును గాని ధైర్యసాహసములు సందేహము. సిరియాళ చెట్టియందీ లక్షణములన్నియు రాశీభూతములగా నుండుటచేతనే యీతని కీర్తి శాశ్వతమైనది. ఈకథ "అరువత్తుమూవుర చరిత్ర" మను ద్రవిడ గ్రంథమున గలదు. దీనిని పాల్కురికి సోమనాథుడు బసవపురాణమున చతుర్థాశ్వాసమున ౧౪౦ ద్విపదలలో నొక యుపాఖ్యానముగ రచించినాడు. సిరియాళ చరిత్ర శైవుల కెక్కువ యభిమానమగుటచె పలువురు శైవభక్తులైన కవులు ప్రత్యేక కావ్యనాటకములుగ రచించిరని పాల్కురికి సోమనాథుడే బసవపురాణమున నిట్లు చెప్పినాడు. (మా. పు. ట. ౧౨౪)

"కరమర్థిమూఁడూర సిరియాలుచరిత
మేటిరై చను భక్తకూటములందు
పాటలుగా గట్టి పాడెడువారు
ప్రస్తుతోక్తులగద్య పద్యకావ్యముల
విస్తారముగ జేసి వినుతించువారు
నటుగాక సాంగభాషాంగ క్రియాంగ
పటునాటకంబుల నటియించువారు,
మునుమాడి వీరు వారన నేల కూడి
కనుగొన బ్రోళ్ళ రోళ్ళను బాడెదరు.
అనుమానమొకింతయును లేదు "కన విని-

పాల్కురికి సోమనాథునికిఁబూర్వము సిరియాళ చరిత్ర మాంధ్రభాషలో లేక పోయినను తమిళ కర్ణా

టాది భాషలందు చంపూకావ్య నాటకములుగా రచింపబడియుండెను. అతని తర్వాత నాంధ్ర భాషలో పలువురు రచించినవి మనకుగలవు.

అవచిదేవయతిప్పయ కంకితముగా రచించిన హరవిలాసము వరని కథామానసపాత్రమునుగుటు కతనికులను వాడైన శివభక్తుడగు సిరియాళచరిత్రమును శ్రీనాథకవి సార్వభౌముడు ప్రథమ శివవిలాసముగ గ్రహించినాడు. పాల్కురికిసోమన ౧౫౦ ద్విపదలలో కూర్చిన యీ కథను ప్రపంచించి ౧౪౦ పద్యములలో మొదటిరెండాశ్వాసములు చేసిన, సందర్భోచితములైన మార్పులు కల్పించి బహురసవంతముగా రచించినాడు. ఇందు సిరియాళునకు చిరుతొండనంబియనియు, సంగళవ్వకు తిరువెంగనాచి యనియు, సీరాళకుమారునకు సిరియాళుడనియు నామాంతరములు వాడబడినవి. పండితారాధ్యచరిత్రమును శ్రీనాథుడు పద్యరూపముగ రచించినట్లుగలదుగదా, దాని రచనగూడ నీ విధముగనే యుండియుండునని యూహింపవచ్చును.

పాల్కురికి సోమనాథుని బసవపురాణమునందలి ద్విపదలను పద్యరూపముగ రచించుట "శివకవు లీవిధమంగీకరింతు రిష్టము మాకున్" అని పిడుపర్తిసోమన కతనితండ్రి బసవన యుపదేశించుటచే నాపనికతడు పూనుకొనెను. అందు పాల్కురికి సోమనాథుని పదములచే గ్రహించిపిడుపర్తి సోమనాథుడు పద్యములలోగూర్చుటచే నది యనూనాతిరిక్తముగ నున్నది. ఈ సిరియాలకథను ప్రత్యేకముగ మూడాశ్వాసముల పద్యప్రబంధముగ గరికిపాటి తిమ్మయ్యయను కవి రచించినాడు, ఇది యముద్రితము. దీని యంత్యగద్య యిది. "ఇది శ్రీమద్గురుసిద్ధ వీరేశ్వర వరప్రసాదిలబ్ధ కవితా సామ్రాజ్యధురంధర, ఘనయశోబంధుర, సమధిక వీరశైవాచార నిదాన గరికిపాటి లింగనామాత్య పుత్ర తిమ్మయ నామధేయ ప్రణీతంబైన సిరియాళచరిత్రం బన్నకావ్యంబున సర్వంబును తృతీయాశ్వాసము."

ఈకావ్యప్రారంభమిది.

ఉ. శ్రీనగమందిరుం, దనుజశిక్షు,
 మహోన్నతుఁ బార్వతీశ్వరున్
భానుమహోగ్రదీప్తనిరతభక్త
 గృహాంగణ పారిజాతమున్.

* * * * *

సీ. శివకవీశ్వరులను చిత్తంబునం గొల్చి,
 నందిసోమేశు నమస్కరించి
పిడుపర్తిబసవన్నఁ గడుప్రస్తుతులు చేసి,
 తత్పుత్రుసోమయ్యఁ దలచిదలచి,
బాణమయూరులఁ బ్రహ్వాటాంజలిచేసి,
 కాళిదాసాదులఁ గాంతు చేసి,
శ్రీహర్షకవివరు సేవించి పూజించి,
 వాల్మీకులకు చేసి వందనంబు,
గీ. పూనికొలిచెద బమ్మెరపోతవిభుని,
 ....

దీనిచివర యిట్లున్నది.

"దేవదేవమునీంద్రవందిత
 ద్విరద చర్మవిచేలనా
భావజాంతక, త్రిపురభంజన
 భక్తమాన సరంజనా
జీవితేశ్వర, భూతనాయక
 సింధుతూణ గరీశ్వరా,
కోవిదస్తుత, వృజినదూరిత
 కోటిసూర్య ప్రకాశితా."

ఈకావ్యశైలి రచనారీతులబట్టి యిది సర్వసామాన్య కావ్యముగ గనిపించుచున్నది. ఇట్లే జనుపల్ల్య గ్రామనివాసియగు చిత్తారు గంగాధరుడను జంగమకవి యీకథను ద్విపదకావ్యముగ రచించి రాచవీటి వీరభద్రస్వామి కంకిత మిచ్చినాడు. ఇతడు ౧౭ వ శతాబ్దమువాడుగా దోచును. ఇదికూడ నముద్రితమే. ఈకావ్య ప్రారంభమిది.

ద్వి. శ్రీకరంబైనట్టి సృష్టిభాగమున
 ప్రాకటంబుగ బ్రహ్మపదమును మీరి,
 పురజింప వైకుంఠపురమునిగూడు.
 ముక్తియొసగు కైలాసమునకు సమము.
 కడురమ్యమగు శివకంచియొగలాదు
 పుడమిలోపల మహాపుణ్యక్షేత్రంబు."

* * * * *

దీనిచివరభాగమిది.

"సంతోషమునమండె సత్యకాలమును
అనియిట్లు సూతుండు అ శౌనకాది
మునులకువినిపించె ముదముతో నేను.
నా పాలిశ్రీగురునాథుని పేర

* * * *

విరివిరెక్కిన రాచవీటినివాసు
పరమాత్ముడగు వీరభద్రుని పేర
సిరియాలకథ నేను శైవ్యమార్గమున
కరమర్థినర్పింతు ఘనమైనవాడ
మరునిభా వీరయ్య మల్లమాంబికాకు
వరపుత్రుడగువాడ వంశవర్ధనుడ
కరమొప్ప జనపల్లి గంగాధరుండ
విరచితంబిది సర్వ వేదోక్తమైన
ఈ పుణ్యచారిత్ర యిష్టమయేవారు

* * * *

అచంద్రతారార్క...........
సఫలమైయుండును సద్భక్తులిండ్ల

బ్రోవుదొరగా రీ గ్రంథమునుగూర్చి యిట్లు వ్రాసినారు. "ఈ కావ్యము జబ్బుగా ఉన్నది' యతులు ప్రాసలనుగురించి మాత్రం తెలియని కవి చెప్పినది. పనికిరాదు" ఈ కవి భల్లాణచరిత్ర, గంగా వివాహము, కొలనుపాకమాహాత్మ్యము అనువానిని గూడద్విపదలలో రచించినాడు. అవిగూడా ఇట్టే యున్నవి.

పిరియాళకథను వాలెకోటయ్యయను వతడు యక్షగాన రూపమున నతిమనోహరముగ రచించి మంచికంటి నాగలింగయ్య కంకితమిచ్చెను. ఇదియు నముద్రితమే. దాని యంత్యగద్యఇట్లున్నది.

"ఇది శ్రీమద్గురు మహాదేవవరప్రసాదలబ్ధ నిగమాగమోక్త వీరశైవాచార సిద్ధాంత ప్రవీణ వాలెవంశ సుధాపయోనిధి శీతకిరణ, బుద్ధయార్యధానపాత్రి, రాచయపుత్ర, షట్ స్థల, షల్లింగావధాన, ఇష్టప్రాణభావైక్య, సుఖానూనగురులింగ, జంగమభక్తి ప్రధాన, కోటయార్య ధానవిరచితంబైన బసవపురాణోక్త చిరుతొండభక్త కథానిధానంబను యక్షగానంబు సర్వంబును సంపూర్ణము."
ఈ యక్షగాన ప్రారంభమిది.

శా. శ్రీ కాంచీపురమధ్యభాగ విలస
    త్సింహాసనాధ్యాసియై
పాకారిప్రముఖామరార్చిత పద
    ద్వంద్వుండునై యొప్పునా
యేకామ్రేశ్వర లింగమూర్తి సకలా
    భీష్టంబులిచ్చుక్ కృపా
నేకంబింపుగ మంచికంటికులజ
    శ్రీ నాగలింగయ్యకుక్.

*   *   *   *

ద్వి. సురతోటమరచోద కుర్తినివాసు
దురితరశివభక్తి యుక్తుఁడు నాగ
లింగదేవర శిష్యుడింగితజ్ఞాని
యంగడమంచి కంట్యన్వయాంభోధి
పరిపూర్ణచంద్రుడై భాసిల్లుచున్న
వర నాగలింగయ్య చరణలింగమునకు."

కృతిపతి కవిని నీయక్షగానంబు రచింపగోరుట

క. నీవును మనుకోటేశ్వర
దేవుని దినోత్సవంబు తెనుగున రగడక్
గావించినావు భక్తిని
నావిధమున శైవగణము లానందింపక్.

క. చిరుతొండభక్త మహిమము
గరిమంబుననొక్క యక్షగానముగాగక్.

విరచించియు నే కామ్రే
శ్వరునకు వంకితమొనర్పు సత్కవివర్యా

*   *   *   *   *

కథాప్రారంభము—

సీ. భక్తహితార్థమై, పరుసు చిరుతొండని,
    మనసు ద్రచ్చియుశైవ, మండలంబు
కడతేర్చి రక్షింప, కరుణారసమువచ్చి,
    ఘనతరమహిమ ప్రఖ్యాతిచేయ
తలఁచియుశంభుండు, తాత్పర్యభావుడై,
    తనమహత్త్వంబున, తక్షణమున
వారధు లుప్పొంగి, వడిశేకమైయుండి,
    మేఘగర్జనములు, మిన్నుప్రోయ
గీ. చేర్లునదులును కొలువ లేకముగను
పిడుగులునుతీగ మెఱుపులు పిక్కటిల్ల
బహుళతరంబుగ జనులెల్ల భయమునొంద
ఘోరతరవర్షమంతట గురియసాగె.

క. ఘోరితరంబగు వర్షము
పారంబైరాత్రి పగలు పరికింపఁగరా
రీరీతి యురువదొకదిన,
మారూఢిగ గురియసాగె నంతట నురియుక్.

క. ఈదురుగాలి చినుకులకు
నాదరువులు లేక పసువు లంభోయనుచుక్
ఏదరికి చొత్తమనుచును
కొదరిసిలువంగ లేక గడగడ వణకెక్.

క. చెరువులు బావులు గుంటలుఁ,
నరయంగ కో నేర్లు నిండియతిథియ మెండక్
వరదలు పారలగముద్రో,
దరములు పొరలిపి ధరలు తల్లడపడగక్.

ద్వి. అ చిరుతొండఁ డత్యానందమొంది
యేచివభక్తి పైనలమి జంగములు
ఎందఱో తెంచిన శిష్టాన్న చయము
లందించివారి మహాప్రసాదంబు
గొనుచుండు నటువాన గురియుచునుండ
పనుగొననెప్పుడు పాకంబునకును
కంటకష్టేలు లినయింట లేకున్న
ఇంటింట వెదకిన నెచట గానకను
సతిని దగ్గరఁ నిలచి జంగమకోటి
కతిశ యంబలర ప్రొద్దోయె నింకట్టు
లనపుడు విని యుత్ఫుల్లాంబుజవదన
మన కేటిచింతయు మాధవుకరుణ
సకలవస్తువులు సమకూడియుండ
నొకటి తక్కువనుట యుచితమె మనకు
నూనియవస్త్రముని తానంబుదడిపి
మాను గానగ్నిని మండరిగొల్పి

సాకయత్నంబు లేర్పాటుగా చేసి
చేకొని దమభక్తి చెల్లించుకొనిరి.

* * * *

ఇక నీకావ్యములందలి కవిత్వతారతమ్యము నొక సమాన సన్నివేశమును గ్రహించి విచారింతును. కావ్యమున కథాకథనమునకంటె కల్పనాశక్తిగల వస్తువర్ణనమున మేలైన కవనముండును. దానికంటె సంభాషణ పూర్వకమైన సన్నివేశమున నుత్తమకవిత్వ కళను ప్రదర్శించుటకు వీలుండును. దీనికంటెను మానవమానసిక తత్త్వవివరణము సలుపు నావేశపూరితమైన భావములను వ్యక్తీకరించుటలో నుత్తమకవితను వెలార్చుట కవకాశముండును. ఇవేరసాశ్రయములైనవి. ఇందును విశేషించి పాత్రల వివిధ భావసమ్మిశ్రితావస్థను వర్ణించు సన్నివేశములు బహూకరణీయములు. సిరియాళకథయందు వృద్ధజంగమునకు సంగళవ్వ దనయేకపుత్రుని మాంసముతో భక్ష్యములు చేసి వడ్డించిన తర్వాత తన పంక్తినిభుజించుటకై యామెపుత్రుని పిల్వ బ్రేరేపగా నామె కాదనలేక నలుదిక్కులు పరికించి, యెలుగెత్తి పిలిచిన సన్నివేశమున నొకవైపు పుత్రప్రేమ, యింకొక చెంతస్మరణచే పుత్రశోకము, మఱియొకవంక పరమేశ్వరభక్తి, పుత్రుడు నిజముగా వచ్చునేమో యను నాశయును వివిధభావము లొక్కమారుగ విలువరింపబడినవి. పాల్కురికి సోమనాథుడు ద్విపదలో వ్యంగ్యముగ నిట్లు వరవడి పెట్టినాడు.

"పూర్వజన్మార్జిత భూరికర్మములు
గుర్వణగించు నా కొడుక రావయ్య.
దక్షిణాధీశ్వరు దర్పమణంచు
దక్షుతగల్గు నాత్మజుండ, రావయ్య!
విరసపశ్చాజ్జన్మ మరణదుఃఖములు
పొరిమాల్పఁజాలు నాపుత్ర, రావయ్య!
ఉత్తరంబేలును దాత్తయోగీంద్రు
చిత్తంబునవువచ్చు శిశువ, రావయ్య!
అలరు నాకోప భోగాతీతపదము
లలవడె నేడు నాయయ్య, రావయ్య.
దండధరోద్దండ దండప్రశక్తి
ఖండింపనోపు పుత్రుండ, రావన్న.
పాయని వ్యామోహ పాశబంధములు
కోయంగఁజాలు నా కుఱ్ఱ, రావన్న.
ద్రవిణాదికేషణత్రయ విజృంభణము
తివులఁబడని నాతిండ్రి, రావన్న
సురరాజనుతుడు విక్రమతతిపోవేషి
వరదుడైనాడు నావడుగ, రావన్న.
అంతకాంతకమూర్తి యగుతపరాజు
సంతసంబంద నాసామి, రావన్న,
ఘోరవిస్ఫార సంసారవారాశి
పారమీఁదించు పాపండ, రావన్న.
అంచితాగణ్య పుణ్యప్రాప్తివమరుగు
కాంచీవిలాసు నగ్రజుడ, రావన్న.
దివిజకన్యకలతో దివిముక్తికన్య
కవయుచున్నది భక్తికాంతుండ, రావె.
దండడిమీయయ్య దక్షిణభుజము
నందంద యదరెడి నన్న, రావన్న.
భానుఁ డెంతేనియు బడమటవ్రాలె
శ్రీనిలయుండ, నాసిరాల, రావె.
స్వాదొంద నర్తేశ సఖునిసన్నిధిఁ బ్ర
సాదంబు గొనఁగ నాగాదిలి, రావె."

పాల్కురికి సోమనాథుని పై ద్విపదలచే పిడుపర్తి సోమనాథుడు క్రింది రీతి పద్యములలో గూర్చినాడు గాన తన వ్యక్తిత్వమిందేమియు గనుపరచలేదు.

"సీ. పూర్వజన్మార్జిత భూరి దుష్కర్మాళి,
కుదురడగించు నాకొడుక, రార,
దక్షిణాధీశుని దర్పంబు దెగటార్చు,
దక్షుండవైన నాతనయ రార,
భయదపశ్చాద్ధర్మ భావిదుఃఖంబులఁ,
బరిమార్పగల్గు నాపట్టి రార,
ఉత్తరదిగీశ్వ రోపాత్తసఖ్యుని,
వశవర్తివైన నాశిశువ రార,
తే॥ స్వర్గసౌఖ్యాధికపదస్థ, త్వరగ రార,
దండధరదండ ఖండనోద్దండ రార,
ప్రకటసంసారపాశ మోచకుడ రార,
విత్తపతి సుతాసక్తి విముఖ రార.
సీ. దివిజలోకేశ్వరాధిక దేవదేవుండు,
వరదుడైనాడు నావడుగ, రార.
అంతకాంతకమూర్తియగు తపస్వివరుండు,
సంతసంబంద నాస్వామి, రార,
ఘోరవిస్ఫార సంసారపయోరాశి,
పారమొందించు నాపట్టి, రార.
అర్థశేష ఖవిధుండగు యోగివేషంబు,
కోరిభజించు నాకుఱ్ఱ, రార,
గీ. దివిజకాంతాయుతామృతయువతి నిన్ను,
గవయనున్నది సముక్తికాంత, రార,
సారసాక్షుమీతండ్రి సవ్యబాహు,
వదరుచున్నది వేగ మాయన్న, రార,
క. హేళియుపడమటవ్రాలె, సి-
రాలా, రాఁగదర యుత్తరం జేల జను
ర్జాలోన్మూలన శాలివి,
కాలయకుండైన తపసి సంతసమొందన్."

ఈ భాగమును శ్రీనాథుని యొక సీసపద్యమున నిట్లు రచించినాడు.

"సీ. రారా, వణిగ్వంశవారాశిహిమధామ,
రారా, నిశబ్ద రాంభోరుహాశు.
రారా, మహాఘోర వీరశైవాచార,
రారా, ఘనౌదార్యరాజరాజ,
రారా కుమారకంఠీరవేంద్రకిశోర,
రారా, సముగ్రధీశాహినేయ,
రారా, మనోభవాకార రూపవిలాస,
రారా, యసారసంసారదూర,

తే. రార నావన్నె వన్నెగ, రారా తనూజ
రార శిరియాల, రార నాప్రాణపదమ,
రార నాకన్న, రా జియ్య రార యనుచు,
జీరె గారాపు గొడుకు రాజీవనయన."

శ్రీనాథునికూర్పున రచనాగౌరవము గలదు కాని పాల్కురికి సోమనాథుని రచనయందలి వ్యంగ్య ప్రధానమైన గాంభీర్యము గానరాదు. మఱియు సోమన కూర్పు భావావేశముతో సాగించివేయును. శ్రీనాథుడు తన రచనను స్వతంత్రించినను సోమనాథుని రచనయందలి చమత్కారమును త్యజించినాడనియే చెప్పవలసి వచ్చును.

ఇక గరికపాటి తిమ్మన రచన చూతము.

"ఉ. భైరవయోగి యిట్లనియె భక్తుడ,
పుత్రులు లేనియింట నే
హారముగొంటలేదు సుతులందున
బిల్వగ విన్నవాడవో,
ధీరత నీదు పుత్రునకు తెల్లము
గాగను దాచినావు, నీ
కూరిమి పుత్రరత్నమును కోరిక
మీరగ జీరితెమ్మనెన్

మ. కడు నే నెప్తను భక్తమాన్యనిను నే
కాపాడితిన్ నీ సుతున్
పుడమిన్ దా చెద తిప్పతెన్నకు మదిన్
పూర్ణాత్ముడానంచునో
కడిమిన్ భక్త వరాగ్రగణ్య భళిరా
కంటిన్ నిమన్ మెచ్చితిన్
వడిగా బిల్వుము నీ కుమారవరునిన్
వామాక్షీ జీరన్ వడిన్.

సీ. ఇంద్రాది సురలార, యినచంద్రవరులార,
కడగి మాపుత్రుని గానరయ్య,
బృందారమునులార, పుణ్యవర్తనులార,
కడగి మాపుత్రుని గానరయ్య,
వరుణపావక యక్షహరిహయతిరులార,
కడగిమాపుత్రుని గానరయ్య,
కిన్నరకింపురుష గీర్వాణపతులార,
కడగి మాపుత్రుని గానరయ్య,

గీ. వనిత ఘోషింప నీరీతివారు చెదరి,
అలరి శివభక్తి నీయందువలరియున్న
యపుడు మా కేల వడిగెదో యబ్జవదన,
స్థిరతినున్నాడు సిరియాళు చెలువుమీర.

వెండియు.

గీ. అంతకుండును భైరవుండనుచు మదిని,
వడిగమఱియేమియగు తడవాయెననుచు,
వెంతబిల్చిన రాడు సిరియాళు విభుడు,
అనిన భూకాంత పల్కె నాశ్చర్యముగను."

తిమ్మన సిరియాళచరిత్రగల తాళపత్రప్రతి మధ్యమధ్య కీటకభక్షితములయే కాక యందలి రచన సంస్కారహీనముగగూడ నున్నది. మఱియు నిది యర్వాచీనకాలమునాటి ప్రబంధపద్ధతి సాగినది. ఇందు పాల్కురికి సోమనాథుని వ్యంగ్యరచన లేకపోవుటయే కాక, శ్రీనాథుని రచనాగాంభీర్యము గూడ వీడి నాస్యరచనలో దిగినది. ఇక చిత్తరు గంగాధరుని రచన చెప్పకోదగినదే కాదు. కాన దానినుండి యుదాహరింప మానుదును. యక్షగానమున నాలెకోటయ్య యీ సన్నివేశము నొకయేల పాటగా గూర్చినాడు. అతని రచనయిది.

"గీ. దనుజనించి తల్లి దనయునిఁబిలుఁగంగ
కాకయుండునటరొ లోకమునను,
కల్లలాడి కొలమెల్ల బుచ్చక వేగ
సొంపుదనరఁబిలువు చూతమిపుడు."

వ॥ ఇవ్విధంబున సీశ్వరుడాదు వాక్యంబులకు తిరువెంగనాచి మనంబున నిట్లనియె.

క. ఎచ్చట నున్నాడవో,
నిచ్చటికిని పేరుగూర్చి యేనిప్పుడునా
వత్సరారమ్మనుచును,
ముచ్చటగా నెల్లు బిలుతు మోదంబలరన్.

వ. అని పూర్వద్వారంబున నిలిచి, నల్దిక్కులంగాంచి యాననంబు నాకసంబునకు నెత్తి, హస్తంబు జాచి, ప్రమథ గణంబుల పాదంబులు మనంబునం దలఁచి తనయు నిం బిలువం దొడంగె.

ఏలలు

పూర్వకర్మార్జితమైన భూరికర్మముల నెల్ల
గర్వమణచినవాడుకా, రావయ్యా,
ఓచిన్ని తండ్రీ, శరుద్రనాజ్ఞ మీరబోకయ్యా. ౧

దక్షిణాధీశునిపట్టి దర్పమడచినట్టి
శివుడీక్షణాన వచ్చియున్నాడు,

ఓ ముద్దులతనయా,
మోక్ష మొందవ వేగరావయ్యా. ౩

పశ్చిమాశాంతరముల భాసురముగ శివుని
నిశ్చయముగ గలిసినావేమో, ఓ సిరియాల సెట్టి
నిశ్చయమొనరింప రావయ్యా. ౫

ఉత్తరాధీసుని సఖుఁడ ట్లిచ్చి లింగత్వ స్థిగొంచు
పొత్తుగసివ బిలుచుచున్నాడు,
ఓ నాయనయ్య వేగ చిత్తమురంజిల్ల రావయ్య. ౪

పున్నమ వెన్నెలబైట చిన్నిబాలలతో గూడి
వెన్నుగా నాడుచున్నావేమో,
ఓముద్దుల తండ్రి ఇవ్వాళ్లవలెనె రావయ్య॥ ౫

పాదతీర్థప్రసాదము మోదిములరఁగ గావించి
నీదురాక గోరుచున్నారు, ఓ నా చిన్నిబాలా,
ఆదరమున వేగరావయ్య. ౬

పాయని వ్యామోహ పాశబంధములు దిగటార్చి
యే తొడల యాడుచున్నావో, ఓ ముద్దుగుమార
కాయజారి కనికు రావయ్యా. ౭

వాదభేదములు మాని యాదిమధ్యాంత రాశమున
పాదుగా నీవు వసించినావేమో, ఓ సిరియాలసెట్టి,
మోదముల గంగ రావయ్యా. ౮


ఎంచరాని పాతకముల ద్రుంచి శివ కొంచి శివుని
నంచితముగ మదిని నమ్మచు ఓ నా చిన్నిబాల
కొంచిజనులు మాన రావయ్య. ౯

వ. అని యివ్విధంబున జనని పిలుచు సమయంబున.

సీ. మోమున ముంగురుల్ ముద్దుగా నెనయంగ
మెడ రత్నహారముల్ మెరయుచుండ;
సందిబొందియలు పెంపొంద దూగుచునుండ
మొలగజ్జెలందెలు మ్రోయుచుండ;
చెక్కిళ్లయందున చిరుచమట లాడువంగ
కనకంపు రావిరేకయు చెలంగ;
బంగారు జల్తారు పట్టుకండువ చెంగు
లంగు నా మీన చెలంగుచుండ;
గీ. చూపరుల కెల్ల నత్యంత చోద్యముంద
సురలు గీర్తింప తాపసవరులు వేడ,
పుష్పవర్షంబుగురియ పెంపొంద జనని
శిబమాలించి బాలుండు సరగవచ్చె॥."

ఈవిధముగా బహురసవంతమైన రచనతో గూడి యక్షగానరచన వెలసినది. యక్షగానములందు రసవంతమైన కవిత దేశీయపద్ధతి నెట్లు రచింపవచ్చునో దీనివలన తెలియగలదు. రససిద్ధులైన పలువురి కవుల హస్తములలో పలువిధములుగ సిరియాళకథ యెట్లు రచింపబడి పాఠకుల నాకర్షించినదో స్పష్టముకదా.

సిరియాళకథ చారిత్రాత్మకమైనది కాని ప్రక్షిప్తపురాణకథ గాదు. ఇతనికి సంబంధించిన శాసనములు తమిళభాషయందు గనబడుచున్నవి. ఇతడు క్రీ. శ. ౬౩౦ ప్రాంతమున నున్నవాడు. పెరియ పురాణమునందలి యీకథ తమిళమున చిరకాలమునుండి పాటలుగా ప్రచారమున గలదు. నూరు సంవత్సరముల క్రిత మొక కవి దీనిని నాటకముగ తమిళమున రచించినాడట. కన్నడమున శాంతకవి క్రీ. శ. ౧౬౫౦ ప్రాంతమున 'సిరియాల సత్వపరీక్షె' యను యక్షగానముగ రచించినాడు. మఱియు వార్ధక షట్పది చందమున 'సిరియాళసెట్టియ' యను పేరితో పాటలు గలవు. మళయాలమున నీ కథావస్తువుతో రచన లున్నట్లు తోచదు.



విజ్ఞానశాస్త్రం - ప్రకృతివింతలు:

జంతుజాలం - వింతనేత్రాలు

వానపాముకు కళ్లు లేవు. కాళ్లూ లేవు; ముక్కూ చెవులూ కూడా కనబడవు. ఉంగరాలు పేర్చిన రబ్బరు గొట్టములాగే ఉంటుందిగదా! గుడ్డిగా నేలలో తొలుచుకొంటూ పోతుంది. ఇక ఈ పురుగుకు స్పర్శజ్ఞానం తప్ప, ఈగలకు దోమలకు మాత్రంగానైనా, దృష్టి ఉండే అవకాశం లేదుగదా! కాని రాత్రివేళ నేలలోనుంచి పైకి పాకుతున్న వానపాముమీద టార్చిలైటు వెలుగు వేస్తే, అకస్మాత్తుగా, సుళ్లు తిరిగి మళ్లీ నేలలోకే పాకపోతుందే! ఈ వెలుగు చీకటుల తేడా కళ్లు లేకుండా ఎల్లా తెలిసింది. ఏదో అపాయం వస్తోందన్న భయం ఏ యింద్రియం తెల్పింది?-వానపాముకు చర్మం పొడుగునా, ఫొటో ఎలెక్ట్రిక్ సెల్లులుంటాయి. (అనగా వెలుతురువల్ల విద్యుత్ప్రసారంలో మార్పు తెప్పించే జీవకణాలు) వీటివల్ల స్పర్శేంద్రియంద్వారానే ఈ విభేదం వానపాముకు తెలుస్తుంది. బాహ్యంగా 'కళ్లు' అంటూ కనబడని ప్రకృతి దృష్టి విశేషం ఇల్లా వానపాములో వ్యక్తమవుతుంది. కళ్లులేని దృష్టి ఇది.

ప్రకృతి దృగింద్రియాలను, ఒక్క నేత్రాల ద్వారానే కాక అనేక విధాలుగా జీవకోటిలో వ్యక్తపరిచింది. వానపాములో చర్మరంధ్రాలే, తేజోవిదత్మకగుణంవల్ల నేత్రాలయాయి. ప్రకృతిలో అనేక రకాల కళ్ళున్నాయి. ఇటు కన్ను కాని కన్ను ఇది, అటు గండుతూరీగ కళ్ళు చూస్తే పలకల వజ్రాలు పొదిగిన ఒంటిరాతి చెవిదుద్దుల్లాగుంటాయి. ఈ వరుసని అనేక రకాలకళ్లు, అనేక ప్రయోజనాలు కలవి, ప్రకృతిజీవాలను పరిశీలిస్తే మనకు కనబడుతాయి.

జలజంతువులను ముందు చూద్దాం. ఆలిచిప్పల లాంటి నల్లచేపలకు, చిప్ప అంచుచుట్టూ చర్మాన్నంటి తళతళలాడే కళ్లుంటాయి. చుక్క చేప ఉంది-స్టార్ ఫిష్—ఈ చేప దేహమే అయిదు వేళ్ళూ చాచినట్లు, నక్షత్రంలా గుంటుంది. ఈ అయిదు వేళ్ళ కొసలనూ ఐదు కళ్లుంటాయి, ఈ చేపకు.

క్రాఫిష్ అని మరో చేప ఉంది. ఈ చేపకళ్లు పగలు చూస్తే తెల్లబారిఉంటాయి. రాత్రి అయేటప్పటికి ఈ కళ్లు నల్లరంగుకు మారిపోతాయి. చీకటి పడటంతోనే, చీకట్లు చూసేందుకు అనుకూలమైన ద్రవము కంటిపొరలో తయారవుతుంది. మళ్ళీ వెలుగు వచ్చేటప్పటికి, ఈ ద్రవము పక్కలకు జారి పగటిచూపుకు అనుకూలంగా కంటిని మారుస్తుంది.

ఇక్కడికి కంటిరంగు మారటమే చూశాము. కాని కంటి జాగాయే మారిపోయే చేప ఉంటుందనైనా అనుకోగలమా! అల్లాంటిది మామూలు చేపే. 'చందువాయి' చేపలాంటి దొక చేప ఉంది. ఫ్లౌండర్ అంటారు. పుట్టినప్పుడు దీనికి తలకురెండువైపులా రెండు కళ్లుంటాయి. కాని పెద్దదై శరీరం కొంచెం వెడల్పుగా సాగటంతో, ఒక కన్ను నెత్తిమీదికి, మీదిమీదికి పాకి, చివరికి అటు దిగి రెండో వైపుకి వచ్చి, రెండో కంటిప్రక్కనే ఆ వైపే స్థిరపడిపోతుంది. ఈ చేప పెద్దదయేటప్పటికి రెండు కళ్ళూ తలకు ఒకప్రక్కనే ఉండిపోతాయి.

మనం రెండుకళ్లూ, ఒకే కదలికతో కదుపుకుంటూ, ఒకేచూపు మేళవించుకొంటాం. రెండు కళ్లూ కలిసి ఒకేవిధంగా తప్ప కదపము. కాని మన సాటి జంతువుల్లో చాలా జీవాలు, ఏ కంటి కా కంటిని విడిగా కదుపుకో గల్గుతాయి. తొండ, ఒకేసారి ఒక కంటితో ఉత్తరదిశను ఒక కంటితో దక్షిణదిశనూ, పరిసరాలు రెండుదిక్కులా పరికించుకోగలదు. పీతల కళ్లుగొట్టాలకతికించినట్లు ఇంకా పైకి ఉంటాయేమో! అవి ఇంతకన్న కూడా ఇష్టంవచ్చినట్టు కళ్లు తిప్పుకో గలవు. అచ్చు సబ్ మెరిన్ పెరిస్కోపు వాడినట్టు పీత తన కళ్లు ఇష్టంవచ్చినట్టు వాడుకోగలదు. పీతి కళ్లల్లో ఇంకో గమ్మత్తు కూడా ఉంది. కన్ను చుట్టూ తిప్పటంలో ఇసుక, దుమ్ము, ధూళి కంటినిండా ఎక్కువ పడవచ్చును. అప్పుడు పీత తన కళ్లను గొట్టం లోపలికి లాక్కుంటుంది. ఆ గొట్టం పొడుగునా కనురెప్పలకున్నట్లు, వెంట్రుకలుండి కంటిని శుభ్రం చేస్తాయి.

కళ్లు ఎప్పటికప్పుడు జాగ్రత్తపెట్టుకొని తుడుచుకోటంలో పీతల పద్ధతే చాల జీవాలు అనుసరిస్తాయి. కప్పలకళ్లు మరీ ఉబ్బెత్తుగా బైటికి పొడుచుకొని ఉంటాయి. గట్టిబురదలో మునిగి కదిలేటప్పుడు కంటిగుడ్డుకు ఏదైనా దెబ్బతగిలే అపాయం చాలా ఉంటుంది. అందుకని బోదురుకప్ప బురదలో మునిగేటప్పుడు కళ్లు కనుబొత్తలలోకి బాగా లోపలి

లాగేసుకొంటుంది. దాదాపు అంగిటికి తగులుతూన్నట్లుంటాయి, ఈ కనుగుంటలు.

మొసలి బురదలోకి పోయేటప్పటికి, కంటి రెండు రెప్పలూ కాక, లోపల అద్దాల కిటికీలాంటి మూడో కంటిరెప్పతో కంటిగుడ్డును మూస్తుంది. ఈ మూడో రెప్ప కనుకొలకుల్లోంచి తెరుచుకొని కంటిగుడ్డును ఆవరించి వ్యాస్తుంది. పక్షులలో కూడా ఇల్లాంటి మూడవ కనురెప్ప ఉంటుంది. పక్షులు ఎగురుతూన్నంతసేపూ ఈ రెప్ప కంటిగుడ్డుమీద ఇటునుంచి అటు ఆడుతూ, కంట్లో నీరూ, దుమ్మూ, అంతా ఎప్పటికప్పుడు తుడిచేస్తుంటుంది.

ఎడారి ఎండల్లో తిరగాల్సిన ఉష్ట్రపక్షులు, జిరాఫీలు మొదలైనవాటికి ఎండకు కన్ను మిరుమిట్లు గొలపకుండా, తెర వేసినట్లుండే కనురెప్ప లుంటాయి. రాబందులకు, గద్దలకు, కనుబొమ ఎముకే గడ్డకట్టి ముందుకు పొడుచుకొనివచ్చి కన్ను మిరుమిట్లు గొలపకుండా కాపాడుతుంది.

ఇక కలుగులు చేసుకొని బ్రతికే జంతువులను పరిశీలిస్తే, వీటిల్లో చాలావాట్లకు ముందుకాళ్ల మెత్తలకు కళ్లు తుడుచుకొనే కుంచె లుంటాయని తెలుస్తుంది. బల్లికళ్లల్లో పిల్లికళ్లల్లోలాగానే, కనుగ్రుడ్డు గుండ్రంగా కాక అండాకృతిలో ఉండి చీకట్లో కనబడేందుకు సాయకారిగా ఉంటుంది. బల్లి ఎప్పటికప్పుడు నాలికసాచి కళ్లు శుభ్రంగా తుడుచుకొంటూంటుంది. ఇక్కడ అప్రస్తుతం అయినా బల్లి విషయంలో ఇంకో విశేషం కూడా ఉంది. బల్లి కాళ్ళవేళ్లకు గాలిపీల్చుకునే బిళ్లలుంటాయి. దూలాల క్రిందుగా పాకవలసినా, ఈ బిళ్లలతో దూలాన్ని అంటిపెట్టుకొని క్రిందకు పడకుండా ఉండగలుగుతుంది. బల్లిని దీపంవెలుతురులో పట్టుకుచూస్తే ఈ చెవికి ఆ చెవికి మధ్య ఏం లేకుండా, గాజుబిళ్లలాగే కనబడుతుంది.

జంతువులకు కళ్ల జాగ్రత్త చాల అవసరం. చాలా విషయాలకు జంతువులు తమ దృష్టిమీదే ఆధారపడి ఉండాల్సి ఉంటుంది. ఆ అవసరాలు కూడా మనం ఊహించలేనంత విపరీతంగా ఉంటాయి.

ప్రవాహజలంలో స్థిరంగా నిలవాల్సినప్పుడు చేప కేవలం ప్రవాహస్పర్శవల్లే, నీటి కదలికవల్లే, ఈత సాగించదు. ప్రక్కను ఒడ్డు కదులుతూందీ లేనిదీ చూసుకుంటూ తన నడక తీర్చుకొంటుంది. కొందరు మనస్తత్వవేత్తలు ఈ విషయం నిమ్మత్తుగా నిరూపించారు. కదలని నీళ్లల్లోనే చేపలను పెట్టి, నీళ్ళను కాకుండా ఇటూ అటూ ఉన్న గట్లలాంటి తొట్టి అంచులను, వేగంగా ముందుకు కదపసాగారు. నీళ్ళు కదలకపోయినా కూడా గట్టు కదులుతూండటం కనిపించటంవల్ల చేప భ్రమపడి వేగంగా ముందుకు ఈది ముందు అంచులకు కబీమని కొట్టుకున్నదట!

సముద్రపు ఒడ్డున తాబేటి గ్రుడ్లు పగిలి పిల్లలు బైటికి వచ్చీ రావటంతోనే సహజంగా సముద్రంలోకి పాకిపోతాయి. సముద్రపు వాసన పసి పట్టబట్టి ఇల్లా చేస్తున్నా యనుకొన్నారు ప్రకృతి శాస్త్రజ్ఞులు. కాని అప్పుడు పుట్టిన తాబేలుకూడా సముద్రాన్ని చూడగలదనీ, క్షితిజరేఖలాగా బయలుగా కనబడే సముద్రపు అంచుకేసి చూపువల్లే సహజంగా బయలుదేరుతుందనీ ఈమధ్యనే కనుగొనగల్గారు.

జంతువులకు చూపు అంటే కేవలం వస్తువులను చూడటమే గాదు వాట్ల పరస్పర సంబంధాదికమైన విశేషాల నన్నిటినీ చూపువల్లే గ్రహిస్తాయి. చూపువల్ల విచక్షణ జ్ఞానం ఎంత ఉంటుందో అని కోడిపిల్లలమీద పరీక్షలు సాగించారు. కోడిపిల్లలకు పాలరాతిమీద తౌడు పెట్టటం అలవాటు చేశారు. పక్కనే అంతకన్నా కొద్దిగా చాయ తక్కువగా ఉన్న రాతిమీద తౌడు పోసినా పాలరాతిమీద తౌడే కోడిపిల్లలు తినసాగాయి. పాలరాతిమీదికన్నా ఎక్కువ వెలుగు అవతలరాతిమీద ప్రసరించి దీనికన్నా అది తేజోవంతంగా ఉండేటట్టు చేశారు. ఆ కృతకపు వెలుగులో కూడా, మనుష్యః కంటికే అందని ఛాయాభేదం, ఆ కోడిపిల్లలు గ్రహించగలిగేవని తేలింది.

గడియారంముల్లు కదలటం మన చూపుతో సరిగ్గా గ్రహించాలంటే నిముషంకన్నా ఎక్కువ కాలమే పడుతుంది. కాని పావురం ౭౫ సెకండ్లలోనే ఆ కదలికను గ్రహించగల్గుతుంది. అంబోతులు రంగుగుడ్డ చూస్తే బెదురుతాయని సామాన్యంగా వింటాము. మనతోపాటు ఒక్క కోతులను మినహాయిస్తే, తక్కిన నలుగాలి జంతువులకు రంగుల భేదా తెలియని మసకతనం (*color blindness*) ఉంటుంది. రంగుల ప్రాముఖ్యం మనకున్నమాదిరిగా వాటికి ఉండదు. వాట్ల జీవితరక్షణలకు పోషణలకు అవసర విచక్షణలుమాత్రమే తెలుసుకొనే పద్ధతులకు వాటి చూపు అలవాటు పడుతుంది.

ఈగలను వెనకనుంచి చెయ్యి విసిరి పట్టుకొందామని ఎన్నోమాట్లు ప్రయత్నిస్తాము కాని వెనుక చూపు ఉన్నట్లే ఈగ ఎగిరిపోతుంది. కీటకాలన్నిటికీ కంటి అమరిక చాలా సమృష్టంగా ఉంటుంది. ఒక్కొక్కటి ఒక్కొక్క కన్నులాగా పనిచేసే, పదివేలనుంచీ పాతికవేలదాకా సన్నని గొట్టాలు కట్టకట్టినట్టుగా ఉండి, కన్నుగా ఏర్పడతాయి ఈ కీటకాలకు. ఈ గొట్టాలలో తలాకభాగమూ, చుట్టూ ప్రపంచపు తలాకపక్కకు దృష్టి అందిస్తూ, నలు

పక్కలా ఒక్కసారే కీటకం కంటికి కనబడేటట్లు చేస్తాయి. ఈ కళ్లు కూడా భూతిఅద్దాలలాగా పైకి ఉబ్బిఉండటంతో ప్రక్కలకే కాకుండా ముందు వెనుకలకు కూడా ఒకేసారి చూడగలుగుతాయి. ఇంతే సహస్రముఖంగా ఉండే ఈ కంటివల్ల ఈగలకు మనకన్నా కూడా అనేకవిధాల ప్రశస్తమైన దృష్టి ఉంటుంది. మనకు ఇంద్రధనుస్సులోని ఏడువర్ణాలు- నీలిమనుంచి ఎరుపువరకుమాత్రమే - గ్రహించగల దృష్టి ఉంది. కాని క్రిమికీటకాలు, ఇంకా అనేక వర్ణాలు మనమూహించలేనివి కూడా చూడగలుగుతాయి. తుమ్మెదలు అల్ట్రావైయలెట్, అతినీలవర్ణాన్ని చూడగలుగుతాయి. చీమలు, గుడ్లగూబలు, ఇన్ఫ్రారెడ్ అనుకోణ వర్ణాన్ని కూడా చూడగల్గుతాయి.

న్యూజీలాండ్‌లో, టుయటారా అనే పెద్ద సరీసృపం ఉంది. పురాణయుగాలలో ఎప్పుడో భూమిమీద తిరిగిన జీవాలకు ఇది ఏకైక ప్రతినిధి అని అనవచ్చు. ఆ జంతువుల పూర్వీకపువాటికి ఏకాక్షులలాగా నుదురున ఒక్కటే కన్నువుండి ఉండే దనేందుకు చిహ్నాలు ఇప్పటి జంతువుల నొసటి చర్మపుక్రింది బొమికకట్టు సూచిస్తుంది. ఆనాటి ఏకాక్షినుంచే, సహస్రాక్షులదాకా, 'జీవం' అనేక విధాల నేత్రాలతో ప్రయోగంచేసి చూస్తూనేఉంది. అసలు కంటి విచిత్రాలకు ఎక్కడో వెదుకొక్క అక్కరలేదు. మనచుట్టూ అనేక దృష్టాంతాలు కనబడుతూనే ఉంటాయి.

మన కంటిలో రెటీనా, (ఫోటోగ్రాఫ్ ప్లేటులాగా కంటిలో ఉండే నరాల పలక) మధ్య ఫోలియా అనే చిన్నగుంట ఉంటుంది. ఇక్కడే నరాల కొసలు దట్టంగా ముద్దకట్టి ఉంటాయి. మన మేదన్నా చూస్తున్నప్పుడు ఆ వస్తు చిత్రం ఇక్కడికి కేంద్రీకరింపబడి, స్ఫుటమైన దృష్టి కలుగుతుంది. కాని నీటిలో మునిగినప్పుడు దృష్టి చెదరి ఈ స్ఫుటత్వం పోతుంది. కాని లకుముకిపిట్ట చూడండి.


లకుముకిపిట్ట గాలిలోనుంచే చేపను చూస్తుంది. అకస్మాత్తుగా నీటిలో సూటిగా మునుగుతుంది. కాని నీటిలో మునగగానే చేప కదిలిపోతే కనబడవద్దా? లకుముకిపిట్ట కంటిగ్రుడ్డు గుండ్రంగా కాక అండవృత్తాకారంగా ఉంటుంది. కాబట్టి దాని రెటీనాలో మనలాగా ఒక ఫోలియా కేంద్రంగాక రెండు ఫోలియా లుంటాయి. గాలిలో చూస్తున్నప్పుడు మనకులాగానే మధ్యఉన్న ఫోలియాయే దృష్టి నిస్తుంది. కాని నీళ్ళల్లో మునగగానే మధ్య ఫోలియాలను మానికొని ప్రక్కలనున్న ఫోలియాలతో నీటిలో చూడగల్గుతుంది.

ఇంకోవిషయం! మన కంటినరం, కంటిగ్రుడ్డు లోపలి భాగంలోనుంచి తెముల్చుకొని పోయే చోట, 'చీకటిచుక్క' (*Blind spot*) ఒకటి ఉంటుంది. అంటే మనం చూస్తున్న వస్తువు చిత్రం రెటినామీద పడ్డప్పుడు ఈ చీకటిచుక్కను ఆక్రమించిన మాత్రం వస్తువిశేషా లేవీ మనకు కనబడవు. కాని మనకు రెండు కళ్లు ఒకేవస్తువును చూస్తూ దృష్టి నిస్తాయి. అందుచేత ఒక కంటిలో కనబడని కొద్ది విశేషాలను రెండవకన్ను పూరిస్తుంది కాబట్టి మనకంత ఇబ్బంది ఏమీ ఉండదు. కానీ చాలా జంతువులకు కళ్లు మనకున్నంత ప్రక్క ప్రక్కనే ఉండకుండా, మరీ చెరో ప్రక్కకూ ఉంటాయి. ఏకన్ను కాకన్నే విడివిడిగా చూసి మెదడుకు చెప్పాలి. అల్లాంటప్పుడు, కొంత చూపు నష్టమయిపోతే, అపాయం ఎక్కువ కాదా. చెట్ల-చిటారి కొమ్మల రెమ్మనుంచీ రెమ్మకు ఉరికే ఉడతకు, ఈ దృష్టి దోషం ఉంటే, దుముకుదుముకుకూ ప్రాణాపాయమే కదా!

ఉడత కంటిలో ఈ నరం కనుగుడ్డును వదిలే చోటు, అప్పచ్చిలాగా పల్చగా గీతలాగా అయిపోతుంది. అందుచేత కనబడని మేర దాదాపు పూర్తిగా తగ్గిపోతుంది. ప్రకృతి ఉడతలనల్లా రక్షించింది.

మన చుట్టూ పరిసరాలల్లో జంతువుల చేష్టలూ చూపులూ పరిశీలించుకోగలిగామంటే ఆనందమే కాదు, కొత్తకొత్త విజ్ఞానాన్ని కూడా అపారంగా సేకరించుకోగల్గుతాము.

(అమెరికన్ మెర్క్యురీనుండి)



క్షేత్రయ్య పదములు

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

'కదిసిన నోరపోయి మతి
కబ్బపు దొంతుల సత్పదార్థముల్
గడుసుచు సెట్టివారి బోషగన్నను
గుజ్జని పేన్నహాహాఖ్యముల్
మదికి నసహ్యమౌ కుపద
మార్గమునం జరియింపుచున్న త
త్పదకవు లెల్ల మత్కృతిని
దప్పులు పట్టక యూరకుండుడీ.'

ఆంధ్ర సాహితీ మందిరంలో రాటుదేరిన పాండిత్యం చాటున 'అరచాటున నాంధ్రపదఘాటి చొక్కుపుంజనుగవపొల్కు' కనబడీ కనబడనట్టుగా దోబూచులాడే శృంగారాన్ని, రిచ్చకీడ్చి నడివీధిపాలు చేసినారని కసికొద్ది 'మదికి నసహ్యమౌ కుపదమార్గమున్ జరియించు'వా రని కవినిందావ్యాజంతో నోరార దూషించి ఒకానొకకవి పదకవులపై తన కుండే అక్కసునంతా ఒక్కసారుగా తీర్చుకొని 'తృప్తాస్మి' అనుకున్నాడు. నేటిదాక సాహిత్య విమర్శకులకైతేనేమి, కవిచరిత్రకారులకైతేనేమి యించుమించు యిటువంటి భావమే వుండడంచేత పదకవిత్వానికి గాని, పదకవులకు గాని లభింపదగినంత ఆదరం లభింపలేదు. వాఙ్మయశాఖల్లో పదకవిత్వశాఖ ఒకటి వుందనైనా వారు తమ గ్రంథాల్లో పుటంకించకపోవడం శోచనీయం.

అయితే నిజంగా జాతీయజీవనాన్ని పదకవిత్వం ప్రతిబింబించ గలిగినంతగా తక్కిన యే వాఙ్మయశాఖ కూడా ప్రతిబింబించ లేకపోయిందంటే విడ్డూరం యేమీ లేదు. అసలు పదకవిత్వశాఖ తక్కిన వాఙ్మయశాఖలవంటిది కాక కేవలం దేశిసరుకు. ఒక విధంగా యీ పదకవు లందరూ పదకవిత్వం పేరిట తమ కాలంలోని రుచిరములైన సామాజికజీవన ఘట్టాలనే రచించినా రనడం తప్పు కాదు. భాష, ఛందస్సు, వ్యాకరణము, కథావస్తువు, పాత్రౌచితి అనే కట్టుబాట్లకు లోబడి రావలసి వుండడంచేత ప్రజావ్యవహారంలోని రుచిగల పలుకుబళ్ళు, నానుడులూ, శ్రుతిసుభగాలయిన కాకువులూ, వేళాకోళములూ, వెక్కిరింతలూ మొదలయిన వాటికి పద్యకవిత్వంలో లేని అవకాశం పదకవిత్వంలో వుండడమే యీ కవిత్వాన్ని జాతికి సన్నిహితం చేసింది. అన్నమయ్య, క్షేత్రయ్య, సారంగపాణి మొదలయిన పదకవుల సాహిత్యంలో మనకు ఈ విషయమే స్పష్టమవుతుంది.

ఇటీవల పదకవిత్వాన్ని గూర్చి పరిశోధనలు జరగడమూ, ప్రాచీన పదకవుల సాహిత్యం సవిమర్శంగా ప్రకటింపబడడమూ చాలా సంతోషింపదగ్గ విషయం. అన్నమయ్య పదసాహిత్యమంతా తిరుపతిలో సంపుటాలుగా ప్రకటింపబడుతున్నవి. ఆయన శృంగార సంకీర్తనలు ఇటీవలే ప్రచురింపబడినవి. అన్నమయ్యకు తర్వాత పదకవిత్వ పాకాన్ని పలచబజేచి జొబ్బబడను కావించిన మహనీయుడు క్షేత్రయ్య. క్షేత్రయ్య సాహిత్యం మనకు విలువలేని సాహితీభాండారం. మన జాతీయ జీవనసర్వస్వం అది.

త్యాగరాజ కీర్తనలను సవ్యాఖ్యానంగా ప్రకటించి ఆంధ్రజాతికి అందించిన ఆంధ్రగానకళా పరిషత్తువారూ, తన్నిర్వాహకు లయిన శ్రీ విస్సా అప్పారావుపంతులు గారూ క్షేత్రయ్య సాహిత్యాన్ని లభ్యమయినంతవరకూ సేకరించి అనేక నూతనాంశాలు తెలిపే విపులమయిన పీఠికతో ప్రకటించడం మన అదృష్టం.

క్షేత్రయ్య తన మేరువుపదంలో సుమారు నాలుగు వేల నూరో లేక నాలుగు వేల యిరువందలో పదాలు రచించినట్టుగా తెలుపుకునివున్నా మన కవన్నీ నేడు లభించడంలేదు. ఇంతకుముందు అచ్చైన గ్రంథాలలో ౨౭౦ క్షేత్రయ్య పదాలు మాత్రమే ముద్రింపబడినవి. తమ పరిశోధనవలన లభించిన సుమారు ౬౦ క్రొత్తపదములను గూడ చేర్చి మొత్తం ౩౩౦ పదములను శ్రీ అప్పారావుగారు ఇందులో ప్రకటించినారు. క్రొత్తగా లభించిన ౬౦ పదాలతో, అమూల్యములయిన నూతనవిషయాలను తెలిపే విపులమైన పీఠికతో ఈ ముద్రణం పూర్వముద్రిత గ్రంథా లన్నింటికంటె ముచ్చటగానూ, గుణోత్తరంగానూ వున్నది. భానుదత్తుని రసమంజరికి ఎవరో అజ్ఞాతభావుకుడు క్షేత్రయ్య పదలక్ష్యాలతో

రచించిన అనువాదం 'శృంగార రసమంజరి' కూడ యిందుతో ముద్రింపబడినది.

మువ్వగోపాల నామాంకితములై వున్నప్పటికీ రచనసుబట్టి అప్రౌఢ రచితాలుగా కనబడుతుండడం చేత ఇందులో ముద్రింపబడిన పదాలలో కొన్ని ప్రక్షిప్తా లనదగినట్టుగా వున్నవి. ఈ విషయాన్ని సంపాదకులేకూడ పేర్కొన్నారు. ముద్రమార్పు అతి సులభం కావడంచేత కాపీలు లేఖకుల అజ్ఞానం చేత వేణుగోపాల నామాంకితా లయిన సారంగపాణి పదాలు కొన్ని మువ్వగోపాల ముద్రతో క్షేత్రయ పదాలుగా వ్రాతప్రతులలోని కెక్కినవి. నిజంగా సారంగపాణి పదాలే అయివుండీ మువ్వగోపాల పదాలుగా వ్రాతప్రతులలోకెక్కిన నాలుగు పదాలు ఇందులో ముద్రితములై వున్నవి.

(౧) అక్కరలేని కాపురమాయె (పుట - ౪)
మూడవ చరణంలో

'తాను వేణుగోపాలు డాయె - దయలు దూర మాయె' అన్న ముద్రమార్పుతో యీ పదమే సారంగ పాణి పదములలో నున్నది. (చూ. ప్రథమభాగము. ౫౪ వ పదము.)

(౨) ఇంటికి రా నిచ్చేనా—యీ మేనితో
నింతి నాని దలచేనా (పుట—౨౧)

అనుపల్లవిలో

'గొంటుకాడై వేణు - గోపాలుడు నాపై' అనీ
తుది చరణంలో

'పని బూని వేణుగో - పాలా యని పిలిచేవా' అనీ యిదే పదం ముద్రమార్పుతో సారంగపాణి పదాలలో వున్నది. (చూ. ప్రథమ భాగము - ౩౯ వ పదము)

(౩) తన చిత్తము వచ్చినటుల - దయసేయు మనవే
(పుట—౧౨౦)

అనుపల్లవిలో

'వినవే కార్వేటినగర - వేణుగోపాల దేవునితో', అనే మార్పుమాత్రంతో యిదే పదం సారంగపాణి పదాలలో వున్నది. (చూ. ప్రథమ భాగము ౫౫ వ పదము)

(౪) తెలిసె నీ తెనరు లేని జాడలు (పుట-౧౨౯)
అనుపల్లవిలో
'వలదు నిలుపు యీ మాటల కేమి

వచ్చె వేణుగోపాల నా సామి' అని ముద్ర మార్పుతో యిది సారంగపాణిపదాలలో వున్నది. (చూ. ప్రథమ భాగము. ౪౩ వ పదము)

ఇదిగాక రాజగోపాల నామాంకితముగా మూవ ల్లూరు సభాపతయ్యగారిచే రచింపబడిన యీ క్రింది పదము ఒకటి యిందులో ముద్రింపబడినది.

ఎవతె తాళు నమ్మా యీ నడతల—
నే మందునె కొమ్మా (పుట—౬౯)
అనుపల్లవిలో

'సవతి రాజగోపాలు కెక్కు వేమొ' అన్న ముద్ర మార్పుతో ఈ పదము సభాపతయ్యగారి పదాలలో వున్నది. వావిళ్ళ ముద్రణాలయమువారు ముద్రించిన క్షేత్రయపదములలోని నాలుగు పదములు ఇందు ముద్రింపబడ లేదు.

శృంగార రసమంజరిలో 'నా మేను నీ మే నవు చును బలికిన' అనుపదము కొట్టిపుణ్యము పదము అని కుంపటీకరణములలో పేర్కొనబడి యున్నది. కాని అది సభాపతయ్య పదము. ఇదిగాక శృంగార రస మంజరిలో నుదాహరింపబడి ఘనా నావారివని గుర్తింప బడని 'ఎందుకు బొంకేవురా లేదని నాతో'— 'ఇచ్చిన మంచిదే యీకున్న మంచిదే' అను పద ములు సారంగపాణి పదములు. తక్కిన పదములుకూడ ఎవరివో గుర్తింపబడవలసి వున్నవి.

గ్రంథసంపాదకులు తమ విపులమైన పీఠికలో క్షేత్రయ్య జన్మస్థలాన్ని సోపపత్తికంగా నిర్ణ యించడం మాత్రమే గాక పదములనుబట్టి ఒకవిధంగా క్షేత్రయ జీవితచరిత్రను పోల్చుటకు ప్రయత్నించారు. ఇదిగాక పదకవిత్వ చరిత్రమూ, సంగీత శాస్త్రములో క్షేత్రయపదముల విశిష్టత, క్షేత్రయ మధురభక్తి, క్షేత్రయ పదములలో పూర్వపద కవుల ఛాయలు మొదలైన అనేక విషయాలను గూర్చి చర్చించడంలో సంపాదకులు అమూల్యము లయిన అనేక విషయాలను తెలిపారు.

క్షేత్రయ జన్మస్థలం కృష్ణాజిల్లాలోని మొవ్వ గ్రామమే అనీ అక్కడి మువ్వగోపాలస్వామికి అంకి తములుగానే క్షేత్రయ్య తన పదములను రచించినాడని సంపాదకులు ఇందులో నిరూపించారు. కాని క్షేత్రయ జన్మస్థలం చిత్తూరుజిల్లా చంద్రగిరి తాలూకాలోని మొవ్వగ్రామ మనే అభునాతనుల వాదాన్ని ఖండించడంలో నిమగ్నులై మువ్వ ఉత్త రార్కాడు జిల్లాలోని మూవపుర (*Moovatura*) మని వ్రాసిన కీర్తనాచార్య పి. ఆర్. శ్రీనివాస అయ్యంగారి వాదమును సంపాదకులు విస్మరించి నటుల వున్నది. ఆ వాదాన్నికూడా సోపపత్తికంగా ఖండించివుంటే బాగుండేది. ఇతరస్థలాల్లో ఎక్కడా మువ్వగ్రామం వున్నట్టుగా గుర్తింపబడకపోవడం, కృష్ణాజిల్లాలో మొవ్వగ్రామం వుండడం, క్షేత్రయ్య

మువ్వపురిగోపాల అని పేర్కొనడం, ఆ గ్రామంలో మువ్వగోపాలస్వామి దేవాలయం వుండడం అందులో క్షేత్రయ్య వంశీకులు అని చెప్పుకుంటున్న వారు వుండడం, మువ్వకు దగ్గర లోనే వున్న కూచిపూడిలోని భాగవతులు సాంప్రదాయికంగా పాడి అభినయిస్తూ వుండడం వారి వాదానికి బలమును చేకూరుస్తూ వున్నవి. కావయితే నేడు మొవ్వగ్రామంలో వుంటున్న వారి యింటి పేరునుబట్టి క్షేత్రయ్య యింటిపేరు 'మొవ్వవా'రని నిర్ణయించడం కొంత సాహసమే. ప్రబలములయిన కారణాలే క్షేత్రయ్య నివాసస్థలం కృష్ణాజిల్లాలోని మొవ్వ గ్రామమే అని నిరూపించగలుగుతున్నా సంపాదకులే పీఠికలో క్షేత్రయ్య పాడిన పదములను బట్టి క్షేత్రయ్య దర్శించినవిగా గుర్తించిన దైవతములు, క్షేత్రములు, చాలవరకు దక్షిణమండల ప్రాంతములలోనివై వుండడం విచారింపదగిన విషయం. అందులోనూ కొన్ని అప్రసిద్ధములయిన, సాధారణంగా దక్షిణదేశ యాత్రికునికి మార్గంలో తగులని గ్రామదైవతములమీద క్షేత్రయ్య పదాలు చెప్పి వుండడంచేత క్షేత్రయ్య యీ ప్రాంతాలవారే యేమో అనే సందేహానికి కూడా అవకాశం కలుగుతూ వుంది. క్షేత్రయ్య యీ ప్రాంతాలవాడు అనే ప్రవాదం కూడా యీ సందేహానికి కొంత బలం. తాళ్లపాక తిమ్మక్క సుభద్రాకల్యాణంలో—

'పుండరీకాక్షుడా - పురుషోత్తముడ
మురవైరి వందిత - మువ్వగోపాల
నారదవినుత యా - నంద ముకుంద

మత్స్యావతార నా- మనవి చేకొనుము'—అన్న చోట పేర్కొన్న 'మువ్వగోపాల' అనే పదం కూడ యెక్కడో కృష్ణా జిల్లాలో వుండే మొవ్వలోని మువ్వగోపాలస్వామిని పేర్కొనునది కాక తిరుపతి ప్రాంతంలోని మువ్వగోపాలస్వామినే పేర్కొనేదిగా వుండి యీ వాదానికి ప్రాణం పోస్తూ వుంది. ఇక్కడ ఒక్క చోట మాత్రం మువ్వగోపాల అనేపదానికి మువ్వలు ధరించిన గోపాలుడని కాని, మువ్వల వేణుగోపాలుడని పేరుగల కార్వేటి నగర వేణుగోపాలుడని కాని అర్థం చెప్పుకోవడం అసహజంగా అనుపించకపోదు. ఇదిగాక చిత్తూరి జిల్లాలోని 'మువ్వలవారి పల్లె' జమీందారీ గ్రామము పేరు గుర్తింపబడినంత మాత్రాన గవర్నమెంటు రికార్డును తప్పవజాలము కదా! క్షేత్రయ్య తిరిగిన స్థలములు సంపాదకు లొసగిన పట్టికనుబట్టి విజయనగరమువద్ద తుంగభద్రా తీరముననున్న హేమాద్రి, కడప, కడప జిల్లాలోని యివంత్రోలు, కర్నూలులోని పాలగిరి, తిరుపతి, తిరువళ్లూరు, సత్యవీడు (ఇది చిత్తూరుజిల్లా దనియున్నది. అది సరికాదు. చెంగల్పట్టుజిల్లాలోనిది), చక్కరపురి, (ఇది చక్రపురియై యుండును. ద్విపద నలచరిత్రకారుడైన చక్రపురి రాఘవాచార్యుల తాత చక్రపురి దొడ్డయాచార్యులు షోలింగరులోని కందాళ దొడ్డయాచార్యుల శిష్యుడు. * చక్రపురి దక్షిణమండల ప్రాంతములలోనిదై యుండును), కంచి, శ్రీరంగము, మధుర, శ్రీశైలము, కోవళ్లూరు, చిదంబరము, మహాదేవ పట్టణము ఇత్యాదులు. ఇందులో దక్షిణదేశములోనివి మినహాయించగా తక్కిన స్థలము లన్నియు దక్షిణమండల ప్రాంతములవే యయియుండుట గమనార్హము. ౪౯౯ వ పదములో 'వేదపురి నిలయు' డని కలదు. ఈ వేదపురి యెక్కడిదో తెలియరాలేదని సంపాదకులు వ్రాసిరి. అది బహుశః 'వాదపురి' యయియుండును. చిదంబరమునకు వాతపురి, వాదపురి యను పేళ్లుకలవు. క్షేత్రయ్య చిదంబరమునకు పోయి తిల్లగోవిందునిమీద పదములు చెప్పినవాడే కనుక 'వాదపురి'—చిదంబర మగుననుట సమంజసమే యగును. రావిపాటి తిప్పన్న త్రిపురాంతకోదాహరణములో 'వాదపురి' పేర్కొనబడినది.

క్షేత్రయ్య దర్శించిన స్థలములనుబట్టి మాత్రమే కాక యతడు తన పదములలో వాడిన భాష, నానుడులు, పదప్రయోగములు, కారకములు కూడ కొన్ని యతనికి దక్షిణమండల ప్రాంతీయతను ధ్రువపరచుచున్నవి.

౧౩ వ పదములో—

"పామూడి జోగివలె పాయె (పోయె ననుటకు) నా బ్రతుకు" ఇందు పేర్కొనబడిన పామూడి లేక పాముడి అనంతపురము జిల్లాలోనిది. ఆ గ్రామములో మెట్టవేదాంతులు ఎక్కువ. వా రిటు యిహమునకు అటు పరమునకు చెడినవా రగుదురు. అందుచే నా బ్రతుకు పామూడిజోగి బ్రతుకువంటిదైనదని, ప్రియ వంచితయయిన నాయిక యనుచున్నది. దక్షిణమండలములలో వ్యవహారమున నున్న యీ సామెతను వాడిన క్షేత్రయ యీ ప్రాంతములవా డనుట సత్యదూరము కాజాలదు. ఇదిగాక వక్కలాకులు, పద్దు (పంతము అను నర్థములో), లోకాస్తమానమైనట్లు, రెండు దల చుట, మోడిచేసుకొనుట, ఎగబోయుట, పాలకుడిగి, నిత్యనిత్యము, పూలంగిసేవ, కుయ్యాకు, పటానిపూల పావడ, చెప్పి చాలారె అనే యీ పదాలు దక్షిణమండలాలలో మాత్రమే విరివిగా ప్రజావ్యవహారంలో వున్నవి క్షేత్రయపదాలలో కానవస్తున్నవి.

ఇందుచేత క్షేత్రయ్య జన్మస్థలం మొవ్వ గ్రామమే అయివుండినా జీవితకాలంలో చాలా

* చూ. నలచరిత్ర ద్విపద-పీఠిక - ; పండితారాధ్య చరిత్ర పీఠిక పుట ౧౪౦.

భాగం రాయలసీమ ప్రాంతాలలో తిరిగి జీవితపు రుచులు అనుభవిస్తూ తంజావూరుకు వెళ్ళివుంటాడని అనుకోవడమో, యీ ప్రాంతాలలోనే నేడు గుర్తింపబడని మువ్వగోపాలస్వామి ఆలయం వుండే 'మువ్వపురి' వుండియుంటుందని అనుకోవడమో సమంజసం అవుతుంది.

సంపాదకులు క్షేత్రయ రచించిన కొన్ని పదములను బట్టి అతడి జీవితచరిత్ర యిట్టిదని చెప్పబూనడం ఒకవిధంగా సాహసమే అవుతుంది. కవీశ్వరుని చరిత్ర అందుకుకులుగా మనకు లభించినప్పుడు అతడి రచనలో అతని జీవితంలోని ఘట్టాల ఛాయలుగా కనబడే వృత్తాంతాన్ని బట్టి కవి జీవితచరిత్రను పోల్చుకోవడం, పూర్వచరిత్రను పరిపుష్టపరచుకోవడం కొంతవరకూ సమంజసమే అయినా మొదటి నుండి తుదిదాకా అంతా వూహాలతోనే కథ అల్లడం చాతుర్యమయితే కావచ్చుగాని చరిత్ర కాజాలదు. వరదునిమీద క్షేత్రయ్య రచించిన పదాలనుబట్టి సంపాదకులు క్షేత్రయ్య జీవితచరిత్ర యిట్టిదై వుంటుందని వూహించి చెప్పిన కథ కేవలం కట్టుకథ. క్షేత్రయ్య జీవితచరిత్ర అట్టిదే అయివుంటుందని మనం నిశ్చయించడం సమంజసం కాదు. విశేషించి క్షేత్రయ్య విజయరాఘవనాయకునిమీద చెప్పిన 'సామాన్యముగాదె వాని పొందు' అనే పదంలోని విషయాన్ని క్షేత్రయ్య జీవితచరిత్రకు సంబంధించినదిగా చెప్పడం సమంజసం కాదు. ఆ పదంలో క్షేత్రయ్య తన విషయం చెప్పుకోలేదు. విజయరాఘవనాయకుని విషయం చెప్పినాడు. నామమాత్రంగా విజయరాఘవనాయకుణ్ణి పేర్కొని తన విషయమే అందులో చెప్పుకొన్నాడని చెప్ప గుదరదు. ఎందుకంటే విజయరాఘవనాయకుడు నిజంగా అట్టివాడు. ఆ పదంలోని విషయం విజయరాఘవనాయకుడికి అక్షరాలా సరిపోతుంది.

శృంగార రసమంజరినిగూర్చి వ్రాస్తూ 'పదములను వ్రాయుటలో అలంకారశాస్త్రములోని రసమంజరిలోని శృంగార ప్రధానములగు సర్వలక్షణములకును లక్ష్యములను వ్రాయుట క్షేత్రయ్యయొక్క యభిప్రాయ'మని సంపాదకులు వ్రాయడంకూడ సత్యం కాదు. కాంతాజనంయొక్క మనస్తత్వమూ, వారి అభిరుచులూ, రహస్యాలూ, పలుకులూ, కులుకులూ చక్కగా యెరిగివుండిన క్షేత్రయ్య రసతన్మయుడై తన యెరుకనంతా ముంచి యెత్తుతూ భావావేశంతో పదాలు రచించినాడుగాని రసమంజరిని దగ్గర పెట్టుకొని అందులోని లక్షణాలకు లక్ష్యాలుగా పదములు రచించలేదు. శృంగార రసమంజరికారుడు రసమంజరిని అనువదిస్తూ అందలి లక్షణాలకు లోబడే కొన్ని మువ్వగోపాలపదాలను, ఇతర పదాలను లక్ష్యాలుగా పేర్కొన్నాడు. వివిధ నాయికానాయక లక్షణాలకు సరిపోలుతూ వున్న లక్ష్యాలు మువ్వ గోపాల పదాలలోనూ, ఇతర పదాలలోనూ వుండడం గుర్తించి శృంగార రసమంజరికర్త ఆయా నాయికాది లక్షణాలకు లక్ష్యాలుగా కొన్ని పదాలను పేర్కొనినాడు. అంతేకాని క్షేత్రయ్య రసమంజరిలోని లక్షణాలకు లక్ష్యాలు వ్రాసే వుద్దేశంతో యీ పదాలు రచించలేదు.

క్షేత్రయ్య అన్నమయ్యననుకరించినాడని చూపిన యుదాహరణములలో పోలిక లంతగా కానరావడం లేదు. ఆ వుదాహరణాలు ఒకరి నొకరు అనుకరించినట్టుగా గాక వారివారి ప్రత్యేకతతోనే ప్రతిభాసిస్తున్నది. పచ్చి శృంగారాన్ని బాహాటంగా తనివిదీర తన మనసార పదములలో నుంచెత్తిన క్షేత్రయ్య పదాలలో అధ్యాత్మతత్వమున్నదనిగాని, అందు మధురభావమిళితమైన రాధాకృష్ణతత్వము-అదే మధురభక్తి - వున్నదనిగాని చెప్పడం అత్యుక్తి. క్షేత్రయ్య కళామధురమూర్తి! రసైక చక్షుష్కుడయిన భావుకుడు!

అనేక తాళపత్రాలు, వ్రాతప్రతులు పరిశోధించి, ముందు అచ్చయిన గ్రంథాలలో లేని సుమారు తొంభై పదాలను సేకరించి ఆకారాది క్రమంలో మొత్తం మూడువందల ముప్పై పదాలను చక్కని కాగితాలమీద ముచ్చటగా ముద్రింపించి క్షేత్రయ్య సాహిత్యాన్ని మన కందించిన శ్రీవిస్సా - అప్పారావు పంతులుగారు వందనీయులు. వారి యమూల్యకృషి ఫలోన్ముఖం కావడానికి కారకులయి యీ అమూల్య గ్రంథాన్ని ఆంధ్రలోకాని కర్పించే భాగ్యం ఆంధ్ర గాన కళాపరిషత్తు పొందింది. క్షేత్రయ పదప్రయోగములను గూర్చి శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి గారు వ్రాసిన కృతిప్రశంస, శ్రీ జమ్మలమడక మాధవ రామశర్మగారు క్షేత్రయసాహిత్యము అనే పేరుతో వ్రాసిన వ్యాసమూ ఇందులో ప్రకటింపబడినవి. క్షేత్రయ పదప్రయోగవిశేషాలలో కొన్నింటిని మాత్రమే శ్రీ సూర్యనారాయణ శాస్త్రిగారు దిఙ్మాత్రంగా పేర్కొన్నారు. ఇంకా క్షేత్రయ ప్రయోగించిన అనేక పదముల స్వరూపాలనుగురించి, వాటి విశేషాలను గురించి చెప్పవలసిన సంగతులు చాలా వుండిపోయినవి. ఈ పదములలోని నానుడులను, సామెతలను ఏర్చి శ్రీవిస్సా-అప్పారావుగారు ప్రత్యేకంగా ప్రకటించి భాషా పరిశోధకులకు చాలా సౌకర్యం చేకూర్చారు. అచ్చువేయబడిన పదాలు ఇంకకొంత ప్రామాణికంగాపరిష్కరింపబడివుండేబాగుండేది. యతిస్థలాలు కొన్ని స్థలాల్లో సరిగా గుర్తింపబడకపోవడం, చరణములలోని పాద విభజన కొన్ని

చోట్ల సరిగా లేకపోవడం, అర్థదృష్టితో కొన్ని తప్పులు దొరలడం మొదలయిన కొన్ని చిన్న చిన్న పొరబాట్లు మినహాయిస్తే సంపాదకులు ఈ గ్రంథ పరిష్కరణంలోనూ, ముద్రణంలోనూ చూపిన ప్రత్యేక శ్రద్ధ ప్రశంసనీయం.

గ్రంథభాగంలోని ముద్రణస్ఖాలిత్యాలు కొన్ని - ౧౦౧ వ పదము రెండవచరణ మిట్లున్నది.

'సరివారు గైకొన్నట్లు రొమ్మైన-
సరిగకోకల సరసముగాను
యింటివెచ్చానికై పదిరూక లమర్చినావా -
యికయేమో యొక
మంచి వలువతో నే అల్లునికి
ధర నైశ్వర్యము వచ్చితే
అర్థరాత్రి గొడను బట్టుకొన్నట్లు ॥ఎన్ని॥'

అర్ధరాత్రి గొడను బట్టుకొనుట తప్పు. గొడుగును బట్టుకొన్నట్లు అని యుండవలెను. సరి యయిన పాద విభజనముతో నీ చరణ మిట్లుండవలెను.

సరివారు గైకొన్నట్లు రొమ్మైన -
సరిగకోకల (గైకొనేవు)
సరసముగాను యింటి వె -
చ్చానికై పదిరూకల
మరిచినావా యిక యేమో యొక-
మంచి వలువతో నే అల్లునికి
ధర నైశ్వర్యము వచ్చితే అ -
ర్ధరాత్రి గొడుగు బట్టినట్లు—

౧౦౬ వ పదములో—

'మువ్వగోపాల నీ - మనసు దెలిసె లేరా' యని యుండవలెను. మువ్వగోపాల యని ముద్రితము.

౧౩౧ వ పదములో—
మూడవ చరణములో ప్రథమ పాదము

'చెలియ మువ్వగోపాలు డైన శ్రీ వేంకటేశుని' అని యుండవలెను.

౧౪౪ వ పదములో—

వలచిన దానిగూడి - వా డిందు రాడాయె - నని యుండవలెను.

౧౫౧ వ పదములో—

మూడవ చరణములోని పాదములు తారుమారుగా ముద్రింపబడినవి. ఆ చరణ మిట్లుండవలెను.

మదనుని కేళికి చెదరే వేమె
చెదరి భయంబున జూచే వేమె
మమతదీర ముద్దియ వదేమె
మదుపు లీయ చెయ్యాడ దదేమె—

౧౫౪ వ పదములో—

మానినిరో నిన్న - మాపటివేళలో-నని యుండవలెను. నిన్న అని ముద్రితము

౧౬౨ వ పదములో—
ప్రథమ చరణములో

కన్నుల పీడముతో - కాటుక మోవితో
వెన్నుని కీల్జడ - వేటుతోను—

అని యున్నది. 'వెన్నున' అని మాత్రము తప్పొప్పుల పట్టికలో సవరింపబడినది.

'కన్నుల పీడెముతో - కాటుక మోవితో
వెన్నున కీల్జడ - వేటుతోను'—

అని యుండదగును.

పీడెము వేసికొన్న నోటితో నెవతో మువ్వగోపాలుని కన్నుల ముద్దు పెట్టుకొనినది. అందుచే నతని కన్నుల కామె పెదవులమీది పీడె మంటినది. ఇతడా నాయిక కాటుక కన్నులను ముద్దు పెట్టుకొనగా నితని మోవికి ఆమె కన్నులలోని కాటుక యంటినది కనుక 'కన్నుల పీడెముతో - కాటుక మోవితో'— అనట సమంజసము. రెండవ చరణములో 'నిద్దుర మబ్బుతోను' అని యుండవలెను.

౧౮౯ వ పదము—

వలచేది యొకరికోసమా ? — ఓర్వలేని - చెలులంటేనే కోసమా అనే పల్లవితో ప్రారంభము కావలెను. ఇది యనుపల్లవిగా ముద్రితము—

౧౮౭ వ పదములో

చెలగి మోమున మోము - కేర్చి ముద్దాడుచు నుండె - అని యుండవలెను.

౨౩౫ వ పదములో

ప్రథమచరణ మిట్లుండవలెను.

తియ్యని కెమ్మోవాని - తేనె లానుచును
సయ్యాటమున ప్రొద్దు - జరప నొప్పేవా
పయ్యెద తొలగించి - పాలిండ్లపై నొక్క-
చెయ్యైన వెయ్య నొప్పేవా

౨౪౧ వ పదములో కడపటి చరణము.

'మువ్వగోపాల దమ్మని - ముద్దు బెట్టి కూడగాను
పువ్వుబోణి మోవి తేనె - భుజియించిన చవి దలచి'

అని యుండవలెను. ఈ రెండు పాదములకు మధ్య రెండవ చరణములోని 'మరువ వెరవు గొనవరట' అనుపాదమునకు పాఠాంతరము కాబోలు 'మురువ జెరవు గాన నకట' అను పాదము తప్పుగా పడినది.

౨౪౫ వ పదములో కడపటి చరణము.

'సకియ నీ చన్గవలు -
సంగటికొండ లందురు గాని

కొండలైతే -
కోటలిలుపు లేవే
యిక నేమి సేయుదును మువ్వగోపాల -
యిదిగో పాలిండ్లపై
తిర్క్కింప రవికముకే తలుపు గాదా'

అని యుండవలెను.

౨౫౧ వ పదములో —

'మాలిమితో దను - మువ్వగోపాలస్వామి' అని యుండవలెను.

౨౫౨ వ పదములో

'భాళి తాళజాలలే నని తా - బలికినదే గురుతు' అని యుండవలెను. తా ననినదే గురుతు అని ముద్రితము.

౨౬౧ వ పదములో

'మూవగోపాలా - ముద్దుల లేలా
నా విభిగాని ని - న్నన బరిలేదు'

అని యుండవలెను. పల్లవికి సమపల్లవికి ప్రాస మున్న నితడు ప్రతిపదమునకు పాటించినాడు. మువ్వ గోపాల - అని ముద్రితము.

౨౬౭ వ పదములో

రెండవ చరణమున అరు పాదములు కలవు. మూడవపాదము 'అలసి మువ్వగోపాలుడు - అనిశము ననుగూడి' అన్నంతవరకుండవలెను. కడపటి రెండు పాదములకు నీ చరణమునకు సంబంధము లేదు. అది వేరొక చరణములోని తునుకలై యుండును మూడవ చరణము ప్రారంభము' రేపొద్దు ప్రాణవిభుల' నని యుండవలెను. రాపువ గూడున్న - అన్నదానితో ప్రాసము.

౨౭౨ వ పదములో

'చెలువుని జూచి మోహించి -
చేకొని యొకతె యున్నదో'

అని యుండవలెను. చేకొన జెవతె అని ముద్రితము. అర్థము కుదురదు.

౩౦౬ వ పదములో

పగదాయ పూవింటివాడు - అని యుండవలెను. పగదాయె అని ముద్రితము.

విజయరాఘవముద్రలో 9 వ పదము కడపట.

'కేడెంపు వజ్రాలకమ్మలు ఆరాణికైతే
తొడించిన వుంగరమ్ములు నాతోనైతే
జాడిగానె యిచ్చకమ్ములు - ఓరోరి జాణ'

అని యుండెదగును.

ఇప్పటివరకు ఉపలబ్ధము లయిన పదాలన్నీ ఒక్కచోట చేర్చుకోవడం జరిగింది గనక యిక తర వాత క్షేత్రయ్య రచనా రీతులనుబట్టి ఆయా పదాలను ప్రామాణికంగా పరిష్కరించుకోనడం మన వంతు. బహుశ్రమ కోర్చి యీ పదాలను సేకరించి చక్కగా ముద్రించి రసికప్రపంచాని కంతటికీ అందజేసిన శ్రీ అప్పారావు గారికి ఆంధ్రలోకం ఋణపడివుంది. సంప్రదాయపద్ధతిని స్వరపరుపబడిన క్షేత్రయ పద ములను గూడ ఆంధ్ర గానకళా పరిషత్తువారు త్వరలో ప్రకటింతురు గాక!



గ్రంథవిమర్శనము

సమాజసామ్రాజ్యము
లేక
ఆదర్శప్రభుత్వము

శ్రీ పంచాంగం వెంకటాచార్యులు తెలుగు పండితులు మునిసిపల్ హైస్కూలు. హాస్పేట: బళ్లారిజిల్లా. వెల : రెండురూపాయలు:

ఇది మూడాశ్వాసాల పద్యకావ్యము. మాంధాత చక్రవర్తి చరిత్రము, ఆ చక్రవర్తి ఆదర్శప్రభుత్వము దీనిలో వర్ణ్యవిషయాలు. ఇది సాంప్రదాయికమైన ప్రబంధ ధోరణిలో రచింపబడిన పద్యకావ్యమేమో నని పాఠకులకు అభిప్రాయం కలగవచ్చును.

కాని సామాన్యప్రబంధాల ధోరణిలో ఈ కావ్యరచన సాగలేదు. ఆదర్శప్రభుత్వపద్ధతి చిత్రించడానికై కవి ఈకావ్యం వ్రాశారు. అందుచేత ప్రాచీనకాలపు మాంధాత చరిత్రలో నేటి కాలపు ఆదర్శప్రభుత్వానికి సంబంధించిన అభిప్రాయాలు ఇమిడ్చి వీరీ కావ్యం నిర్మించారు. కనక రచయిత ఈ కావ్యానికి సమాజ సామ్రాజ్యము, లేక ఆదర్శ ప్రభుత్వము అని పేరు పెట్టారు.

ఒక కవి నేటి కాలపు సువిశాలాదర్శం ఏదో ఒకటి తీసుకొని ఆ ఆదర్శం చిత్రించ డానికి ప్రాచీన కాలపుగాథ ఏదైనా స్వీకరించడంలో అనౌచిత్యం ఏమీ లేదు. అయితే నేటి కాలపు దైనందినాచారాలు ప్రాచీన పురాణపురుషులకు అంటగట్టడం కేవలం అనౌచిత్యంగా పరిణమిస్తుంది.

శ్రీ పప్పూరిరామాచార్యులుగారు ఈ కావ్యానికి ప్రవేశిక వ్రాస్తూ "కృతయుగమునాటి సాంప్రదాయములకును, ఆచారములకును భిన్నముగా ఈ మాంధాతృచరిత్ర నడచినదనుటను దోషముగా కాక నది యొక గుణముగా పాఠకులు గ్రహించి రసాస్వాదనచేయ ప్రార్థితులు." అన్నారు.

కాని, కేవలం నేటికాలపు దైనందినాచారాలు కూడా పురాణపురుషుడైన మాంధాతకు అంటగట్టడమే ఈ కావ్యానికొక దోషంగా పరిణమించింది.

ఉదాహరణకు మాంధాతచక్రవర్తి తండ్రి అయిన యువనాశ్వుడు 'రాజకుమార విద్యాలయ వార్షికోత్సవసమితి కధ్యక్షుడుగా' వెళ్లడం అనే కథా ఘట్టం తీసుకుందాము. విద్యాలయాల వార్షికోత్సవాదులు, వాటికి అధ్యక్షవరణాదులు బాగా ఇటీవలి కాలపు ఆచారాలు. ఆకాలంలో ఋష్యాశ్రమాలలో గురుకులవాసం ఉండేదిగాని ఇల్లాంటి అధునాతనాచారాలేవీ ఉండేవికావు. ఈవిధంగా కేవలం నేటి కాలపు సాంఘికాచారాలు ఈ కావ్యంలో చాలా చోట్ల కనిపిస్తున్నాయి. ఈ ఆచారాల వర్ణన ఈ కావ్యానికొక లోపము.

అయితే ఈ కవికి కావ్యరచనకు కావలసిన పాండిత్యం ఉన్నది. వృత్తరచన, అక్కడక్కడ చేసిన ఆయా ఋతువులవర్ణన ఈ కవికిగల రచనాశక్తికి స్ఫోరకంగా ఉన్నాయి. ఈ క్రింది వసంత ఋతువర్ణనలు ప్రత్యేకంగా పరిశీలింపదగినవి.

"అంత వసంత మొప్పెను ల
  తాంత నితాంత నవస్వరూపమై
కంతుసఖుండు కోకిలలు
  క్రమ రసాలకిసాలయంబులన్
బంతి మెలర్ప నూచుచును
  పారణసేయుచు శ్రేత్రకావళిన్
సంతస మొందజేయగ
  రసాతలమంతట దానె రాజుగాన్."

"మృదుహాసరాశినాఁ బొదలు వెన్నెలప్రోవు
  ఋదుతల నాహంగఁ బ్రోత్సహింప
దలవాకిళులయందుఁ జలువపానుపులెల్ల
  విరిమల్లియల తావి వెక్కగొలుప
కలవారి ముంగిళ్లఁ గలధౌతపాత్రలు
  కలమాన్న దధిపూర కలన మెరయ
రచ్చపట్టుల వాడరచ్చబండలు తిన్నె
  లిష్టకథాగోష్ఠి నింపుమీర
మధుర శుభకర మాధవ మాసమందు
శుక్లపక్షపు మునిమాపు సొంపుమిసుల
బగటివేళల యుడుకుల బెగటుమాన్చి
ప్రాణికోటి సమాదరపాత్రమయ్యె."

భామినీ విలాసము

విద్వాన్ వేదము వేంకటకృష్ణశర్మ. ౭౦ స్వామిపిళ్లవీథి, చూళై, మద్రాసు ౭. వెల: ౩-౦-౦

ఇది జగన్నాథ పండితరాయలు సంస్కృతంలో రచించిన భామినీ విలాసానికి వేదము వేంకట కృష్ణశర్మగారు రచించిన పద్యానువాదము.

పండితరాయలు ౧౭ వ శతాబ్దంలో ఢిల్లీచక్రవర్తి షాజహాను సభలో దిగ్దంతాల వంటి పండితులనేకులను వాదంలో నిర్జించి చక్రవర్తిచే అపూర్వంగా గౌరవింపబడిన ఆంధ్రాలంకారికుడు. ఈయన సుప్రసిద్ధాలంకారశాస్త్రగ్రంథం రసగంగాధరము ఇంతకుపూర్వమే తెలుగులోకి వచ్చింది.

పండితరాయలు సంస్కృతవాఙ్మయంలో కవిగాకూడా ప్రసిద్ధికెక్కాడు. ఈ కవి రచించిన భామినీవిలాసం ఇంతకుపూర్వం ఆకుండి వ్యాసమూర్తిశాస్త్రిగారు, దంటు సుబ్బావధానిగారు, తెనుగులోకి అనువదించారు. అయినా శ్రీ వేదము వేంకటకృష్ణశర్మగారి కావ్యం మీద గల గౌరవంచేత తిరిగీ దీనిని తెలుగులోకి అనువదించినట్లు కనిపిస్తున్నది.

వేంకటకృష్ణశర్మగారీ గ్రంథంలో మూల సంస్కృత శ్లోకాలు ముద్రించి, వానిసరసనే తమ ఆంధ్రానువాదంకూడా ముద్రించారు. అందుచేత సంస్కృతం తెలిసినవారికీ పద్యాలు మూలంతో సరిపోల్చడానికి వీలిచ్చింది. వీరీ అనువాదం మూలానుసారిగా ఉండడానికి చాలా శ్రమ తీసుకున్నారు. సరళము, శిష్టము అయిన కావ్యభాషలోనే వీరి అనువాదం నడిచింది. ఈ క్రింది సంస్కృతానువాదాలను బట్టి వీరి అనువాదధోరణి గ్రహింపవచ్చును.

చింతా మీలితమానసో మనసిజః —
  సఖ్యో విహీనప్రభాః
ప్రాణేశః ప్రణయాకులః
  పునరసౌ వార్తాం సమస్తాకథా
ఏతత్త్వాంప్రతిబోధయామి
  మనుచే దుక్తిం హితం మన్యసే
ముగ్ధే మాకురు మాన మాన
  మానన మిదం రాకాపతిక్షేప్యతి.

సంస్కృత భామినీవిలాసము-శృంగారరసముల్లాసము
  కంతుడు చింత దాల్చెఁ జెలికత్తెలు

పెల్వెలనైరి నీ ప్రియుం
డెంతో కలంగెఁ జెక్కులిక నేల?
  హితంబని నాదుపల్కు నీ
వెంతువయేని ముగ్ధ వినుమీ!
  కడురోషకళంకితాస్య! మా
నాంత మొనర్చు; పూర్ణతుహినాంశుని
  యాటలు సాగనీకుమీ!

ఈ పద్యానువాదం చివరిదాకా సరళంగా మూలానుసారంగానే నడిచిందిగాని, చివరిపాదంలో 'రాకాపతి క్షేప్యతి' అన్న వాక్యానువాదంమాత్రం తెనుగులో స్పష్టంగా భాసించడం లేదు.

ఈ క్రింది శ్లోకంలో మూలంలోని భావమాధుర్యం వాచ్యంకావడంవల్ల వ్యంగ్యగౌరవం తగ్గింది.

'వక్షోజాగ్రం పాణినాస్పృశ్య దూరం
యాతస్యద్రాగాననాబ్జం ప్రియస్య
శోణాగ్రాభ్యాం భామినీలోచనాభ్యాం
జోషం జోషం జోష మేవావతస్థే'
'పాణి జను మెన స్పృశియించి వడిగ నవల
కరుగు ప్రియు మోముదమ్మి శోణాగ్రములగు
కనుల భామినిపుల్కుపుల్కనగనుచు
నిలిచె స్మరదీపన మడంపఁజాలము గామి'

ఈ అనువాదంలో మూలంలో 'జోషం జోషం జోష మేవావతస్థే' అన్న వ్యంగ్యమాధుర్యం 'నిలిచె స్మరదీపన మడంపఁజాలముగామి' అన్న వాక్యంలో బాగా వాచ్యమై పోయింది.

అయితే ఇలాంటి దోషాలున్న అనువాదాలు ఈ కావ్యంలో చాలా తక్కువ.

ఈ క్రింద ఉదాహరించిన ధారాళమైన అనువాదాలవంటివి ఈ కావ్యంలో చాలా ఎక్కువగా ఉన్నాయి.

ఏనిసుధామయోక్తుల యహీన
  రసంబును గ్రోలువాణి, చే
బూనిన వీణెతంత్రులను ముట్ట
  కనాదరమున్ వహించు, నా
ధీనిధిపండితేంద్రు నుడితీరు గ్రహించి
  శిరంబునూపఁడెం
తే వృషభుండు; దాబసపతి ప్రతిముం
  డెటు సేయకుండినన్.

ఈ కావ్యానికి శ్రీపరవస్తు వెంకటరామానుజస్వామి ఎం. ఏ. గారు సమగ్రము, విమర్శనాత్మకము అయిన ఉపోద్ఘాతం వ్రాశారు.

పండ్లు : (నాలుగైదు భాగాలు)

గోటేటి శ్రీగిరాజు. ప్రకాశకులు : ఆంధ్ర గ్రంథాలయ ట్రస్టు, పటమటలంక.

నాలుగవ భాగము వెల : ౫ రూపాయలు. ౫ భాగము వెల : నాలుగు రూపాయలు.

తెలుగులో వ్యవసాయశాస్త్రానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు వేళ్లమీద లెక్కపెట్టవచ్చును. ఇవి ఈ జాతికి చేరిన పుస్తకాలు. వీటి

శీర్షికలనుబట్టి ఇవి పండ్లనుగూర్చిన పుస్తకాలే అని పాఠకులు భ్రమపడవచ్చును.

కాని ఇవి పండ్లనుగూర్చిన పుస్తకాలుమాత్రమే కావు.

నాల్గవభాగంలో మొత్తం ౯౫ రకముల పండ్ల జాతుల వృక్షాలు, వాటి శ్రేంపకము, వాటికి కావలసిన శీతోష్ణస్థితులు మొదలైన విషయాలన్నీ ఈ గ్రంథ కర్త వివరించారు.

అయిదవ భాగంలో కొబ్బరి, అరటి మొదలైన పెద్ద పెద్ద వృక్షజాతులను గూర్చిన వివరాలున్నాయి.

ఈ పుస్తకాలలో ఛాయాచిత్రాలు కూడా చేర్చడంవల్ల కర్షకులకు, వ్యవసాయాభిమానులకు ఇవి బాగా ఉపయోగంగా ఉన్నాయి.

శ్రీ గోటేటి జోగరాజుగారు చిరకాలం వ్యవసాయశాఖలో పనిచేసి, ఆయా ఫలజాతులనుగురించి చక్కని అనుభవం గడించినవారు. వీరి గ్రంథాలు ఫల జాతి వృక్షాల వ్యవసాయంచేసే రైతులకు బాగా ఉపయోగిస్తాయి.

ఈ రెండు గ్రంథాల ముద్రణాదికాలు ప్రశ్నేకంగా ప్రశంసింపదగినవిగా ఉన్నాయి. ఇలాంటి ఉత్తమ వ్యవసాయశాస్త్ర గ్రంథాలు ప్రచురించిన గ్రంథాలయప్రచారకులు అభినందనీయులు.

రాఘవయాదవీయమ్.

[సంస్కృత శ్లేష కావ్యము]

వింజమూరి సోమేశకవి. ప్రకాశకులు : వింజమూరి వెంకన్నపంతులు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్, సూర్యారావుపేట, కాకినాడ. వెల : ఒకరూపాయి.

ఇది రామాయణ, భాగవత కథాపరమైన సంస్కృత శ్లేష కావ్యము. ఈ కావ్య రచయిత వింజమూరి సోమేశకవి, ఈగ్రంథ ప్రకాశకులైన శ్రీ వింజమూరి వెంకన్నపంతులుగారికి ఏడవతరము వారిని ఈ గ్రంథపీఠికాకర్తలు శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు వ్రాస్తున్నారు. అందుచేత ఈ కవి 18 వ శతాబ్దంలో జీవించి ఉన్నాడని నిశ్చయింపవచ్చును.

ఈ కాలానికే సంస్కృతంలో శ్లేషకావ్యరచనం బాగా విజృంభించింది. వింజమూరిసోమేశకవి ఈసంప్రదాయం అనుసరించి ఈ కావ్యరచనకు ఉపక్రమించి ఉండవచ్చును. ఒకే శ్లోకంలో రామాయణ భాగవత కథలు రెండు నడుపుతూ శ్లేషకావ్యం రచించడమే కష్టం. ఆపైన రసవంతంగా కావ్యం రచించడం అంతకంటె కష్టం. సోమేశకవి శ్లేషనిర్వహణలోనే సంతృప్తిపడక రసస్ఫూర్తికోసంకూడా ఎక్కువగా శ్రమించి ఈకావ్యరచన సాగించాడు.

ఈ క్రింది శ్లోకాలనుబట్టి సోమేశకవి రచనా వైఖరి గమనింపవచ్చును.

యా పద్మినీ కలిత గంధవహా వరాలీ
శ్రీ వాహినీ జయతి చారు పయోధరాఢ్యా
తాం దీవసైస్తదనుయోగిభి రేష నీతాం
యోగీ తతార రఘుభాగధిరుహ్య నావం

-ద్వితీయసర్గము-

"ఆశ్చర్య మాపుః కులపుష్పపాదపాన్
దృష్ట్వాపి నాకీ రమ్యతోపమామృతాః
వస్తూని భక్ష్యాణి మణీ స్తతః పురో
జీతే విమానా న్యదితాంశ్చ వానరాః!"

సోమేశకవి సంస్కృత వాఙ్మయం పోషించిన ఆంధ్రులలో ఉత్తమ శ్లేషకావ్యకర్తగా పరిగణింపదగినవాడు.

చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలోను, కాకినాడ ఆంధ్ర పరిషత్పుస్తక భాండాగారంలోను లభించిన తాళపత్రమాతృకల ననుసరించి ఈ గ్రంథం ప్రకటించామని 'తొలి పలుకు'లో శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు వ్రాశారు.

ఈ రెండు తాళపత్రమాతృకలలోను తమకు ఈ కావ్యంలోని చివరిసర్గ లభించలేదనీ, అందుచేత దొరికినంతవరకే ఈ కావ్యం ప్రకటించడం జరిగిందనీ, ఎవరిదగ్గరనైనా సంపూర్ణగ్రంథం గల మాతృక ఉంటే తమకు పంపవలసిందనీ, అది కృతజ్ఞతాపూర్వకంగా స్వీకరించి ప్రకటించగలమనీ శ్రీ పాపయ్యశాస్త్రిగారు పీఠికలో ఒక విజ్ఞప్తి చేశారు. త్వరలోనే వీరి విజ్ఞప్తి ఫలించగలదని ఆశిస్తున్నాను.

ఈ శ్లేషకావ్యం సరళశైలిలోనే రచింపబడినది. అయినా సంస్కృతంలోగాని ఆంధ్రంలోగాని ఒక లఘుటీక వ్రాసి దానితో కూడా కలిపి ప్రకటిస్తే ఈ కావ్యం ఇంకా పాఠకులకు సుగమం కాగలదు. దీనివల్ల పాఠకులకు ఇంకా ఈ కావ్యంలోని శ్లేషచాతుర్యం గ్రహించే అవకాశం కలుగుతుంది. ప్రకాశకులు ద్వితీయముద్రణలో ఈవిషయం గమనించగలరని ఆశిస్తున్నాను.

వేణీసంహారము

[ఆంధ్రీకరణము]

శ్రీ బులుసు వెంకటేశ్వరులు బి. యే., రామారావుపేట. కాకినాడ. వెల : మూడురూపాయలు.

వేణీసంహారానికి ఇంతకుపూర్వం వడ్డాది సుబ్బారాయకవి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు చేసిన అనువాదా లున్నాయనీ, అయినా తిరిగీ తెలుగులోకి అనువదించవలసిన అవసరం ఉన్నదని గ్రహించి తా మీ అనువాదానికి పూనుకున్నామనీ రచయిత తమ పీఠికలో తెలియజేశారు.

అయితే వీరి అనువాదం కూడా పూర్వుల అనువాద సరణిలోనే నడిచిందిగాని, దీనిలో పూర్వానువాదాలలో ఉండే లోట్లు తీర్చే ప్రయత్నం జరగలేదు. సంస్కృత వేణీసంహారంలో కవి ఆయా పాత్రలకు తగిన సంస్కృత ప్రాకృతాదిభాషలు వ్రాసినా, పూర్వానువాదకులు అందరికీ గ్రాంథికాంధ్రమే వాడారు. ప్రకృతానువాదంలో కూడా కవి ఇదే పద్ధతి అవలంబించారు. పాత్రోచితంగా భాషాప్రయోగం చేస్తే ఈ అనువాదం పూర్వానువాదాలకంటె భిన్నంగా ఉండేది.

సంస్కృత వేణీసంహారకర్త భట్టనారాయణుడు సంస్కృతంలో సుప్రసిద్ధకవి. వడ్డాది సుబ్బారాయ కవి చాలావరకు మూలమాధుర్యం తెలుగు పాఠకులకు చవిచూపించారు.

శ్రీవెంకటేశ్వర్లుగారి అనువాదంలో సంస్కృత పదాలపాలు కొంచెం ఎక్కువగా పడింది. మూలానుసారంగా అనువదించాలనే ప్రయత్నమే దీనికి కారణమై యుండవచ్చును. ఈక్రింది పద్యము అనువాదశైలికి ఉదాహృతిగా ఇవ్వవచ్చును.

"భువనం బేర్చఁగ ద్వాదశార్కు
లుదయంబుం బొంద లేదింక; స
ప్తవిధంబై లయకాల వాయువులు వీ
వన్ లేదు; సంవర్తమే
ఘవితానంబది యాక్రమింపదు
వియద్గర్భంబు; నస్మత్ప్రతిన్
జనజీవంబుల శౌర్యరాశి బలుకన్
భావ్యంబె పాపాత్మకుల్"

పద్యరచన వీరు రచించిన ఇతరకావ్యాలలోకంటె భిన్నంగా ఉన్నది. కాని శ్రీ వెంకటేశ్వర్లుగారి పద్యానువాదం ఇంచుమించుగా పూర్వానువాదకుల ధోరణిలోనే ఉన్నదిగాని అంతకంటె ఉత్తమంగా కనబడడంలేదు.

పాశ్చాత్య విద్యావేత్తలు

[*Great western Educators*]

మద్దూరి సత్యనారాయణమూర్తి బి. ఎ. డిప్. ఇడి.
హెడ్మాస్టరు, గవర్నమెంట్ హైస్కూల్ చెన్నూరు. హైదరాబాద్ (దక్కను) వెల : రెండు రూపాయలు.

పాశ్చాత్య దేశాల్లో విద్యావేత్తలనేకులు 16వ శతాబ్దంనించీ విద్యాబోధన విషయాల్లో అనేక పరిశోధనలు జరిపారు. ఈ గ్రంథంలో ౧౬వ శతాబ్ది ప్రారంభంలోకమీనియస్ మొదలుకొని ఈనాటి మాంటిస్సోరీ, జాన్ డ్యూయీలవరకు గల తొమ్మండుగురు విద్యావేత్తలనుగురించీ చరిత్రలో వారు చేసిన పరిశోధనలు, వాటివల్ల నేటి విద్యావిధానాల్లో కలిగిన పరిణామాలు గ్రంథకర్త సంగ్రహంగా వివరించారు.

తెనుగులో విద్యాబోధన పద్ధతులను గురించిన పుస్తకాలు తక్కువ ఉన్నాయి. అందుచేత సంగ్రహరూపంగా ఉన్నా విద్యాసమస్యలు అర్థం చేసుకొనగోరేవారికిది కొంతవరకు ప్రాథమిక పరిచయం కలిగిస్తుంది.

అయితే దీనిలో ఫ్రోబెల్ విద్యావిధానం వివరిస్తూ గ్రంథకర్త బహుమానములు—వృత్తులు అని రెండు పదాలు వాడారు. వీటినిగురించిన వివరణాలు చాలా సంగ్రహంగా ఉండడంచేత ఈ బహుమానా లంటే పాఠకులకు బోధపడడంలేదు. ఇలాంటి పదాలు వాడినప్పుడు వాటికి సరిపోయే ఆంగ్లపదాలుగాని, ఇంకా విస్తృతిమైన వివరణలుగాని ఇస్తే బాగుండేది. ఇల్లాగే ఆయా విద్యావేత్తల సిద్ధాంతాలు కూడా విపులంగా వివరిస్తే పాఠకులకు ఇవి ఇంకా సుబోధకంగా ఉండేవి.

ముందు ముద్రణలోనైనా ఇలాంటి చిన్నచిన్న మార్పులు చేస్తే గ్రంథకర్త తలచిన ట్రైది మాధ్యమిక, ఉన్నత పాఠశాలల బోధనాభ్యసన విద్యార్థులకు బాగా ఉపయోగకారిగా ఉండగలదు.

భారతదేశం-జనాభా వినియమనం

★

ప్రపంచం జనాభా పెరిగిపోతోంది. ముఖ్యంగా భారతదేశంలాంటి దేశాలలో! దానితో తిండిసమస్య అంతకంతకు మరీ భీకరంగా తయారవుతోంది. ఉన్న ప్రజలకే చాలినంత ఆహారం లేకుండగా, జనాభా కూడా పెరగటంతో సమస్య మరింత క్లిష్టమవుతోంది. సమస్య కొత్తదని కాదు— కాని ఈ గత శతాబ్దంలో మరింత జటిలంగా తయారయింది. పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉందో తెలిసికోటానికి గత మూసాల పత్రికల్లో ఏ కొద్ది విశేషాలు పరిశీలించుకున్నా చాలు.

ఈ జనాభా లెక్కల్లో భారతదేశం జనాభా 3౬.౧ కోట్లు తేలవచ్చునని జనాభా కమిషనర్ గారు అంచనా వేశారు. అంటే ౧౯౪౧ జనాభామీద పదో వంతు పెరిగిందన్నమాట. (క్రిందటి దశాబ్దం పెరుగుదల నూటికి ౧౪.౧ ఉంది కాబట్టి, ఈ అంచనా కొంచెం పొరపాటున తక్కువ ఉందేమో!)

గత యుద్ధం పూర్వంకన్నా, తూర్పు ఆసియా దేశాలలో పంట నూటికి 3 వంతులు తగ్గిందని, జనాభా నూటికి పది వంతులు పెరిగిందనీ, ప్రపంచ వ్యవసాయసంఘ నిపుణులు అంచనా వేశారు.

ధాన్యాల దిగుమతులకై అధికవ్యయం

౧౯౫౧ సంవత్సరానికి భారతదేశానికి ఆహార దిగుమతులకోసం దాదాపు ౨౦౦ కోట్లరూపాయిలు దాకా ఖర్చు కావచ్చును. దేశం వివిధరాష్ట్రాలలో ఆహారసబ్సిడీల క్రింద ఇచ్చే సొమ్ము ఇందులో జమకు రాదు. అంటే ఇంకా చాలా ఎక్కువ ఖర్చే ఉంది. (భారతప్రభుత్వం ౧౯౫౦-౫౧ రివిన్యూ ఆదాయం 3౫౯ కోట్ల రూపాయలకే అంచనా) ఇంత భారీ ఎత్తున ధనం ఖర్చవటానికి, ఎక్కువ టన్నుల ధాన్యాలు కావలసిరావటమే కాక, విదేశాలలో ధాన్యాల ధరల పెరుగుదల కూడా కారణమే.

౧౯౪౦-౫౦ లో అమెరికా జనాభా నూటికి ౧౪.౫ వంతులు పెరిగింది. ఇంత పెరుగుదల మును పెప్పుడూ లేదు. గత దశాబ్దం పెరుగుదల రేటు ఇందులో సగం మాత్రంగానే ఉండేది. అక్కడి మొత్తం ౧౫ కోట్ల జనాభాకు, తొమ్మిది నెలలక్రిందే మరో ౨౦ లక్షలు కలిసిందని అవధికారిపు అంచనాలు తెలిపాయి.

అసలు తమ జనాభా తక్కువగా ఉందని, పెంచుకోవాలని చూసే దేశాలు కూడా లేకపోలేదు. కొన్ని దేశాలకు కావలసినంతకుమించే ఆహారపు పంట లున్నాయి. కాని మొత్తంమీద ప్రపంచ జనాభా అతి ఎక్కువగానూ, ప్రపంచ ఆహార సంపద చాలా తక్కువగానూ ఉన్నమాట నిజం. ద్వితీయ ప్రపంచ సంగ్రామానికి పూర్వమే ప్రపంచంలో మూడింట రెండు పాళ్లు జనాభాకు, ఐరోపియ దేశాలలో కూడా, చాలినంత ఆహారం ఉండేదికాదు. ఇప్పటివున్న అంచనాల ప్రకారం చూస్తే, తలకొకట్టే ఆహారం కొలత అంతకన్నా కూడా తక్కువగానే ఉంది. అమెరికా, కనడాలలో ఆహారపు పంటలు చాలా పెరిగినమాట నిజమే. కాని యుద్ధంలో చాలా దేశాల వ్యవసాయమే నాశనమై పోవటంవల్ల, ఈ పెరుగుదల, ప్రపంచ ఆహారసంపదను యుద్ధాపూర్వ స్థితికి తీసికొని వచ్చే మాత్రంగా ఉపకరించింది. ఇదీ అదృష్టమే. అయితే ఈనాడు ప్రపంచంలో పది ఏళ్ళ క్రిందటికన్నా ౨౦ కోట్ల జనం ఎక్కువయ్యారు. ఈ ౨౦ కోట్ల మందికీ కావలసినంత అధికాహారం చేకూరనే లేదు. (ఈ ౨౦ కోట్లలో దాదాపు ౫ కోట్లమంది భారతదేశంలోనే ఉన్నారని ౧౯౪౧—౫౧ జనాభా పెరుగుదల రేటు పరికిస్తే స్ఫురిస్తుంది.)

ఇప్పుడు భారతదేశంలాంటి దేశాలకు ఈ ధాన్యాలు కరుకువాణెం (*Hard currency*) ఇచ్చి కొనుక్కోవలసిన దేశాలనుంచి తప్ప లభించకపోవటం ఆహార సమస్యను మరింత క్లిష్టం చేసివైచింది. తరుగు దేశాలకు ఉత్తర అమెరికా దేశాలు పంపుతున్న ధాన్యం, మొత్తంలో ఏడవవంతునుంచి, ఐదవవంతు దాకా పెరిగాయి. (అంటే తరుగు దేశాలకు సరఫరాలలో అమెరికన్ సరఫరాలు మొత్తం సరఫరాలలో నూటికి ౧౪ నుంచి ౨౦ దాకా పెరిగాయి.)

ప్రపంచ జనాభాలు

ప్రపంచ జనాభా చూస్తే గత ౧౫౦ ఏళ్ల లోనే ప్రపంచ జనసంఖ్య రెండున్నర రెట్లు పెరిగిందని విదితమౌతుంది. ౧౮౫౦—౧౯౩౩ ల మధ్య యూరోపియన్ జనాభాలు దాదాపు ఏడురెట్లు పెరిగాయి. అక్కడ క్షామాలు మొదలైన ఈతిబాధలు తగ్గిపోవటం, పారిశ్రామికంగా దేశాలు

విధానాలతో అధికాహారోత్పత్తి కూడా జరగ వచ్చును. ఆహారసంపద యథార్థంగానే పెరగ వృద్ధి చెందటం ఇందుకు కారణాలని చెప్పవచ్చును. అయితే ౧౯ శతాబ్దపు చివరిపాలు నుంచీ, ఈదేశాలు చాలావాటిల్లో జనన సంఖ్య చాలా తగ్గ మొగం చూపింది. (బహుశః అక్కడ జీవన ప్రమాణాలు అభివృద్ధిచెందటం, సంతాన నిరోధవిజ్ఞానవ్యాప్తి, ఇందుకు కారణాలు కావచ్చును) ఈ తగ్గుదల మరీ ఇనుమడించేటప్పటికి కొన్ని దేశాలు అలజడిపడి, సంతానాభివృద్ధిని అమితంగా ప్రోత్సహించేస్థితి వచ్చింది. అయినా ప్రపంచ జనసంఖ్య మాత్రం పెరుగుతూనే వచ్చింది.

మరీ జనసంఖ్య పెరిగిన దేశాలలో, ౧౯౩౬-౩౯ ల మధ్య, వెయ్యింట జననం రేటు పెరుగుదల ఇల్లా ఉంది. ఈజిప్టు - వేయికి ౪౩.౧; పాలస్తీనా- ౪౨.౧; మెక్సికో—౪౦.౪; ఇండియా—౩౪.౯; ఛిలీ—౩౩.౯; వెనిజులా ౩౩.౪; ఇదే సమయంలో యూరపియన్ దేశాలలో పెక్కువాటిల్లో వేయికి ౨౦ కూడా జననాల పెరుగుదల లేదు. అయితే జననసంఖ్య పెరుగుతూన్న దేశాల జనాభాలతో పోల్చి చూస్తే, జననసంఖ్య తరుగుతూన్న దేశాల జనాభా చాలా కొద్ది.

సృష్టి - లయాల - సమత్వం చెడింది

చారిత్రికంగా—ప్రపంచ జీవకోటి చరిత్ర పరంగా—చూస్తే, సృష్టిలయాల మధ్యవున్న—జనన—మరణ సంఖ్యల—సమత్వాన్ని మానవుడే పూర్తిగా చెదరగొట్టినట్లు గోచరిస్తుంది. తక్కిన జంతుజాలంలో సంతాన వృద్ధి ఎక్కువగా ఉన్నచోట, ఆ జంతువులు అపాయాలు గడిచి బ్రతికి పెద్దవయ్యే జీవిత అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. ఇంకా తక్కువ రకం జీవకోటిలో, అసంఖ్యాకాలుగా పుట్టుక లున్నచోట చావు తప్పి బ్రతకటమే విడ్డూరంగా ఉంటుంది. కాని సృష్టిలోకల్లా తెలివైనవాడు గాబట్టి, మానవుడు తన ఆహారం తానే పండించుకొని, రోగాది భయాలను, ప్రకృతి సిద్ధమైన అపాయాలను గడచేరి బ్రతికటం నేర్చుకున్నాడు. ఫలితం, జన సంఖ్యను అమితంగా పెంచుకోగలిగాడు.

భారతదేశ పరిస్థితిని మరి కొంచెం సూక్ష్మంగా పరిశీలిద్దాం. ఈ దేశంలో సగటున చదరపు మైలుకు ౨౯౦ మంది జనం ఉన్నారు. ఇంగ్లాండులాంటి కొన్ని పాశ్చాత్యదేశాలలో ఈ సంఖ్య ఇంకా ఎక్కువ ఉంటారు. కాని అవి పారిశ్రామికంగా చాలా పెరిగిఉన్న దేశాలు. మరి భారతదేశ సౌభాగ్యమంతా వ్యవసాయం మీదే ఆధారపడి ఉంది. ఇక్కడి భూమిని పంపకం చేయమాస్తే, తలకు, రెండుం బాతిక ఎకరాలు రావు. (ఈ కొస్తలోనూ సాగులో ఉన్నది ఎకరంకన్నా తక్కువ) తక్కిన పెద్ద జనాభా దేశాలతో పోల్చిచూస్తే, ఈ భూమి ఏ మూలకూ రాదు. చైనాలో తలకు ఆరు ఎకరాలు. అమెరికాలో తలకు ౧౩ ఎకరాలు, రష్యాలో తలకు ౨౭ ఎకరాలు పంపకానికి తగ్గ భూమి ఉంది.

ఇప్పటి భారతయూనియన్ ప్రదేశంలో లెక్క చూస్తే౧౯౦౧-౫౧ మధ్య జనాభావృద్ధి నూటికి ౦.౭ చొప్పునఉంది. ౧౯౫౧ లెక్కలకు ముందటిదశాబ్దంలో ఈ పెరుగుదల నూటికి ౧.౪ ఉంది. జనసంఖ్య పెరగటమే కాకుండా, సగటు ఆయుఃప్రమాణం, ౨౬ ఏళ్లే, మునుపటి మాదిరిగానే ఉంది. (౧౯౫౧ జనాభా లెక్కలో వయస్సు వివరాలు తీసుకో లేదు.) జీవన ప్రమాణాలు తక్కువున్న ప్రతిదేశం లోనూ వ్యాధి అవకాశాలు ఎక్కువగా ఉండటం వల్ల పుష్టికల్ల ఆహారం లేకపోవటంవల్లా, మరణసంఖ్య ఎక్కువగానే ఉంటుంది. అందుచేత ఆయుఃప్రమాణము ౨౬ వత్సరాలంత తక్కువగానే ఉంది.

ద్వితీయ ప్రపంచయుద్ధ ప్రారంభంలో రెండు మూడేళ్ల వరకూ, ఇండియా ఆహార దిగుమతులు అట్టే అంతలేవు. ౧౯౪౩—౪౪ నుంచీ — బెంగాలు క్షామమూ, రేషనింగ్ ప్రారంభం, వాటినుంచీ,— ఈ దిగుమతులు తలకు ౧.౭ పౌనులనుంచి తలకు ౧౭ పౌనుల దాకా (పదిరెట్లు) పెరుగుతూ వచ్చాయి.

౧౨౦ నుంచి ౧౩౦ కోట్ల రూపాయలవరకూ ఆహారధాన్యాల దిగుమతికై ప్రభుత్వం వెచ్చించవలసి వస్తూంది. దేశ విభజనవల్ల కొంత సుక్షేత్రం భారత భూమికి దక్కకుండా పోయిఉండవచ్చును, గాని ఈనాడు దేశంలోఉన్న ఆహారం చాలనంతగా జన సంఖ్య పెరిగిపోయిందన్న యథార్థం గుర్తించక తప్పదు. బెంగాల్‌లో చదరపు మైలుకు ౭౦౦ జనాభా ఉండటంకూడా క్షామానికి ముఖ్యకారణ మని గుర్తించక తప్పదు.

దారిద్ర్యం నాటినాటికీ పెరుగుతూనే ఉండి

మానవునికి తిండి ముఖ్యమే. కాని తిండికి వచ్చినపాట్లే తక్కిన బ్రతుకు అవసరా లన్నిటికీ ఏర్పడ్డవి. జనసంఖ్య పెరగటంతో, తిండి, గుడ్డ, ఇల్లు, తదితర జీవితావసరాలు, అన్నీ కరవై పోయాయి. దేశ దారిద్ర్యం నాటినాటికీ పెరిగి పోతోంది.

భవిష్యత్తు చూసినా ఏమంత ఆశాజనకంగా లేదు. ఇప్పటికి ప్రారంభించిన ప్రణాళికల ప్రకారం వ్యవసాయం కొంత వృద్ధిపొంది పాశ్చాత్య

తప్పును. కాని ఆరోగ్యరక్షణలు, వైద్యసహాయాలు కూడా సకీసంగా పెరుగుదల అవటంతో, మరణ సంఖ్య కూడా, జనన సంఖ్యతో పోలిస్తే తగ్గిపోతుంది. ఆరోగ్యరక్షణలు, వైద్యశిక్షణలు అత్యవసరాలు. వాంఛనీయాలు. చావుల నిల్లా తగ్గించటం చాలా శ్రేయస్కరమే. కాని జననసంఖ్య విషయంలో కూడా జాగ్రత్త తీసుకోకపోతే, ఈ కృషి అంతా నిష్ఫలమే అయిపోగలదు.

ఏ దేశానికైనా శ్రేష్ఠమైన (*optimum*) జన సంఖ్య ఎంతా అని ఒక లెఖ్ఖ ఉంది. ఏ సంఖ్య కన్నా జనసంఖ్య ఎక్కువైనా, తక్కువైనా, దేశంలో "జీవన ప్రమాణాలు" (*Standards of living*) క్షీణించిపోతాయో, ఆ జనసంఖ్యను 'శ్రేష్ఠ' సంఖ్య అంటారు. ఈ లెఖ్ఖ నిజానికి ఎప్పటికప్పుడు, వ్యవసాయిక, పారిశ్రామిక ఇత్యాది అభివృద్ధులతో మారుతూనూ ఉంటుంది. భారతదేశంలో వ్యవసాయం, పరిశ్రమలు అభివృద్ధిపొందినపుడు, ఈ 'శ్రేష్ఠ' సంఖ్య, కూడా ఇప్పటి అంచనాకన్న పెరుగుతుంది, కాని ఎంత పెరిగినా, పెరుగుతున్న జనాభా సంఖ్యకు ఈ 'శ్రేష్ఠ' సంఖ్య సరితూగటానికి చాలా సంవత్సరాలు పడుతుంది.

అందుకని జనాభావృద్ధిని అరికట్టటం అనేది చాలా పెద్ద సమస్య అని స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

బీదవాడికే బిడ్డ లెక్కువ

సంతాన బాహుళ్యము, ఏ ఒక్క జాతి, వర్ణం, యొక్క ప్రత్యేక లక్షణంమాత్రం కాదని తెలుసుకోవటం, అత్యవసరం. శాస్త్రపరిశోధన రీత్యా, జాతులలో ఈ విభేదాలు పాటింపవలసినంత మాత్రంగా ఏమీ లేవని తెలిసింది.

కాని సంప దారిద్ర్యాలమీదా జ్ఞాన, అజ్ఞాన పరిస్థితులమీదా మాత్రం సంతాన బాహుళ్యం ఆధారపడిఉంటోందని లెఖ్ఖలవల్ల తేలింది. ఆర్థికంగా, సాంఘికాంతరంగా ఎంత ఉచ్ఛస్థితిలో ఉంటే సంతానవృద్ధి అంత తక్కువగా ఉంటున్నదనీ ఎంత నీచంగా ఉంటే అంత ఎక్కువగా ఉంటున్నదనీ, హిందువులు, ముస్లిములు, పారసీకులు మొదలైన అన్ని జాతులవారి నుంచీ తీసిన లెఖ్ఖలవల్ల నిరూపితమయింది. (పి. కె. వాట్టాల్ — ౧౯౩౪.)

ఇంకో విషయంకూడా తేలింది. జన సంఖ్య విస్తరణ చెందాలనిగాని, తగ్గాలనిగాని ప్రబోధాలు ప్రయత్నాలు జరిగినప్పుడు, ఈ పెరుగుదలగాని, తరుగుదలగాని, ఎక్కడ శ్రేయస్కరం కాదో అక్కడే జరుగుతూ వచ్చింది. పశ్చిమ యూరప్ దేశాలలో సంతానవృద్ధికై, బోనస్‌లు, బహుమానాలు, ఉచితవైద్య, విద్యాసహాయాలు, పిల్లల పెంపకాలు ఇత్యాది ప్రోత్సాహాలు చూపినప్పుడు, చాలా బీదవాళ్లు, విద్యా విషయకంగా వెనుకబడ్డ వాళ్లూమాత్రమే ఈ ప్రోత్సాహం అందుకో గలిగారు; పై తరగతులవాళ్ళకు వీనివల్ల వొరిగే అధికలాభం ఏమీ కనబడనందున. పోనీ అటు సంతాన నిరోధ ప్రచారాలు అవి జరిగినప్పుడు చూద్దామంటే, చదువుకున్నవాళ్లూ, ధనికులూ, ఇల్లాంటి జన బాహుళ్యానికి తోడ్పడనివాళ్ళే ముందు కొస్తారు తప్ప, ఎక్కడ సంతాన నిరోధం అవసరమో, ఆ తరహా జనానికి ఈ ప్రచార ప్రబోధమే సరిగ్గా అందదు.

ఇక్కడ తరగతులని చెప్పటంవల్ల, జన్మతః ఒక తరగతివాళ్ళు తెలివైనవాళ్ళని గాని, ఒకళ్ళు కారనిగానీ, కాదు. అక్కడుండే వాతావరణం వల్ల, జీవన ప్రమాణాలవల్ల, పెంపకంలో ఈ తేడాలొస్తాయి. అందరికీ విజ్ఞానం అందచేసి, అందరి జీవన ప్రమాణాలు వృద్ధిచేస్తే ఈ తారతమ్యం గోచరించనే గోచరించదు. అందుచేత జనసంఖ్య వృద్ధిని అరికట్టదలచుకుంటే, ప్రభుత్వం బీదజనం, మధ్య తరగతి జనం, వీళ్లల్లోనే విజ్ఞాన ప్రబోధాలు కల్పించి, వాళ్ళ జీవనప్రమాణాలు వృద్ధి అయేందుకు మార్గం చూపిస్తేనే, దేశానికి క్షేమకరంగా, జనసంఖ్య సమస్య సర్దుబాటు కాగల్గుతుంది.

సంతానవృద్ధికి నిరోధ పరిస్థితులు

ఈ పరిస్థితుల్లో చాలా వాట్లమీద మానవునికి అధికారమే లేదు. సిరిసంపత్తులు, విద్యా విశిష్టతలు ఉన్నచోట సంతానం తక్కువ. స్త్రీవిద్య, ఉద్యోగాలు, వ్యాయామక్రీడలు ఇత్యాది ఆధునిక స్త్రీజన వ్యాసంగాలు కూడా పిల్లల పెంపకానికి నిరోధకాలుగానే పనిచేస్తాయి. పట్టణాల సమ్మర్ద జీవితం, ఆలస్య వివాహాలు, కూడా ఇంతే. జనాభా పెంపకానికి ఎక్కువ దోహదమిచ్చే, పేద, మధ్యతరగతి జనంలో, విద్యా విజ్ఞానాలను, స్త్రీ విద్యను, జీవితవృత్తులను, జీవన ప్రమాణాలను, పెంపుచేయటం జనాభా సమస్యాపరిష్కారానికి ఎక్కువ సహకారి కాగలదని ఇందువల్ల విదితమౌతూంది.

కాని ఈ ఆశయాలు శీఘ్రసాఫల్యం అందుకునేవి కావు. ఈ కృషి సాగించాలన్నా తీగ కదిపితే డొంకంతా కదిలినట్టు, అనేక ఇతర సమస్యలు ఎక్కడికక్కడ అడ్డుతగిలే మాటా నిజమే. సంతాన నిరోధం, ఏ కొద్దిమందో చదువుకొన్న వాళ్లలో కాక జనబాహుళ్యంలో ప్రచారంలోకి రావాలంటే ప్రభు

త్వమే ఇంతకన్న నూతే విధానాలను, ఆ జనానికి అందుబాటులో అమలుపరచాల్సి ఉంటుంది.

ఇంతవరకు చాలా పాశ్చాత్య దేశాలలో జనాభా వృద్ధిచేయటం విషయంలోనే ప్రచారాలు, ప్రయోగాలు, ప్రభుత్వపు ప్రోత్సాహంతో సాగాయి. ఫ్రాంసు, బెల్జియమ్, స్వీడెన్, ఇంగ్లండరికన్నా జర్మనీ ఈ విషయంలో కృషిచేశాయి. ఇక్కడ కూడా స్వీడన్ అవలంబించిన విధానాలు కొంత పరిశీలించ తగ్గవి. ఎందుకంటే, కేవలం జనసంఖ్య కాకుండా, ఆ శ్రేయస్సును పెంపొందించటానికి కూడా వాళ్ళు జాగ్రత్త తీసుకొన్నారు. అక్కడ జనంలో సంతాన నిరోధ విజ్ఞానం ప్రచారంచేసి, విజ్ఞానవిధానంలో, సంతు పొందడం ఎల్లాగో, సంతు కావలసిన తలి దండ్రుల దేహదార్ఢ్యాది ఔచిత్య గుణాలకు ప్రచారం ఇచ్చి, అల్లాంటి జనాభాను పొందటానికి శాస్త్రీయంగా కృషిచేశారు. సంతాననిరోధ ఉపకరణాలు, జాతీయ వైద్యసంస్థ ద్వారా ప్రజలకు, పరీక్షలు సాగించి, అందుబాటు చేయించారు.

భారత దేశానికి ప్రణాళిక

భారతదేశంలో కూడా ఇల్లా, సంతాన నిరోధాన్ని గురించి, విజ్ఞానప్రచారాలను, కార్మికవర్గాలకు మధ్యతరగతి వర్గాలకూ పరిమితంచేసి, వారికి, ఈ జ్ఞాన పరికర సంపదంతో అందుబాటయ్యేటట్లు, జనమధ్యంలో ఈ విజ్ఞాన కేంద్రాలను స్థాపించవలసి ఉంటుంది. సుఖరోగనివారణ క్లినిక్‌ల మాదిరిగానే, ప్రతిపల్లెటి ఆస్పత్రిలోనూ ప్రతి మ్యునిసిపల్ ఆరోగ్య సంస్థలోనూ, సంతాన నిరోధశాఖలను, ఉచిత ప్రబోధప్రచారాలకై స్థాపించవలసి ఉంటుంది. మిల్లులు, ఫ్యాక్టరీలు, మొదలైన కార్మికస్థానాలలో, పబ్లిక్ హెల్తు నివాసా లన్నిటిలోనూ, సంతాన నిరోధం గూర్చి విజ్ఞానాన్ని ప్రచారంచేయటానికి, సలహాల నిచ్చేందుకు స్టెరిలైజేషన్, ఋతుకాలాలు తప్పించుకోడం, ఇత్యాది విషయాలు ఉచితంగా బోధచేసేందుకు ప్రచారకుల నేర్పరచాలి.

పల్లెటూళ్ళల్లో ఇప్పటికీ కొన్నిచోట్ల మామూలు ఆస్పత్రులే లేవు. అల్లాంటిచోట్ల ప్రభుత్వమే కాక, వైద్యులేటు వ్యక్తులు సంస్థలూ కూడా ఇందుకు సహకరించవలసి ఉంటుంది.

ఇదంతా ఒక్క ప్రభుత్వంయొక్క విధ్యుక్త ధర్మమనీ, ప్రభుత్వమే చేయాలనీ అనుకోనక్కర లేదు. అమెరికా బ్రిటన్‌లలాంటి దేశాలలో అనధికార సంస్థలే ఈ కృషి సాగించాయి. అమెరికాలో బర్త్‌కంట్రోల్ లీగు, బ్రిటన్‌లో మాల్థూసియన్ లీగు, చాలా ప్రశస్తమైనకృషి చేశాయి. కాని భారతదేశంలో, కేవలం ప్రభుత్వం ఆమోదం కాక, ప్రభుత్వం కృషీ సహకారం, ప్రోద్బలంకూడా ఈకృషికి చాలా వాంఛనీయాలు. ధన సహాయం చెయ్యటమే కాకుండా, ఆరోగ్యమంత్రిత్వశాఖలు, ప్రచారానికితగినంతమంది ఉద్యోగులకు శిక్షణ నిచ్చి ప్రజలలో ప్రబోధం కల్పించవచ్చును. అనేక విధాల సమ్మోకాలు పాతుకునిపోయిన మనదేశంలో సంతాన నిరోధంవంటి విషయం, ప్రభుత్వం పత్తాసులేనిదే ఫలవంతం కాబోదు.

పంచవర్ష ప్రణాళికవిషయం చెప్తూ, కేవలం పంట పెంచితే చాలదనీ, జనాభా వినియమనం చేసుకోటం అవసరం అనీ, 'సంతాననిరోధం' అన్న మాటను చూసి బెదరకుండా దాని యథార్థాలను, గ్రహించి ప్రజలు పరిస్థితుల నెదుర్కోవలసి ఉందనీ భారత ప్రధాని పండిట్ నెహ్రూ ఉద్ఘాటించారు.

ఈ విషయం పంచవర్ష ప్రణాళికలో అజకు రావటం చాలా శుభసూచకం. ఈ సమస్య పరిష్కారానికి వాస్తవిక దృక్పథం ఏర్పడగలదని ఆశిద్దాం.

భారతక్షేత్రంలో ఇల్లాంటి భావాలబీజాలు ఊసరక్షేత్రంలో చల్లినట్లే అని చాలామంది నమ్మకం. కాని ఏ పండితులూ అంచనా వేయలేనంత, వాస్తవిక దృక్పథం ఎప్పుడు ప్రజాబాహుళ్యంలో ఉండనే ఉంటుంది. ఆ విజ్ఞానాన్ని, ఉపకరణ సంపత్తిని ఆ ప్రజ కందియ్యటమే ఇకిరులు చేయవలసిన పని.

—(హిందూస్థాన్ టైమ్సులో ఏ. రాయ్ వ్యాసానికి కృతజ్ఞతతో)

Printed & published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad